పోతన

భాగవతము

దశమస్కంధము Vol. III



పోతన భాగవతము

దశమస్కంధము

[మూడవభాగము]

సరళగద్యానువాదసహితము


అనువాదకుడు :

శ్రీ ముదివర్తి కొండమాచార్యులు

ప్రధానసంపాదకుడు :

డాక్టర్ జంధ్యాల పాపయ్యశాస్త్రి

"కరుణశ్రీ"



ప్రచురణ :

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1991

POTHANA BHAGAVATHAMU
with Sarala Gadyanuvadamu

Author :
POTANA MAHAKAVI

Author of the Anuvada :
Sri Mudivarthi Kondamacharyulu

Edited by :
Dr. Jandhyala Papaiah Sastry "Karuna Sri"

T. T. D Religious Publication Series No. 384

First Edition : 1991

Art : Sri K. Jagadeesh

Copies: 5,000

Published by:
Sri M. V. S. Prasad, I.A.S.,
Executive Officer,
T. T. Devasthanams, Tirupati.

Printed at:
T. T. Devasthanams Press,
Tirupati-517507.

ముందుమాట

భారతీయసంస్కృతికి మూలభూతాలైన వేదాల్ని వేద ధర్మాన్ని లోకంలో సుప్రతిష్ఠితం చేయడం కోసం ఏర్పడ్డ సులభ సాధనాలు పురాణాలు. విరాట్పురుషుడికి శ్రుతి స్మృతులు రెండూ నేత్రాలనీ, పురాణాలు హృదయమనీ దేవీభాగవతమూ, ఇతిహాస పురాణాలద్వారా వేదాన్ని విస్తరింప చేయాలని భారతమూ, వేదార్థాలన్నీ పురాణాల్లో ప్రతిపాదింప బడ్డాయని నారదీయమూ మొదలైన గ్రంథాలు పురాణాల మాహాత్మ్యాన్ని ప్రశంసించాయి.

ఈ పురాణాలు పద్దెనిమిది. వీటిలో పదిహేడు పురాణాల సారాన్ని ఆకర్షించి వ్యాసభగవానుడు భాగవత పురాణాన్ని రచించాడని పద్మపురాణం వెల్లడిస్తున్నది. బ్రహ్మసూత్ర ఉపనిషద్భగవద్గీతలనే ప్రస్థానత్రయంతోపాటు ప్రస్థానచతుష్టయంలో ఒకటిగా భాగవతం ప్రస్తుతించబడింది. సంసారభయాన్ని పోగొట్టేదీ, అజ్ఞానమనే చీకటిని తొలగించేదీ, భగవత్తత్త్వాన్ని వివరించేదీ భాగవతమని స్కాంద పద్మపురాణాదులు ప్రకటిస్తున్నాయి.

భగవంతుని కథల్ని చెప్పేది భాగవతం. ధర్మసంస్థాపనార్థం ఆయన ధరించిన 21 అవతార గాథల్ని ఇది వివరిస్తుంది. అంతేకాకుండా ప్రహ్లాదాది భక్తుల కథల్ని చెప్పేది భాగవతమని కూడ పెద్దలు పేర్కొంటారు. భాగవతతత్త్వాన్ని భావగతం చేసుకోవడం భక్తులకు మాత్రమే సాధ్యం. పండితుల ప్రతిభాపాటవాల్ని గుర్తించడానికి భాగవతం పరీక్షాకేంద్రమనీ, భారత

ప్రౌఢవాన్ని అర్థం చేసుకొనడానికి శక్తి, రామాయణ స్వార స్యాన్ని గ్రహించడానికి రక్తి, భాగవతామృతాన్ని గ్రోలడానికి భక్తి ఆవశ్యకాలని విద్వాంసుల అభిప్రాయం. "భక్త్యా భాగవతం జ్ఞేయం, న వ్యుత్పత్త్యా న టీకయా" అని కదా ఆర్యోక్తి!

ద్వాదశస్కంధ పరిమితమైన భాగవతంలో దశమస్కంధం ఆత్మస్థాన మని చెప్పవచ్చు. రామాయణంలో సుందరకాండకు ఎంతటి ప్రాముఖ్యం వున్నదో భాగవతంలో దశమస్కంధానికి అంతటి ప్రాశస్త్యం వున్నది. భాగవత నాయకుడైన శ్రీకృష్ణ పరమాత్మ బాల ప్రౌఢ లీలలే దశమస్కంధ కథార్థాలు. అవి మానవ జీవితంలోని ఆధ్యాత్మిక శక్తిని అభివ్యక్తం చేస్తాయి. అంతేకాకుండా భాగవతం ప్రతిపాదించిన నవవిధ భక్తి మార్గాల్లో మధురభక్తికి ఒక విశిష్టస్థానం వున్నది. అది దశమస్కంధంలో అప్రతిమానమైన అభినివేశంతో వర్ణించబడింది. పరమేశ్వరుణ్ణి ప్రాణనాథుడనే భావంతో ఆరాధించడాన్ని మధురభక్తి అని పిలుస్తారు. ప్రేమ పరాకాష్ఠకు చేరుకున్న భక్తుల విరహం పరమాత్ముడి పొందుకోసం పరితపించే జీవాత్మ విరహమని చెప్పవచ్చు. గోపిక లిందుకు ప్రతీకలు. చక్కెరబొమ్మను ఎక్కడ కొరికినా తీపే అన్నట్లు దశమస్కంధంలో ఏ ఘట్టాన్ని స్పృశించినా మధురమే.

భారతీయుల ఆధ్యాత్మిక సంపదకు ప్రతిబింబమైన సంస్కృత భాగవతాన్ని తెలుగు చేయడంలో సహజ పాండిత్యుని భక్త్యావేశ కవితామాధుర్యాలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. ఆంధ్రదేశంలో ఆబాలవృద్ధాన్నీ ఆనందింపచేయగల సామర్థ్యం పోతనభాగవతానికి మాత్రమేవున్నది. పల్లెల్లోగాని, పట్టణాల్లోగాని పోతనార్యుని పద్యాలు ప్రజలకు కంఠస్థాలు. ప్రహ్లాదచరిత్ర, గజేంద్రమోక్షము, రుక్మిణీకల్యాణము, శ్రీకృష్ణుని బాల్యక్రీడలు,

గోపికావిరహం మొదలైన భాగవత ఘట్టాలు అశేషాంధ్రావళికి పరిచయం కావడానికి కారణం సహజపాండిత్యుని అనన్యకవితా వైభవమే.

పోతన విరచిత దశమస్కంధం మూడవభాగంగా వెలువడే ఈ పుస్తకంలో కృష్ణుడు రజకుణ్ణి చంపడం, నారదుడు కాలయవనుణ్ణి రెచ్చగొట్టడం, కంసవధ, భ్రమరగీతలు, జరాసంధుని దండయాత్ర, రుక్మిణీకల్యాణం ప్రధానఘట్టాలు పోతనకవితాప్రాశస్త్యం ఈ ఘట్టాల్లో పఠితల హృదయాల్ని రంజింపజేస్తుంది.

సుప్రసిద్ధకవి పండితులు, ప్రజ్ఞాపాటవపరిపూర్ణులు, లబ్ధప్రతిష్ఠులు, ప్రస్తుతం తి. తి. దే. ల పుస్తకప్రచురణవిభాగంలో ఉద్యోగులు అయిన శ్రీ ముదివర్తి కొండమాచార్యులవారు ప్రతి పద్యానికి మనోజ్ఞంగా, మిక్కిలి సులభశైలిలో తాత్పర్యం వ్రాసి అందించారు. సుప్రసిద్ధవిద్వాంసులు, మహాకవి డా. కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారి ప్రధాన సంపాదకత్వాన, వారి పరిష్కరణంతో ప్రకటిత మవుతున్న ఈ భాగాన్ని తి. తి. దేవస్థానములు ఆంధ్రప్రజల కందిస్తున్నది. ఉత్కృష్టమైన మా యీ కృషి తెలుగు పాఠక మహాశయులకు ప్రయోజనకరం కాగలదని మా ప్రగాఢవిశ్వాసం.

తిరుపతి,
10-7-91

యం. వి. యస్. ప్రసాద్,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

సంపాదకమండలి

డా. కరుణశ్రీ (ప్రధానసంపాదకుడు)
డా. ఎన్. బి. రఘునాథాచార్య
డా. రావుల సూర్యనారాయణమూర్తి
శ్రీ. కె. సుబ్బారావు

పరివేశిక

'భాగవతం భాగవతం అని పదిమార్లు అంటే చాలు మనమంతా భాగవతాం' అన్నాట్ట వెనకటికి ఒక పెద్దాయన. అంటే చదువుకున్న పండితులలోనే కాకుండా చదువురాని సామాన్యప్రజలలో కూడా భాగవతం అంటే ఎంతటి గౌరవం ఉన్నదో మనం ఊహించుకోవచ్చు.

అంతేకాదు. అష్టాదశ మహాపురాణాలలో కూడా శ్రీమద్భాగవతానికి ఒక విశిష్టస్థానం ఉన్నది. శ్రీమన్నారాయణుని ఏకవింశతి అవతారాలూ భాగవతంలో అభివర్ణింపబడినాయి. అంతేకాకుండా విశేషించి శ్రీకృష్ణావతారం సమగ్రంగా సర్వాంగసుందరంగా సహృదయహృదయంగమంగా చిత్రీకృతమైంది.

భగవంతుని లీలలతోనూ, భగవద్భక్తుల చరిత్రలతోనూ నిండి భక్తి జ్ఞాన వైరాగ్యసంభరితమై ఉండటం కూడా భాగవతానికి ఎక్కడలేని ప్రశస్తి తెచ్చిపెట్టింది. అందుకనే అది శ్రీమద్భాగవతంగా విరాజిల్లింది.

ఇంకా చెప్పాలంటే తక్కిన పురాణాల్లోకంటే భాగవతంలో వ్యాసుల వారి రచన రమ్యమై ప్రౌఢగంభీరమై విలసిల్లింది.

పద్మపురాణంలో శ్రీమద్భాగవతం సాక్షాత్తుగా భగవత్స్వరూపమని నిరూపింపబడింది.

> తమాదిదేవం కరుణానిధానం
> తమాలవర్ణం సుహితావతారమ్,
> అపారసంసార సముద్రసేతుం
> భజామహే భాగవతస్వరూపమ్.

భాగవతం భగవంతుని స్వరూపంగా చెప్పటం గమనించదగింది. భాగవతంలో ఉన్న పండ్రెండు స్కంధాలనూ భగవంతుని అవయవములుగా పేర్కొనడం జరిగింది. చిత్తగించండి-

ప్రథమశ్చ ద్వితీయశ్చ చరణౌ ద్వౌ ప్రకీర్తితౌ,
తృతీయశ్చ చతుర్థశ్చ ద్వావూరూ సముదీరితౌ.
పంచమో నాభిదేశశ్చ షష్ఠో హృదయ ముచ్యతే,
సప్తమ శ్చాష్టమశ్చైవ బాహూ ద్వౌ పరికీర్తితౌ.
నవమః కంఠదేశః స్యాత్ దశమో ముఖమేవ చ,
ఏకాదశో లలాటం చ ద్వాదశస్తు శిఖోచ్యతే.
ఏవం సర్వం భాగవతం శ్రీహరేరంగ ముచ్యతే.

భాగవతంలోని ప్రథమ ద్వితీయస్కంధాలు భగవంతుని చరణా లనీ, తృతీయ చతుర్థస్కంధాలు ఊరువులనీ, పంచమస్కంధం నాభి ప్రదేశమనీ, షష్ఠస్కంధం హృదయమనీ, సప్తమ అష్టమస్కంధాలు బాహువులనీ, నవమస్కంధం కంఠమనీ, దశమస్కంధం ముఖమనీ, ఏకా దశం లలాటమనీ, ద్వాదశం శిఖ అనీ వివరింపబడింది. ఇందులో దశమ స్కంధం భగవంతుని ముఖమనీ చెప్పడంవల్ల దాని ప్రాధాన్యం ఎంత టిదో అభివ్యక్త మవుతున్నది. శ్రీకృష్ణసర్వస్వమైన భాగవత దశమ స్కంధం సర్వోత్తమ మనటంలో సందేహం లేదు.

భావుకులైన పాఠకుల హస్తాలలో ఉన్నది భాగవత దశమస్కంధం లోని తృతీయ సంపుటం. ఈ సంపుటంలో శ్రీకృష్ణుని మథురానగర ప్రవేశం, రజక గర్వభంజనం, సుదాముని వృత్తాంతం, కువలయాపీడ మర్దనం, చాణూర ముష్టికవధ, కంససంహారం, దేవకీ వసుదేవుల కారా గృహవిమోచనం, ఉగ్రసేనుని పట్టాభిషేకం, రామకృష్ణుల విద్యాభ్యాసం, భ్రమరగీతలు, జరాసంధ దురాక్రమణం, కాలయవన సంహారం, ముచు కుందుని వృత్తాంతం, రుక్మిణీకల్యాణం– అనే కథాఘట్టాలు సుమనోమనో జ్ఞంగా అభివర్ణితము లైనాయి.

శ్రీకృష్ణుడు మథురానగరంలో ఎదురుగా వస్తున్న రజకుణ్ణి చూచి ఇలా అంటాడు–

విందులమై నరేశ్వరుని వీటికి వచ్చితి మేము; మాకు మా
మందలలోన గట్టికొన మంచిపటంబులు లేవు; నీ ముడిన్
సుందరధౌతచేలములు శోభిలుచున్నవి; తెమ్ము; నిమ్న మే
మందెదు నిమ్ము, రాజుదెస నల్లర మో రజకాన్వయాగ్రణీ!

అంత గొప్పగా సంబోధించి ప్రాధేయపడి శుభం పలికి ప్రార్థించినా అందుకు ఆ రజకుడు తలబిరుసుగా సమాధానం చెబుతాడు—

ఎట్టెట్రా ! మనుజేంద్రు చేలములు మీ కిం బాడియే ? మీరలుం
గట్టంబోలుదురే ? పయోఘృతదధిగ్రాసంబులన్ మత్తులై
యిట్టాడం జనెంగాక గొల్లలకు మీ కెబ్భంగి నోరాడెడిన్ ?
కట్టా ! ప్రాణము గోలుపోయెదు సుమీ కంసోద్ధతిన్ బాలకా !

గర్వాంధుడైన రజకుడికి దేహశుద్ధిచేసి రామకృష్ణులు వస్త్రాలు ధరించి ముందుకు సాగుతారు. ఇంతలో సుదాముడనే మాలాకారుడు కని పిస్తాడు. అతడిసేవలకు మెచ్చి వరం కోరుకోమంటాడు కృష్ణుడు. అప్పుడు సుదాముడు ఇలా అంటాడు—

నీ పాదకమలసేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపారభూతదయయును
తాపసమందార ! నాకు దయసేయంగదే !

ఈ పద్యానికి తెలుగువారి నాలుకలపై ఎంతటి ప్రచారం అధికారం ఉన్నదో మన అందరికీ తెలుసు. ఇంతకూ ఆ పద్యం సుదాముడు పలి కిందా ? పోతనగారు పలికిందా ? అనేదే సందేహం. ఆ తరువాత కుబ్జఅనే మరుగుజ్జుపిల్ల కనిపిస్తుంది. ఆ వంకరటింకరపిల్లను చూచి కృష్ణు డిలా అంటాడు—

ఎవ్వరిదానవు ? లేపము
లెవ్వరికిం గోరికొనుచు నేగెదు ? నీ పే
రెవ్వతె ? మా కిమ్మిన్నియు
నివ్వటిలెదు చక్కనగుచు నీరజనేత్రా !

'చక్కనగుచు' అన్నమాటలోని వ్యంగ్యాన్ని కుబ్జ గ్రహించింది. ఆ అమ్మాయి కొంచెం రోషంతో ఇలా అంటుంది—

'చక్కనివాడవౌదు ! పర
సంబుల నొంపకు ; మెల్లవారికిన్
జక్కదనంబు లెక్కడివి ? ....'

'నీవే పెద్ద చక్కనయ్యవులే. చమత్కారాలు చాలించు. అందరికీ నీ చక్కదనం ఎక్కడనుంచి వస్తుంది? నా పేరు త్రివక్ర. కంసుడి దాసిని. రాజుగారికి సుగంధలేపనాలు తీసుకువెళుతున్నాను' అంటుంది.

కుబ్జ నిజానికి త్రివక్ర. మెడ వంకర. నడుము వంకర. కాళ్లు వంకర. అయితే మాత్రం వెక్కిరింపుగా 'చక్కనగుచు నివ్వటిలెదు' అంటాడా! ఇదంతా పోతనగారి చమత్కారం. మూలంలో ఈ మాట లేదు.

కా త్వం వరోర్వేతదుహానులేపనం
కస్యాంగనే వా కథయస్వ సాధు నః,
దేహ్యావయో రంగవిలేప ముత్తమం
శ్రేయ స్తతస్తే న చిరాద్భవిష్యతి.

'ఆ విలేపనాలు మా కివ్వు. నీకు త్వరలో శుభం కలుగుతుంది అని మూలంలో ఉంటే ఇవన్నీ మాకిస్తే నీ వంకర చక్కబడి నీవు చక్కని దాన వవుతావు' అంటాడు తెలుగు కృష్ణుడు. అందుకు కుబ్జకు రోషంవచ్చి పై విధంగా పలికింది. తరువాత ఆ విలేపనాన్ని రామకృష్ణులకు సమర్పిస్తుంది. కృష్ణుడు ఆమె వక్రత్వం పోగొట్టి అనుగ్రహిస్తాడు.

శ్రీకృష్ణుడు కంసుని ధనుశ్శాలలో ఉన్న విల్లు విరవటం అత్యంత మనోహరంగా వర్ణించాడు పోతన–

బంధుల్ మేలన వామహస్తమునఁ జాపంబెత్తి మౌర్వీలతా
సంధానం బొనరించి కొంచెపుఁదెగన్ శబ్దించుచున్ ధీరతా
సింధుం డా హరి దాని ఖండితముగాఁ జేసెన్ జనుల్ చూడఁగా
గంధేభంబు రసాలదండము నొగిన్ ఖండించు చందంబునన్.

ఈ పద్యం మూలానికి సరైన అనువాదం. గమనించండి మూల శ్లోకాన్ని–

కరేణ వామేన సలీలముద్ధృతం
సజ్యం చ కృత్వా నిమిషేణ పశ్యతామ్,
నృణాం వికృష్య ప్రబభంజ మధ్యతో
యథేక్షుదండం మదకర్యురుక్రమః.

పోతన్నగారు ఈ సందర్భంలో చేసిన చంద్రోదయ సూర్యోదయ వర్ణనలు అనన్యసామాన్యములు. అత్యంతమనోహరములు. ముందు చంద్రోదయాన్ని చిత్తగించండి—

ప్రాచీదిశాంగనా ఫాలతలంబున
దీపించు సిందూరతిలక మనఁగ
దర్పించి విరహుల ధైర్యవల్లులు ద్రెంప
దర్పకుం డెత్తిన దాత్ర మనఁగ
నలిగి కాలకిరాతు డంధకారమృగంబు
ఖండింప మెఱయించు ఖడ్గ మనఁగ
గగనతమాలవృక్షము తూర్పుకొమ్మను
లలితమై మెఱయు పల్లవ మనంగఁ

దొగలు సంతసిల్ల దొంగలు భీతిల్ల
కడలి మిన్నుముట్టి కడలుకొనఁగ
పొడిచె శీతకరుఁడు భూరి చకోరక
ప్రీతికరుఁడు జారభీతికరుఁడు.

చంద్రోదయానికి ముకుళించుకొన్న కమలాలను ఎంత హృదయంగమంగా వర్ణించాడో చూడండి—

'కళలు గలుగు గాక; కమల తోడగుఁ గాక;
శివుని మౌళిమీఁదఁ జేరుఁగాక;
నన్ను నొల్లఁ దపనుఁడైన మత్పతి' యని
సాధ్విభంగి కమలజాతి మొగిడె.

ఇక్కడ 'తపనుఁడు' అనటంలో చమత్కారం ఉన్నది. తపన శబ్దానికి సూర్యుడు, తపింపజేసేవాడు అని రెండర్థాలు. సాధ్వీలక్షణం సమంజసంగా నిరూపితమైంది.

ఇదే సందర్భంలో పోతన్నగారు చేసిన సూర్యోదయవర్ణనం అనంతర ప్రబంధకవులకు 'ఒజ్జబంతి' అయింది. ముద్దులు మూటగట్టే ఆ పద్యాన్ని చిత్తగించండి—

భూషణములు సెవులకు; బుధ
తోషణము; లనేకజన్మదురితౌఘ విని
శ్శోషణములు; మంగళతర
ఘోషణములు; గరుడగమను గుణభాషణముల్.

రుక్మిణి అన్నగారైన రుక్మి తన చెల్లెల్ని శిశుపాలునికి ఇవ్వాలని నిర్ణయిస్తాడు. బంధువుల అభిప్రాయాన్ని త్రోసిపుచ్చుతాడు.

బంధూనా మిచ్ఛతాం దాతుం
కృష్ణాయ భగినీం నృప,
తతో నివార్య కృష్ణద్విడ్
రుక్మీ చైద్య మమన్యత.

ఈ శ్లోకానికి పోతన్నగారు వ్రాసినపద్యం ఎంత హృద్యంగా ఉందో చిత్తగించండి—

బంధువు లెల్లఁ గృష్ణునకు బాలిక నిచ్చెదమంచు శేముషీ
సింధువులై విచారములు సేయఁగ వారల నడ్డుపెట్టి దు
స్సంధుడు రుక్మి కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి మత్తపు
ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై.

శ్రీకృష్ణుని దగ్గరకు పంపిన బ్రాహ్మణుని రాక ఆలస్యం కావడంతో రుక్మిణి పడుతున్న ఆవేదన, ఆందోళన పోతన్నగారు అత్యద్భుతంగా వర్ణించారు—

లగ్నం బెల్లి; వివాహముం గదిసె; నేలారాఁడు గోవిందుఁ? డు
ద్విగ్నం బయ్యెడి మానసంబు; వినెనో వృత్తాంతమున్; బ్రాహ్మణుం
డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె? నా యత్నంబు సిద్ధించునో
భగ్నంబై చనునో విరించికృత మెబ్భంగిన్ బ్రవర్తించునో?

ఇంకా ఈ పద్యంలో ఆమె మనోవేదన ఆలకించండి—

ఘనుఁ డా భూసురుఁ డేగెనో? నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో
విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో? విచ్చేసెనో? యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపఁడో? యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో? నా భాగ్య మెట్లున్నదో?

తా నేమైనా రహస్యంగా రాయబారం పంపటం పొరపాటేమో! అందుకు కృష్ణుడు తప్పుపట్టాడేమో! అని ఆందోళన చెందుతున్న రుక్మిణితో ద్వారకనుండి తిరిగివచ్చిన అగ్నిద్యోతనుడు ఈ విధంగా చెప్పడంలో ఎంతో ఔచిత్యం ఉన్నది—

మెచ్చె భవద్గుణోన్నతి; కమేయధనావళు లిచ్చె నాకుఁ; దా
వచ్చె సుదర్శనాయుధుఁడు వాఁడె; సురాసురు లెల్ల నడ్డమై
వచ్చిన నైన రాక్షసవివాహమునం గొనిపోవు నిన్ను; నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా!

ఈ పద్యంలో 'మెచ్చె భవద్గుణోన్నతికి' అనటంలో రుక్మిణి మనస్సులోని సందేహం తీరిపోయింది. 'తా వచ్చె సుదర్శనాయుధుఁడు' అనటంలో శ్రీకృష్ణుని ఆగమనవేగం అభివ్యక్తమయింది.

పోతన్నగారు భాగవతప్రారంభంలో గురుస్తుతి చేయలేదే అని కొంతమందికి అనుమానంగా ఉండేది. దానికి సమాధానం మనకు ఇక్కడ దొరుకుతుంది. రుక్మిణీ కల్యాణఘట్టంలోనే పోతన్నగారు సొంతంగా ఈ పద్యం వ్రాశారు. రాయబారిగా వచ్చిన బ్రాహ్మణుడు కృష్ణుడితో అంటాడు—

ఆ యెలనాఁగ నీకుఁ దగు; నంగనకుం దగు దీవు; మా యుపా
ధ్యాయుల యాన; పెండ్లియగుఁ; దప్పదు; జాడ్యములేల? నీవు నీ
తోయమువారిఁ గూడుకొని తోయరుహాననఁ దెత్తుగాని వి
చ్చేయుము; శత్రులన్ మఱుముసేయుము; సేయుముశోభనం బిలన్.

'మీ రిద్దరూ పరస్పరం తగిన దంపతులు. మీకు తప్పకుండా వివాహం జరిగి తీరుతుంది. మా గురువులమీద ఒట్టు' అంటాడు. అంతే కాని ఆ వేదవేత్త అయిన బ్రాహ్మణోత్తముడు వేదాల తోడనిగాని, భగవంతుని తోడనిగాని, గాయత్రి తోడనిగాని అనకుండా 'మా ఉపాధ్యాయుల ఆన' అనటంలో ఎంతో విశేషం ఉంది. ఇది పోతన్నగారికి గురువులయందుండే గౌరవానికి మచ్చుతునక.

తన కోరిక చెల్లించి కృష్ణుని కొనితెచ్చిన బ్రాహ్మణునికి రుక్మిణీదేవి తన కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు సమర్పించటం ఎంతో సముచితంగా ఉంది.

> జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశమున్ జెప్పి; నన్
> నిలువం బెట్టితి; నీ కృపన్ బ్రదికితిన్; నీయంత పుణ్యాత్మకుల్
> గలరే ? దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర; నం
> జలిఁ గావించెద; భూసురాన్వయమణీ ! సద్బంధుచింతామణీ !

ఈవిధంగా పోతన్నగారి అనువాదం అత్యంతసహజంగా, ఔచిత్య భరితంగా, సరసంగా, సరళంగా సాగిపోయింది.

పోతనభాగవతంలోని ఈ పద్యభాగాన్ని హృద్యమైన గద్యంలో అనువాదం చేసినవారు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు గారు. వీరు సుప్రసిద్ధ విద్వాంసులు, మధురకవులు. విద్వత్కవిశిరోమణి బిరుదాంకితులు. ధర్మదీక్ష, అమరసందేశము, నారాయణమ్మ, పూర్ణాహుతి, వీరమనీడు, ముక్తావళి, ప్రచండకౌశికము, కూనలమ్మ – ఇత్యాది పద్య గద్యకృతులను రచించి పేరెన్నికగన్నవారు. వీరి రచనలపై శ్రీ చల్లా హరిశ్చంద్ర పరిశోధన చేసి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టం అందుకున్నారు. విన్నాణపు తెలుగు పలుకుబడులకు పెన్నిధి ఐన అన్నమాచార్యులవారి పదాలను సుమారు తొమ్మిదివందల సీసపద్యాలలో ముంచి ఆ కవితాసుధారసాన్ని ఆంధ్రరసజ్ఞపాఠకులకు అందించిన ఘనత మన ముదివర్తివారికే దక్కింది.

కొండమాచార్యులవారి భాగవతానువాదం సహజంగా, సరళంగా, సర్వాంగసుందరంగా మూలవిధేయంగా సాగింది.

తెలుగుజాతికి అత్యంతం ప్రీతిపాత్రమైన పోతనభాగవతాన్ని అక్షరాస్యులందరికీ అందుబాటులో ఉండే నిమిత్తం హృద్యగద్యానువాద సహితంగా ప్రకటించాలనే సముచితసంకల్పం తిరుమల తిరుపతి దేవస్థానముల వారికి కలగటం బహుధా ప్రశంసనీయం. ఇటువంటి సదుద్దేశ్యంతోనే పోతనభాగవతం ప్రాజెక్టు ప్రారంభింపబడింది. పరమపవిత్రమైన

ఈ మహాకార్యంలో నాకు కూడా అవకాశం కల్పించిన దేవస్థానాల కార్య నిర్వహణాధికారి శ్రీ యం. వి. యస్. ప్రసాద్, ఐ.ఏ.ఎస్ గారికి నా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు.

ఈ శుభసందర్భములో అనువాదభాగా లన్నింటినీ పరిశీలించి పరిష్కరించి ఏకసూత్రత కల్పించేకార్యం నామీద ఉంచిన ప్రజాసంబంధాధికారి డా. రావుల సూర్యనారాయణమూర్తి గారికీ, ఎడిటర్ శ్రీకాట్రపాటి సుబ్బారావు, ఎం.ఏ. గారికీ నా అభివందనాలు అందిస్తున్నాను.

అక్షరదోషాలు దొర్లకుండా సహస్రాక్షులై ప్రూఫులు సరిదిద్దిన పూజ్య మిత్రులు శ్రీ ముదివర్తి కవీంద్రులకు, శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి, ఎం.ఏ., గారికీ నా అభివాదాలు.

ముద్రణకు తగినట్లు నిర్దుష్టమూ, సుస్పష్టమూ అయిన ప్రెస్ కాపీ సిద్ధంచేసి ఇచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ, ఎం.ఏ., ఎం.ఫిల్ కు నా శుభాశీస్సులు. ఈ సంపుటాన్ని ఇంత ముచ్చటగా ముద్రించి ఇచ్చిన తి. తి. దేవస్థానం ప్రెస్ మేనేజరు శ్రీ యం. విజయకుమార్‌రెడ్డి గారికీ, వారి సిబ్బందికీ నా సాధువాదాలు.

మిగిలిన భాగవత సంపుటాలు కూడా ఇదేవిధంగా అచిరకాలంలో ఆంధ్రసోదరుల హస్తాలను అలంకరింపగలవని వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

మీ
తరుణశ్రీ
ప్రధానసంపాదకుడు
పోతనభాగవతం ప్రాజెక్టు

కల్యాణభారతి,
రవీంద్రనగర్ః గుంటూరు.
10-7-91

విషయానుక్రమణిక

దశమ స్కంధము

మూడవ భాగము

పోతన భాగవతము

దశమ స్కంధము

[మూడవభాగము]

వ. మఱియును. 1253

క. నానావిధగంధములుఁ బ్ర
సూనఫలాదులును హరితశుభలాజములుం
గానిక లిచ్చుచు విప్రులు
మానుగఁ బూజించి రా కుమారోత్తములన్. 1254

* అనంతరం ఆ మధురానగరంలోని బ్రాహ్మణులు పలువిధములగు చందనద్రవ్యాలనూ, పూలు, పండ్లు మున్నగువానినీ, శుభకరములైన పచ్చని అక్షతలనూ కానుకలుగా ఇస్తూ ఉత్తములైన ఆ వసుదేవ కుమారులను ఉత్సాహంగా పూజించారు.

వ. ఆ సమయంబున నగరద్వారంబున నుండి వచ్చు రాగకారుండగు నొక్క రజకుం గని హరి యిట్లనియె. 1255

* ఆ సమయంలో నగరము వాకిటినుండి వస్తున్న రంగులు వేసే ఒక చాకివాణ్ణి చూచి శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

శ్రీకృష్ణుండు రజకుని జంపి వాయక సుదాముల లొసంగు పూజల నంగీకరించి మే లొసంగుట :—

ఉ. విందులమై నరేశ్వరుని వీటికి వచ్చితి మేము; మాకు మా
మందలలోనఁ గట్టికొన మంచిపటంబులు లేవు; నీ ముడిన్
సుందరధౌతచేలములు శోభిలుచున్నవి; తెమ్ము; నిన్ను మే
లందెదు; నిమ్ము; రాజుదెస నల్గుర; మో రజకాన్వయాగ్రణీ! 1256

* ఓ రజకకుల శిరోమణీ! మేము మీ రాజుగారి నగరానికి అతిథులమై అరుగుదెంచాము. మా మందలో మాకు ధరించడానికి మంచిగుడ్డలు లేవు. నీ మూటలో ఉతికిన అందమైన బట్టలు ఉన్నట్లున్నాయి. మేము రాజుగారికి అల్లుళ్ళం. ఆ వస్త్రాలు మాకు ఇచ్చెయ్యి. నీకు మేలు కలుగుతుంది.

వ. అనిన రోషించి వాఁ డిట్లనియె. 1257

శా. ఎట్టెట్రా! మనుజేంద్రు చేలములు మీ కీఁ బాడియే? మీరలుం
గట్టం బోలుదురే? పయోఘృతదధిగ్రాసంబులన్ మత్తులై
యిట్టాడం జనెఁగాక గొల్లలకు మీ కెబ్భంగి నోరాడెడిన్?
గట్టా! ప్రాణముఁ గోలుపోయెదు సుమీ కంసోద్ధతిన్ బాలకా! 1258

* ఆ మాటలకు ఆ రజకుడు కోపించి ఇలా అన్నాడు- ఏమిరా డింభకా! ప్రభువుగారి వస్త్రాలు మీ కివ్వమంటావా? ఇది న్యాయమా? మీరు ఆ వస్త్రాలు ధరించడానికి యోగ్యులా? పాలు నెయ్యి పెరుగు ఆహారించి తలక్రొవ్వి ఇలా కూశారు. కాకపోతే గొల్లలైన మీకు ఇలాంటిమాటలు నోటి కెలా వస్తాయి? అయ్యో! కంసమహారాజుగారి ఆగ్రహానికి పాత్రమై నీవు ప్రాణాలు పోగొట్టుకుంటావు సుమా!

క. మా రాజుసొమ్ముఁ గైకొన
నే రాజులు వెఱతు; రింత యెల్లిదమే నీ;
కీ రాజరాజగృహమున
నీ రాజసమేల? గొల్ల! యేఁగుము తలఁగన్. 1259

* ఓ గొల్లపిల్లవాడా! మా రాజుగారిసొమ్ము అంటుకోడానికి ఏ రాజులైనా భయపడతారు. నీ కింత వేళాకోళంగా ఉందా? రాజులకు రాజైన ఈ కంసుని రాజ్యంలో నీ కింత రాజసమా? తొలగి దూరంగా పో!

వ. అనిన విని రోషించి. 1280

క. ఘోరకరాగ్రతలంబున
ధీరుఁడు కృష్ణుఁడు శిరము దెగిపడఁ గొట్టెం
బౌరుల గుండెలు వగులఁగ
వీరోద్రేకిన్ మదావివేకిన్ జాకిన్. 1281

* రజకునిమాటలకు గోపాలునికి కోపం వచ్చింది. ధీరుడైన శ్రీకృష్ణుడు బీరంతో రెచ్చినవాడూ, పొగరుబోతూ, తెలివిమాలిన వాడూ అయిన ఆ చాకివాణ్ణి భయంకరమైన తన ముంజేతితో తల తెగిపడునట్లు కొట్టినాడు. దీనని చూచి పురవాసుల గుండెలు పగిలి పోయాయి.

వ. ఇట్లు భగ్నుండైన రజకుని జూచి వానివారలు పటంబులు డించి వెఱచి వఱచిన రామకృష్ణులు వలసిన వస్త్రంబులు ధరియించి కొన్ని గోపకుల కొసంగి చనుచుండ. 1282

* ఈలా నేలగూలిన చాకలిని చూచి వాని మనుషులు బట్టలు అక్కడ వదలి భయంతో పరుగెత్తిపోయారు. అంతట బల రాముడూ, శ్రీకృష్ణుడూ తమకు కావలసిన పుట్టములు కట్టుకొని కొన్ని గోపకుల కిచ్చి ముందుకు సాగారు.

క. అంతట నొక వాయకుఁ డా
క్రంతన్ వసుదేవసుతులఁ గని బహువర్ణా
త్యంతమృదుపటాభరణము
లెంతయు సంతసముతోడ నిచ్చన్ మెచ్చన్. 1283

* ఆ సమయంలో ఒక చేనేతపనివాడు ఆ దారిలో వస్తున్న వసుదేవుని కుమారులైన రామకృష్ణులను జూచి వారు మెచ్చుకొను నట్లు పలురంగులు కలిగి మిక్కిలి మెత్తనివైన వస్త్రాలనూ, ఆభరణా లనూ పరమసంతోషంతో ఇచ్చాడు.

శా. కారుణ్యంబున వానిఁగైకొని యలంకారంబు గావించి శృం
గారోదంచిత దిగ్గజేంద్ర కలభాకారంబులం బొల్చి రా
శూరుల్; మాధవుఁ డంత వాయకుని శుశ్రూషన్ మహాప్రీతుఁడై
సారూప్యంబును లక్ష్మియు న్నొసఁగె నైశ్వర్యాది సంధాయియై. 1264

* శూరులైన రామకృష్ణులు వాటిని దయతో స్వీకరించి అలంకరించుకొని సింగారింపబడిన దిగ్గజాల గున్నలమాదిరి చెన్ను వహించారు. అంతట మాధవుడు ఆ చేనేతపనివాని పరిచర్యకు మిక్కిలి సంతుష్టుడై వానికి ఐశ్వర్యాదులను అనుగ్రహించి, తన సారూప్యమును సంపత్తినీ ప్రసాదించాడు.

వ. అంత నా రామకృష్ణులు సుదాముండను మాలాకారు గృహంబునకుఁ జనిన నతండు గని లేచి గ్రక్కున మ్రొక్కి చక్కన యర్ఘ్యపాద్యాదికంబు లాచరించి సానుచరులయిన వారలకుఁ దాంబూల కుసుమగంధంబు లొసంగి యిట్లనియె. 1265

* అనంతరం రామకృష్ణులు పూలదండలుకట్టే సుదాముని యింటికి వెళ్ళినారు. అతడు వీరిని చూచి వెంటనే లేచి నమస్కరించాడు. చక్కగా అర్ఘ్యము, పాద్యము మొదలైన విధులతో సత్కరించాడు. రామకృష్ణులకూ అతనివెంట వచ్చిన వారికీ తాంబూలములు, పూలు, గంధములు ఇచ్చి ఈ రీతిగా అన్నాడు.

ఉ. పావనమయ్యె నా కులము; పండెఁ దపంబు; గృహంబు లక్ష్మికిన్
సేవిత మయ్యె; నిష్టములు సేకుఱె: విశ్వనిదానమూర్తులై
భూవలయంబుగావ నిటుపుట్టిన మీరలు రాకఁ జేసి నే
నే విధ మాచరింతుఁ? బను లెయ్యవి? బంట; నెఱుంగఁ జెప్పరే! 1266

* ప్రపంచానికి ఆదికారణమూర్తులై ధరణీచక్రాన్ని సంరక్షించడంకోసం ఇట్లా అవతరించిన మహానుభావులు మీరు, మీ రాక

వల్ల మా వంశం పవిత్ర మయింది. నా తపస్సు ఫలించింది. నా యిల్లు సిరిసంపదలతో నిండింది. నా కోరికలు ఈడేరినాయి. నేను ఏ ప్రకారం నడచుకోవాలి? ఏ పనులు చెయ్యాలి? నేను మీ బంటును; సెలవివ్వండి.

వ. అని పలికి. 1267

క. దామోదరరాముల కు
ద్దామయశోహసితతుహినధాములకు వధూ
కాములకుఁ దెచ్చియిచ్చె సు
దాముఁడు ఘనసురభికుసుమదామము లధిపా! 1268

* అని పలికి అతిశయించిన కీర్తిచే చంద్రుణ్ణి అపహసించువారూ, మగువలపాలిటి మన్మథులూ అయిన ఆ రామకృష్ణులకు సుదాముడు మిక్కిలి పరిమళముతో గూడిన పూలమాలలు సమర్పించాడు.

క. వారును మాలికుఁ డిచ్చిన
భూరి కుసుమ దామములను భూషితులై 'నీ
కోరిన వర మిచ్చెద' మని
కారుణ్యము సేయ నతఁడు గని యిట్లనియెన్. 1269

* వారునూ సుదాము డిచ్చిన దండలతో అలంకరించుకుని ఏమి కావాలో కోరుకో! 'నీవుకోరిన వర మిస్తాము' అని దయతో పలుకగా అతడు శ్రీకృష్ణునితో ఇట్లన్నాడు.

క. 'నీ పాదకమలసేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యము నితాం
తాపార భూతదయయును
దాపసమందార! నాకు దయసేయఁ గదే! 1270

* తపస్వులకు కల్పవృక్షంవంటివాడా! కృష్ణా! కమలముల వంటి నీ పాదాల పరిచర్యనూ, నీ పాదాలు పూజించే భక్తులతో చెలిమినీ, అఖిలప్రాణులమీద అత్యంతమైన అపరిమితమైన దయనూ నాకు ప్రసాదించు.

వ. అని వేఁడికొనిన నిచ్చి మఱియు మాధవుం డమ్మాలికునకు బలాయుఃకీర్తిసంపద లొసంగి వాని గృహంబు వెడలి రాజవీథిం జని చని. 1271

* ఇలా వేడుకొన్నవన్నీ అనుగ్రహించి ఇంకను శ్రీకృష్ణుడు సుదామునికి బలము, ఆయుష్యము, తేజము, యశము, సిరిసంపదలు కరుణించి వాని యింటినుండి బలరామసహితుడై బయలుదేరి రాజ వీథిలో సాగిపోయాడు.

క. ఆ నలినాక్షుఁడు గాంచెను
నానాలేపముల భాజనము పికొనుచుం
బూని చనుదెంచు దానిని
నానవరుచినిచయ విపమితాబ్జం గుబ్జన్. 1272

* అలా పోతూ కమలములవంటి కన్నులుగల శ్రీకృష్ణుడు పలురకాల మైపూత లుంచిన పాత్ర పట్టుకుని వస్తున్న కుబ్జను చూచాడు. దాని ముఖద్యుతిముందు పద్మం తలవంచుకుంటుంది.

వ. కని యిట్లనియె. 1273

* అబ్జనేత్రుడు కుబ్జను చూచి ఇలా అన్నాడు.

క. 'ఎవ్వరిదానవు? లేపము
లెవ్వరికిం గోరి కొనుచు నేఁగెదు? నీ పే
రెవ్వతె' మా కిమ్మిన్నియు
నివ్వటిలెదు చక్కనగుచు నీరజనేత్రా!' 1274

* ఓ పద్మాక్షీ! నీ వెవరిదానివి? ఈ కలపములు ఎవరికోసం తీసుకవెళుతున్నావు? నీ పేరేమిటి? ఈ లేపనములన్నీ మా కివ్వు. అలా ఇస్తే నీవు చక్కగా ప్రకాశిస్తావు.

వ. అనిన న య్యబల యిట్లనియె. 1275

ఉ. చక్కనివాఁడవౌదు; పరసంబుల నొంపకు; మెల్ల వారికిన్
జక్కఁదనంబు లెక్కడివి? చారుశరీర! త్రివక్ర యం్రడు; నే
నిక్కము కంసుదాసిని; వినిర్మలలేపనవిద్యదాన; నన్
మిక్కిలి రాజు మెచ్చుఁ; దగ మీరు విలేపనమున్ ధరింపరే? 1276

* ముకుందుని పలుకులు విని ఆ ముగుద ఇలా అన్నది– ఓ సుందరాంగా! నీవు బలే అందగాడివేలే. పరసాలతో నన్ను వేధించకు. అందరికీ అందాలెక్కడినుంచి వస్తాయి? నన్ను 'త్రివక్ర' అంటారు. నేను కంసుడి దాసిని. అచ్చమైన మైపూతలు చేయడమే నా నేర్చిన విద్య. నన్ను రాజు మిక్కిలి మెచ్చుకుంటూ ఉంటాడు. మీరు ఈ విలేపనాలు పూసుకొనరా?

క. అని పలికి యా కుమారుల
తనువులు నగవులును వీక్షితమ్ములు మాటల్
తన చిత్తముఁ గరఁగించిన
ననులేపము లిచ్చె వారి కబల ప్రియముతోన్. 1277

* ఇలా పలికి పడుచువారైన ఆ బలరామకృష్ణుల నెమ్మేనులు, నవ్వులు, చూపులు, పలుకులు తన మనస్సును కరగింపగా ఆ కుబ్జ ప్రేమతో వారికి మైపూతలు ఇచ్చింది.

సీ. ఇవ్విధంబునఁ గుబ్జ యిచ్చిన లేపంబు
అన్నియుఁ దామ దేహమున నలఁది
కొని ప్రసన్నతనొంది కుబ్జ మువ్వంకల
యొడలు సక్కఁగ నొత్తి యునుపఁ దలఁచి

తత్పదంబుల మీఁదఁ దన పదంబులు ద్రొక్కి
హస్తాంగుళ ద్వయ మబల గౌద
క్రింద విప్పుగ నిడి కృష్ణుఁడు మీఁదికి
నెత్తిన వక్రత లెల్ల మాని

ఆ. చక్కనైన చిత్తజన్మబాణము క్రియఁ
గొమరు మిగిలి పిఱుఁదు గుచయుగంబు
నొంపు సేయఁ దరుణి సుందరమూర్తియై
కమలనయనుఁ జూచి కాంక్షతోడ. 1278

* ఈలా కుబ్జ యిచ్చిన విలేపనము లన్నింటినీ వెన్నుడు తన ఒంటినిండా పూసుకుని ప్రసన్నుడైనాడు. మువ్వంపులుగల దాని దేహాన్ని చక్క నొత్తదలచాడు. దాని మీగాళ్ళమీద తన అడుగు లుంచి త్రొక్కిపట్టినాడు. తన చేతిరెండు వ్రేళ్ళను దాని గడ్డముక్రింద పెట్టి దేహము చక్కగా సాగునట్లు పైకెత్తినాడు. అంతతో అది వంపులు దీరి మన్మథుని సమ్మోహనాస్త్రం మాదిరి పొలుపారింది. పిరుదులు, చనుగవ సొంపునింపగా కుబ్జ చక్కనిచుక్కయై కమ లాక్షునివైపు కాంక్షతో చూచింది.

క. 'వేంచేయుము నా యింటికిఁ
బంచశరాకార!' యనుచుఁ బైకొంగు గాక
ర్షించి హరిఁ దిగిచెఁ గామిని
పంచాశుగబాణజాల భగ్నహృదయయై. 1279

* కాముకురాలైన కుబ్జ మదనుని బాణసమూహముచే చెదరిన హృదయము గలది అయింది. 'మన్మథాకారా! నా యింటికి దయచెయ్యి' అంటూ పద్మనాభుని పయిపుట్టము చెరగు పట్టుకొని లాగింది.

క. కామిని తిగిచినఁ గృష్ణుఁడు
రాముని వీక్షించి నగుచు రాజావనః మ
త్కామితముఁ దీర్చి పిదపన్
నీమందిరమునకు వత్తు నేఁ డలుగకు మీః 1280

* ఆ కాముకురాలు అలా తన్ను లాగగా కృష్ణుడు బలభద్రుని జూచి నవ్వుతూ ఆమెతో ఇలా అన్నాడు- ఓ చంద్రముఖీ! నా వచ్చినపని సాధించిన తర్వాత నీ గృహానికి వస్తాను. నేడు కోపింపకు!

వ. అని వీడుకొలిపి కృష్ణుండు విపణిమార్గంబునం జని చని తాంబూల మాలికాగంధంబులును బహువిధంబు లయిన కానికలును పౌరు లిచ్చినఁ బరిగ్రహించుచు ధనుశ్శాల కరిగి యందు. 1281

* ఇలా అంటూ ఆమెను సాగనంపి కృష్ణుడు అంగడివీథిలో వెళ్ళివెళ్ళి పురప్రజ లిచ్చిన తమ్ములములు, పూలదండలు, చందనములు ఇంకా పలువిధాలైన కానుకలను స్వీకరిస్తూ ధనుశ్శాలకు వెళ్ళినాడు.

క. సురరాజు వింటికై వడి
గురుతరమై భూరివీరగుప్తంబయి దు
స్తరమైన విల్లు పొడగని
నరులు వల దనంగ బిట్టు నగి వికసితుఁడై. 1282

* దేవేంద్రుని ధనుస్సువలె మిక్కిలి గొప్పదై, మేటివీరులచే రక్షింపబడుతున్న దుర్భరమైన ఆ వింటి నతడు వీక్షించాడు. రక్షకులు వద్దనుచుండగా పక్కున నవ్వి విప్పారిన మోముగలవా డైనాడు.

శా. బంధుల్ మేలన వామహస్తమునఁ జాపంబెత్తి మౌర్వీలతా
సంధానం బొనరించి కొంచెపుఁదెగన్ శబ్దించుచున్ ధీరతా
సింధుం డాహరి దాని ఖండితముగాఁ జేసెన్ జనుల్ చూడఁగా
గంధేభంబు రసాలదండము నొగిన్ ఖండించు చందంబునన్.1283

* ధైర్యమునకు సముద్రమువంటివాడగు శ్రీకృష్ణుడు తన చుట్టాలు మెచ్చగా, ఎడమచేతితో ధనుస్సును పైకెత్తినాడు. తీవవంటి అల్లెత్రాటిని తగిలించి నారిని మొరయిస్తూ మదపుటేనుగు చెరకు గడను తునుమురీతిగా జనులు చూస్తుండగా దానిని రెండుగా విరిచి వేశాడు.

క. కోదండభంగనిర్గత
నాదము వీనులకు భీషణం బయి యాశా
రోదోంతరములు నిండుచు
భేదించెన్ భోజవిభుని బింకము నధిపా! 1284

* పరీక్షిన్మహారాజా! విల్లు విరుగునప్పుడు పుట్టిన చప్పుడు చెవులకు భీతిగొలుపుతూ దిగంతరాలను పూరిస్తూ, భోజభూపాలుడైన కంసుని ధైర్యాన్ని భేదించింది.

వ. అప్పుడు 1285

ఉ. 'అద్దిర! రాచవిల్ విఱిచె నర్భకుఁ డెంతయు శంకలేక నేఁ
డుద్దవిడిన్ సహింపఁ దగ దుగ్రతఁ బట్టుఁడ' మంచుఁ గ్రుద్ధులై
గ్రద్దన లేచి తద్ధనువు కావలివా రరుదేర వారి వ
య్యిద్దఱుఁ గూడిపట్టి మడియించిరి కార్ముకఖండహస్తులై. 1286

* ఆ సమయంలో 'ఆశ్చర్యం! ఈ బాలు డే మాత్రం సందేహించక శౌర్యంతో ఇపుడు రాజుగారి ధనుస్సు ఖండించాడు. ఇది సహింపరాని సాహసకార్యం. ఇతణ్ణి పౌరుషంతో పట్టాలి' అంటూ చాపరక్షకులు కోపోద్రేకంతో వెంటనే లేచి మీదికి వచ్చారు. అంతట రామకృష్ణు లిద్దరూ ఆ వింటితునుకలు చేతపుచ్చుకుని వారిని పట్టి కొట్టి మట్టుపెట్టారు.

వ. అట్లు రామకృష్ణులు మథురాపురంబున విహరించి వెడలి విడిద
లకుం జని రంత. 1287

* ఈ విధంగా బలరామకృష్ణులు మథురానగరంలో విహారం చేసి అక్కడినుంచి బయలుదేరి తమ విడుదులకు వెళ్ళిపోయారు.

సూర్యాస్తమయ చంద్రోదయముల వర్ణనము:

మ. గగనారణ్యచరాంధకారగజముం గాలాహ్వయవ్యాధుఁ డ
చ్చుగఁ బట్టన్ గమకించి మచ్చిదుటకై చూతాంకురశ్రేణిచే
నొగిఁ గల్పించిన కందుకం బనఁగ సూర్యుం డంత వీక్షింపఁగాఁ
దగె మందప్రభతోడఁ బశ్చిమమహాధాత్రీధరేంద్రంబునన్. 1288

* కాలమనే కిరాతుడు ఆకాశ మనే అరణ్యంలో చీకటి అనే ఏనుగును పట్టడానికై పూనుకొని మచ్చుపెట్టుటకు తయారుచేసిన మామిడిచిగుళ్ళకందుకమా అన్నట్లుగా మార్తాండుడు మందగించిన కాంతితో పడమటిపర్వతంమీద చూడ ముచ్చటగొలిపాడు.

క. తరుణుఁడగు శీతకరునిన్
మరగి వియల్లక్ష్మి దన్ను మాని ముదుకఁడున్
ఖరకరుఁడు నగుచు ద్రొబ్బిన
కరణిన్ రవి పశ్చిమాద్రితటఁ గ్రుంకె నృపా! 1289

* ఓ రాజా! ఆకాశలక్ష్మి, పడుచువాడూ, చల్లనిచేతులవాడూ అయిన చంద్రుణ్ణి వలచి వృద్ధుడూ, కరకుచేతులవాడూ అంటూ తన్ను త్రోసిరాజన్న విధంగా భానుడు పడమటికొండదగ్గర అస్తమించాడు.

ఆ. కళలు కలుగుఁగాక! కమలతోడగుఁగాక!
శివునిమౌళిమీఁదఁ జేరుఁగాక!
నమ్య నొల్లఁ దపమఁడైన మత్పతి యని
సాధ్వితంగిఁ గమలజాతి మొగిడె. 1290

* తాను కళలు కలిగినవా డగుగాక! లక్ష్మి తోబుట్టువగు గాక! శివుని సిగనెక్కి నిక్కుగాక! అన్యుడైన చంద్రుడి పొత్తు మా

కక్కరలేదు. తపింపజేసి వాఁడైనప్పటికీ మా భర్త సూర్యుడే అని పతి
వ్రతవలె పద్మినీజాతి మూతిముడుచుకుంది.

క. సుందరసాయంసంధ్యా
వందన విప్రార్ఘ్యతోయ వజ్రహతోద్య
న్మందేహాసుర రక్త
స్యందము క్రియఁ గెంపుసొంపెసఁగె నవరదిశన్. 1291

* అందమైన ఆ సాయంకాలం సంధ్యావందనమున బ్రాహ్మ
ణులు సలుపు అర్ఘ్యప్రదానం అనే వజ్రాయుధంతో కొట్టబడిన మందేహ
రాక్షసుల రక్తస్రావంవలె పడమటిదిక్కులో ఎర్రదనం ఎసలారింది.

ఆ. భూమి నుండి మింటఁ బూర్ణమై కర్కట
మకర మీనరాశి మహితమైన
హరియశస్సుధాబ్ధియందలి తుంపురు
లనఁగ జుక్క లొప్పె నాకసమున. 1292

* భూమ్యాకాశాలు నిండి కర్కట, మకర, మీనరాశులచే
భాసించు నారాయణుని కీర్తి అనే పాలసంద్రంలోని తుంపరలా
అన్నట్టు మింట చుక్కలు మెరిశాయి.

క. ఎల్లదిశలు నిండిన శ్రీ
వల్లభుగుణమహిమ బ్రహ్మ వాసించుటకై
చల్లిన మృగమద మనఁగా
వెల్లివిరిసెఁ దమము గగనవీథుల నెల్లన్. 1293

* అన్నిదిక్కులందు వ్యాపించిన లక్ష్మీనాథుని మహిమను
పరిమళింపజేయుటకై బ్రహ్మదేవుడు చల్లిన కస్తూరి కాబోలు అన్నట్టు
ఆకాశవీథు లన్నిటిలో చీకట్లు ముసురుకున్నాయి.

క. ఆ చీఁకటి వెనుతగిలినఁ
బ్రాచీదిశనుండి గంతుఁ బరువున రవి ఖ
ర్వాచలము మలఁక ద్రోవను
వే చనియెంగాక నిలిచి విఱుగక యున్నే ? 1294

* చీకటి వెన్నాడగా రవి, తూర్పుదిక్కునుండి పరుగున గంతు లిడుతూ మేరుపర్వతం చుట్టుదారిలో వేగంగా వెళ్ళినాడు. అలాకాక అతడు నిలిచిఉంటే ఈ పాటికి విరిగిపోయేవాడే!

ఉ. మీకును వైరి; యెప్పుడును మిక్కిలి మాకును వైరి; రాజు దో
షాకరుఁ; డింక వచ్చు జలజాతములార! మదీయబాలురం
జేకొనుఁ డంచు బాలకులఁ జీఁకటి దాఁచిన భంగిఁ జిక్కి రా
రాక వసించెఁ దుమ్మెదలు రాత్రి సరోరుహకుట్మలంబులన్. 1295

* 'ఓ తమ్ములారా! చంద్రుడు మీకూ, మాకూ శత్రువే. అతడు దోషాకరుడు - అంటే రాత్రిని కలుగజేసేవాడు. అదుగో రాబోతున్నాడు. మా బాలకులను స్వీకరించి భద్రంగా మీ కడుపులలో పెట్టుకుని కాపాడండి' అంటూ చీకటి తన పిల్లలను దాచుటకు అప్పగించిన రీతిగా తుమ్మెదలు తామరమొగ్గలందు చిక్కుకుని వెలుపలికి రాలేక రేయి అంతా అక్కడే నివసించాయి.

సీ. ప్రాచీదిశాంగనాఫాలతలంబున
దీపించు సిందూరతిలక మనఁగ
దర్పించి విరహుల ధైర్యవల్లులు ద్రెంప
దర్పకుం డెత్తిన దాత్ర మనఁగ
నలిగి కాలకిరాతుఁ డంధకారమృగంబు
ఖండింప మెఱయించు ఖడ్గ మనఁగ
గగనతమాలవృక్షము తూర్పుకొమ్మను
లలితమై మెఱయు పల్లవ మనంగఁ

ఆ. దొగలు సంతసిల్ల దొంగలు భీతిల్లఁ
గడలి మిన్నుముట్టి కడలుకొనఁగఁ
బొడిచె శీతకరుఁడు భూరిచకోరక
ప్రీతికరుఁడు జారభీతికరుఁడు. 1296

* చకోరపక్షులకు ప్రీతినీ, విటకాండ్రకు భీతినీ కలిగిస్తూ చంద్రుడు ఉదయించాడు. అతడు తూర్పుదిక్కనే తొయ్యలిముఖంపై దీపించే కుంకుమబొట్టు అన్నట్టుగానూ, వియోగుల ధైర్యమనే తీగలను త్రెంచడానికి గర్వంతో మన్మథు డెత్తిన కొడవలి అన్నట్టుగానూ, కాలుడు అనే బోయ చీకటి అనే మృగాన్ని ఛేదించుటకు జళిపించే కరవాలం అన్నట్టుగానూ, ఆకసమనే కానుగుచెట్టుయొక్క తూర్పుకొమ్మలో మెరిసే మెత్తని చిగురాకు అన్నట్టుగానూ ఉన్నాడు. అతణ్ణి చూచి కలువలు వికసించాయి. దొంగలు భయపడ్డారు. అంభోరాశి తరగలెత్తి అంబర మంటింది.

క. దర్పిత తారాధిప వరి
సర్పిత కిరణౌఘమిళిత సకలదివంబై
యేర్పడి కమలభవాండము
గర్పూరపుఁగ్రోవి భంగిఁ గనుపట్టె నృపా! 1297

* ఓ రాజా! త్రుళ్ళిపడుతున్న నక్షత్రవిభుడైన చంద్రునికిరణ సమూహం నలుగడలా వ్యాపింపగా బ్రహ్మాండం ఒక కర్పూరకరండం వలె కనుపించింది.

క. ఆ రేయి గోపయుతులై
క్షీరాన్నము గుడిచి రామకృష్ణులు మదిఁ గం
సారంభ మెఱిఁగి యిష్ట వి
హారంబుల నప్రమత్తులై యుండి రటన్. 1298

* రామకృష్ణులు ఆ రాత్రి గోపకులతో కలిసి పాలబువ్వ ఆరగించి మనసులో కంసుని ప్రయత్నాలన్నీ గమనిస్తూ యథేచ్ఛా విహారాలతో ఆ నగరోపవనంలో జాగరూకులై గడిపారు.

క. తన పురికి రామకృష్ణులు
సమదెంచి నిజానుచరులఁ జంపుటయు మహా
ధమవు గదిసి విఱుచుటయును
విని కంసుఁడు నిదురలేక విహ్వలమతియై. 1299

* కంసుడు తన పట్టణానికి బలరామకృష్ణులు రావటమూ, తన అనుచరులను వధించటమూ, పెనుధనుస్సును విరిచివేయుటమూ విన్నాడు. అతనికి నిద్రపట్టలేదు. మనసు కలతబారింది.

సీ. కర్ణరంధ్రములు చేఁ గప్పిన లోపలి
ప్రాణఘోషము వినబడక యుండెఁ
దోయాదికములందుఁ దొంగిచూచినయంతఁ
దల గానరాదయ్యె దనువుమీఁదఁ
గరశాఖ నాసికాగ్రంబుపై నిడి చూడ
గ్రహతారకలు రెండుగా నగపడె
వెలుఁగున నిలుచుండి వీక్షింపఁగా మేని
నీడ సరంధ్రమై నేలఁ దోఁచె

ఆ. నడుగుజాడ దృష్టమౌట లే దయ్యెను
దరువులెల్ల హేమతరువు లగుచు
మెఱయుచుండెఁ గాలమృత్యువు దగ్గఱ
బుద్ధియెల్లఁ గలఁగె భోజపతికి. 1300

* భోజవిభుడైన కంసునికి, చేతులతో చెవిరంధ్రాలను మూసినపుడు తన లోపలి ప్రాణవాయుశబ్దం వినబడకుండా పోయింది. నీటిలోనూ అద్దములోనూ తొంగిచూచినపుడు తన శరీరముపై శిరము కాన్పించలేదు. వ్రేలు ముక్కుకొననుంచి చూడగా ఆదిత్యాదిగ్రహాలూ, అశ్విన్యాది నక్షత్రాలు ఒక్కొక్కటీ రెండు రెండుగా అగుపించాయి. వెలుతురులో నిలుచుని చూడగా తన మేనినీడలో ఛిద్రములు గోచరించాయి. నేలమీద తన అడుగులగుర్తు కనబడటం లేదు. చెట్లన్నీ

బంగారువన్నెతో భాసించాయి. కాలమృత్యువు సమీపించగా అతని బుద్ధి కలత చెందింది.

క. గరళముఁ దినుటయుఁ బ్రేతముఁ
బరిరంభించుటయు నగ్నభావుఁ డవుటయున్
శిరమునఁ దైలము వడుటయు
ఖరపతి నెక్కుటయు నతఁడు కలలోఁ గనియెన్. 1301

* విషం మ్రింగినట్లు, మృతులయిన వారిని కౌగిలించుకొన్నట్టు, దిసమొలతో ఉన్నట్లు, తలపై నూనెపడినట్లు, గాడిదపై నెక్కినట్లు కంసుడు కలలు గన్నాడు.

వ. మఱియు రక్తకుసుమమాలికాధరుండై యొక్కరుండ నెక్కడ నేనియుం జనుచున్నవాఁడ నని కలఁగాంచి మరణహేతుకభ్రాంతిఁ జింతాక్రాంతుండై నిద్రం జెందక వేగించుచున్న సమయంబున. 1301

* మఱియు ఎర్రనిపూలదండలు ధరించి ఏకాకియై ఎక్కడికో వెళుతున్నట్లు అతడు కలగాంచాడు. మృతికి కారణమైన భీతితో దుఃఖాక్రాంతుడై నిదురపోక ఆ రేయి ఎలాగో వేగించాడు.

సూర్యోదయ వర్ణనము :

క. అరుణ హరినఖర విదళిత
గురుతిమిరేభేంద్రకుంభకూట వినిర్ము
క్త రుధిరమౌక్తికముల క్రియ
సురపతిదిశఁ గెంపుతోడఁ జుక్కలు మెఱసెన్. 1302

* అరుణుడు అనే సింహం గోళ్ళతో చీల్చిన చీకటి అనే గజేంద్రుని కుంభస్థలం నుంచి వెలువడ్డ నెత్తుటితో కలిసిన ముత్యాల మాదిరి తూర్పుదిక్కున ఎర్రదనంతో నక్షత్రాలు మెరిశాయి.

సీ. పౌలోమి దన బాలు పొమ్పుపైఁ గనుపట్టఁ
 బన్నిన పవడంపుబంతి యనఁగ
నాయురర్థముల వ్యయంబు లొత్తిలి చాటు
 కాలజాంఘికుచేతి ఘంట యనఁగ
ఘనజంతుజీవితకాలరాసుల విధి
 కొలువ నెత్తిన హేమకుంభ మనఁగఁ
బశ్చిమదిక్కాంత పరఁగఁ గైసేయుచో
 ముందట నిడుకొన్న ముకుర మనఁగఁ

తే. గోకతాపోపశమదివ్యఘుటిక యనఁగఁ
బద్మినీకాంతనోములఫల మనంగ
మూఁడుమూర్తుల సారంపు ముద్ద యనఁగ
మిహిరమండల ముదయాద్రిమీఁద నొప్పెఁ. 1304

* సూర్యబింబం తూర్పుకొండపై ఉదయించింది. అది శచీదేవి తన పిల్లవాని పొనుపుమీద కనిపించేట్టు చిలుకల పందిరికి అమర్చిన పగడాలబంతియా అన్నట్లుంది. ఆయుస్సనే ధనం వ్యయమై పోతున్నది అని గట్టిగా చాటుతున్న కాలమనే వార్తాహరునిచేతిలోని గంటయా అన్నట్లుంది. బ్రహ్మదేవుడు ప్రాణుల జీవితకాలమనే ధాన్యరాసులను కొలవడానికి ఎత్తిన బంగరుకుంచమా అన్నట్లుంది. పడమటిదిక్కు అనే అంగన అలంకరించుకునేటప్పుడు ముందుంచు కున్న అద్దమా అన్నట్లుంది. జక్కవల పరితాపం మాన్పే దివ్యమైన మందుగుళికయా అన్నట్లుంది, పద్మిని అనే నాయిక వ్రతఫలమా అన్నట్లుంది. ముమ్మూర్తుల వెలుగుముద్దయా అన్నట్లుంది.

క. వచ్చెం జల్లని గాడ్పులు
విచ్చెం గమలములు; దమము విరిసి బిలంబుల్
చొచ్చెం; బద్మమరందము
మెచ్చెం దుమ్మెదలు గ్రోలి మిహిరుఁడు వొడమన్. 1305

● సూర్యోదయసమయంలో చల్లనిగాలులు వీచాయి. పద్మాలు పూచాయి. చీకట్లు పటాపంచలై గుహలలో దూరాయి. తుమ్మెదలు తమ్మిపూదేనియను త్రాగి ఆనందించాయి.

క. సంకాశితోదయాచల
పంకజసఖ కిరణరాగ పరిపూర్ణంబై
పంకేరుహగర్భాండము
కుంకుమసలిలంపుఁ గ్రోవి కొమరున నొప్పెన్. 1306

● తూరుపుకొండపై ఉదయించిన సూర్యునికిరణాల అరుణిమతో నిండినదై, బ్రహ్మాండము కుంకుమనీటితో కూడిన బుడ్డివలె సొబగారింది.

వ. తదనంతరంబ. 1307

సీ. పాషాణ వల్మీక పంకాదిరహితంబు
మృదులకాంచననిభ మృణ్మయంబు
గమనీయ కస్తూరికా జలసిక్తంబు
బద్ధచందనదారు పరివృతంబు
మహనీయ కుసుమదామ ధ్వజతోరణ
మండితోన్నతమంచమధ్యమంబు
బ్రాహ్మణ క్షత్త్రాది పౌరకోలాహలం
బక్రాంత తూర్యత్రయాంచితంబు

ఆ. నిర్మలంబు సమము నిష్కంటకంబునై
పుణ్యపురుషమనముఁ బోలి కంస
సైన్య తుంగ మగుచు సంతుష్ట లోకాంత
రంగమైన మల్లరంగ మొప్పె. 1308

* అప్పుడు మహారాజు కంసుడు మల్లయుద్ధానికి సిద్ధం చేయించిన క్రీడారంగము రాళ్ళు, పుట్టలు, బురద లేనిదై మెత్తని

బంగరువన్నెమట్టితో ఒప్పింది. అది కమ్మని కస్తూరిజలంతో తడుప బడింది. చుట్టూ గందపు కఱ్ఱలతో దానికి కంచె అమర్చబడింది. గొప్పపూలదండలతో, పతాకలతో, తోరణాలతో అలంకృత మయింది. ఎత్తైన ఆసనములమధ్య ఆ రంగం నిర్మించబడింది. బ్రాహ్మ ణులు, క్షత్రియులు- ఆదిగాగల పురప్రజల కోలాహలంతో అది నిండి ఉంది. ఎడతెగకుండా మ్రోగుతున్న వాద్యధ్వానాలతో ఎసలారింది, అది పుణ్యపురుషుని మానసంమాదిరి మాలిన్యం లేనిదై, సమమై, కంటకరహితమై శోభిల్లింది. కంసుని సైన్యంతో ఉన్నతమై చెన్ను మీరింది. జనుల హృదయాలకు సంతోషం సమకూరుస్తున్నది.

క. ఆ మల్లరంగపరిసర
భూమిస్థిత మంచమందు భోజేంద్రుఁడు మా
న్యామాత్యసంయుతుండై
భూమీశులు గొలువ నుండెఁ బొక్కుచు నధిపా! 1308

● ఆ మల్లరంగానికి సమీపాన ఉన్న ఉన్నతాసనమందు భోజరాజేంద్రుడైన కంసుడు మాన్యులగు మంత్రులతో గూడి. సామంతులు సేవిస్తుండగా, ఖేదపడుతూ కూర్చుని ఉన్నాడు.

మ. సకలాంభోనిధి మేఖలావహనముం జాలించి యేతెంచు నా
గకులాగంబులభంగి నొప్పుచుఁ దగం గైసేసి చాణూర ము
ష్టికకూటుల్ శలతోసలుల్ గురువులన్ సేవించుచున్ రంగ ధా
త్రికి నేతెంచిరి తూర్యఘోషముల నుద్రేకం బనేకంబుగన్. 1310

● సమస్త సముద్రాలు మొలనూలుగాఉన్న భూమండలాన్ని మోయడం మానుకుని నడిచివస్తున్న కులపర్వతాలమాదిరి ఒప్పుతూ, తగినట్లు అలంకరించుకుని చాణూరుడూ, ముష్టికుడూ, శలుడూ, తోసలుడూ తమ ఉపాధ్యాయులను కొలుస్తూ, నానావిధాలైన వాద్య శబ్దాలకు ఉద్రేకం చెలరేగగా, రంగస్థలానికి చేరినారు.

క. నందాదులైన గోపకు
లందఱుఁ జని కానుకలు సమర్పించి నృపున్
సందర్శించి తదనుమతిఁ
జెంది మహామంచముల వసించిరి వరుసన్. 1311

● నందుడు మొదలైన గోపాలు రందరూ వెళ్ళి కంసరాజును సందర్శించి కానుకలు సమర్పించి అతని అనుజ్ఞతో పెద్ద పెద్ద ఆస నాలపై వరుసగా కూర్చున్నారు.

వ. అంత రామకృష్ణులు నలంకృతులై మల్లదుందుభి నినదంబు విని సందర్శన కుతూహలంబున. 1312

● అంతట బలరామకృష్ణులు అలంకరించుకొన్నవారై జెట్టిల భేరీనినాదాలు విని మల్లరంగం చూడడానికి ఉబలాటపడ్డారు.

క. ఓడక రంగద్వారము
జాడం జని వారు కనిరి సమదకువలయా
పీడంబున్ ఖిన్నవరా
క్రీడంబుం బ్రమదకంటకిత చూడంబున్. 1313

● రామకృష్ణులు జంకూ గొంకూ లేకుండా రంగస్థలం వాకిలి దగ్గరకు వెళ్ళి మదంతో కూడిన కువలయాపీడమనే కుంజరాన్ని చూచారు. అది గ్రొచ్చి కోరాడటంలో ఇతర గజాలను క్రిందు పరుస్తుంది. ఆ మత్తేభరాజం అధికమదంతో గగుర్పొడిచిన ముందల గలది.

వ. కని తత్కరిపాలశ్రేష్ఠుండైన యంబష్ఠునికి మేఘనాదగంభీరభాష ణంబుల రిపుభీషణుండగు హరి యిట్లనియె. 1314

● అరిభయంకరుడైన శ్రీహరి ఆ మదేభాన్ని అవలోకించి మేఘగర్జనంవలె గంభీరమైన కంఠంతో మావటివాళ్ళకు నాయకుడైన వానిని చూచి ఇట్లన్నాడు.

శ్రీకృష్ణుఁడు కువలయాపీడ మను గజంబును వధించుట:

శా. ఓరీ! కుంజరపాల! మా దెసకు నీ యుద్యన్మదేభేంద్రముం
బ్రేరేఁపం బనిలేదు; త్రిప్పు; మరలం బ్రేరేఁచినన్ నిన్ను గం
భీరోగ్రాశనితుల్యముష్టిహతులన్ భేదించి నేఁ డంతకుం
జేరం బుత్తు మహత్తరద్విపముతో సిద్ధంబు యుద్ధంబునన్. 1315

● ఓరీ! మావటీ! మా వేపుకు ఈ మత్తమాతంగాన్ని తోల వలసినపని లేదు. వెనుకకు మరలించు, డీకొలిపినావా పోరాటంలో నీ మదపుటేనుగుతోపాటు నిన్ను గంభీరమైన, దారుణమైన, పిడుగు పాటులవంటి నా పిడికిలిపోటులతో పొడిచి చంపుతాను. యముని పాలికి ఇపుడే పంపుతాను. ఇది తథ్యం.

వ. అని పలికి. 1316

ఉ. మించిన కొప్పుఁ జక్కనిడి మేలవఁ బచ్చనిచీర కాసె బం
ధించి అలాటకుంతలతతిన్ మరలించుచు సంగరక్రియా
చుంచుతఁ బేర్చి బాలకుఁడు చూచు జనంబులు దన్ను 'బాపురే!'
యంచు నుతింప డగ్గఱియె హాస్తిజితాగము గంధనాగమున్. 1317

* ఇలా పలికి చొక్కమైన జుట్టుముడిని చక్కచేసికొని, మెల్లగా పీతాంబరాన్ని దట్టిగా బిగించి కట్టుకుని, నుదుటవ్రేలాడే ముంగురులను పైకి త్రోసుకుంటూ యుద్ధకార్యనైపుణ్యంతో విజృంభించి బాలుడైన కృష్ణుడు చూచేవారు సెబాసని తన్ను మెచ్చుకుంటుండగా తొండంతో కొండలను పిండిచేసే ఆ మత్తవేదండాన్ని సమీపించాడు.

క. అంజక బాలకుఁ డనియును
గొంజక దయమాలి రాజకుంజర! యంతం
గుంజరమును డీకొలిపెను
గుంజరపాలకుఁడు గోపకుంజరుమీఁదన్. 1318

* ఓ రాజోత్తమా! మావటివాడు బాలుడని సందేహింపక కరుణమాలి కంసుని ఆజ్ఞానుసారం గోపకులశ్రేష్ఠుడైన శ్రీకృష్ణునిపైకి ఏనుగును దీకొలిపినాడు.

వ. మఱియు న య్యనేకపం బనేకపపాలక ప్రేరితం బయి, మహా వాతసంఘాత సముద్ధూతంబగు విలయకాలకీలికీలిని బిట్టు మిట్టిపడి, మృత్యుదేవత యెత్తునం, గాలుపోలిక, శమనుని గమనిక నెదిరి మదసలిల పరిమళ లుబ్ధ పరిభ్రమద్భ్రమర గాయక ఝంకృతు లహంకృతి నంపాదింపం, గులకుంభినీధర గుహాకుంభ గుంభనం బుగా ఘీంకరించి, రోషభీషణ శేషభోగిభోగ భయంకరంబగు కరం బున శౌరిం జీరి, చీరికిం గొనక, పట్టిన నట్టిట్టు గెంటి, విఘుంతుద వదన గహ్వరంబువలన విడివడి యుఱుకు తరణికరణి దర్పించి కుప్పించి, పాదమధ్యంబునకు నసాధ్యుండై దూఁటి, మాటుపడినం గ్రోధబంధురంబై సింధురంబు మహార్ణవమధ్య మంథాయమాన మంథర మహీధరంబుకైవడి జిఱజిఱం దిరిగి, కానక భయానకంబై గాలివెరవునం గని పొంగి చెంగటం బ్రళయదండిదండ ప్రశస్తం బగు హస్తంబువంచి వంచించి చుట్టి పట్టి పడవేయం గమకించినం జలింపక తెంపున హరి కరి పిఱింది కుఱికి మహోరాహువాల వల్లికా కర్షణోదీర్ణుం డగు సుపర్ణు తెఱంగున నెగిరి శుండాలంబు వాలంబు లీలం గేల నొడిసిపట్టి జళిపించి పంచవింశతి బాణాసన ప్రమాణదూరంబు బీరంబునం ద్రిప్పివైవ, న వ్వారణంబు దుర్ని వారణంబై రణంబున కోహటింపక సవ్యాపసవ్యపరిక్రమణంబుల నవక్రంబై కవిసిన, నపసవ్య క్రమంబులఁ దప్పించి, రొప్పి కుప్పించి యెదుర్కొనినఁ గర్కశుం డయి, మేచకాచల తుంగ శృంగ నిభంబగు కుంభికుంభంబు చక్కటిప్రక్కలై చెక్కలెగయ దురంతకల్పాంత జీమూత ప్రభూత నిర్ఘాత నిష్ఠురంబగు ముష్టి సారించి యూఁచి పొడిచినం దద్వికీర్ణ రక్త సిక్త మౌక్తికంబులు

వసుంధరకు సంధ్యారాగ రక్తతారకాచ్ఛన్నం బగు మిన్నుచె న్నలవరింప నిలువరింపక ౘ్రమ్మొగ్గి మోఁకరిలి, ౘ్రమ్మొగ్గక దిగ్గన వగ్గజంబు లేచి, చూచి, ౘ్రోచి నడచి, సంహారసమయ సముద్ర సంఘాత సంభూత సముత్తుంగ భంగ సంఘట్టితం బగు కులాచలంబు ౘ్రియఁ ౘ్రమ్మఱ నమ్మహాభుజుని భుజాదండంబులవలన ఘట్టితంబై, కట్టలుక ముట్టి నెట్టుకొను మున్మురంబునం గొమ్ములం జిమ్మిన, నమ్మేటి చేసూటి మెఱసి హస్తాహస్తిసంగరంబునఁ గరం బొప్పి దప్పింబడక నొప్పించిన, నకుంఠిత కాలకంఠ కఠోర భల్ల భగ్నం బగు పురంబు పగిది, జలధిం జటుల ఝంఝానిల వికలం బగు కలంబు కైవడి నమ్మదకలంబు బలంబు దక్కి చిక్కి ౘ్రుక్కు వడి లోఖికరంబునుం బోలె దానసలిలధారా విరహితంబై విరహితలంపునుం బోలె నిరంతర చిత్తజాతవిగ్రహంబై, గ్రహణకాలంబునుం బోలెఁ బరాధీనఖరకరంబై, ఖరకరోదయంబునుం బోలె, భిన్నపుష్కరంబై, పుష్కరవైరి విలసనంబునుం బోలె నభాసిత పద్మకంబై యున్న సమయంబున. 1319

* ఇంకను పలువురు మావంతులు ఆ కువలయాపీడమును పురికొల్పినారు. పెనుగాలిగుంపుచే పైకెగసిన ప్రళయకాలంలోని అగ్నిజ్వాల విధంగా, ఆ మత్తగజం ౘ్రుళ్ళిపడుతూ మృత్యుదేవత మాదిరీ, కాలపురుషునికైవడీ, యముని తీరునా కృష్ణుణ్ణి ఎదుర్కొన్నది. తన మదజల వాసనమీద ఆసచే చుట్టూ తిరుగాడే తుమ్మెదలనే గాయకుల ఝుంకారంవల్ల ఆ గజం అహంకరించింది. అది కులపర్వత గుహలవంటి కుంభాలను తన ఘీంకారంతో పూరించింది. అగ్రహో దగ్రుడైన ఆదిశేషునిపడగవలె భయంగొలిపే తన తుండంతో నిర్లక్ష్యంగా శౌరిని పట్టుకుంది. అసాధ్యుడైన హరి అంతట అటునిటు పెనగి రాహువు ముఖగహ్వరం నుంచి తప్పించుకొని వెలికురికే భాస్కరుని మాదిరి, చెంగున ఎగిరి దాని కాళ్లనడుమ దూరి దాగు కొన్నాడు. గోవిందుడు కనిపించక పోయేసరికి కువలయాపీడానికి

క్రోధం పెల్లుబికింది. మహాసాగరమధ్యంలో పరిభ్రమించే మందర
గిరిలాగా అది గిరగిర తిరుగాడింది. వాసనపసికట్టి కృష్ణుడున్నచోటు
తెలిసికొని ఉప్పొంగిపోయింది. ప్రళయకాలంలోని యమదండం
లాగా ప్రచండమైన తన తొండాన్ని క్రిందికి వంచి అది పద్మలోచనుణ్ణి
వంచించి చుట్టి పట్టుకుని పడమొత్తటానికి ప్రయత్నించింది. మాధ
వుడు చలింపక తెంపుతో దాని వెనుకవైపునకు ఉరికినాడు. రాహువు
తోకను పట్టిలాగే జగజెట్టి గరుడునిచందంగా శ్రీకృష్ణుడు ఒక్క ఎగురు
ఎగిరి ఆ ఏనుగువాలాన్ని చేతితో ఒడిసి పట్టుకున్నాడు. పరాక్రమంతో
వందమూరల దూరానికి దానిని గిరగిర త్రిప్పి విసరివేశాడు.

ఆ మదేభం అడ్డుకొనరానిదై, అవక్రపరాక్రమంతో పోరా
టానికి వెనుదీయక కుడిఎడమలుగా తిరుగుతూ మళ్ళీ మాధవుడి
మీదికి ఉరికింది. అప్పుడు కృష్ణుడు కుంజరం కుడిప్రక్కకు తిరిగి
నప్పుడు తాను ఎడమప్రక్కకు, అది ఎడమవైపుకు తిరిగినప్పుడు
తాను కుడివైపుకూ తిరుగుతూ దానికి బాగా రొప్పు తెప్పించాడు.
అతడు కాఠిన్యం వహించి దానిపైకి చెంగలించాడు. ప్రళయకాల
మేఘాలనుండి పడిన కఠోరమైన పిడుగులాంటి తన పిడికిలి బిగించి
ఊడ్చి ఆ గజకుంభస్థలాన్ని గ్రుద్దినాడు. ఎత్తయిన అంజనగిరిశిఖరం
లాంటి దాని కుంభస్థలంపగిలి ముక్కచెక్కలై ఎగిరిపడింది. ఆ ఇభ
కుంభంనుంచి నెత్తుటితో తడిసి చెదరి నేలరాలిన ముత్యాలు సంజ
కెంజాయలో ఎర్రటినక్షత్రాలతో కప్పబడిన మింటిసొబగును ధరణికి
సంతరించాయి. ఆ శుండాలం అంతతో అగక మ్రొగ్గి మోకరిల్లి
సంబాళించుకుని వెంటనే లేచింది. అటునిటు చూచింది. ముందుకు
ఉరవడించింది. ప్రళయ వేళలో సముద్రాల సముత్తుంగ తరంగాలచే
కొట్టబడిన కులపర్వతం మాదిరి అది మళ్ళీ భుజబలసమేతుడైన
శ్రీకృష్ణునిచే కొట్టబడింది. మిక్కుటమైన క్రోధంతో కువలయాపీడం
గోవిందుణ్ణి ఒక్కుమ్మడిగా తన కొమ్ములతో చిమ్మింది. నందసుతుడు

హస్తలాఘవం మీరగా బాహాబాహీ యుద్ధంలో మిక్కిలి విజృంభించి దానిని తల్లడిల్ల చేశాడు.

అప్పుడు ఆ మదగజం మొక్కవోని ముక్కంటి బల్లెముచే భగ్నమైన పురంలాగా, సముద్రంలో తీవ్రమైన ఝంఝామారుతంవల్ల పాడైన ఓడలాగా శక్తి కోల్పోయింది. బక్కచిక్కి స్రుక్కిపోయింది. దానోదకధారలు లేని పిసినారి చెయ్యి విధంగా అది మదజలధారలు లేనిది అయింది. ఎడతెగని మదనుని పోరుగల వియోగి హృదయం లాగా ఎడతెగక మదిలో జన్మించిన విరోధం కలది అయింది. పరాధీనుడైన ప్రభాకరుడుగల గ్రహణవేళమాదిరి ఎండిన తొండము గలది అయింది. పూచిన తామరలుగల సూర్యోదయం లాగా చీలిన తొండపుకొనగలది అయింది. ప్రకాశింపని పద్మాలుగల చంద్ర ప్రకాశం మాదిరి, వెలవెలపోయిన ముఖమందలి బిందువులు కలది అయింది.

శా. కాలం ద్రొక్కి సలీలుఁడై నగవుతోఁ గంఠీరవేంద్రాకృతిం
గేలన్ భీషణదంతముల్ వెఱికి సంక్షీణంబుగా మొత్తి గో
పాలగ్రామణి వీరమౌళిమణియై ప్రాణంబులం బాపె నా
శైలేంద్రాభముఁ బ్రాణలోభము నుదంచత్సారగంధేభమున్. 1320

* ఆ సమయంలో గోపాలశేఖరుడూ, వీరశిరోరత్నమూ అయిన ముకుందుడు పర్వతరాజముతో సమానమైనదీ, ప్రాణాలపై ఆసకలదీ, అయిన ఆ మత్తకరీంద్రమును మహాసింహం మాదిరి సవిలాసంగా నవ్వుతూ, కాలితో త్రొక్కి, చేతితో భయంకరమైన దాని దంతాలు ఊడబెరికి, బక్కచిక్కునట్లు బాది ప్రాణాలు తీసివేశాడు.

వ. మఱియు దంతిదంతతాడనంబుల దంతావళపాలకులం గాలుప్రోలి కనిపి తత్ప్రదేశంబు వాసి. 1321

• తర్వాత ఆ ఏనుగు దంతాలతోనే మావటివాండ్రను యమపురికి పంపించి ఆ చోటు వదలిపెట్టాడు.

మ. కరిదంతంబులు మూఁపులందు మెఱయన్ ఘర్మాంబువుల్ మోములన్
నెరయం గోపకులంత నంత మలయన్ నిత్యాహవస్థేము లా
హరిరాముల్ సనుదెంచి కాంచిరి మహోగ్రాడంబరాపూరితా
మరమర్త్యాది జనాంతరంగము లనన్మల్లావనీరంగమున్. 1322

* కదనరంగంలో కాలుకదపక పోరాడే ఆ రామకృష్ణులు ఏనుగుదంతాలు తమ మూపులపై మెరుస్తుండగా, స్వేదబిందువులు ముఖములందు నిండగా, గోపాలకులు తమ్ము పరివేష్టించగా బయలు దేరి వచ్చి మల్లభూమిని చూచారు. అది దేవమానవులహృదయాలను మహాభయంకరమైన ఆడంబరంతో కలవరపెడుతూ ఉంది.

సీ. మహితరౌద్రంబున మల్లుర కశనియై
నరుల కద్భుతముగ నాథుఁ డగుచు
శృంగారమునఁ బురస్త్రీలకుఁ గాముఁడై
నిజమృత్యువై కంసునికి భయముగ
మూఢులు బీభత్సమూను బొంద వికటుఁడై
తండ్రికి దయరాఁగఁ దనయుఁ డగుచు
ఖలులకు విరసంబుగా దండియై గోప
కులకు హాస్యంబుగాఁ గులజుఁ డగుచు

ఆ. బాంధవులకుఁ బ్రేమ భాసిల్ల వేలుపై
శాంత మొనర యోగిజనుల కెల్లఁ
బరమతత్త్వ మగుచు భాసిల్లె బలునితో
మాధవుండు రంగమధ్యమందు. 1323

• మల్లరంగంమధ్యలో బలరామసహితుడైన మధుసూదనుడు రౌద్రరసంతో మల్లురకు పిడుగువలె కనుపించాడు. అద్భుతరసంతో ప్రజలకు ప్రభువుగా తోచాడు. శృంగారరసంతో పౌరవనితలకు పంచశరుడుగా భాసించాడు. భయానకరసంతో కంసునికి వానిపాలిటి మృత్యువుగా మూర్తీభవించాడు. బీభత్సరసంతో మూర్ఖులకు వికట

మైన వాడనిపించాడు. కరుణరసంతో తండ్రికి కన్నబిడ్డడుగా కాంతిల్లినాడు. వీరరసంతో దుర్మార్గులకు విద్వేషం కలిగించాడు. హాస్యరసంతో గోపకులను కులదీపకుడుగా గోచరించాడు. ప్రేమ రసంతో చుట్టాలకు దేవుడుగానూ, శాంతరసంతో యోగిజనులకు పరబ్రహ్మస్వరూపుడుగానూ ప్రకాశించినాడు.

వ. అప్పుడు 1324

క. వచ్చిన కుంభీంద్రంబును
వచ్చిన బలమాధవులను వరుసం గని తా
నొచ్చిన చిత్తముతోడుతఁ
జెచ్చెరఁ గడు వెఱచె భోజసింహుం డధిపా! 1325

* ఓ రాజా! ఆ సమయంలో వచ్చిన కువలయాపీడమునూ, వచ్చిన రామకృష్ణులనూ క్రమంగా చూచి భోజకులావతంసుడైన కంసుడు నొచ్చిన మనస్సుతో మిక్కిలి భయపడినాడు.

ఉ. ధీరుల వస్త్రమాల్యమణిదీప్త విభూషణధారులన్ మహా
కారుల సర్వలోకశుభకారుల మానవమానినీమనో
హారుల రంగభూతలవిహారుల గోపకుమారులన్ మహా
వీరులఁ జూచి చూచి తనివిం దుదిముట్టక లోకులందఱున్. 1326

● ధీరులూ, వస్త్రములూ, పూలదండలూ, రత్నాలతో వెలుగొందే నగలు ధరించినవారూ, నటులవేషములో నున్నవారూ, సకల జగాలకూ క్షేమం కలిగించే వారూ, మగవారియొక్క మగువల యొక్క మనసులు ఆకర్షించే వారూ, మల్లరంగంలో విహరిస్తున్న వారూ, మహావీరులు అయిన ఆ గోపకుమారులను జను లందరూ తనివితీరక మాటిమాటికీ చూచారు.

ఉ. సన్నుత రామకృష్ణముఖచంద్రమయూఖ సుధారసంబులం
గన్నులఁ ద్రావుచందమునఁ గాంచుచు జిహ్వల నంటి చూచు లీ
ల న్నుతిసేయుచుం గరములం బరిరంభము సేయుభంగి న
త్యున్నతిఁ జూపుచుం దగిలి యొండొరుతోడ రహస్యభాషలన్ 1327

* అందమైన రామకృష్ణుల ముఖచంద్రబింబాలనుండి ప్రసరించే అమృతరసాన్ని కన్నులతో త్రాగేవిధంగా చూస్తూ, నాలుకలతో చప్పరించి చవిచూచే విధంగా స్తుతిస్తూ, చేతులతో కౌగలించేవిధంగా ముమ్ముందుకు తూలుతూ అక్కడివారంతా ఒకరితో ఒకరు గుజగుజలు పోయినారు.

క. వసుదేవు నివాసంబున
వసుధన్ రక్షింప వీరు వైష్ణవతేజో
అసనముఁనఁ బుట్టినారఁట
పసిబిడ్డ లనంగఁ జనదు పరదేవతలన్. 1328

* వీరు విష్ణుదేవుని తేజోవిలాసంతో భూమిని కాపాడుటకై వసుదేవుని గృహంలో జన్మించినారట. పరబ్రహ్మస్వరూపు లయిన వీరిని పసిపాపలనడం తగదు అనుకున్నారు.

సీ. చంపెఁ దక్కసిఁ బట్టి; చక్రవాతునిఁ గూల్చెఁ
బడఁద్రొబ్బె మద్దుల; బకుని జీరె;
నఘదైత్యుఁ బొరిగొనె; నదరి వత్సకుఁ ద్రుంచె
గిరి యెత్తి దేవేంద్రుఁ గ్రిందు పఱిచెఁ
గాళియు మర్దించె; గహనానలముఁ ద్రావెఁ
గేశి నంతకుపురికేగ ననిచె;
మయుపుత్రుఁ బరిమార్చె; మఱియును దానవ
భటుల మర్దించి గోపకులఁ గాచె;

తే. గోపకాంతల మనములఁ గోర్కెఁ దీర్చె
నీ సరోరుహలోచనుం డీ శుభాంగుఁ
డీ మహామహుఁ డీ దిగ్గజేంద్రనిభుఁడు
మనుజమాత్రుండె తలపోయ మాధవుండు? 1329

* నళినములవంటి నయనములుకలవాడూ, మంగళకరమైన అంగసౌష్ఠవము గలవాడూ, గొప్పతేజస్సు కలవాడూ, దిగ్గజేంద్రము

నకు దీటైనవాడూ, లక్ష్మికి పతియైనవాడూ అయిన శ్రీకృష్ణుడు రక్కసియైన పూతనను పట్టి చంపినాడు. సుడిగాలియైన తృణావర్తుని హతమార్చినాడు. మద్దిమ్రాకులను పడగూల్చినాడు. బకాసురుని సంహరించినాడు. అఘుడనే అసురుణ్ణి పొరిగొన్నాడు. విజృంభించి వత్సాసురుణ్ణి వధించినాడు. గోవర్ధనగిరి నెత్తి దేవేంద్రుణ్ణి అవమానించినాడు. కాళియుడనే నాగరాజును మర్దించినాడు. కార్చిచ్చును త్రాగివేసినాడు. కేశి అనే దానవుణ్ణి యమునిచెంతకు పంపినాడు. మయుని కొడుకైన వ్యోమాసురుని నిర్మూలించినాడు. ఇంకనూ ఎందరో దనుజవీరులను దునుమాడి గోపకులను కాపాడినాడు. త్రేతలమనసులోని కోరికలను ఈడేర్చినాడు. ఆలోచింపగా ఇతడు సామాన్య మానవుడు కాడు.

శ్రీకృష్ణ బలరాములు చాణూర ముష్టికులను వధించుట :

వ. అని పలుకుచుఁ బౌరజనులు సూచుచుండ రామకృష్ణులకుఁ జాణూ రుం డిట్లనియె. 1330

● ఈ విధంగా అనుకుంటూ పురప్రజలు రామకృష్ణులను చూస్తున్నారు. అప్పుడు చాణూరుడు రామకృష్ణులతో ఇలా అన్నాడు.

మ. వనమార్గంబున గోపబాలకులతో వత్సంబులన్ మేపుచుం
బెనఁగన్ మిక్కిలి నేర్చినా రనుచు నీ పృథ్వీజనుల్ సెప్ప మా
మనుజేంద్రుం డిట మిమ్ముఁ జీరఁ బనిచెన్ మల్లాహవక్రీడకుం;
జనదే కొంతపరాక్రమింప మనకున్ సభ్యుల్ విలోకింపఁగన్. 1331

● అడవిదారులలో గొల్లబుడుతలతో కలిసి దూడలు మేపుతూ జెట్టిపోరులలో మిక్కిలి నేర్పుగడించారని ఈ పుడమిలో జనులు చెప్పుకుంటుండగా విని మా మహారాజు మల్లయుద్ధక్రీడకు మిమ్ము ఇక్కడికి పిలిపించాడు. ఇప్పుడు ఇక్కడిసభ్యులు చూస్తుండగా మనం మన మన పరాక్రమాలు కొంత ప్రదర్శించడం సముచితం.

మ. జవసత్త్వంబులు మేలె? సాము గలదే? సత్త్రాణమే మేను? భూ
ప్రవరుం బోనన మి మ్మనంగ వలెనే? పాళీ లభీష్టంబులే?
పవివో? కాల కృతాంతదండకమవో? ఫాలాక్షు నేత్రాగ్నివో?
నవనీతంబుల ముద్దగాదు; మెఱఁగన్ నా ముష్టి గోపార్భకా! 1332

• ఓ గొల్లకుఱ్ఱా! నీకు జనసత్త్వాలు బాగున్నవా! సాము నేర్చినావా? తనువు శక్తియుక్తమా? రాజును క్షీర మిప్పించమని చెప్పవలెనా? జూదాలంటే నీ కిష్టమేనా? నా పిడికిటి పోటంటే ఏమిటో తెలుసా? ఇది పిడుగువంటిది; లేదా యముని కాలదండం లాంటిది. లేదా ముక్కంటి కంటిమంట వంటిది. అర్థమయిందా? నా పిడికిలిగ్రుద్దు వెన్నముద్దకాదు తింటానికి.

క. జనములు నేర్చిన విద్యలు
జననాథునికొఱకుఁ గాదె? జననాథుఁడు నీ
జనములు మెచ్చఁగ యుద్ధం
బున మనముం గొంతప్రొద్దు పుత్తమె? కృష్ణా! 1333

* ఓయి కృష్ణా! జనులు విద్యనేర్వడం ప్రభువుల మెప్పు కోసమే కదా! రాజూ, ఈ ప్రజలూ మెచ్చుకునేటట్లు మనం మల్ల యుద్ధంతో కొంత కాలక్షేపం చేదామా!

వ. అనిన విని హరి యిట్లనియె. 1334

ఉ. సాములు లేవు; పిన్నలము; సత్త్వము గల్గనరాదు; మల్ల సం
గ్రామవిశారదుల్ గులిశకర్కశదేహులు మీరు; మీకడ
న్నేము చరించు టెట్లు? ధరణీపతి వేడ్కలు సేయువారముం
గాము; వినోదముల్ పలుపఁ గాదనవచ్చునె యొక్కమాటికిన్. 1335

• వా డిట్లనగా కృష్ణు డిలా అన్నాడు. మాకు సాములు తెలియవు. మేము పిన్నవాళ్ళం. సత్తువ ఉందని చెప్పలేము. మీ రో మల్లయుద్ధంలో నిష్ణాతులు. వజ్రాయుధం మాదిరి కరకైన శరీరాలు

కలవారు. ఇట్టి మీతో మే మెట్లా తలపడడం? మీ రాజుగారికి వినోదం కలిగించే వాళ్ళమూ కాము. కాని పోరాటకు మీరు ఆహ్వానిస్తే ఒక్కసారిగా కాదని ఎలా అంటాము?

క. నీతోడుత నేఁ బెనఁగెదఁ
ప్రీతిన్ ముష్టికునితోడఁ బెనఁగెడి బలుఁ డు
గ్రాతతమల్లాహవమున
భూతలనాథునికి మెచ్చుఁ బుట్టింతు సభన్. 1336

• నీతో నేనూ, ముష్టికునితో మా అన్న బలరాముడూ ఉత్సాహంతో పెనగులాడుతాము. భయంకరమైన మల్లయుద్ధంలో భూతలమునకు ప్రభువైన కంసునకు ప్రీతి కలిగిస్తాము.

వ. అనిన విని చాణూరుం డిట్లనియె. 1337

శా. నాతోఁ బోరఁగ నెంతవాఁడ? విసిరో నాపాటియే నీవు? వి
ఖ్యాతుండం; గులజుండ; సద్గుణుఁడ; సత్కర్మస్వభావుండ! నీ
కేతాదృగ్విభవంబు లెల్లఁ గలవే? యీ వీటఁ బోరాడుటల్
ప్రేతల్ సూడఁగఁ గుప్పిగంతు లిడుటే? వీక్షింపు గోపార్భకా! 1338

• హరి మాటలువిని చాణూరుడు ఇలా అన్నాడు. అవురా! గొల్లపిల్లవాడా! నాతో పెనగులాడుటకు నీ వెంతవాడివి? నీవు నాకు సమానుడ వవుతావా? నేను ప్రసిద్ధుణ్ణి. శుద్ధమైన కులంలో పుట్టినవాణ్ణి. సత్కర్మలాచరించే స్వభావం కలవాణ్ణి. నీకు ఇలాంటి గొప్పతనముందా? ఈ రాచవీటిలో పోరాటమంటే గొల్లలముందు కుప్పిగంతులువేయడం కాదుసుమా! బాగా ఆలోచించుకో!

శా. స్థాణున్ మెచ్చఁడు; బ్రహ్మ గైకొనఁడు; విష్వక్సేను నవ్వున్; జగ
త్ప్రాణున్ రమ్మనఁ డీడుగాఁ డని; మహాబాహాబలప్రౌఢి న
క్షీణుం డాజికి నెల్లి నేఁ డనఁడు! వైచిత్రిన్ వినోదించు ని
చ్చాణూరుం డొక గోపబాలు ననికిన్ శక్తుండు గాకుండునే? 1339

● ఈ చాణూరుడు ఈశ్వరుణ్ణి మెచ్చుకోడు. బ్రహ్మదేవుణ్ణి లెక్కచేయడు. విష్వక్సేనుణ్ణి గేలిచేస్తాడు. తనకు సాటిరాడని వాయు దేవునిసైతం రణరంగానికి రమ్మని పిలవడు. మిక్కుటమైన భుజ బలాతిరేకం తరగనివాడు. యుద్ధానికి రేపుమాపు అనడు. చిత్రవి చిత్రంగా అలవోకగా ఆహవం చేస్తాడు. ఇట్టి జగజెట్టి చాణూరుడు ఒకగొల్లకుఱ్ఱని పనిపట్టడానికి చాలకపోతాడా?

క. ప్రల్లద మేటికి గోపక!
బల్లిదుఁడను; లోకమందుఁ బ్రఖ్యాతుఁడ; నా
చల్లడముక్రింద దూఱని
మల్లురు లే రెందు ధరణిమండలమందున్. 1340

● గోవులను మేపే కుర్రవాడా! ప్రగల్భా లెందుకు? నేను మహాబలవంతుణ్ణి, లోకంలో ప్రసిద్ధిగాంచిన వాణ్ణి, భూమండలంలో ఎక్కడగానీ ఓడిపోయి నా లంగోటాక్రింద దూరని జెట్టులే లేరు సుమా!

సీ. చలమున నమడాపి జలరాశిఁ జొరరాదు
నిగిడి గోత్రముదండ నిలువరాదు
కేడించి కుంభినిక్రిందికిఁ బోరాదు;
మనుజసింహుఁడ నని మలయరాదు;
చేరినఁ బడవైతుఁ జెయిసాఁపఁగా రాదు;
బెరసి నాముందటఁ బెరుఁగ రాదు
భూనాథహింసకుఁ బోరాదు నను మీఱి;
శోధింతుఁ గానలఁ జొరఁగ రాదు

ఆ. ప్రబలమూర్తి ననుచు భాసిల్లఁగా రాదు
ధరఁ బ్రబుద్ధుఁడ నని తలఁపరాదు
కల్కితనముచూపి గర్వింపఁగా రాదు
తరముగాదు; కృష్ణ! తలఁగు తలఁగు. 1341

● ఓ కృష్ణా! మచ్చరంతో నన్ను సమీపించిన తర్వాత సాగరంలో ప్రవేశించడానికి సాధ్యం కాదు (మత్స్యావతారం). పర్వతంచెంత నిక్కి నిలవడానికీ శక్యం కాదు (కూర్మావతారం). అలక్ష్యంతో భూమిక్రిందకు దూరడానికి వీలులేదు (వరాహావతారం). సింహామువంటి పురుషుణ్ణి అని పొగరుగా తిరగడానికి కుదరదు (నృసింహావతారం). దగ్గరకు వస్తే పడద్రోస్తాను. కనుక చేయి సాచడానికి సందుదొరకదు (వామనావతారం). పెనగి నా ఎదుట పెచ్చు పెరగటం అలవికాని పని (త్రివిక్రమ స్ఫురణ). నన్ను దాటి రాజును హింసించడం శక్యపడదు (పరశురామావతారం). గాలిస్తాను గనుక అరణ్యాలలో ప్రవేశించటానికి అవకాశం లేదు (శ్రీరామావ తారం). ప్రబలమైన ఆకారం కలవాడనని విర్రవీగుటకు వీలుండదు (బలరామావతారం). పుడమిలో 'నేనే ప్రబుద్ధుణ్ణి' అని భావించకు (బుద్ధావతారం). కల్కితనంతో(తెలివితేటలతో) గర్వింపరాదు సుమా! (కల్క్యవతారం). నాతో యుద్ధం చేయడం నీ తరంగాదు. తొలగిపో!

వ. అదిగాక నీవు శ్రీహరి నంటేని. 1342

● అదీగాక నీవు 'ఆదినారాయణుడను' అంటావా? అలా అయితే విను!

సీ. మహిమతో మండంగ మథురాపురముగాని
బొలుపార వైకుంఠపురము గాదు
గర్వంబుతో మండఁ గంసునిసభగాని
సంసారరహితుల సభయుఁ గాదు
ప్రకటించి వినఁగ నా బాహునాదముగాని
నారదు వీణాస్వనంబు గాదు
చదురు లాడఁగ మల్లజనవిగ్రహముగాని
రమతోడి ప్రణయవిగ్రహము గాదు

తే. వెలసి తిరుగంగ వేదాంతవీథి గాదు
మొఱఁగివో మునిమనముల మూల గాదు
సొఁగి నడవంగ భక్తుల జాడ గాదు
శౌరి! నా మ్రోల నీ వెందుఁ జనియె దింక? 1343

● వైభవోపేతంగా నివసించడానికి ఇది వైకుంఠపురంగాదు, మధురానగరం. దర్పంతో మెలగడానికి ఇది సన్న్యాసుల సభకాదు, కంసుని ఒడ్డోలగం. స్వచ్ఛందంగా వినడానికి ఇది నారదుని వీణా నినాదం కాదు, నా భుజాస్ఫాలనశబ్దం. చతురోక్తు లాడడానికి ఇది లక్ష్మీదేవితోడి ప్రణయకలహం కాదు, మల్లురతోడి రణరంగం. యథేచ్ఛగా సంచరించడానికి ఇది వేదాంతవీథి కాదు. దాగి ఉండడానికి ఇది మునిమనఃకుహరం కాదు. ముందుకు వెళ్ళడానికి ఇది భక్తుల సంగతి కాదు. గుర్తుంచుకో! కృష్ణా! ఇక్కడి నుంచి నీ వెక్కడికీ వెళ్ళలేవు.

వ. అని పలికి. 1344

సీ. రోషాగ్నిధూమప్రరోహంబు కైవడి
శిరమున సన్నపుశిఖ వెలుంగ
నాశామదేభేంద్రహస్తసన్నిభములై
బాహుదండంబులు భయదములుగ
లయసమయాంతకోల్లసిత దంష్ట్రిలభంగి
జాఁగిన కోఱమీసములు మెఱయ
నల్లని తెగగల నడగొండచాడ్పున
నాభీలనీలదేహంబు మెఱయఁ

ఆ. జరణహతుల ధరణి సంచలింపఁగ నభో
మండలంబు నిండ మల్లసఱచి
శౌరిదెసకు నడచెఁ జాణూరమల్లుండు
పౌరలోకహృదయభల్లుఁ డగుచు. 1345

అని పలికి మల్లుడైన చాణూరుడు గగనమండలం నిండేటట్లు భుజాస్ఫాలనం చేశాడు. కోపమనే అగ్నినుంచి ప్రసరించే సన్నని పొగమాదిరిగా అతని తలపై పిలకజుట్టు ప్రకాశించింది. దిగ్గజముల తొండాలకు సమానమైన పొడుగాటిచేతులు భీతిని కలిగిస్తున్నాయి. ప్రళయకాలంలోని యమధర్మరాజు పదునైన కోరల విధంగా పొడవైన కోరమీసాలు మెరుస్తున్నాయి. నల్లనినిడుపైన నడకొండలాగా భయంకరమైన నల్లని దేహం పెల్లుబుకుతున్నది. అడుగుల తాకిడికి పుడమి దద్దరిల్లగా చాణూరమల్లుడు కృష్ణుడివేపు నడిచాడు. ఈ దృశ్యం పట్టణప్రజల హృదయాలకు బల్లెమయింది.

వ. ఇట్లగ్గలంబగు నగ్గలిక డగ్గఱిన మల్లునిం గని మెల్లన మొల్లంబగు బీరంబు వెల్లిగొన, వల్లవవల్లభుం డుల్లసిల్లి బాహునాదంబున రోదోంతరాళంబు పూరించి మించి కవిసెః నిట్లిద్దఱు నుద్దవిడి నున్నతవిషమంబులగు జాణలిడి, కరికరియును, హరిహరియును, గిరిగిరియునుం దాఁకు వీఁకం దలపడి, యితరేతరహేతిహింసితంబులగు దవానలంబుల తెఱంగునఁ బరస్పర దీర్ఘనిర్ఘాత ఘట్టితంబులగు మహాభ్రంబుల విభ్రమంబున, నన్యోన్యతుంగతరంగ తాడితంబులగు కల్పాంతకాలసముద్రంబుల రౌద్రంబున నొండొరుల ముష్టిఘట్టనంబుల ఘట్టితశరీరులై దద్దరిలక డగ్గఱి, గ్రద్దన న య్యుద్ధబుం దిరుగునెడ హరి నొచ్చి పేర్చి యార్చి జెట్టింబట్టి పడం దిగిచి పాదంబుల జాడించి పముల్లాసంబున నెనకంబునకు వచ్చిన మెచ్చి, నొచ్చి య చ్చపలుండు మీఱి మోర సారించి, తెరలక, పొరలంద్రొబ్బిన న బ్బలానుజుం డుబ్బి, గొబ్బున మేను వర్ధిల్ల నర్ధాంగకంబున నుండి జానువుల నొత్తుచు, నురవడిం గర పడంబున నున్న నా దుర్నయుండును 'బాల! మేలు మే' లని లీలం గాలుసొరనిచ్చి, త్రోచినం జూచి యేచి ఖేచరు లగ్గించి యుగ్గడింప న గ్గోపకుమారుండు పాటవంబున రాటవంబునకుం జని వెన్నెక్కి నిక్కిన నక్కంసభటుండు మదజలరేఖాబంధురంబగు గంధసింధురంబుచందంబునఁ బదంబుమ బదంబునం, గరంబును

గరంబునన్ గ్రహించి, సహించి, వహించి నైపుణంబున లోపలం
దిరిగి యట్టిట్టు దట్టించిన దిట్టతనంబునం దిటవు దప్పక యప్పద్మ
లోచనుండు కేడించి, యేచి సమతలంబున వైచి ప్రచండంబగు
వాని పిచండంబు వాఁగించి కాలం గాలు గిలించి ఢొక్కరంబు
గొనిన నయ్యుత్ర్యాసి సభ్యులు సన్నుతింపం గ్రమ్మఱించి జడ్డనం
గా లడ్డగించి, రక్షించుకొనిన నా రక్షోవైరి వాని కటిచేలంబువట్టి
యెత్తి యొత్తి నడుమ రాగెయిడి, సందువెట్టి నవ్వైన నవ్విరోధి
కాలు కాలిలోనిడి వేధించి నిరోధించిన నిరోధంబుఁ బాసి తిరిగి
వసుదేవుపట్టి పట్టిసంబు గొని దట్టించిన నుబ్బరిక చేసి చాణూ
రుండు హరికరంబు వట్టి హుమ్మని నెమ్మొగంబునం గా లిడి
మీఁదైనం గేళికాలకుండు కాలిం గాల నివారించి మీఁదై నెగడి
యుండనీక దుర్వారబలంబున విదలించి లేచి గృహీత పరిపంథి
చరణుండై విపక్షునివక్షంబు వజ్రివజ్రసన్నిభంబగు పిడికిటం బొడి
చిన వాఁడు వాఁడిచెడక విజృంభించి యంభోరాశి మధ్యంబునం
దిరుగు శైలంబుఁబోలిక నేల జిఱజిఱం దిరిగి తన్నిన వెన్నుండు
కుప్పించి యుప్పరం బెగసి మీఁద నుఱికిన నతండు కృష్ణపాద
సంధిపరిక్షిప్తపాదుండై యెగసి లేచి సముద్ధతుండయ్యె నయ్యెడ.
1346

* ఈలా మిక్కిలి పూనికతో సమీపించిన మల్లుణ్ణి గోపాల
శేఖరుడు చూచాడు. మెల్లగా పరాక్రమాటోపం అతిశయిల్లగా అత
డుల్లాసంతో భుజ మప్పళించాడు. ఆ నినాదం భూనభోంతరాళంలో
నిండిపోయింది. అతడు జెట్టిపైకి ఉరికినాడు. వారిద్దరూ మహావేగంతో
హెచ్చుతగ్గైన స్థానాలలో నిలిచి ఏనుగు ఏనుగుతో, సింహము
సింహంతో, కొండ కొండతో డీకొన్నట్లు ఒకరితో నొకరు తలపడి
నారు. రెండు కార్చిచ్చులు తమ తమ అగ్నిజ్వాలలతో ఒండొంటిని
పీడించుకొన్నట్లుగా, రెండు మహామేఘములు తమపై పరస్పరం
పెద్దపెద్ద పిడుగులు రాల్చుకొన్నట్లుగా, ప్రళయకాలంలోని రెండు

సముద్రాలు ఒకదానినొకటి సముత్తుంగతరంగాలతో కొట్టుకున్నట్లుగా వారిద్దరూ రౌద్రంతో ఒకరినొకరు పిడికిళ్ళతో గ్రుద్దుకున్నారు. తబ్బిబ్బుపడక ఇరువురు దగ్గరకు చేరుకుని వేగంగా మల్లరంగంలో పరిభ్రమించారు.

అప్పుడు హరి విజృంభించాడు. బొబ్బరిస్తూ జెట్టిని పట్టిపడ లాగినాడు. కాళ్ళు జాడించి మిక్కిలి ఉల్లాసంతో ఆ మల్లుడు విజృంభించటం వీక్షించి గోవిందుడు మెచ్చుకున్నాడు. చపలుడైన చాణూరుడు బాధితు డైనప్పటికీ మెడ నిక్కించి తొలగిపోక మురారిని పొరలాడేటట్టు త్రోసినాడు. అంతట బలరామ సోదరుడు శరీర ముప్పొంగగా తటాలున అర్ధాంగకంలో ఉన్నవాడై మోకాళ్ళతో వానిని ఒత్తినాడు. వేగంగా 'శరవడ' మనే ఒక మల్లబంధం పట్టులో ఉండినాడు. అపుడు దుర్నీతిపరుడైన మల్లుడు 'డింభకా! మేలు మే' లని పలుకుతూ అలవోకగా కాలు చొప్పించి కృష్ణుని పడద్రోసినాడు. అప్పుడు వెన్నుడు చెలరేగి వేల్పులు ప్రస్తుతింపగా చాతుర్యంతో వెనుకకు వెళ్ళి చాణూరుని వీపుపై నెక్కి నిక్కినాడు. కంసుని భృత్యుడైన చాణూరుడు మదజలధారల చారికలతో నిండిన మదపు టేనుగువలె మాధవుని పాదాన్ని తన పాదంతో, చేతిని తన చేతితో పెనవేసి పట్టుకొని నేర్పుతో మల్లరంగంలో తిరుగుతూ అటూ ఇటూ కుదిలించివేశాడు.

కమలలోచనుడు దిట్టతనమున దిటవు గోల్పోక తొలగి చెలరేగి జెట్టిని సమతలంమీద పడద్రోసి పెద్దదైన వాని కడుపుమీద మోదినాడు. తన కాలితో వాని కాలిని మెలివెట్టి 'డొక్కర' మనే మల్లబంధవిశేషాన్ని చూపినాడు.

మల్లవిద్యాభ్యాసంకల చాణూరుడు సభలోనివారు తన్ను పొగడుతుండగా కృష్ణుని వెనుకకు మరలించి తటాలున తన కాలితో

అడ్డగించి తన్ను రక్షించుకున్నాడు. రాక్షసవిరోధియగు కృష్ణుడు వాని దట్టి పట్టి యెత్తి ఒత్తి రాగెయిడి సందు పెట్టి నవ్వినాడు. పగతుడైన మల్లుడు తన కాలిని కృష్ణుని కాలితో చేర్చి బాధించి నిరోధించాడు. వాసుదేవుడు విరోధి నిరోధాన్ని తప్పించుకొని అడ్డ కత్తి చేబూని అదలించాడు. చాణూరుడు చెలరేగి శ్రీహరి బాహువు పట్టుకుని హుమ్మని హుంకరించి ముఖాన కాలు పెట్టి మీదు మిగిలాడు.

లీలామానుషబాలుడైన శ్రీకృష్ణుడు చాణూరుని కాలిని తన కాలితో అడ్డగించి వాని విజృంభణ మణచి అడ్డుకొనరాని బలిమితో విదిలించుకొని లేచాడు. పగవానిపాదాన్ని త్రొక్కిపట్టి వజ్రాయుధం వంటి పిడకిలితో వాని వక్షంపైన పొడిచాడు. వాడు పోడిమి చెడక చెలరేగినాడు. మథనవేళ సాగరమధ్యమున తిరిగే మందరపర్వతం మాదిరి వాడు నేలమీద గిరగిర తిరుగుతూ కృష్ణుణ్ణి తన్నినాడు. వెన్నుడు కుప్పించి గగనమున కెగిరి వానిపై దూకినాడు. కృష్ణుని పాదాల తాకిడికి తన పాదాల సంధిబంధాలు తొలగగా వాడు ఎగిరి పైకి లేచి విజృంభించాడు.

క. బలభద్రుఁడు ముష్టికుఁడును
బలములు మెఱయంగఁ జేసి బాహాబాహిం
బ్రలయాగ్నుల క్రియఁ బోరిరి
వెలయగఁ బహువిధములైన విన్నాణములన్. 1347

● అదే సమయంలో పలురకాలైన బలవిన్యాసాలతో బలరాముడు ముష్టికుడు తమ బలం చూపుతూ ప్రళయకాలంలోని అగ్నులచందాన బాహువులతో ఒకరనొకరు త్రోసుకుంటూ పోరాటం సాగించారు.

వ. ఇ వ్విధంబున. 1348

క. వల్లవులు పెనఁగి రున్నత
గల్లులతో భిన్నదిగిభకరవల్లులతో
మల్లులతో రిపుమానస
భల్లులతో భీతగోపవల్లులతోడన్. 1349

● ఈ మాదిరిగా నిక్కినచెక్కిళ్ళు గలవారూ, దిగ్గజాలతొండాలను భేదించే తీవలవంటి చేతులు గలవారూ, శత్రువుల మనస్సులకు బల్లెములవంటి వారూ, గోపకుల సమూహానికి భయము కల్గించే వారూ అయిన ఆ మల్లులతో గోపాలబాలకులైన బలరామకృష్ణులు పోరాడినారు.

వ. ఆ సమయంబునఁ బౌరకాంతలు మూఁకలు గట్టి వెచ్చనూర్పుచు ముచ్చటలకుం జొచ్చి తమలో నిట్లనిరి. 1350

● అప్పుడు మథురలోని మానినులు గుంపులు గూడి వేడియూర్పులు విడుస్తూ తమలో ఈ విధంగా ముచ్చటించుకున్నారు.

ఉ. మంచి కొమారులం గుసుమమంజుశరీరులఁ దెచ్చి చెల్లరే!
యంచితవజ్రసారులు మహాద్రికఠోరులు నైన మల్లురం
గ్రించులఁ బెట్టి రాజు పెనఁగించుచుఁ జూచుచునున్నవాఁడు; మే
లించుక లేదు; మాను మనఁ! డిట్టిదురాత్ముని మున్నవింటిమే?

● ఔరా! కుసుమాలవలె కోమలమైన శరీరాలుకల మంచి బాలురను రప్పించి వజ్రసారులూ, పర్వతాలవలె కఠోరులు అయిన వీరులతో మల్లయుద్ధం చేయిస్తూ రాజు వినోదం చూస్తున్నాడు. ఇందులో మంచి ఏ కొంచెం కూడా లేదు. పోరు మానండి అని పలుకడు. ఇలాంటి దుర్మార్గులను మునుపు ఎన్నడైనా విన్నామా! కన్నామా?

క. చూచెదరుగాని సభికులు
నీ చిన్నికుమారకులకు నీ మల్లురకున్
ఓ చెల్ల! యీడుగాదని
సూచింపరు పతికిఁ దమకు శోకముగాదే? 1352

• సభాసదులు చూస్తున్నారే కాని ఈ పసిపిల్లలకూ, ఈ మల్లురకూ జోడు కుదరదని రాజుకు చెప్పలేకున్నారు. ఇది అధర్మం. ఇది తమకూ, తమ రాజుకూ శోకం కలిగించకపోదు.

సీ. వేణునాళములమై వెలసిన మాధవుం
డధరామృతము లిచ్చి యాదరించుఁ
బింఛదామములమై పెరిఁగిన వెన్నుండు
మస్తకంబునఁ దాల్చి మైత్రి నెఱపుఁ
బీతాంబరములమై బెరసిన గోవిందుఁ
డంసభాగమునఁ బాయక ధరించు
వైజయంతికలమై వ్రాలినఁ గమలాక్షుఁ
డతికుతూహలమున నఱుతఁ దాల్చుఁ;

తే. దనరు బృందావనంబునఁ దరులమైనఁ
గృష్ణుఁ డానందమునఁ జేరి క్రీడ సల్పు
నెట్టి నోముల నయిన ము న్నిట్టివిధము
లేల కామైతి మో యమ్మ! యింక నెట్లు? 1353

• మనము పిల్లనగ్రోవులమై ఉంటే మాధవుడు కెమ్మోవిసుధ లిచ్చి మన్నించేవాడు, నెమలిపురిదండలమై ఉంటే వెన్నుడు నెత్తిపై నిడుకొని నెయ్యం నెరపేవాడు. పచ్చని పట్టువలువలమై ఉంటే గోవిందుడు భుజాలపై విడువక ధరించి ఉండేవాడు. వనమాలికలమై ఉంటే కమలాక్షుడు మిక్కిలి ఆసక్తితో, కంఠాన కైసేసి ఉండేవాడు. అందమైన బృందావనంలో వృక్షాలమై ఉంటే కృష్ణుడానందముతో దరిచేరి క్రీడించేవాడు. ఓ యమ్మా! పూర్వజన్మాలలో ఎట్టి వ్రతాలనైనా ఆచరించి ఈలా ఎందుకు కాలేకపోయామో! ఇపుడింకేమి చేయగలం?

ఉ. పాపపుబ్రహ్మ ! గోపికల పల్లెలలోన సృజింపరాదె ము
న్నీపురిలోపలన్ మనల నేల సృజించె ? నటైన నిచ్చలున్
జేపడుఁ గాదె యీ సుభగుఁ జెందెడి భాగ్యము సంతతంబు నీ
గోపకుమారుఁ బొంద మును గోపకుమారిక లేమినోఁచిరో ! 1354

• పాపియైన బ్రహ్మ మునుపే మనలను ఆ వ్రేపల్లెలో పుట్టించి ఉండకూడదా? ఈ మథురలో ఎందుకు పుట్టించాడో! ఆ గొల్లపల్లెలోనే పుట్టించి ఉంటే ఈ సుందరాంగుని పొందే సౌభాగ్యం సంతోషం ఎల్లప్పుడూ మనకు సమకూడి ఉండేవి కదా! ఈ గోప కుమారుణ్ణి పొందడానికి ఆ గోపికలు పూర్వ మెట్టి నోములు నోచారో?

క. గోపాలకృష్ణుతోడను
గోపాలనవేళలందుఁ గూడి తిరుగు వా
గోపాలు రెంత ధన్యులొ
గోపాలుర కైన నిట్టి గురురుచి గలదే ? 1355

• గోవులు మేపే సమయంలో గోపాలకృష్ణునితో కలసిమెలసి తిరిగే ఆ గోపాలకు లెంత పుణ్యాత్ములో! భూమిని పాలించే ప్రభువులకైనా ఇట్టి గొప్ప అనుభవం ఉన్నదా?

క. శ్రమజలకణసిక్తంబై
కమలదళేక్షుని వదనకమలము మెఱసెన్
హిమజలకణసిక్తంబై
కమనీయం బగుచు నున్న కమలముభంగిన్. 1356

• మంచునీటి చుక్కలచే తడిసి మనోహరంగా ఉండే పద్మం మాదిరి, కమలాక్షుని ముఖకమలం చెమటబిందువులచే తడిసి ప్రకాశిస్తున్నది.

ఆ. సభకుఁ బోవ రాదు; సభవారి దోషంబు
నెఱిఁగి యూరకున్న నెఱుఁగకున్న
నెఱిఁగి యుండియైన నిట్టట్టు పలికినఁ
బ్రాజ్ఞుఁ డైనఁ బొందుఁ బాపచయము. 1357

● సభకు వెళ్ళరాదు. వెళితే, సభలోనివారుచేసే తప్పిదాలను తెలిసి ఉపేక్షించినప్పటికీ, ఆ దోషాలు తెలుసుకోలేక పోయినప్పటికీ, దోషాలు తెలిసి కూడ న్యాయవిరుద్ధంగా పలికినప్పటికీ-ఎంత పండితు డైనా పాపం అనుభవించి తీరుతాడు.

వ. అని పెక్కండ్రు పెక్కు విధంబులం బలుకుచుండఁ దద్బాహు యుద్ధంబున. 1358

క. ధృతిసెడి లోఁబడె మల్లుం
డతులిత భవజలధితరికి హతరిపు పురికిన్
జితకరికిన్ ధృతగిరికిం
దత హరిరవభరిత శిఖరిదరికిన్ హరికిన్. 1359

● ఈ విధంగా పలువురు పలురీతుల పలుకుతుండగా ఆ ముష్టి యుద్ధంలో సాటిలేని సంసారమనే సముద్రాన్ని దాటడానికి నావవంటి వాడూ, శత్రుపురాలను ధ్వంస మొనర్చినవాడూ, కువలయాపీడ గజాన్ని జయించినవాడూ, గోవర్ధనగిరి నెత్తినవాడు, విరివియైన సింహగర్జనంతో పర్వతగుహలను పూరించినవాడూ అయిన శ్రీకృష్ణు నికి చాణూరుడు ధైర్యంచెడి లోబడిపోయాడు.

క. హరికిని లోఁబడి బెగడక
హరియురము మహోగ్రముష్టి నహితుఁడు పొడువన్
హరి కుసుమమాలికాహత
కరిభంగిఁ బరాక్రమించెఁ గలహోద్ధతుఁడై. 1360

● విరోధియైన చాణూరుడు కృష్ణునకు లోపడినప్పటికీ, భయ పడక మహాభయంకరమైన పిడికిలితో వెన్నుని రొమ్మును పొడిచాడు. పూదండచే కొట్టబడిన ఏనుగుచందంగా ఆ పోటును లెక్కచేయక శ్రీహరి యుద్ధమందు విజృంభించి పరాక్రమం చూపినాడు.

క. శౌరి నెఱిఁజొచ్చి కరములు
క్రూరగతిన్ బట్టి త్రిప్పి కుంభిని వైచెన్
శూరుం గలహగభీరున్
వీరుం జాణూరు ఘోరు వితతాకారున్. 1361

● పరాక్రమవంతుడూ, యుద్ధమందు గంభీరుడూ, భీతిగొలిపే వాడూ, దొడ్డదేహంకలవాడూ, వీరుడూ అయిన చాణూరుణ్ణి కృష్ణుడు చొచ్చుకునిపోయి కర్కశంగా వాని చేతులు పట్టుకుని గిరగిర త్రిప్పి నేలపై కొట్టినాడు.

క. శోణితము నోర నొలుకఁగ
జాణూరుం డట్లు కృష్ణసంభ్రామణ సం
క్షీణుండై క్షోణిం బడి
ప్రాణంబులు విడిచెఁ గంసుప్రాణము గలఁగన్. 1362

● ఆ విధంగా అచ్యుతునిచేత గిరగిర త్రిప్పబడిన చాణూరుడు బాగా నలిగినవాడై నోటినుంచి నెత్తురు కారగా పుడమిమీదబడి ప్రాణాలు విడిచాడు. అతని ప్రాణం పోగానే కంసుని ప్రాణం కలక బారింది.

క. బలభద్రుండును లోకులు
బలభద్రుం డనఁగఁ బెనఁగి పటుబాహుగతిన్
బలభేది మెచ్చ ద్రిప్పెను
బలవన్ముష్టికునిఁ గంసు బలములు బెగడన్. 1363

● బలభద్రుడు నిజంగా బలభద్రుడే (బలముచే క్షేమం కల వాడు) అంటూ లోకులు అంటుండగా, ఇంద్రుడు మేలుమేలని మెచ్చుకోగా బలరాము డపారమైన బాహుబలంతో బలవంతుడైన ముష్టికుణ్ణి పట్టుకుని ఇటూ అటూ త్రిప్పినాడు. అది చూచి కంసుని సేన బెదిరిపోయింది.

ఆ. త్రిప్పి నేలవైవ దిగ్గన రక్తంబు
వదనగహ్వరమున వఱదవాఱ
ముష్టికుండు ఘోరముష్టి సత్త్వము సెడి
కూలె గాలిఁ దరువు గూలినట్లు. 1364

• బలరాముడు అలా త్రిప్పి త్రిప్పి నేలపై ధబ్బున పడ వేయగా ముష్టికుని గుహవంటి నోటినుంచి నెత్తురు వరదలై పారింది. బలరాముని ఘోరమైన ముష్టిఘాతంతో ముష్టికుడు సత్తువకోల్పోయి పెనుగాలివల్ల మహావృక్షం కూలినట్లు నేలపై గూలినాడు.

వ. మఱియును. 1365

క. పాటవమునఁ బలుపిడికిట
సూటిం బడఁబొడిచె బలుఁడు శోషిత ఘన బా
హాటోప నృపతి కీటుం
గూటున్ వాచాటు నధికఘోరలలాటున్. 1366

• గొప్ప భుజబలాటోపం కల రాజునకు చీడపురుగులాంటి వాడు, కల్లరీడూ, వదరుబోతూ, మిక్కిలి భయంకరమైన నుదురు కలవాడూ అయిన ముష్టికుణ్ణి బలభద్రుడు దిటవైన తన పిడికిలితో సూటిగా పడబొడిచినాడు.

వ. అంత న ద్దనుజాంతకుండు చరణప్రహరణంబుల భిన్నమస్తకులం జేసివాని చెలులం గూటతోసలశలుల నంతకాంతికంబున కనిచిన.

• అటుపిమ్మట రాక్షసులకు అంతకుడైన బలరాముడు ముష్టి కుణ్ణి, మిత్రులైన కూటుడు, తోసలుడు, శలుడు అనువారిని తన కాలి తాపులతో తలలు పగులగొట్టి యమునిచెంతకు పంపించాడు.

క. వల్లవబాలకు లని మన
మల్లవరులు పెనఁగి నేఁడు మడిసిరి వీరల్
బల్లిదులు; తలఁడు తలఁడని
చెల్లాచెదరైరి పాఱి చిక్కిన మల్లుల్. 1368

● కేవలం గోపాలబాలకులనే భావంతో వారితో యుద్ధంచేసిన మన మల్లశ్రేష్ఠులు మరణించారు. రామకృష్ణులు బలవంతులు; 'తొలగుడు, తొలగుడు' అంటూ తక్కిన మల్లురు చెల్లాచెదరై పారిపోయారు.

ఉ. మల్లురఁ జంపి గోపకసమాజములో మృగరాజురేఖ శో
భిల్లఁగఁ బాదపద్మములఁ బెల్లుగ నందెలు మ్రోయ వచ్చు వా
వల్లవరాజనందనుల వారక చూచి మహీసురాదు ల
ల్లల్లన సంస్తుతించిరి ప్రియంబుగఁ గంసుడుదక్క నందఱున్. 1369

● మల్లులను చంపి గొల్లలమధ్య సింహాలవలె శోభిల్లుతూ అడుగుదామరలందు అందెలు మ్రోగుతూ ఉండగా వస్తూన్న గొల్లలరాజైన నందుని నందనులను బ్రాహ్మణులు మొదలైన వారందరూ రెప్పవాల్పక చూచి ప్రీతితో పొగడినారు. ఒక్క కంసుడుమాత్రం మచ్చరంతో వారిని మెచ్చుకోలేదు.

శ్రీకృష్ణుడు కంసుని వధించుట:

వ. అంత సభాజనంబుల కలకలంబు నివారించి మంత్రులం జూచి కంసుం డిట్లనియె. 1370

● అంతట సభాసదుల కోలాహలాన్ని నివారించి కంసుడు తన మంత్రులను చూచి ఈ విధంగా అన్నాడు.

ఉ. వల్లవబాలురన్ నగరివాకిటికిన్ వెడలంగ ద్రొబ్బుఁడు; దీ
గొల్లల ముట్టికోల్ గొనుడు; క్రూరుని నందునిఁ గట్టుఁడు; దుర్వికిం
దెల్లముగాఁగ నేఁడు వసుదేవునిఁ జంపుఁడు; తండ్రిగాఁడు వీఁ
డెల్లవిధంబులం బరుల కిష్టుఁడు కావతుఁ డుగ్రసేనునిన్. 1371

● ఈ గోపబాలకులను పట్టణద్వారం దాటి వెళ్ళేటట్లు త్రోసివేయండి. ఈ గొల్లలను ముట్టడించండి, క్రూరుడైన నందుణ్ణి బంధిం

చండి. లోకానికి వెల్లడి అయ్యేటట్లు ఇప్పుడే వసుదేవుణ్ణి చంపి వేయండి. ఉగ్రసేనుణ్ణి రక్షించవద్దు. వీడు నాకు తండ్రి కాదు. సకలవిధాలా శత్రువునకు ఇష్టమైనవాడు.

వ. అని పలుకు సమయంబున. 1372

శా. జంఘాలత్వముతో నగోపరిచరత్సారంగహింసేచ్ఛ ను
ల్లంఘింపన్ గమకించు సింహముక్రియన్ లక్షించి పౌరవ్రజా
సంఘాతంబులు తల్లడిల్ల హరి కంసప్రాణహింసార్థియై
లంఘించెం దమగంబుమీఁదికి రణోల్లాసంబు భాసిల్లఁగన్. 1373

● ఈ ప్రకారంగా కంసుడు పలుకుతుండగా పిక్కబలంతో కొండశిఖరాన తిరిగే జింకను సంహరించటానికి కుప్పించి దుమికే సింహకిశోరం లాగున శ్రీకృష్ణుడు కంసుని సంహరింప తలచినవాడై గురిచూచి మంచెమీదికి యుద్ధోత్సాహంతో దూకినాడు. కొలువులో ఉన్నవారంతా తల్లడిల్లినారు.

క. తమగమున కెగురు యదు స
త్తమగణ్యునిఁ జూచి ఖడ్గధరుఁడై యెదిరెం
దమ గమివారలు వీరో
త్తమగణవిభుఁ డనఁగ గంసధరణీపతియున్. 1374

● తానున్న మంచెమీదికి ఎగిరి దుముకుతున్న యదుకుల సింహమైన కృష్ణుణ్ణి చూచి మథురాధినాథుడైన కంసుడు, ఖడ్గాన్ని చేత ధరించి ఎదిరించాడు. అతనిపక్షంలోని వారంతా కంసుడు వీరోత్తంసుడని ప్రశంసించారు.

శా. పక్షీంద్రుం డురగంబుఁబట్టు విధ మొప్పన్ గేశబంధంబు లో
కక్షోభంబుగఁ బట్టి మౌళిమణు లాకల్పాంతవేళాపత
న్నక్షత్రంబులభంగి రాల రణసన్నాహంబు డిందించి రం
గక్షోణిం బడఁద్రోచెఁ గృష్ణుఁడు వెసన్ గంసున్ నృపోత్తంసునిన్.
1375

● పక్షులకు ప్రభువైన గరుత్మంతుడు పామునుపట్టే రీతిగా శ్రీకృష్ణుడు కంసుని జుట్టుముడి పట్టుకున్నాడు. సభలోని జనులంతా భయభ్రాంతు లైనారు. ప్రళయకాలంలో నక్షత్రాల మాదిరి అతని కిరీటంలోని మణులు జలజల నేల రాలినాయి. యుద్ధసన్నాహం అణ గించి క్షాత్రకులావతంసుడైన కంసుణ్ణి యదువల్లభుడు మల్లరంగ స్థలంమీదికి పడద్రోసివేశారు.

శా. మంచాగ్రంబుననుండి రంగధరణీమధ్యంబునం గూలి యే
సంచారంబును లేక చిక్కి జను లాశ్చర్యంబునుం బొందఁగాఁ
బంచత్వంబును బొందియున్న వినుతున్ బద్మాక్షుఁ డీడ్చెన్ వడిన్
పంచాస్యంబు గజంబు నీడ్చు వగిదిన్ బాహాబలోల్లాసియై. 1376

● కంసుడు మంచెమీది నుంచి మల్లక్రీడారంగ మధ్యంలో వచ్చి పడి ఎట్టి కదలిక లేక కట్టెలాగా బిగుసుకొనిపోయాడు. అక్కడి జను లబ్బురపడుతూ చూస్తుండగా ఆ దుర్మతి అక్కడి కక్కడే మర ణించాడు. పద్మపత్రాక్షుడైన శ్రీకృష్ణుడు భుజబలవిజృంభణంతో కేసరి ఏనుగును ఈడ్చిన విధంగా అతణ్ణి ఈడ్చినాడు.

క. రోష ప్రమోద నిద్రా
భాషాశనపానగతులఁ బాయక చక్రిన్
దోషగతిఁ జూచి యైన వి
శేషగతిన్ గంసుఁ డతనిఁ జెందె నరేంద్రా! 1377

● ఓ పరీక్షిన్మహారాజా! కంసుడు రోషంలో, సంతోషంలో, నిద్రలో, సంభాషణసమయంలో, భోజనవేళలో, నీరు త్రావేపట్టులో చక్రాయుధుడైన శ్రీకృష్ణుని ద్వేషబుద్ధితోనే, దోషబుద్ధితోనే చూచాడు. అయినప్పటికీ అతడు భగవంతునే పొంది ఉత్తమగతి అందుకొన్నాడు.

వ. ఆ సమయంబున. 1378

క. గోపాలుఁ డొక్కఁ డద్దిర!
భూపాలకుఁ జంపె వీనిఁ బొదువుం డేత
ద్రూపాలస్యము లేలని
తాపాలఘురోష లగుచు దర్పోద్ధతులై 1379

* ఆ సమయంలో 'ఒక్క గొల్లపిల్లవాడు ప్రభువుని చంపినాడు. ఔరా! ఎంత ఆశ్చర్యం. వీనిని చుట్టుముట్టండి. ఇంకా ఆలస్యం ఎందుకు?' అంటూ పరితాపంతో అగ్గలమైన కోపంతో పొగరుబోతులై -

శా. న్యగ్రోధుండును గహ్వుఁడున్ మొదలుగా నానాయుధానీక సా
మగ్రిన్ గంసునిసోదరుల్ గవియుడున్ మాద్యద్గజేంద్రాభుఁడై
యుగ్రుండై పరిఘాయుధోల్లసితుఁడై యొండొండ చెండాడి కా
లాగ్రక్షోణికిఁ బంచె రాముఁడు గరీయస్థేముఁడై వారలన్. 1380

* కంసుని తోబుట్టువులు న్యగ్రోధుడు, గహ్వుడూ మొదలైన వారు అనేకవిధాలైన యుద్ధపరికరాలతో కృష్ణుని మీదికి విజృంభించారు. అప్పుడు మహాబలుడైన బలభద్రుడు రౌద్రమూర్తియై పరిఘ అనే ఆయుధం ధరించి మత్తమాతంగం లాగా ఒక్కొక్కరిని చెండాడి యముని సన్నిధికి పంపినాడు.

వ. ఆ య్యవసరంబున. 1381

క. చేతులఁ దాళము లొత్తుచు
జేతోమోదంబుతోడ సిగముడి వీడన్
బాతరలాడుచు మింటను
గీతము నారదుఁడు పాడెఁ గృష్ణా! యనుచున్. 1382

* ఆ సమయంలో చేతులతో తాళాలువాయిస్తూ, జుట్టుముడి వీడగా నారదమహర్షి ఆనందంతో ఆకాశంలో 'కృష్ణా!' అని పాటలు పాడుతూ నాట్యం చేశాడు.

క. వారిజభవరుద్రాదులు
భూరికుసుమవృష్టి గురిసి పొగడిరి కృష్ణున్
భేరులు మ్రోసెను నిర్జర
నారులు దివి నాడి రధికనటనముల నృపా! 1383

* పరీక్షిన్మహారాజా! బ్రహ్మ ఈశ్వరుడు మున్నగు వేల్పులు కొల్లలు కొల్లలుగా పూలజల్లులు కురియిస్తూ శ్రీకృష్ణుణ్ణి స్తోత్రం చేశారు. దేవదుందుభులు మ్రోగినాయి. దేవతాంగనలు అనేకవిధాలుగా ఆకసంలో ఆడినారు.

వ. అంతం గంసాదుల కాంతలు భర్తృమరణదుఃఖాక్రాంతలై కరంబుల శిరంబులు మోఁదుకొనుచు నశ్రుధారా పరిషిక్తవదనలై సదనంబులు వెలువడి వచ్చి వీరశయ్యానిద్రితు లయిన విభులం గౌఁగిలించుకొని సుస్వరంబుల విలపించిరి. అందు గంసభార్య లిట్లనిరి. 1384

* అంతట కంసుడు మొదలగువారి పత్నులు భర్తలమృతివల్ల శోకాక్రాంతలై చేతులతో తలలు బాదుకుంటూ, కన్నీటిధారలతో తడిసిన ముఖాలతో తమ తమ మందిరాల నుండి వచ్చారు. వీరశయ్యలందు దీర్ఘనిద్ర చెందిన తమ పతులను పరిష్వంగం చేసుకుని రమణీయ గద్గద కంఠధ్వనితో ఏడ్చినారు. వారిలో కంసుని భార్యలు ఇట్లన్నారు.

సీ. గోపాలసింహంబు కోపించి వెల్వడి
నిను గజేంద్రుని భంగి నేఁడు గూల్చె
యాదవేంద్రానిల మాభీలజవముల
నిను మహీజముమాడ్కి నేలఁ ద్రాల్చె
వాసుదేవాంభోధి వారి యుద్వేలమై
నిను దీవికైవడి నేఁడు ముంచె
దేవకీసుతవజ్రి దేవత లలరంగ
నినుఁ గొండక్రియ నేఁడు నిహతుఁ జేసె

తే. హా మనోనాథ! హా వీర! హా మహాత్మ!
హా మహారాజ! నీ విట్లు హతుఁడ వయిన
మనుచు నున్నార మక్కట! మమ్ముఁ బోలు
కఠినహృదయులు జగతిపైఁ గలరె యెందు! 1385

* జీవితేశ్వరా! గోపాలుడనే మృగేంద్రం కోపంతో వెడలి వచ్చి గజేంద్రునివంటి నిన్ను హతమార్చింది. నాథా! యదునాథుడనే మారుతం దారుణవేగంతో వృక్షమునువలె నిన్ను నేలపైవ్రాల్చింది. మహానుభావా! వాసుదేవుడనే సముద్రజలం చెలియలికట్టను అతిక్రమించి దీవినివలె నిన్ను ఇప్పుడు ముంచివేసింది. మహారాజా! దేవకీపుత్రుడనే దేవేంద్రుడు దేవతలు సంతోషించే విధంగా కొండవంటి నిన్ను చెండివేశాడు. అయ్యో! నీ విలా చనిపోయినప్పటికీ మేము బ్రతుకుతున్నాము. అక్కటా! మావలె కఠినహృదయం కలవారు భూమిమీద ఎక్కడైనా ఉన్నారా?

క. భూతముల కెగ్గు సేసిన
భూతంబులు నీకు నెగ్గుఁ బుట్టించె వృథా
భూత మగు మనికి యెల్లను
భూతద్రోహికిని శుభముఁ బొంద దధీశా! 1386

* ప్రాణులకు నీవు కీడు చేయగా ఆ ప్రాణులే నీకు కీడు చేశాయి. ప్రాణులకు ద్రోహం చేసినవానికి మేలు కలుగదు. బ్రతుకంతా వ్యర్థ మౌతుంది.

క. గోపాలకృష్ణుతోడను
భూపాలక! మున్ను దొడరి పొలసినవారిన్
నీ పాల బుధులు సెప్పరె
కోపాలస్యములు విడిచి కొలువం దగదే. 1387

* మహారాజా! గోపాలకృష్ణుణ్ణి ఎదిరించి ప్రాణాలు కోల్పో యిన వారిని గురించి పూర్వం నీ సమక్షంలో పండితులు చెప్పలేదా! క్రోధము, జడత్వమూ వీడి గోవిందుని సేవించితే ఎంత బాగుండేది!

వ. అని విలపించుచున్న రాజవల్లభల నూరార్చి, జగద్వల్లభుం డయిన హరి కంసాదులకుఁ బరలోకసంస్కారంబులు సేయం బనిచి దేవకీవసుదేవుల బంధనంబు విడిపించి, బలభద్రసహితుం డయి, వారలకుఁ బ్రణామంబులు సేసిన. 1388

* ఈ మాదిరిగా ఏడుస్తున్న రాచయిల్లాండ్రను ఓదార్చి లోకే శ్వరుడైన శ్రీకృష్ణుడు కంసుడు మొదలైన వారికి పారలౌకికక్రియలు సల్పేందుకు ఆదేశించాడు. దేవకీవసుదేవులను చెఱ విడిపించి బల రామునితో గూడ వారికి నమస్కారాలు చేశాడు.

శ్రీకృష్ణుఁడు దేవకీవసుదేవుల చెఱమాన్పి యుగ్రసేనునికి పట్టము కట్టుట

మ. కని లోకేశులుగాని వీరు కొడుకుల్ గారంచుఁ జిత్తంబులన్
జనయిత్రీ జనకుల్ విచారపరులై శంకింపఁ గృష్ణుండు దా
జనసమ్మోహినియైన మాయఁ దదభిజ్ఞానంబు వారించి యి
ట్లనియెన్ సాగ్రజుఁడై మహావినతుఁడై యానందసంధాయియై. 1389

* తల్లిదండ్రులైన దేవకీవసుదేవులు తమ కుమారులను చూచి 'వీరు లోకాలకు ప్రభువులైన దేవతలే గానీ సాధారణ మానవులు గారు' అని ఆలోచిస్తూ తమ మనస్సులలో సంశయింప సాగారు. అపుడు శ్రీకృష్ణుడు అన్న బలభద్రునితో గూడినవాడై, జనులను సమ్మోహింపజేసే మాయాశక్తిని ప్రయోగించి వారి ఎఱుకను తొల గిస్తూ వినయవినమ్రుడై యిట్లన్నాడు.

సీ. మమ్ముఁ గంటిరి గాని మా బాల్యపౌగండ
కైశోర వయసులఁ గదిసి మీర
లెత్తుచు దింపుచు నెలమి మన్నింపుచు
నుండు సౌభాగ్యంబు లొంద రైతి;
రాకాంక్ష గలిగియున్నది దైవయోగంబు
తల్లిదండ్రులయొద్దఁ దనయు లుండి
యే యవసరమున నెబ్భంగి లాలితు
లగుచు వర్ధిల్లుదు రట్టి మహిమ

తే. మాకు నిన్నాళ్ళు లేదయ్యె మఱియు విమఁడు
నిఖిలపురుషార్థహేతువై నెగడుచున్న
మేని కెవ్వార లాఢ్యులు మీర కారె
యా ఋణముఁ దీర్ప నూఱేండ్ల కైనఁ జనదు. 1390

* అమ్మా! నాన్నా! మమ్ము ప్రసవించినారే గాని, మా బాల్యం పౌగండం, శైశవం అనే ప్రాయముల్లో ప్రీతితో ఎత్తుకుంటూ, దింపుతూ లాలించి, పాలించే భాగ్యాన్ని మీరు పొందలేరు. కోరిక ఉండికూడ దైవయోగముచే అది తీరలేదు. తలిదండ్రుల సమక్షంలో బిడ్డలుండి ఏ సమయంలో ఏ విధంగా బుజ్జగింపులు పొందుతూ ఎదుగుతారో అట్టి అదృష్టం మా కిన్నాళ్ళూ లేకపోయింది. ధర్మార్థకామమోక్షము లనే పురుషార్థములు సాధించడానికి కారణమైన ఈ శరీరాలకు కర్త లెవరు? జననీజనకులైన మీారే కదా! నూరేండ్లకయినా మీ ఋణం తీర్చుకోడానికి మాకు శక్యం గాదు.

క. చెల్లుబడి గలిగి యెవ్వఁడు
తల్లికిఁ దండ్రికిని దేహధనముల వృత్తుల్
సెల్లింపఁ డట్టి కష్టుఁడు
ద్రెల్లదుఁ డా మీఁద నాత్మపలలాశి యగున్. 1391

* సమర్థుడై ఉండికూడా తన దేహముతో ధనముతో తన తల్లిదండ్రులకు ఎవడు సేవచేయడో అట్టివాడు కష్టుడు, దుష్టుడు. వాడు చచ్చి పరలోకాన తన మాంసం తానే తింటాడు.

క. జననీజనకుల వృద్ధులఁ
దనయుల గురువిప్రసాధుదారాదుల నే
జనుఁడు ఘనుఁ డయ్యుఁ బ్రోవక
వనరును జీవన్మృతుండు వాఁడు ధరిత్రిన్. 1392

● ఏ మానవుడు తలిదండ్రులనూ, వయోవృద్ధులనూ, చిన్న బిడ్డలనూ, గురువులనూ, బ్రాహ్మణులనూ, సాధువులనూ ఇల్లాలు మొదలైనవారిని సమర్థుడై ఉండికూడా పోషింపక దీనాలాపము లాడుతాడో అట్టివాడు ఈ భూమిపై బ్రతికియూ చచ్చినవాడే.

వ. అదియుం గాక. 1393

శా. కారాశాలల మా నిమిత్తము మిముం గంసుండు గారింపఁగా
వారింపంగ సమర్థతల్ గలిగియున్ వారింపఁగా రాక ని
ష్కారుణ్యాత్మ్యులమైన క్రూరుల మహాకౌటిల్యసంచారులన్
సారాతిక్షములార! మమ్ముఁ గొఱఁతల్ సైరించి రక్షింపరే! 1394

● అంతేకాక జననీజనకులారా! మీరు మిక్కిలి ఓర్పుగల వారు. మా కారణంగా మిమ్ము కంసుడు చెరసాలలో ఉంచి బాధిస్తూ ఉంటే వాణ్ణి వారించే సామర్థ్యం ఉండి కూడా వారించని దయ మాలినవాళ్ళం; క్రూరులం; కపటవేషధారులం. మా లోపాలు సహించి మమ్ములను మన్నించండి.

వ. అని యిట్లు మాయామనుష్యుండయిన హరి పలికిన పలుకులకు మోహితులై, వారల నంకపీఠంబుల నిడుకొని, కౌఁగిలించుకొని, కన్నీటం దడుపుచుఁ బ్రేమపాశబద్ధులయి, దేవకీవసుదేవు లూరకుండిరి. అంత వాసుదేవుండు మాతామహుం డయిన యుగ్రసేనునిఁ జూచి. 1395

● ఈ విధంగా మాయామానుషవిగ్రహుడైన శ్రీ కృష్ణుడు పలికినాడు. ఆ మాటలకు దేవకీ వసుదేవులు మోహాము చెందినారు. వారు తమ పుత్రులను ఒడులలో కూర్చుండబెట్టుకున్నారు. గట్టిగా కౌగిలించుకున్నారు. కన్నీళ్ళతో వారి శిరస్సులు తడిపారు. ప్రేమాతిశయంతో మాటలురాక మౌనం వహించారు. అప్పుడు శ్రీ కృష్ణుడు తన తల్లికి తండ్రిగారైన ఉగ్రసేనుణ్ణి తిలకించి ఇలా అన్నాడు.

చ. అనఘ ! యయాతిశాపమున యాదవవీరులకున్ నరేశ్వరా
సనమున నుండరాదు; నృపసత్తమ ! రాజవు గమ్ము భూమికిన్;
నినుఁ గొలువంగ నిర్జరులు నీ కరివెట్టుదు రన్యరాజులం
బనిగొనుటెంత ! రమ్ము జనపాలనశీలివి గమ్ము వేడ్కతోన్. 1396

● పుణ్యాత్ముడవైన రాజేంద్రా ! యయాతిశాపంవల్ల వీరులైనప్పటికీ యాదవులు రాజపీఠం అధిష్ఠించటానికి వీలుకాదు. కాబట్టి ఈ భూమికి నీవే అధిపతిగా ఉండు. మేము నిన్ను సేవిస్తుంటాము. దేవతలే నీకు కప్పం చెల్లిస్తారు. ఇక ఇతరరాజులు నీ ఆజ్ఞ శిరసా వహిస్తారని వేరుగా చెప్పడ మెందుకు? వేడుకతో ప్రజాపరిపాలనకు సిద్ధపడు.

వ. అని పలికి. 1397

క. మన్నించి రాజుఁ జేసెను
వెన్నుఁడు సత్యావధాను విశ్రుతదానున్
సన్నుతమానున్ గదన
చ్ఛిన్నాహితసేను నుగ్రసేనున్ దీనున్. 1398

● ఈ విధంగా పలికి సత్యమందు ఏకాగ్రతకలవాడూ, దానములు సల్పడంలో ప్రసిద్ధుడూ, అభిమానవంతుడని పొగడ్త కాంచినవాడూ, సమరంలో శత్రుసైన్యాలను సంహరించేవాడూ, దర్పం లేనివాడూ, అయిన ఉగ్రసేనుణ్ణి వాసుదేవుడు సంభావించాడు. మథురానగరానికి రాజును గావించాడు.

వ. తదనంతరంబ తొల్లి కంసభీతులై విదేశంబులం గృశియించు చున్న యదు వృష్ణి భోజ మరు దశార్హ కుకురాంధక ప్రముఖులగు సకలజ్ఞాతిసంబంధులను రావించి, చిత్తంబు లలర విత్తంబులిచ్చి వారి వారి నివాసంబుల నుండ నియోగించె; న వ్విధంబున. 1399

● అటుపిమ్మట శ్రీకృష్ణుడు పూర్వం కంసుడి భయంవల్ల ఇతరదేశాలలో గాసి చెందుతున్న తన జ్ఞాతులూ, చుట్టాలూ అయిన యదువులు, వృష్ణులు, భోజులు, మధువులు, దశార్హులు, కుకురులు, అంధకులు, ఆదిగాకల వారి నందరినీ పిలిపించాడు. వారి మనసులు సంతసించేటట్లు వారికి ధనాదికం బహూకరించి వారివారిగృహాలలో నివసించడానికి ఏర్పాట్లు చేశాడు.

క. మధుసూదనసత్కరుణా
మధురాలోకన విముక్త మానస భయులై
మధురవచనములఁ దారును
మధురానగరంబు ప్రజలు మనిరి నరేంద్రా! 1400

● కరుణారసంతోనిండిన మధుసూదనుని మధురాతి మధుర మైన కటాక్షవీక్షణాలతో మనసులోని భీతి తొలగినవారై తీయతీయని సల్లాపాలతో వారూ, మధురాపట్టణంలోని ప్రజలు కలసిమెలసి జీవించారు.

వ. అంత నొక్కనాఁడు సంకర్షణసహితుండై నందునిం జేరి గోవిం దుం డిట్లనియె. 1401

● అనంతరం ఒకనాడు గోవిందుడు బలరామునితో కలిసి నందునివద్దకు వెళ్ళి యిట్లన్నాడు.

శా. తండ్రిం జూడము తల్లిఁ జూడము యశోదాదేవియున్ నీవు మా
తండ్రిం దల్లియు నంచు నుండుదుము సద్ధర్మంబులం దొల్లి యే
తండ్రుల్ బిడ్డల నిట్లు పెంచిరి? భవత్సొజన్యభావంబులన్
దండ్రీ! యింతటివార మైతిమిగదా! తత్తద్వయోలీలలన్. 1402

● జనకా! మేము తండ్రిని చూడలేదు. తల్లిని చూడలేదు. యశోదాదేవీ, నీవూ మా తల్లిదండ్రులని భావిస్తూ ఉంటిమి. ఇంతకు ముందు ఏ తల్లిదండ్రులు తమ బిడ్డలను ఇంత గారాబంగా పెంచారు? నీ మంచితనంవల్ల ఆ యా వయసుకు తగిన ఆటపాటలతో పెరిగి ఇంతవారమైనాము!

ఉ. ఇక్కడనున్న బాంధవుల కెల్లను సౌఖ్యముసేసి వత్తు మే
మక్కడికిన్; మదీయులకు నందఱకున్ వినిపింపు మయ్య నే
మెక్కడనున్న మాకు మది నెన్నఁడు బాయవు మీ వ్రజంబులో
మక్కువతోడ మీరు కృప మా కొనరించు క్రియావిశేషముల్. 1403

● ఇక్కడ మథురానగరంలో ఉన్న చుట్టా లందరికీ మేలు కలిగించి అక్కడికి వ్రేపల్లెకు మేము వస్తాము. ఈ సంగతి మన వారందరికీ చెప్పండి. మీరు గోకులంలో ఎంతో మక్కువతో, దయతో మాకు చేసిన ఉపచారాతిశయాలు మే మెక్కడున్నా మా మనసునుండి ఎన్నటికినీ మరలిపోవు.

వ. అని పలికి వస్త్రభూషణాదు లొసంగి సాదరంబుగం గౌఁగిలించుకొని గోవిందుం డనిచిన నందుండు ప్రణయవిహ్వలుండై బాష్పజలపూరితలోచనుం డగుచు వల్లవులుం దానును వ్రేపల్లెకుఁ జనియె; నంత. 1404

● ఈ ప్రకారంగా పలికి శ్రీకృష్ణుడు వస్త్రాలు, ఆభరణాలు మొదలైన వాటి నిచ్చి ఆదరంతో కౌగిలించుకొని సాగనంపినాడు. నందుడు అనురాగంతో విలవిలలాడుతూ కన్నీళ్ళతో నిండిన కన్నులు గలవాడై గొల్ల పెద్దలతో కలసి వ్రేపల్లెకు వెళ్ళిపోయాడు.

క. గర్గాదిభూసురోత్తమ
వర్గముచే నుపనయనము వసుదేవుఁడు స
న్మార్గంబునఁ జేయించెను
నిర్గర్వచరిత్రులకును నిజపుత్రులకున్. 1405

● అనంతరం వసుదేవుడు గర్వరహితమైన చరిత్రకల తన కుమారులకు గర్గుడు మొదలైన బ్రాహ్మణపురోహితుల సన్నిధిలో యథావిధిగా ఉపనయనసంస్కారం జరిపించాడు.

క. ద్విజరాజవంశవర్యులు
ద్విజరాజముఖాంబుజోపదిష్టవ్రతులై
ద్విజరాజత్వము నొందిరి
ద్విజరాజాదికజనంబు దీవింపంగన్. 1406

● చంద్రవంశజులలో అగ్రగణ్యులై అలరారుతున్న బలరామకృష్ణులు బ్రాహ్మణోత్తముల ముఖకమలాలనుండి ఉపనయన మంత్రోపదేశములను గ్రహించినవారై విప్రులు, రాజులు ఆదిగాగల జనులూ, గరుత్మంతుడు, ఆదిశేషుడు మొదలైనవారూ దీవన లీయగా ద్విజత్వం (క్షత్రియత్వం) అందుకున్నారు.

వ. ఉపనయనానంతరంబున వసుదేవుండు బ్రాహ్మణులకు సదక్షిణంబులుగా ననేక గోహిరణ్యాదిదానంబు లొసంగి తొల్లి రామకృష్ణుల జన్మసమయంబులందు నిజమనోదత్తలైన గోవుల నుచ్చరించి యిచ్చి కామితార్థంబుల నర్థులకుం బెట్టె; నిట్లు బ్రహ్మచారులై.

● ఉపనయనమైన అనంతరం వసుదేవుడు ధరణీసురులకు దక్షిణలతో గూడ ధేనువులు, బంగారము మొదలైన అనేకదానాలు చేశాడు, మునుపు రామకృష్ణుల జననకాలంలో తాను మనస్సుతో సంకల్పంచేసి దానంచేసిన గోవులను ఇప్పుడు ప్రత్యక్షంగా దానమిచ్చాడు. యాచకులకు వారు కోరిన సమస్తవస్తువులు సమర్పించాడు.

శా. ఉర్విన్ మానవు లెవ్వరైన గురువాక్యోద్యుక్తులై కాని త
త్పూర్వాచారంభము సేయఁబోల దనుచున్ బోధించు చందంబునన్
సర్వజ్ఞత్వముతో జగద్గురువులై సంపూర్ణులై యుండియుం
గుర్వంగీకరణంబు సేయఁ జని; రా గోవిందుఁడున్ రాముఁడున్.

● ఈ విధంగా బ్రహ్మచర్యవ్రతాన్ని అవలంబించిన బలరామ కృష్ణులు పుడమిలో మనుజు లెవ్వరు గాని గురుకులవాసం చేసి గురువుల ఉపదేశాలు శ్రద్ధతో ఆలకించితే తప్ప విద్యావంతులు కాలేరు సుమా! అని లోకానికి బోధించాలని భావించారు. సమస్తము నెఱిగిన వా రయినప్పటికినీ, జగద్గురువు లయినప్పటికినీ, పరిపూర్ణు లయినప్పటికినీ బలరామకృష్ణులు ఆచార్యుణ్ణి అన్వేషించుతూ బయలు దేరారు.

వ. చని మహావైభవరాశియైన కాశిం జేరి తత్తీరంబున నవంతీపుర నివాసియు, సకలవిద్యావిలాసియు నైన సాందీపని యను బుధ వర్యునిం గని యథోచితంబుగ దర్శించి, శుద్ధభావవర్తనంబుల భక్తిసేయుచుండ, వారలవలన సంతుష్టుండై. 1409

● రామకృష్ణులు గొప్పవైభవములకు కాణాచియైన కాశీ పట్టణం చేరుకున్నారు. అక్కడ ఉంటున్న అవంతీపట్టణవాస్తవ్యుడూ, సమస్తవిద్యలచే విలసిల్లువాడూ అయిన సాందీపని అనే పండితోత్త ముని సముచితరీతి సందర్శించారు. స్వచ్ఛమైన మనస్సుతో సత్ప్ర వర్తనతో ప్రగాఢమైన భక్తితో ఆయనను సేవించారు. ఆచార్యుడు ఆ శిష్యుల వినయవిధేయతలకు ఎంతో సంతోషించాడు.

శా. వేదశ్రేణియు నంగకంబులు ధనుర్వేదంబుఁ దంత్రంబు మ
న్వాదివ్యాహృత ధర్మశాస్త్రములు నుద్యన్న్యాయముం దర్క వి
ద్యాదక్షత్వము రాజనీతియుము శుద్ధప్రక్రియం జెప్పె నా
భూదేవాగ్రణి రామకృష్ణులకు సంభూతప్రమోదంబునన్. 1410

* బ్రాహ్మణోత్తముడైన సాందీపని సంతోషితస్వాంతుడై రామకృష్ణులకు నాలుగు వేదములు, శిక్ష, వ్యాకరణము, ఛందము, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అను ఆరు వేదాంగములు, ధనుర్వే దము, తంత్రము, మనువు మున్నగు వారిచే చెప్పబడిన ధర్మశాస్త్రాలు,

ఒప్పిదమైన న్యాయశాస్త్రము, తర్కశాస్త్రము, రాజనీతి మొదలైన వాటిని తేటతెల్లంగా బోధించినాడు.

క. అఱువదినాలుగు విద్యలు
నఱువదినాలుగు దినంబు లంతన వారల్
నెఱవాదులైన కతమున
నెఱి నొక్కొకనాఁటి వినికి నేర్చి రిలేశా! 1411

* పరీక్షిన్మహారాజా! రామకృష్ణులు మిక్కిలినేర్పరులైనందున అరవైనాలుగు కళలనూ అరవైనాలుగురోజులలో చక్కగా ఒక్కొక్కనాడొక్కొక్కకళవంతున వినికిడిచేతనే నేర్చుకున్నారు.

క. గురువులకు నెల్ల గురులై
గురులఘుభావములు లేక కొమరుండు జగ
ద్గురులు త్రిలోకహితార్థము
గురుశిష్యన్యాయలీలఁ గొలిచిరి వేడ్కన్. 1412

* గురువులకే గురువు లయినవారూ, ఇతడెక్కువ అతడు తక్కువ అనే భేదభావములు లేక ప్రకాశించు లోకగురువులూ అయిన రామకృష్ణులు సంతోషంతో గురుశిష్యన్యాయంతో ఒజ్జయైన సాందీపనిని సేవించారు.

వ. ఇట్లు కృతకృత్యులైన శిష్యులం జూచి వారల మాహాత్మ్యంబునకు వెఱఁగుపడి సభార్యుండైన సాందీపని యిట్లనియె. 1413

* ఈ విధంగా కృతార్థులైన శిష్యులను చూచి వారి ప్రభావానికి ఆశ్చర్యపడి భార్యతో ఆలోచించి సాందీపని రామకృష్ణులతో ఇట్లన్నాడు.

శా. అంభోరాశిఁ బ్రభాసతీర్థమున మున్నస్మత్తనూసంభవుం
డంభోగాహముసేయుచున్ మునిఁగి లేఁ డయ్యెం గృపాంభోనిధుల్
శుంభద్వీర్యులు మీరు మీ గురునికిం జోద్యంబుగా శిష్యతన్
గాంభీర్యంబునఁ బుత్రదక్షిణ యిడం గర్తవ్య మూహింపరే! 1414

* నాయనలారా! మా కుమారుడు మునుపు సముద్రంలో ప్రభాసమనే ఘట్టాన స్నానంచేస్తూ నీటిలో మునిగిపోయాడు. అంతే; మళ్ళీ అగుపించలేదు. దయకు సముద్రంలాంటివారూ, ప్రకాశించే ప్రతాపంగలవారూ అయిన మీరు మాకు శిష్యులైనారు కనుక మాకు గురుదక్షిణగా అందరికీ అచ్చెరువు గలుగునట్లుగా మా కుమారుణ్ణి తెచ్చి ఇవ్వండి, ఇది మీ కర్తవ్యంగా గుర్తించండి.

క. శిష్యులు బలాఢ్యులైన వి
శేషస్థితి నొంది గురువు జీవించును; ని
ర్దూష్యగుణబలగరిష్ఠులు
శిష్యులరై గురుని కోర్కి సేయం దగదే? 1415

* శిష్యులు అత్యంతబలవంతులైతే గురువు విశేషగౌరవంతో కూడిన ఉత్తమస్థితి నొంది తలెత్తుకొని జీవిస్తాడు. అనింద్య గుణములతో, అఖండపరాక్రమంతో విరాజిల్లే మీరు శిష్యులైయుండి గురుని కోరిక నెరవేర్చడం న్యాయం కదా!

వ. అనిన విని రామకృష్ణులు గుర్వర్థంబుగా దుర్వారరథారూఢులై రయంబునం జని రౌద్రంబున సముద్రంబుఁ జేరి యిట్లనిరి. 1416

* ఆచార్యుడైన సాందీపని పలుకులువిని రామకృష్ణులు గురువుగారి కోరిక తీర్చడంకోసం ఎదురులేని రథాన్ని అధిరోహించారు. తక్షణం సముద్రుని సమీపానికి వెళ్ళి కోపంతో ఇలా అన్నారు.

క. 'సాగర! సుబుద్ధితోడను
మా గురుపుత్రకునిఁ దెమ్ము మాఱాడిన నీ
వాగడ మగుదువు; దుస్సహ
వేగరణాభీలనిశితవిశిఖాగ్నులకున్.' 1417

* ఓ సముద్రుడా! మంచిబుద్ధితో మా గురువుగారి కుమారుని తెచ్చి మాకు అప్పగించు. బదులు మాట్లాడితే సహింపరాని వేగం

కలవీ, రణరంగభయంకరాలూ అయిన మా పదనైన బాణాలు విరజిమ్మే అగ్నిజ్వాలలకు నీవు గురి అవుతావు.

వ. అనిన వారలకు జలరాశి యి ట్లనియె. 1418

ఉ. 'వంచన యింతలేదు యదువల్లభులార! ప్రభాసతీర్థమం
దంచితమూర్తి విప్రసుతుఁ డార్యుఁడు తోయములాడుచుండ ను
త్పంచలితోర్మి యొక్కటి ప్రచండగతిం గొనిపోయెఁ బోవఁగాఁ
బంచజనుండు మ్రింగె నతిభాసురశీలుని విప్రబాలునిన్. 1419

వ. అని వాని వసియించు చో టెఱింగించిన. 1420

• రామకృష్ణుల పలుకులు విని సాగరు డిట్లన్నాడు. 'యాదవేశ్వరులారా, నా మాటలలో మోసం లవలేశం కూడా లేదు. ప్రభాసతీర్థంలో అందమైన ఆకారం గలవాడు, మంచివాడు అయిన బ్రాహ్మణబాలుడు స్నానం చేస్తుండగా తరంగ మొకటి పైకెగసి భయంకరవేగంతో అతణ్ణి లోనికి గొంపోయింది. అలా తీసుకొనిపోగా మిక్కిలి ఒప్పిదమైన స్వభావంకల ఆ భూసుర కుమారుణ్ణి పంచజను డనే దైత్యుడు మ్రింగివేశాడు' అంటూ సముద్రుడు ఆ రాక్షసుడుండే చోటు రామకృష్ణులకు తెలిపినాడు.

శా. శంఖారావముతోడ బంచజనుఁడున్ శంకించి చిత్తంబులో
సంఖిన్నుండుగ వార్ధిఁ జొచ్చి దహనజ్వాలాభ హేయోజ్జ్వల
త్పుంఖాస్త్రంబునఁ గూల్చి వాని జఠరంబున్ వ్రచ్చి గోవిందుఁ డ
ప్రేంఖచ్చిత్తుఁడు బాలుఁ గానక గురుప్రేమోదితోద్యోగుఁడై. 1421

* శ్రీకృష్ణుడు శంఖం పూరించాడు. ఆ శంఖారావం విని పంచజనుడు భయసందేహాలతో కంపించి పోయాడు. శ్రీకృష్ణుడు సాగరజలంలో ప్రవేశించాడు. అగ్నిజ్వాలలతో సమానములై, బంగారుపింజలతో రంగారు బాణాలతో పంచజనుని పడగూల్చి వాని

పొట్టను చీల్చినాడు. అచంచల మనస్కుడైన శ్రీకృష్ణునకు పంచజనుని కడుపులో విప్రకుమారుడు కన్పించలేదు. అతడు గురువుపట్ల గల ప్రీతిచే కార్యతత్పరు డయినాడు.

క. దానవుని దేహజంబగు
మానితశంఖంబు గొనుచు మసలక బలుఁడుం
దో నేతేరఁగ రథియై
దానవరిపుఁ డరిగె దండధరపురికి నృపా! 1422

* పరీక్షిన్నరేంద్రా! రాక్షసవిరోధియైన శ్రీకృష్ణుడు నక్తంచరుడైన పంచజనుని శరీరంనుంచి జనించిన 'పాంచజన్య' మనే గొప్ప శంఖాన్ని తీసుకున్నాడు. ఆలసించక బలభద్రసహితుడై రథము నధిరోహించి యముని పట్టణానికి వెళ్ళినాడు.

వ. చని సంయమనీనామ నగరంబుఁ జేరి తద్ద్వారంబునఁ బ్రళయకాలమేఘగంభీరనినదభీషణం బగు శంఖంబు పూరించిన విని వెఱఁగుపడి. 1423

* అలా వెళ్ళి శ్రీకృష్ణుడు 'సంయమని' అనే పేరుగల ఆ యమపురాన్ని చేరి ఆ పట్టణంవాకిట ప్రళయకాలమేఘంవలె గంభీర ధ్వనితో భీతిగొలిపే తన శంఖాన్ని పూరించాడు. ఆ శంఖఘోషం విని యమధర్మరాజు వెరగుపడ్డాడు.

శా. అస్మద్బాహుబలంబునఁ గైకొనక శంఖారావమున్ మానసా
పస్మారంబుగ నెవ్వఁ డొక్కొ నగరప్రాంతంబునం జేసెఁ; మ
ద్విస్మేరావహరోషపావకునిచే విధ్వస్తుఁడై వాఁడు దా
భస్మంబై చెడు నంచు నంతకుఁడు కోపప్రజ్వలన్మూర్తియై. 1424

* నా భుజబలాన్ని లెక్కచెయ్యక నా మనసుకు క్రోధావేశం కలిగేటట్టు పురంపొంత ఎవడో శంఖం పూరిస్తున్నాడు. వాడు

అద్భుతావహమైన నా క్రోధాగ్నికి బూడిద అయిపోతాడు' అంటూ దండధరుడు కోపంతో మండిపడుతూ వచ్చాడు.

వ. వచ్చి రామకృష్ణులం గని వారు లీలామనుష్య అయిన విష్ణుమూర్తులని యెఱింగి; భక్తితోడం బూజచేసి సర్వభూతమయుం డగు కృష్ణునకు నమస్కరించి 'యేమి సేయుదు నానతి'మ్మనిన నమ్మహాత్ముం డిట్లనియె. 1425

* అలా వచ్చి అంతకుడు బలరామకృష్ణుల నవలోకించాడు. వారు లీలలు నెరపుటకై నరులుగా అవతరించిన నారాయణులని గ్రహించాడు. భక్తితో పూజించాడు. సకలభూతహృదయ నివాసియైన ఆ పరమాత్మకు నమస్సులు సమర్పించి నే నేమి చెయ్యాలో ఆజ్ఞాపించమని అడిగినాడు. యముని మాటలు విని అచ్యుతు డిట్లా అన్నాడు.

క. 'చెప్పెద మా గురునందనుఁ
దప్పుగలుగఁ జూచి నీవు దండమునకున్
దెప్పించినాఁడ వాతని
నొప్పింపుము మాకు వలయు నుత్తమచరితా!' 1426

• పుణ్యశీలుడవైన యమధర్మరాజా! చెపుతాను విను. మా గురుపుత్రునిలో తప్పు కలుగబట్టి దండించడానికై తెప్పించుకున్నావు అతణ్ణి ఇప్పుడు మాకు అప్పగించు. మా కతడు కావాలి.

క. అనిన విని 'వీఁడె వీనిం
గొని పొం'డని భక్తితోడ గురునందను ని
చ్చినఁ గృష్ణుడు వీడ్కొనియెను
ఘనదుర్జనదమను మహిషగమనున్ శమనున్. 1427

* శ్రీకృష్ణుని మాటలు విని యమధర్మరాజు 'ఇదుగో వీడే.' వీనిని తీసుకపొండి అని భక్తితో గురుపుత్రుని ఇచ్చివేశాడు. కృష్ణుడు

దుర్మార్గులను అణచివేసేవాడూ, దున్నపై స్వారీచేసేవాడూ అయిన యముణ్ణి వీడ్కొని గురుకుమారుణ్ణి తోడ్కొని బయలుదేరి వెళ్ళినాడు.

వ. ఇట్లు జము నడిగి తెచ్చి రామకృష్ణులు సాందీపనికిం బుత్త్రుని సమర్పించి 'యింక నేమి సేయవలయు? నానతిం' డనిన నతం డిట్లనియె. 1428

* ఈ విధంగా యమునివద్దనుండి పుత్రుణ్ణి తెచ్చి గురువర్యుడైన సాందీపని కిచ్చి రామకృష్ణులు 'ఇంకా ఏమి చెయ్యవలెనో సెలవివ్వండి' అని అడిగారు. సాందీపని వారితో ఇలా అన్నాడు.

క. 'గురునకుఁ గోరిన దక్షిణఁ
గరుణన్ మున్నెవ్వఁ డిచ్చె? ఘనులార! భవ
ద్గురునకుఁ గోరిన దక్షిణఁ
దిరముగ నిచ్చితిరి మీరు దీపితయశులై. 1429

• 'వీరకుమారులారా! గురువునకు కోరిన దక్షిణ తెచ్చి యిచ్చారు. మీ యశస్సు దిగంతాలలో ప్రకాశింపజేశారు. ఇంతవరకు ఎవడైనా తన గురువునకు అత డడిగిన ఇటువంటి దక్షిణ దయతో ఈ విధంగా ఇచ్చినవా డున్నాడా?'

క. కాలుని వీటికిఁ జని మృత
బాలకుఁ దే నొరుల వశమె? భవదీయ కృపన్
మేలు దొరకొనియె మాకు; వి
శాల మగుంగాత మీ యశము లోకములన్. 1430

* యమసదనానికి వెళ్ళి చచ్చిన పిల్లవానిని తెచ్చియిచ్చుట ఇతరులకు సాధ్యమా? ఎంతో శ్రద్ధాభక్తులతో మాకు మేలు కలిగించారు. మీ కీర్తి లోకాలలో విస్తరిల్లు గాక!

వ. మహాత్ములారా! 'యేను గృతార్థుండ నైతి' నని దీవించిన సాందీపని వీడ్కొని కృతకృత్యులై రామకృష్ణులు రథారోహణంబు

చేసి మథురకుం జనుదెంచి పాంచజన్యంబు పూరించినఁ గని నష్ట
ధనంబులు గనినవారి భంగిం బ్రజలు ప్రమోదించి; రంత నొక్క
నాఁ డేకాంతంబున. 1431

* ఓ పుణ్యాత్ములారా ! 'నేను ధన్యుడ నయినాను' అని సాందీపని వారిని సేవించాడు. గురువుదగ్గర సెలవు పుచ్చుకొని కృతార్థులై రామకృష్ణులు తేరెక్కి మథురానగరానికి వెళ్ళి శంఖాన్ని ఒత్తినారు. అపుడు ప్రజలు తాము పోగొట్టుకొన్న ధనాన్ని తిరిగి పొందిన చందాన సంతోషించారు.

శ్రీకృష్ణుఁడు గోపకాంతల చెంతకు నుద్ధవుని బంపుట

శా. నాపైఁ జిత్తము లెప్పుడున్ నిలుపుచున్ నా రాకఁ గాంక్షించుచున్
నాపే రాత్మల నావహించుచు వగన్ నానాప్రకారంబులన్
గోపాలాంగన లెంత జాలిఁ బడిరో ? కోపించిరో ? దూఱిరో ?
వ్రేపల్లెన్ నిజనర్మ గేహములలో విభ్రాంతచైతన్యలై. 1432

* ఒకనాడు శ్రీకృష్ణుడు ఏకాంతంగా ఇలా తలపోశాడు- వ్రేపల్లెలోని గొల్లముద్దియలు సదా నామీదనే మనసు లగ్నం చేస్తారు. నా ఆగమనాన్ని ఎదురుచూస్తారు. నా పేరు ఆత్మలో ధ్యానిస్తారు. ప్రణయపారవశ్యంతో తమ రహస్య గృహాలలో అనేకవిధాలుగా వగ చెందుతుంటారు. పాపం వారెంత దైన్యం పాలవుతున్నారో ? నాపై ఎంత కినుక వహించారో ! నన్నెంతగా దూషించుతున్నారో !

వ. అని చింతించి. 1433

క. సిద్ధవిచారు గభీరున్
వృద్ధవచోవర్ణనీయు వృష్ణిప్రవరున్
బుద్ధినిధి నమరగురునిభు
నుద్ధవునిం జూచి కృష్ణుఁ డొయ్యన పలికెన్. 1434

● ఇలా ఆలోచించి నిశ్చితమైన భావాలు గలవాడు, గంభీరుడు, పెద్దలు మెచ్చదగినవాడు, వృష్ణివంశస్థులలో ఉత్తముడు, బుద్ధికి గనివంటివాడు, దేవతాగురువైన బృహస్పతితో సమానుడు అయిన ఉద్ధవుణ్ణి పిలిపించి అతనితో శ్రీకృష్ణుడు మెల్లగా ఇట్లన్నాడు.

శా. రమ్మా యుద్ధవ! గోపకామినులు నా రాకల్ నిరీక్షించుచున్
సమ్మోహంబున నన్నియున్ మఱచి యే చందంబునం గుందిరో
తమ్మున్ నమ్మినవారి డిగ్గ విడువన్ ధర్మంబు గాదండ్రు; వే
పొమ్మా! ప్రాణము లే క్రియన్ నిలిపిరో ప్రోద్యద్వియోగాగ్నులన్.

* ఉద్ధవా! ఇలా రా! ప్రణయమూర్తులైన గోపికలు నా ఆగమనాన్ని ఎదురుచూస్తూ నామీది వ్యామోహంతో అన్నీ మరచి పోయి ఎంతగా దుఃఖపడుతున్నారో! నమ్ముకున్న తమ్ము విడవడం ధర్మంకాదని వారంటూ ఉండేవారు. వేగంగా వెళ్ళు. పెచ్చరిలుతున్న వియోగమనే అగ్నిజ్వాలలతో వా రెలా ప్రాణాలు భరించి ఉన్నారో!

క. లౌకిక మొల్లక న న్నా
లోకించు ప్రపన్నులకును లోఁబడి కరుణా
లోకనములఁ బోషింతును
నా కాశ్రితరక్షణములు నైసర్గికముల్. 1436

● లోకధర్మాలను దిగవిడచి నాయెడ చూపు నిలిపి నాయందు ప్రపత్తి చేసే వారికి నేను లోబడి దయామయదృష్టులతో వారిని కాపాడుతాను. ఆశ్రయించిన వారిని ఆదుకోవడం నాకు స్వభావసిద్ధమైన గుణం.

క. 'సందేహము మానుం డర
విందాననలార! మిమ్ము విడువను వత్తున్
బృందావనమున 'కని హరి
సందేశము పంపె నను ము సంకేతములన్. 1437

* కమలముల వంటి కన్నులుగల కాంతలారా! సంశయం మానండి. మిమ్ము వదలిపెట్టను, బృందావనానికి వస్తాను- అని కృష్ణుడు వార్త పంపినాడని నీవు రహస్యంగా గోపికలతో చెప్పు.

వ. అని మందహాససుందరవదనారవిందుండై కరంబు కరంబున నవ లంబించి, సరసవచనంబులాడుచు వీడుకొలిపిన నుద్ధవుండును రథారూఢుండై సూర్యాస్తమయసమయంబునకు నందవ్రజంబు సేరి వనంబులనుండి వచ్చు గోవుల చరణరేణువులం బ్రచ్ఛన్న రథుండై మెచ్చి నందుమందిరంబు ప్రవేశించిన. 1438

* అని చిరునవ్వుతో అందమైన అరవిందంవంటి మోముగల గోవిందుడు ఉద్ధవుని చేతిని తన చేతితో పట్టుకొని రసవంతములైన మాటలు పలుకుతూ సాగనంపినాడు. ఉద్ధవుడు అరదము నెక్కి అర్కుడు అస్తమించే వేళకు వ్రేపల్లెకు చేరినాడు. అడవులలో మేత మేసి వచ్చే ఆలమందల పాదధూళులు అతని రథాన్ని కప్పి వేస్తుండగా ఉద్ధవుడు గోకులం చెరి నందుని మందిరంలో ప్రవేశించాడు.

శా. ఆ పుణ్యాత్మునిఁ గౌఁగిలించికొని నందాభీరుఁ డానందియై
'మా పాలింటికిఁ గృష్ణుఁ డీతఁ' డనుచున్ మన్నించి పూజించి వాం
ఛాపూర్ణంబుగ మంజులాన్న మిడి మార్గాయాసముం బాపి స
ల్లాపోత్సాహముతోడ నిట్లనియె సంలక్షించి మోదంబునన్. 1439

* నందుడు ఆనందంతో ఆ పుణ్యాత్ముణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. ఇతడు మా పాలిటి గోపాలకృష్ణు డంటూ సాదరంగా పూజించాడు. కోరిక తీరేటట్టు కమ్మని భోజనం పెట్టినాడు. ప్రయాణం వల్ల కలిగిన శ్రమ పోగొట్టినాడు. అతణ్ణి చూచి ముచ్చటింప గోరి ఎంతో సంతోషంతో ఇట్లన్నాడు.

క. నా మిత్రుఁడు వసుదేవుఁడు
సేమంబున నున్నవాఁడె? చెలువుగఁ బుత్రుల్
సేమంబున సేవింప మ
హామత్తుండైన కంసుఁ డడఁగిన పిదపన్. 1440

* నాయనా! ఉద్ధవా! నా చెలికాడు వసుదేవునకు క్షేమమే కదా! గర్వాంధుడైన కంసుడు కడతేరిన తర్వాత తన కుమారుల సేవలు అందుకుంటూ సుఖంగా ఉన్నాడు కదా?

శా. అన్నా! భద్రమె? తల్లిదండ్రుల మమున్ హర్షించి చింతించునే?
తన్నుం బాసిన గోపగోపికల మిత్రవ్రాతమున్ గోగణం
బు న్నిత్యంబుఁ దలంచునే? వన నదీ భూముల్ ప్రసంగించునే?
వెన్నుం డెన్నఁడు వచ్చునయ్య? యిటు మా వ్రేపల్లెకు న్నుద్ధవా!

* అన్నా ఉద్ధవా! అక్కడ అందరూ కుశలమేనా? కృష్ణుడు తలిదండ్రులమైన మమ్ము సంతోషంతో తలచుకొంటూ ఉంటాడా? తన కెడమైన గోపకులనూ, గోపికలనూ, చెలికాండ్రనూ, ఆలమంద లనూ ఎల్లప్పుడు స్మరిస్తాడా? ఇక్కడి వనాలనూ, నదులనూగూర్చి ముచ్చటిస్తుంటాడా? ఇటు మా వ్రేపల్లెకు వెన్నుడు ఎప్పుడు వస్తా డయ్యా?

క. అంకిలి కలుగక మా కక
లంకేందుని పగిదిఁ గాంతిలసితంబగు త
త్పంకజనయమని నెమ్మొగ
మింక విలోకింపఁగలనె యీ జన్మమునన్? 1442

* కందులేని చందురుని చందంగా అందాలు చిందుతూ కాంతులు వెదజల్లే ఆ కమలాక్షుని ముద్దులముఖం స్వేచ్ఛగా అలో కించే అదృష్టం ఈ జన్మలో లభిస్తుందా?

క. అని హరి మున్నొనరించిన
పను లెల్లను జెప్పి చెప్పి బాష్పాకుల లో
చనుఁడై డగ్గుత్తికతో
వినయంబున నుండె గోపవీరుం డంతన్. 1443

* ఈ విధంగా గోపాలవరేణ్యుడైన నందుడు శ్రీకృష్ణుడు మునుపుచేసిన కృత్యము లన్నింటినీ పలుమారు చెప్పి చెప్పి బొంగురు వోయిన కంఠంతో మాటాడలేక కన్నీటితో కలకబారిన కన్నులు గలవాడై మిన్నకున్నాడు.

క. పెనిమిటి బిడ్డనిగుణములు
వినుతింప యశోద ప్రేమవిహ్వలమతియై
చను మొనలఁ బాలు గురియఁగ
గనుఁగొనలను జలము లొలుకఁగాఁ బెగ్గిలియెన్. 1444

* ఈ విధంగా తనపతి గోపాలకృష్ణుని గుణాలు ఉగ్గడిస్తుండగా యశోద ప్రేమతో పరవశమైన మనస్సుగలదై చనుమొనల నుండి పాలు జాలువారగా కనుగొనలనుండి కన్నీరు ధారలు కారగా చలించిపోయింది.

వ. ఇట్లు గోవింద సందర్శనాభావవిహ్వలులైన యశోదానందులకు నుద్ధవుం డిట్లనియె. 1445

* ఈ విధంగా కృష్ణసందర్శనం లేమిచే కలతచెందిన యశోదానందులతో ఉద్ధవు డిట్లన్నాడు.

క. జననీజనకుల మిమ్ముం
గనుఁగొన శీఘ్రంబె వచ్చుఁ గని భద్రంబుల్
వనజాక్షుం డొనరించును
మనమున వగవకుఁడు ధైర్యమండనులారా! 1446

* మీరు ధైర్యంగా ఉండండి. తలిదండ్రులైన మిమ్ము దర్శించడానికి కమలాక్షుడు త్వరలోనే వస్తాడు. మిమ్ముచూచి మీకు శుభములు చేకూరుస్తాడు, చింతించకండి.

మ.బలుఁడుం గృష్ణుఁడు మర్త్యులే? వసుమతీభారంబు వారింప వా
రలరూపంబులఁ బుట్టినాఁడు హరి నిర్వాణప్రభుం; డెవ్వఁ డు
జ్జ్వలుఁడై ప్రాణవియోగకాలమునఁ దత్సర్వేశుఁ జింతించు,వాఁ
డలఘుశ్రేయముఁ బొందు బ్రహ్మమయుఁడై యర్కాభుఁడై నిత్యుఁడై.

* రామకృష్ణులు సామాన్యమానవులా? మోక్షమునకు అధినేత యైన శ్రీమహావిష్ణువు భూభారాన్ని తొలగించుటకై రామకృష్ణుల రూపాలలో భూమిమీద అవతరించాడు. ఏ మానవుడు జ్ఞానవంతుడై ప్రాణప్రయాణకాలంలో, సర్వమునకు ప్రభువైన ఆ భగవంతుణ్ణి సంస్మరిస్తాడో అట్టివాడు బ్రహ్మస్వరూపుడై, సూర్యునివలె తేజో విరాజితుడై నిత్యత్వం పొంది ముక్తిరూపమైన శ్రేయాన్ని చూర గొంటాడు.

సీ. అట్టి నారాయణుం డఖిలాత్మభూతుండు
కారణమానవాకారుఁడై నఁ
జిత్తంబు లతనిపైఁ జేర్చి సేవించితి
రతికృతార్థులరైతి; రనవరతము
శోభిల్లు నింధనజ్యోతిచందంబున
నఖిలభూతములందు నతఁ; డతనికి
జననీజనకదారసఖిపుత్రబాంధవ
శత్రుప్రియాప్రియజనులు లేరు;

ఆ. జన్మకర్మములును జన్మంబులును లేవు;
శిష్టరక్షణంబు సేయుకొఱకు
గుణవిరహితుఁ డయ్యు గుణి యయి సర్వ ర
క్షణ వినాశకేళి సలుపుచుండు. 1448

• అట్టి నారాయణుడు అన్ని ప్రాణులయందు ఆత్మగా ఉన్నాడు. కారణవశంగా మానుషవిగ్రహం గైకొన్న ఆయనపై మీరు మనసులు చేర్చి కొలిచారు. మీరు పరమధన్యులు. కట్టెలలో నిప్పుచొప్పున అత డెప్పుడూ సకలప్రాణులందూ ప్రకాశిస్తుంటాడు. ఆయనకు తల్లి, తండ్రి, పెండ్లము, స్నేహితుడు, చుట్టము, విరోధి, ఇష్టుడు, అనిష్టుడు అంటూ ఎవ్వరూ లేరు. జననమరణాలు లేవు. సజ్జనులను సంరక్షించుటకొరకై త్రిగుణరహితు డైనను, గుణములు ధరించి సృష్టిస్థితిలయాలు అనే లీలలు సాగిస్తుంటాడు.

వ. అని మఱియుఁ బెక్కువిధంబుల హరిప్రభావము లుపన్యసించుచు నా రేయి గడపి మఱునాడు దధిమథనశబ్దంబు లాకర్ణించుచు లేచి కృతానుష్ఠానుండై యుద్ధవుం డొక్క రహస్యప్రదేశంబున నున్న సమయంబున. 1449

* అని పలువిధాల ఉద్ధవుడు శ్రీకృష్ణుని మహిమలు గూర్చి ముచ్చటిస్తూ ఆ రాత్రి గడిపాడు. వేకువనే పెరుగు చిలికే చప్పుళ్ళు విని నిద్ర లేచాడు. సంధ్యోపాసనాది నిత్యానుష్ఠానాలు నెరవేర్చుకుని ఒక ఏకాంతస్థలంలో ఉన్నాడు.

శా. 'రాజీవాక్షుఁడు సుందరాస్యుఁడు మహోరస్కుండు పీతాంబరుం
డాజానుస్థితబాహుఁ డంబురుహమాలాలంకృతుం డుల్లస
ద్రాజత్కుండలుఁ డొక్క వీరుఁ డిచటన్ రాజిల్లుచున్నాఁడు; మా
రాజీవాక్షుని భంగి' నంచుఁ గని రా రాజాన్వయున్ గోపికల్.

* ఆ సమయంలో గొల్లచెలువలు అక్కడికి వచ్చారు. వారు పద్మములవంటికన్నులు గలవాడును, అందమైన మోముగలవాడును, విశాలమైన వక్షముగల వాడును, పచ్చని పట్టుపుట్టము కట్టినవాడును, మోకాళ్ళవరకు వ్రేలాడు చేతులు గలవాడును, కమలమాలా విభూషితుడును, మెరుగారు కుండలములు దాల్చినవాడును అయిన

ఒకానొక పురుషపుంగవుడు మా కృష్ణునివలె ఇక్కడ ప్రకాశిస్తున్నాడు అని చెప్పుకుంటూ చంద్రవంశ్యుడైన ఉద్ధవుణ్ణి చూచారు.

వ. కని లజ్జాసహిత హాసవిలోకనంబులు ముఖంబులకుం జెలు వొసంగ నిట్లనిరి. 1451

* అలా చూచి సిగ్గుతో కూడిన నవ్వులు, చూపులు తమ వదనాలకు సొంపు సంపాదించగా ఆ గోపకాంతలు ఉద్ధవుడితో ఇలా అన్నారు.

భ్రమరగీతము

చ. ఎఱుఁగుదు మేము నిన్ను వనజేక్షణమిత్రుఁడ వీవు; కూరిమిన్
మెఱయుచుఁ దల్లిదండ్రులకు మే లెఱిగింపఁ బ్రియుండు పంపఁగా
వఱలెడుభక్తి వచ్చితివి; వారలనైన మనంబులోపలన్
మఱవఁడు శౌరి మేలు; మఱి మాన్యులు రాజున కెవ్వరిచ్చటన్.

* అయ్యా! ఉద్ధవా! మేము నిన్నెరుంగుదుము. నీవు కమలములవంటి కన్నులుగల శ్రీకృష్ణునికి నెచ్చెలివి. ఆయన తన క్షేమం తలిదండ్రులకు తెలుపగోరి నిన్నిక్కడికి పంపగా ప్రస్ఫుట భక్తితో వచ్చావు. ప్రియుడైన యదుపతి తన జననీజనకుల నైనా మరచిపోలేదు, ఎంతో నయం! మరి యీ వ్రేపల్లెలో ఆయనకు సంభావింపదగినవారు మరెవ్వ రున్నారో మాకు తెలియదు.

క. మునివరులైనను బంధుల
ఘనసఖ్యము విడువలేరు గాక విడువరే
సనిమిత్తసఖ్య మాఁకటి
పని దీఱిన నళులు విరులఁ బాయునొ లేదో! 1453

* సర్వసంగపరిత్యాగులైన మునిసత్తములు కూడ బంధువుల తోడి స్నేహానుబంధం వదలుకోలేరు. మఱి శ్రీకృష్ణుడు తన జననీ

జనకులకు ప్రియ మాచరించడంలో వింత ఏముంది? ఇతరులతో చేసే చెలిమి ఒక ప్రయోజనాన్ని బట్టి ఏర్పడుతుంది. ఆ ప్రయోజనం తీరగనే ఆ స్నేహబంధం కూడ వదలిపోతుంది. అకలి తీరిన పిదప తుమ్మెదలు పూలను విడవడం లేదా?

చ. అని యిటు గోపికల్ వలుక నం దొక గోపిక కృష్ణపాదచిం
తనమునఁ జొక్కి చేరువను దైవవశంబునఁ గాంచె నుజ్జ్వల
త్వనిశితసద్వివేకముఁ బ్రసూనమరందమదాతిరేకమున్
ఘనమృదునాదపంచలిత కాముకలోకముఁ జంచరీకమున్. 1454

* అని యీ ప్రకారం గొల్ల చేడెలు పలుకుతుండగా వారిలో ఒకగోపిక శ్రీకృష్ణచరణధ్యాన పరవశురాలైంది. ఆమె తన సమీపంలో విధివశాన చురుకైన తెలివితేటలు గలదీ, పూదేనెను గ్రోలి మత్తిల్లినట్టిదీ, తన మధురమంజుల ఝుంకారస్వనంతో కాముకులను కలవరపెట్టునదీ అయిన ఒక గండుతుమ్మెదను చూచింది.

వ. కని హరి తన్నుం బ్రార్థింపఁ బుత్తెంచిన దూతయని కల్పించు కొని, యుద్ధవునికి నన్యాపదేశంబై యెఱుకపడ న య్యళికిం దొయ్యలి యిట్లనియె. 1455

* అలా చూచిన ఆ గోపిక తన్ను వేడుకొనుటకై ప్రియుడు పంపిన దూతగా కల్పించుకొని ఉద్ధవునికి అన్యాపదేశంగా తాకునట్లు ఆ భ్రమరంతో ఇట్లనింది.

మ. భ్రమరా! దుర్జనమిత్ర! ముట్టకుము మా పాదాబ్జముల్ నాగర
ప్రమదాళీకుచకుంకుమాంకితలసత్ప్రాణేశదామప్రసూ
న మరందార్ధ్రుణితాననుండ వగుటన్ నాథుండు మన్నించుఁగా
క మము న్నేపుచుఁ బౌరకాంతల శుభాగారంబులన్ నిత్యమున్. 1456

* ధూర్తమిత్రుడవైన ఓ మధుపా! నీవు మా పాదపద్మాలు స్పృశించవద్దు. మథురాపురకాంతల స్తనకుంకుమం అంటుకొన్న

మా ప్రాణవల్లభుని పుష్పమాలికలోని మకరందం గ్రోలి ఆ కుంకుమ చేత ఎఱ్ఱబడిన ముఖముగల వాడవు గదా నీవు! మమ్ము విరాళి బారిద్రోచి, పౌరాంగనల శోభనగృహాలలో నిత్యము కులుకుతున్న నిన్ను అతడు మన్నించునేమో కాని మేము మాత్రం మన్నించము.

మ. ఒకపువ్వందలి తేనె ద్రావి మధుపా! యుత్సాహివై నీవు వే
ఱొకటిం బొందెడుభంగి మ మ్మధరపీయూషంబునం దేల్చి మా
యకలంకోజ్జ్వలయౌవనంబుఁ గొని యన్యాసక్తుఁ డయ్యెన్ విభుం
డకటా! యాతని కెట్లుదక్కె సిరి? మిథ్యాకీర్తి నమ్మెంజుమీ! 1457

• ఓయీ! మధుపాయీ! ఒక పువ్వులోని మకరందాన్ని పానంచేసి దానిని దిగవిడిచి, ఉత్సాహంతో మరొక్కపువ్వును నీవు ఆశ్రయించినట్లే శ్రీకృష్ణుడు తన అధరసుధారసాన్ని ఒక్కసారి మమ్ము గ్రోలనిచ్చి మా అచ్చమైన పచ్చియౌవనం కొల్లగొని అన్యకాంతాసక్తుడైనాడు. అయ్యయ్యో! అతడు ఉత్తమశ్లోకుడన్న బూటకపుమాటలు నమ్మి శ్రీమహాలక్ష్మి అట్టి చంచలచిత్తునకు కైవసమయినది.

శా. భృంగా! కృష్ణుఁడు మంచివాఁడనుచు సంప్రీతిం బ్రశంసించె; దీ
సంగీతంబున నేము సొక్కుదుమె? తచ్చారిత్రముల్ వింతలే?
యంగీకారము గావు మాకుఁ; బురకాంతాగ్రప్రదేశంబులన్
సంగీతం బొనరింపు వా రిడుదు రోజ న్నీకు నిష్టార్థముల్. 1458

* ఓ భృంగరాజా! శ్రీకృష్ణుడు మంచివాడని అతనినెంతో సంతోషంతో కీర్తిస్తున్నావు. నీ గానం విని మేము సొక్కిసోలిపోతా మనుకున్నావా? అతని కథలు మాకు క్రొత్తవా యేమి? నీ సంగీతం మేము అంగీకరించం. ఆ మథురానగరిలోని మగువల యెదుట నీ విద్య ప్రదర్శించు: వారు మెచ్చుకుని నీకు అభిమతార్థము లిస్తారు.

మ. సమదాళీశ్వర ! చూడు ముజ్జ్వలితహాస భ్రూవిజృంభంబులన్
రమణీయుండగు శౌరిచేఁ గరఁగరే రామల్ త్రిలోకంబులం ?
బ్రమదారత్నము లక్ష్మి యాతని పదాబ్జాతంబు సేవించు ని
క్కము నే మెవ్వర మా కృపాజలధికిం గారుణ్యముం జేయఁగన్.

* ఓ తుమ్మెదలరాయడా! మనోహరుడగు శ్రీకృష్ణుని మందహాస ద్యుతులకూ, బొమముడి విలాసములకూ కరగిపోని కాంతలు స్వర్గమర్త్యపాతాళభువనములందు కలరా? లేరు. అన్నుల మిన్నయైన ఆ కమలాదేవియే అతని చరణకమలాలను సేవిస్తుండగా ఆ దయాసాగరుని అనుగ్రహించుటకు మే మేపాటి వారము?

శా. రోలంబేశ్వర ! నీకు దౌత్యము మహారూఢంబు; నీ నేరుపుల్
చాలున్; మచ్చరణాబ్జముల్ విడువు మస్మన్నాథపుత్త్రాదులన్
లీలం బాసి పరంబు డించి తనకున్ లీనత్వముం బొందు మ
మ్మేలా వాసె విభుండు ? ధార్మికులు మ న్నీ చందముల్ మెత్తురే ?

* ఓ చంచరీకమా! రాయబారం నడపటంలో నివు చాల గడుసరివి. ని నేర్పు లికచాలు. మా చరణపద్మములను విడిచిపెట్టు. మా భర్తలను, పుత్త్రాదులను చులకనగా వదలి సద్గతిమాట తలపెట్టక తనతో లీనమై ఉన్న మమ్ము అతడేల పరిత్యజించాడు? ధర్మాత్ములు ఇలాంటి నడవడులు మెచ్చుదురా?

శా. వాలిం జంపెను వేటకాని పగిదిన్ వంచించి; దైత్యామజన్
లోలం బట్టి విరూపఁ జేసెను; బలిన్ లోభంబుతోఁ గట్టి యా
త్రైలోక్యంబు మొఱంగి పుచ్చుకొనియెన్; ధర్మజ్ఞుఁడే మాధవుం
డేలా షట్పద ! యెగ్గు మావలన నీ కెగ్గింపఁగా నేటికిన్ ? 1481

● తాను వేటకానివలె వంచించి వానరరాజైన వాలిని వధించాడు. తనపై మరులుగొన్న రావణుని చెల్లెలు శూర్పణఖను ముక్కు చెవులు కోసి విరూపను కావించాడు. పేరాసతో బలిచక్రవర్తిని

బంధించి మోసపుచ్చి ముల్లోకాలు పుచ్చుకున్నాడు. లక్ష్మీవల్లభుడగు ఆ శ్రీకృష్ణుకు ధర్మ మెరిగినవాడా? మా వల్ల తప్పే మున్నది? నీ వతనిని కొనియాడు టెందుకు?

ఉ. పన్నగ మింటిపై నెగసి పాఱు విహంగములైన వీనులం
దన్నొకమాటు విన్న గృహదారసుతాదులఁ బాపి విత్తసం
పన్నత డించి సంసరణపద్ధతిఁ బాపెడువాఁడు నిత్యకాం
క్ష న్నెఱి నున్న మాబ్రదుకు సైఁచునె యేల మధువ్రతోత్తమా!

● స్వేచ్ఛగా గగనతలంలో ఎగిరిపోయే పక్షులు సైతం చెవులార అతని పే రొక్కమారు వింటే ఇల్లు, ఇల్లాలు, పిల్లలు మున్నగు వారిని ఎడచేసి, విత్తాదికం విసర్జింప జేసి, సంసారమార్గం పోకార్చే ఆ కృష్ణుడు ఎడతెగని కోరికలతో న్యాయము తప్పకున్న మా బ్రతుకులు సహిస్తాడా?

మ. కమనీయంబగు వేఁటకానిపలు కాకర్ణించి నిక్కంబుగాఁ
దమ చిత్తంబులఁ జేర్చి చేరి హరిణుల్ తద్బాణ నిర్భిన్నలై
యమితోగ్రవ్యథ నొందు భంగి హరిమాయాలాపముల్ నమ్మి దుః
ఖములం జెందితి మంగజాస్త్రజనితోగ్రక్రాంతి నిందిందిరా! 1463

● ఓ భ్రమరమా! ఆడుజింకలు ఆకర్షణీయమైన వేటగాని పలుకు లాలకించి పారవశ్యంతో చెంతకుచేరి వాని బాణాలకుగురియై అతిదారుణమైన బాధను పొందు విధంగా శ్రీకృష్ణుని మాయమాటలు నమ్మి మన్మథశరాల తాకిడికి స్రుక్కి మేము దుఃఖాలపాలైనాము.

ఉ. బంధుల బిడ్డలన్ మగల భ్రాతలఁ దల్లులఁ దండ్రులన్ మనో
బాంధతఁ జేసి డించి శరణందిన మమ్ము వియోగదుర్దశా
సింధువులోనఁ ద్రోచి యిటు సేరక పోవుట పాడిగాదు; ష
ట్పంధయ! మీ యధీశునకు బాదములం బడి యొత్తి చెప్పవే!

● ఓ షట్పదా! చుట్టాలనూ, సుతులనూ, భర్తలనూ, అన్న దమ్ములనూ, తలిదండ్రులనూ కామాంధత్వముచే విడనాడి తన్నే శరణు జొచ్చినాము. ఇట్టి మమ్ము విరహసాగరమున త్రోసివైచి ఈ రీతి మావంక చేర రాకుండుట న్యాయము కాదని ఏలికయైన శ్రీకృష్ణునకు పాదప్రణామం చేసి గట్టిగా నొక్కిచెప్పు.

సీ. కాంచనరత్నసంఘటిత సౌధంబులే
మా కుటీరంబులు మాధవునకు
వివిధ నరేంద్రసేవిత రాజధానియే
మా పల్లె యదువంశమండనునకు ?
సురభి పాదప లతాశోభితారామమే
మా యరణ్యము సింహమధ్యమునకుఁ
గమనీయ లక్షణ గజతురంగంబులే
మా ధేనువులు కంసమర్దనునకు ?

తే. రూప విభ్రమ నైపుణ రూఢలైన
మగువలమెః మేము మన్మథమన్మథునకు ?
నేల చింతించు మముఁ గృష్ణుఁ డేల తలఁచుఁ ?
బృథివి నధిపులు నూతనప్రియులు గారె ! 1465

● లక్ష్మీవల్లభుడైన శ్రీకృష్ణునకు మాపూరి గుడిసెలు బంగారము మణులతో నిర్మింపబడినమేడలా? యదుకులమునకు అలంకారమైన వెన్నునకు మా పల్లెటూరు పలువురు రాజులచే సేవింపబడు ముఖ్యపట్టణమా యేమి? సింగమునడుమువంటి నడుముగల శ్రీహరికి మా అడవి సువాసనలీను చెట్లతో పూదీగలతో చెలువారు ఉద్యాన వనమా? కంసవిధ్వంసి యగు కృష్ణునకు మా గోవులు సర్వశుభ లక్షణలక్షితములైన ఏనుగులా? గుఱ్ఱములా? మన్మథునికి మన్మథుడైన ఆ వన్నెకానికి గొల్లపడతుల మగు మేము రూపవిభ్రమవిలాసములతో గణుతింపదగిన కాంతామణులమా యేమి? కనుక ఆ శ్రీకృష్ణుడు

మమ్ముగురించి ఎందు కాలోచిస్తాడు? ఎందుకు మమ్ము స్మరిస్తాడు? లోకంలో ప్రభువులు నవప్రియులు గదా?

వ. అని మఱియు నిట్లనేక విధంబులఁ గృష్ణసందర్శనలాలసలయి పలుకుచున్న గోపికల వచనంబులు విని యుద్ధవుండు మధురాలాపంబుల నూరార్పుచు నిట్లనియె. 1466

• అని ఇంకా నానాప్రకారాలుగా కృష్ణసందర్శనమందు ఆశగలవారై మాట్లాడుతున్న గోపవధూటుల మాటలు ఉద్ధవుడు విన్నాడు. విని తీయటినుడులతో వారిని ఊరడిస్తూ ఇలా అన్నాడు.

మ. జప దాన వ్రతహోమసంయమ తపస్స్వాధ్యాయ ముఖ్యంబులన్
నిపుణుల్ గోరియు నే విభున్ మనముల న్నిల్పంగలే రట్టి స
ద్విపులాకారునిపై మహామహిముపై విశ్వేశుపై మీ కజ
స్ర పటుధ్యానము లిట్లు నిల్చెనె ! భవచ్చారిత్రముల్ చిత్రముల్.

* జపము, తపము, దానము, హోమము, ఆత్మనిగ్రహం, వేదాధ్యయనం మొదలగు వాటిచే, నేర్పరులైనవారు కూడ ఏ పరమేశ్వరుణ్ణి తమ మనసుల్లో ప్రయత్నించియూ నిలుపుకొనలేరో, అట్టి మహీయసుడూ, మహామహిమోపేతుడూ, జగదధీశ్వరుడూ అయిన శ్రీకృష్ణునిపై మీకు నిరంతరం దృఢమైన ధ్యానం ఈ విధంగా నెలకొన్నది గదా! ఔరా! మీ చరిత్రలు వింతగొలుపుతున్నవి.

క. నను మీ కడకుం గృష్ణుఁడు
పని పంపెడు వేళఁ బిలిచి పలికిన పలుకుల్
వినుఁ; డన్నియు వివరించెద
వనజేక్షణలార ! మీరు వగవకుఁ డింకన్. 1468

* తామరరేకులవంటికన్నులుగల గోపికలారా! శ్రీకృష్ణుడు నన్ను మీకడకు కార్యార్థంగా పంపేటప్పుడు నాతో చెప్పిన మాటలన్నీ మీకు వివరిస్తాను. వగపుమాని సావధానంగా ఆలకించండి.

వ. అని హరివచనంబులుగా నిట్లనియె. 1469

• అని ఉద్ధవుడు హరి చెప్పిన మాటలెల్ల వారి కిట్లు వినిపించాడు.

సీ. ఎల్లి కార్యములకు నేను బ్రధాన కా
రణము గావున మీకు రమణులార!
కలుగదు మద్వియోగము చరాచరరూప
ములలో మహాభూతములు వసించు
కరణి నుండుదు సర్వగతుఁడనై నే మనః
ప్రాణబుద్ధిగుణేంద్రియాశ్రయుండ
నాత్మయం దాత్మచే నాత్మఁ బుట్టింతు ర
క్షింతును ద్రుంతు హృషీకభూత

తే. గుణగణాకార మాత్మలోఁ గొమరు మిగులు
నిబిడమాయానుభవమున నిత్యశుద్ధ
మాత్మ విజ్ఞానమయమునై యమరు గుణముఁ
బ్రకృతికార్యమనోవృత్తిఁ బట్టి పొందు. 1470

• ఓ రమణీమణులారా! నేను సమస్త కార్యములకు ముఖ్య కారణమై ఉన్నాను. నా యెడబాటు మీకు కలుగదు. స్థావర జంగమాత్మకములైన సకలప్రాణులలో పృథివ్యప్తేజోవాయ్వాకాశము లనే పంచమహాభూతాలు ఉండే విధంగా నేను మనస్సునకు, పంచ ప్రాణాలకు, బుద్ధికి, ఇంద్రియవృత్తులైన శబ్దస్పర్శరూపరసగంధా లకు, జ్ఞానకర్మేంద్రియాలకు ఆధారభూతుడనై ఉన్నాను. నాయందే నా సంకల్పమహిమతో, నాలో సూక్ష్మరూపమున అణగియున్న చరా చర ప్రపంచాన్ని స్థూలరూపంతో సృజిస్తాను, రక్షిస్తాను, నశింప జేస్తాను.

స్వరూపముచేత నిర్మలుడు, జ్ఞానస్వరూపుడు అయిన జీవునకు ప్రపంచస్వరూపం సత్త్వాదిగుణములు లేదా భూతేంద్రియగుణాలతో కలుగుతున్నది.

మాయాకార్యములైన జాగ్రత్స్వప్నసుషుప్తులనే మనోవృత్తు లందు ఆతడు దేవమనుష్యాదిరూపాలతో తోచుచున్నాడు.

చ. కలఁగని లేచి మున్ను గలఁగన్న సమస్తవిధంబుఁ గల్లఁగాఁ
దలఁచిన భంగి మానసపదార్థముచే నిఖిలేంద్రియార్థముల్
బలమునఁ గట్టి తజ్ఞుడు ప్రపంచము లేదనుఁ దన్మనంబుఁ దా
రలయక కట్టుడున్ బుధుల కవ్వల నొండొక భేద మున్నదే? 1471

* నిదురించి మేలుకొన్నవాడు తాను స్వప్నంలో చూచిన దెల్ల అసత్యమని భావించినట్లు తత్త్వవేత్త మననమనే పదార్థంతో శబ్ద స్పర్శాది సకలవిషయాలను దృఢంగా నిరోధించి తనకన్న భిన్నంగా ప్రపంచం లేదని చెపుతాడు. ఆ మనస్సును పండితులు వేసటచెందక అరికట్టిగా అటుపై భేదభావం పొడసూపదు.

ఆ. సాంఖ్య యోగ నిగమ సత్య తపో దమ
ములు మనోనిరోధములు గడపలఁ
గాఁగ నుండు జలధి కడపలగాఁ గల
నదులభంగి నళిననయనలార! 1472

* కమలములవంటి కన్నులుగల గోపికలారా! నదులన్నియు కదలిపోయి కడకు కడలిని చేరునట్లు ఆత్మానాత్మవిచారరూపమైన సాంఖ్యము, యమనియమాదికమైన అష్టాంగయోగము, వేదము, సత్యము, తపము ఇంద్రియనిగ్రహమైన దమము ఇవన్నీ ఒక్క మనోనిగ్రహమందే పరిసమాప్తి చెందుతున్నాయి.

మ. చెలువల్ దవ్వులనున్న వల్లభులపైఁ జిత్తంబులం గూర్తు రు
త్కలికం జేరువవారికంటె నదియుంగా నెప్పుడున్ నన్ను మీ
రలు చింతించుచు నుండఁగోరి యిటు దూరస్థత్వముం బొందితిన్
దలఁకంబోలదు నన్నుఁ గూడెదరు నిత్యధ్యానపారీణలై. 1473

● స్త్రీలు సమీపంలో ఉన్నవారికన్నా దూరంలో ఉన్న ప్రియులపట్ల తహతహపాటుతో చిత్తములందు అనురక్తి కలవారై ఉంటారు. అంతేకాక, మీ రెల్లప్పుడు నన్నే స్మరిస్తూ ఉండాలి అని మీకు దూరంలో ఉన్నాను. భయపడకండి. నిరంతరధ్యాన పారంగతలై మీరు నన్నే పొందగలరు.

వ. అని మీకుం జెప్పుమని కృష్ణుండు సెప్పె నవవుడు మధ్భవునికిం గోపికలు సంతసించి యిట్లనిరి. **1474**

* అని మీకు చెప్పుమని శ్రీకృష్ణుడు నాకు చెప్పిపంపినాడు అని ఉద్ధవు డన్నాడు. ఆ పలుకులు విని గోపికలు సంతోషించి ఆయనతో ఇలా అన్నారు.

ఉ. ఇమ్ములనున్నవాఁడె హరి? యిక్కడి కెన్నఁడు వచ్చు? వచ్చి మా
యుమ్మలికంబు వాపునె? ప్రియుం డిట వచ్చెదనన్న సైఁతురే
య మ్మథురాపురీరమణు లడ్డము వత్తురుగాక చెల్ల రే!
మమ్ము విధాత నిర్దయుఁడు మన్మథవేదనపాలు సేసెనే! **1475**

● శ్రీకృష్ణుడు సుఖంగా ఉన్నాడా? ఆయన ఇక్కడి కెప్పుడు వస్తాడు? వచ్చి మా పరితాపం తీరుస్తాడా? మా ప్రాణేశ్వరు డిచటికి వస్తానంటే ఆ మథురాపట్టణంలోని అతివలు అడ్డగిస్తారే గాని సహిస్తారా?

అయ్యయ్యో! దయమాలిన బ్రహ్మ మమ్ము మన్మథబాధలకు గురిచేశాడు గదా!

చ. మఱచునొకో మదిం దలఁచి మాధవుఁ డా యమునాతటంబునం
దఱచుగ దివ్యసౌరభ లతా గృహపీఠముల నేము డాఁగఁగా
మఱువులమండి నీడలకు మమ్మెలయించి కలంచి దేహముల్
మఱచినఁ దేర్చి నూల్కొలిపి మన్మథలీలలఁ దేల్చుచందముల్.

• లక్ష్మీవల్లభుడగు శ్రీకృష్ణుడు యమునానది యొడ్డున దివ్యపరిమళాలు వెదజల్లు పూ పొదరిండ్లలో దాగిన మమ్ము పొంచి చూచేవాడు. అతడు పొదరిండ్ల నీడలకు మమ్ము జేర్చి నలచి కలచి మేము మైమరపు చెందగా బుజ్జగించి ప్రోత్సహించి మమ్ము మన్మథ క్రీడలలో తేల్చిన ఘట్టాలు మరచునా యేమి?

శా. నీతో నర్మగృహంబులం బలుకునే నే మెల్ల వంశోల్లన
ద్గీతభ్రాంతలమై కళిందతనయా తీరంబునం జేరినం
జేతోజాతసుఖంబులం దనిపి మా చిత్తస్థితుల్ చూడ లీ
లాతంత్రజ్ఞత డాఁగి మెల్లన మదాలాపంబు లాలించుటల్. 1477

• మే మందరం వేణుగానవిభ్రాంతలమై యమునాతీరానికి రాగా మమ్ము మదనలీలలలో తనిపినాడు. ఆ పై మా మనోగతులు తెలుసుకోడానికి విలాసతంత్రజ్ఞుడు కనుక ఎచ్చటనేని దాగియుండి మెల్లగా మా మాట లాలించేవాడు. శ్రీకృష్ణుడు నీతో ఏకాంతంలో ఈ వృత్తాంత మంతా చెపుతాడా?

క. ముచ్చట వేళలఁ జెప్పునె
యచ్చగ మును నేము నోమునప్పుడు జలముల్
చొచ్చిన మా చేలంబులు
మ్రుచ్చిలి యిచ్చిన విధంబు మూలం బెల్లన్. 1478

* శ్రీకృష్ణుడు నీతో ముచ్చటాడు వేళలో కాత్యాయనీవ్రతం కావించుటకు మేము వివస్త్రలమై స్నానార్థం నీళ్ళలో ప్రవేశించి యున్నపుడు మా వలువలు దొంగలించి మళ్లీ మా ప్రార్థనలపై చీర లిచ్చిన ఉదంతము తెలుపునా?

శా. ఏకాంతంబున నీదుపై నొరగి తా నేమేని భాషించుచో
మాకాంతుండు వచించునే రవిసుతామధ్యప్రదేశంబునన్
రాకాచంద్రమయూఖముల్ మెఱయఁగా రాసంబు మాతోడ నం
గీకారంబు నొనరించి బంధనియతిం గ్రీడించు విన్నాణముల్. 1479

* నీవును హరియు ఒంటరిగా నున్నప్పుడు నీ మీదికి ఒరగి నీతో ఏవో రహస్య సంభాషణములు సలుపునపుడు పున్నమ వెన్నెల రేయి యమునానదీ మధ్యభాగంలో మాతో రాసక్రీడలు నెరపుతూ బంధరతు లొనర్చిన నేర్పులు అతడు ఉగ్గడిస్తాడా?

సీ. తమఁబాసి యొక్కింతతడవైన నిటమీఁద
 నేలపై మేనులు నిలువ వనుము
నేలపై మేనులు నిలువక యుటమున్న
 ధైర్యంబు లొక్కటఁ దలఁగు ననుము
ధైర్యంబు లొక్కటఁ దలఁగినపిమ్మటఁ
 జిత్తంబు లిక్కడఁ జిక్క వనుము
చిత్తంబు లిక్కడఁ జిక్కక వచ్చినఁ
 బ్రాణంబు లుండక పాయు ననుము

తే. ప్రాణములువోవ మఱి వచ్చి ప్రాణవిభుఁడు
ప్రాతిరక్షకుఁ డగు తమ్మఁ బ్రాణు లెల్లఁ
జేరి దూఱంగ మఱి యేమి సేయువాఁడు
వేగ విన్నప మొనరింపవే మహాత్మ ॥ 1480

* ఓ మహానుభావా! ఉద్ధవా! మా మాటలుగా ప్రాణేశ్వరుని కిట్లు విన్నవించుము.

తన్ను విడిచి యిటుమీద ఇంచుకసేపైన మా దేహములు ఉర్విపై ఉండవని చెప్పుము. నేలపై మా శరీరములు నిలువకమునుపే ఒక్కసారిగా మా మనోధైర్యములు తొలగిపోవునని చెప్పుము. మా మనోధైర్యము లొక్కసారిగా తొలగిపోయిన పిదప మా మనసు లిక్కడ ఉండవని చెప్పుము. ఇక్కడ మనసులు నిలువకపోగా మా ప్రాణములు ఎగిరిపోవునని చెప్పుము. మా ప్రాణములు ఎగిరిపోయిన పిమ్మట ప్రాణేశ్వరుడగు తాను వచ్చిననూ, జీవరక్షకుడగు తన్ను జీవు లందరూ గుమిగూడి నిందింపగా ఏమి చేయగలడు ? నీ వీ సంగతి వెంటనే అతనికి విజ్ఞప్తిచేయుము.

క. తగులరె మగలను మగువలు?
దగులదె తను మున్న కమల! తగవు విడిచియుం
దగిలిన మగువల విడుచుట
దగదని తనుఁ దగవువలుకఁ దగుదువు హరికిన్. 1481

● పొలతులు పురుషులను ప్రేమించరా? లక్ష్మి మునుపు తన్ను ప్రేమించలేదా? న్యాయము వీడియు మించిన ప్రేమించు బోదులను వీడుట తగదను న్యాయమును దామోదరునకు తెల్పుటకు నీవే తగినవాడవు.

సీ. విభుఁడు మా వ్రేపల్లె వీథుల నేతేరఁ
జూతుమే యొకనాఁడు చూడ్కు లలరఁ
బ్రభుఁడు మాతో నర్మభాషలు భాషింప
విందుమే యొకనాఁడు వీను లలరఁ
దనువులు పులకింప దయితుండు డాసినఁ
గలుగునే యొకనాఁడు కౌఁగిలింపఁ?
బ్రాణేశ! మమ్మేల పాసితి వని దూఱ
దొరకునే యొకనాఁడు తొట్రుపడఁగ?

తే. వచ్చునే హరి మే ముండు వనముఁ జూడఁ?
దలఁచునే భర్త మాతోడితగులు తెఱఁగుఁ?
దెచ్చునే విధి మన్నాథుఁ దిట్టువడక
యెఱుఁగఁ బలుకు మహాత్మ! నీ కెఱుఁగ వచ్చు. 1482

* మా ప్రియతముడు వ్రేపల్లెవీథులకు రాగా ఒకనాడైనను కనులపండువుగా మేము కనగల్గుదుమా? మా ప్రభువు మాతో ప్రియభాషణములు భాషించగా ఒకనాడైనను వీనులవిందుగా వినగల్గుదుమా? వల్లభుడు చెంతకురాగా ఒకనాడైనను ఒడలు గగుర్పొడువ కౌగిలించుకొను భాగ్యము మాకు కల్గునా? ఓ ప్రాణనాయకా! మమ్మెందులకు ఎడబాసితి వని తొట్రుపడ తన్ను దూషించుటకొకనాడైనను అవకాశ మేర్పడునా?

హరి యేనాటికైనను మే మున్న ఈ వనము గనవచ్చునా? మా మనోవల్లభుడగు శ్రీకృష్ణుడు తనకు మాతో గల సంబంధమును స్మరించునా? మాచే తిట్లుపడకముందే బ్రహ్మ మా నాథుని మాకడకు గొనితెచ్చునా? ఓ మహాత్మా! ఇన్నియు నీకు తెలిసియుండును గాన మాకు వివరముగా తెలుపుము.

వ. అని 'దుఃఖార్ణవమగ్నంబైన గోకులంబు నుద్ధరింపుము రమానాథ' యని గోపికలు వగచి తదనంతరంబ మఱియు నుద్ధవ నిగదితం బయిన కృష్ణసందేశంబులవలన విరహవేదనలు విడిచి యుద్ధవునిం బూజించి; రిట్లు కృష్ణలీలావర్ణనలు సేయుచు వ్రేపల్లె నుద్ధవుండు గొన్నినెల లుండి నందాదుల వీడ్కొని మరలి రథారూఢుండై చని చని. 1183

• రమాపతీ! దుఃఖ మనెడు సముద్రములో మునిగినట్టి గోకులాన్ని ఉద్ధరింపుమా అనుచు ఉద్ధవునిముందు గోపికలు శోకించారు. అటు పిమ్మట ఉద్ధవుడు తెల్పిన శ్రీకృష్ణసందేశం ఆలకించి వారు విరహవేదనలు విడిచి అతణ్ణి పూజించారు.

ఇలా శ్రీకృష్ణలీలలు వర్ణిస్తూ ఉద్ధవుడు కొన్ని మాసాలు వ్రేపల్లెలో గడపినాడు. పిదప నందాది యదుపుంగవులను వీడ్కొని రథముపై నెక్కి మథురకు బయలుదేరి వెళ్లాడు.

క. సారమతిఁ బ్రణుతి సేయుచు
నారయ నుద్ధవుఁడు గాంచె నఘసంహారిన్
హారిన్ మథురానగర వి
హారిన్ రిపుజన మదాపహారిన్ శౌరిన్. 1484

• ఆ విధంగా స్థిరచిత్తంతో శ్రీహరిసంకీర్తనం కావిస్తూ వెళ్లిన ఉద్ధవుడు పాపాలను పోకార్చేవాడు, శత్రుజనుల మదము నణచేవాడు, మథురాపురిలో విహరించేవాడు అయిన శ్రీకృష్ణభగవాణ్ణి చూచాడు.

వ. కని యథోచితంబుగా భాషించుచుఁ దనచేత నందాదులు పుత్తెంచిన కానికలు బలకృష్ణులకు నుగ్రసేనునికి వేఱు వేఱ యిచ్చె నని చెప్పి శుకుండు పరీక్షిన్నరేంద్రున కిట్లనియె. 1485

• చూచి ఉద్ధవుడు అతనితో తగురీతి మాట్లాడుతూ తనచే నందుడు మున్నగువారు ఇచ్చిపంపిన బహుమానాలు కృష్ణబలరాములకు, ఉగ్రసేన మహారాజుకు వేర్వేరుగా సమర్పించాడు అని పల్కి శుకయోగీంద్రుడు మళ్లీ పరీక్షిన్నరేంద్రునితో ఈ విధంగా అన్నాడు.

శ్రీకృష్ణుఁడు ఉద్ధవునితోఁ జేరుకొని కుబ్జాగృహంబునకు వచ్చుట

మ. తను మున్నంగజకేళిఁ గోరిన లతాతన్విన్ రతిక్రీడలం
దనుపం గోరి జనార్దనుం డరిగె రత్నస్వర్ణమాల్యాను లే
పన భూషాంబర ధూపదీప పరిదీప్తంబై మనోజ ప్రదీ
పనమై యున్న తదీయ గేహమునకుం బంచేషుపంచేషుఁడై. 1486

• మన్మథమన్మథుడైన శ్రీకృష్ణుడు పూర్వం తన్ను మన్మథక్రీడకై ఆహ్వానించిన ఆ కుబ్జాలతాంగిని శృంగారకేళిలో తృప్తి నొందింప దలచి ఆ వాల్గంటి ఇంటికి వెళ్ళినాడు. ఆ సుందరి మందిరము మణులు, బంగారము, పూలదండలు, మంచిగంధపుమైపూతలు, నగలు, వస్త్రములు ధూపములు — వీటితో విలసిల్లుతూ మన్మథోద్దీపన కరంగా ఉన్నది.

వ. ఇట్లరిగి తద్గేహమధ్యంబున. 1487

ఆ. కాముశరమువోలెఁ గమలారి కళవోలెఁ
మెలఁగి యాడనేర్చు మెఱుపుఁబోలె
నిఖిలభువనమోహినీదేవతయుఁ బోలెఁ
జెలువు మెఱసియున్న చెలువఁ గనియె. 1488

● ఈ విధంగా వెళ్ళిన గోవిందుడు యింటి నడిమిభాగంలో అందచందాలతో అలరారుతున్న కుబ్జను చూచాడు. ఆమె మన్మథ బాణంలాగా, చంద్రకళ మాదిరిగా కదలాడు మెరుపుదీవవలె, సకల జగత్తులనూ సమ్మోహపరచే దేవతరీతిగా వెలిగిపోతూ ఉంది.

మ. హరి యేతెంచిన లేచి సంభ్రమముతో నాళీసమూహంబుచే
సిరి యొప్పన్ విహితోపచారములు దాఁ జేయించి సౌవర్ణ మం
దరతల్పస్థితుఁ జేసి యుద్ధవుని నుద్యత్ప్రీతిఁ బూజించి తా
నురపీఠంబున నుండు మంచు మది నౌత్సుక్యంబు శోభిల్లఁగన్.

* శ్రీకృష్ణుడు రాగానే ఆమె సంభ్రమంతో దిగ్గున లేచింది. చెలికత్తెలచే తగురీతి వైభవోపేతంగా ఉపచారాలు చేయించింది. అందమైన మేల్మిపసిడిమంచం మీద ఆయనను కూర్చొపెట్టింది. ఉద్ధవుణ్ణి మిక్కిలిప్రీతితో పూజించి ప్రకాశించే పీఠంమీద కూర్చోమని చెప్పింది. ఆమె మది ఉబలాటంతో ఉవ్విళ్లూరింది.

క. ఆళీనివహ నివేదిత
మాలా మృగనాభిపంక మణిమయభూషా
చేలాలంకృత యగుచును
హేలావతి గోరె వనరుహేక్షణుఁ గవయన్. 1490

● చెలికత్తెలు ఆమెను పూలదండలతో, కస్తూరిలేపనంతో, మణులు చెక్కిననగలతో, విలువైన వలువలతో అలంకరించారు. విలాసవతియైన కుబ్జ తామరరేకులవంటి కన్నులుగల శ్రీకృష్ణునితో సంగమింప దలచింది.

క. లీలావతీకృతోల్లస
దేలా కర్పూరమిళిత హిత మధుర మహా
హాలారసపాన మద
శ్రీలాలిత యగుచు నబల చేరెం గృష్ణున్. 1491

● ఏలకులు, పచ్చకర్పూరము కలిపి విలాసవతులు తయారు చేసిన హితమైన, తియ్యనైన ఆసవము సేవించి మైమరచి చెలువు గులుకు కలువకంటి కుబ్జ కృష్ణుణ్ణి సమీపించింది.

మ. పరసాలోకనవృష్టి పైఁగురియుచున్ సమ్యగ్వచోవైఖరిం
గరఁగంజేసి సువర్ణకంకణసమగ్రం బైన సైరంధ్రి కే
కరపద్మంబునఁ బట్టి తల్పమున కాకర్షించి గంభీరతం
బరిరంభాదుల నాసపుచ్చి మరుసంభావించుచున్ వేడుకన్. 1492

● శ్రీకృష్ణుడు శృంగారరసం వెల్లివిరిసే చూపులసోన కుబ్జపై క్రుమ్మరిస్తూ సరసపుమాటతో ఆమె హృదయాన్ని కరగించాడు. పద్మమువంటి తనచేతితో కనకకంకణభూషితమైన ఆమె చేతిని పట్టుకొని సెజ్జమీదికి లాగ్చినాడు. గట్టిగా కౌగిలించుకున్నాడు. సిగ్గువల్ల కలిగిన జంకుగొంకులు మాన్పినాడు. కామకేళికి ఉత్సహించాడు.

చ. జాతియుఁ గాలముం గళయు సత్త్వము దేశము భావచేష్టలున్
ధాతువుఁ బ్రాయముం గుణముఁ దద్దశయున్ హృదయంబుఁ
జూడ్కియుం
బ్రీతివిశేషముం దెలిసి పెక్కువిధంబులఁ దొయ్యలిన్ మనో
జాతసుఖంబులం దనిపె శౌరి వధూహృదయాపహారియై. 1493

● చెలువల చిత్తములను హరించే శ్రీకృష్ణుడు జాతి, కాలము, కళ, బలము, దేశము, భావము, చేష్ట, ధాతువు, ప్రాయము, గుణము, దశ, హృదయము, దృష్టి, సంతుష్టి ఇన్నిటి నెరిగి అనేక విధముల ఆ సైరంధ్రిని మన్మథసౌఖ్యాలలో ఓలలాడించి తృప్తి పరచాడు.

క. కరపద్మంబుల మాధవుఁ
గర మొప్పం గౌఁగిలించి కామానలముం
గరభోరువు వర్జించెను
గర మరు దని తోడిశీతకరముఖు లలరన్. 1494

* లక్ష్మీవల్లభుడైన ముకుందుని సులిమెత్తని తొడలుగల కుబ్జ తామరపూలవంటి తన చేతులతో గట్టిగా కౌగిలించుకుని మదన తాపాన్ని దిగవిడిచింది. చంద్రబింబమువంటి మోములుగల ఆమె చెలు లందరూ ఇది అపూర్వమైన అదృష్టమని భావించారు.

మ. సనకాదుల్ తలపోసి కానని విభున్ సర్వప్రభున్ దుర్లభున్
మను దా నిచ్చిన యంగరాగసుకృతామోదంబువం గూడియున్
ఘననిర్వాణవిభూతి యిమ్మనక యా కంజాక్షి 'యోఁ కాయఁజా
అ ననుం గొన్నిదినంబు లంగభవలీలం దెల్పవే ? నావుడున్. 1485

● దేవర్షులైన సనకసనందనాదు లెంత ధ్యానించినను అతడు దర్శింపరాని ప్రభువు. అఖిలలోకములకు అధీశ్వరుడు, దుర్లభుడు. అట్టి పరమాత్ముని కమలములవంటి కన్నులుగల కుబ్జ పూర్వం తాను సమర్పించిన మైపూతలవల్ల సమకూడిన పుణ్యవాసనచేత కలియ గల్గింది. తనకు గొప్పదగు కైవల్యసంపదను ఇమ్మని అడుగక 'కృష్ణా, నీ పొందు విడిచి ఉండలేను. నన్ను కొన్నాళ్ళు మన్మథలీలలలో తేల్చు' మని వాంఛించింది.

ఆ. వనిత గోరుకొనిన వరమిచ్చి శౌరి యా
యుద్ధవుండుఁ దాను నువిదయిల్లు
వెడలె నపుడు తియ్యవిలుకాఁడు సురభితోఁ
దీఁగెయిల్లు వెడలు తెఱఁగు మెఱయ. 1485

● మాధవుడు ఆమె కోరుకున్న వరం అనుగ్రహించాడు. మదనుడు వసంతునితో పొదరింటినుండి వెలువడే చందంగా శ్రీ కృష్ణుడు ఉద్ధవునితో కుబ్జాగృహంనుంచి బయలుదేరినాడు.

క. ఏ వేదంబులుఁ గానని
దేవోత్తముఁ గాంచి ముక్తితెరు వడుగక రా
జీవేక్షణ రతి యడిగెను
భావింపఁ దదీయకర్మఫల మెట్టిదియో ! 1486

* పద్మములవంటి నయనములు గల కుబ్జ వేదములకు గూడ అందరాని దేవతాశిరోమణియైన శ్రీకృష్ణుని సందర్శించి కూడా మోక్షపదవి నడుగక తుచ్ఛమైన విషయసుఖం అపేక్షించింది. ఆలోచింపగా ఆమె కర్మఫల మెటువంటిదో కదా!

క. కారుణ్యంబునఁ గృష్ణుఁడు
తారుణ్యము మెఱసి మదనతంత్రంబుల లీ
లారణ్యవీథి దేల్చెను
సైరంధ్రిన్ విభవవిజిత శక్రపురంధ్రిన్. 1498

* సౌభాగ్యమునందు శచీదేవిని సైతము జయించిన కుబ్జను దయతో శ్రీకృష్ణుడు జవ్వన మతిశయిల్లగా మదనశాస్త్రవిధుల ననుసరించి శృంగారవిలాసములనే వనవీథులలో విహరింప జేసి తృప్తి నొందించాడు.

వ. తదనంతరంబ కృష్ణం డుద్ధవరామసహితుండై హస్తినాపురము నకు నక్రూరునిం బనుపం దలంచి తద్గృహంబునకుఁ జనిన నతండు వారలం గని లేచి రామకృష్ణులకు నమస్కరించి యుద్ధవుం గౌఁగి లించుకొని వారి నందఱ యథావిధిం బూజించి హరిపాదంబులు దన తొడలమీఁద నిడుకొని యిట్లనియె. 1499

• అటు పిమ్మట కృష్ణుడు హస్తినాపురికి అక్రూరుని పంప నెంచినవాడై బలరామునితో, ఉద్ధవునితో గూడి అతని యింటికి వెళ్ళినాడు. అక్రూరుడు వారిని చూడగనే లేచి బలరామకృష్ణులకు వందనం కావించినాడు. ఉద్ధవుణ్ణి కౌగిలించుకున్నాడు. ఆయన వారి నందరినీ తగురీతి పూజించాడు. అచ్యుతుని అడుగులు తన ఒడియం దుంచుకొని ఒత్తుతూ ఇట్లన్నాడు అక్రూరుడు.

క. అనుచరులఁ దామ గంసుఁడు
సనియెన్ నీచేత జముని సదనంబునకున్
ఘనులార! మీ బలంబున
నొనరఁగ యాదవులవంశ ముద్ధృత మయ్యెన్. 1500

• ఆర్యులారా! మీ శౌర్యంచేత కంసుడూ, వాని అను యాయులూ యమమందిరానికి వెళ్ళిపోయారు. యాదవకులం ఉద్ధరింపబడింది.

వ. మహాత్ములారా! విశ్వాదిపురుషులరు, విశ్వకారణులరు, విశ్వమయులరగు మీకుం గార్యకారణంబులు లే; వవధరింపుము. పరమేశ్వరా! నీవు రజోగుణంబున నఖిలంబు సృజియించి, కారణరూపంబునం దదనుప్రవిష్టుండవై, శ్రుతదృష్టకార్యరూప ప్రపంచాకారంబున దీపించుచుందువు. కార్యరూప చరాచర దేహంబులకుం గారణంబు అయిన భూప్రముఖంబు లనుగతంబులును, గార్యరూప దేహంబులు నయి ప్రకాశించు చందంబున నొక్కండవు, కారణరహితుండవు, నాత్మతంత్రుండవు నై యుండియు విశ్వాకారంబునం బెక్కగుదువు. సృష్టి స్థితి లయంబులం జేయుచుండియు విజ్ఞానమూర్తివగుటం బరిభ్రాంతుండైన జీవుని భంగి గుణకర్మబద్ధుండవు కావు. కావున సిద్ధంబు తన్నిమిత్తంబు బంధహేతువును సిద్ధింపదు.

• మహాత్ములారా! మీరు విశ్వమునకు ఆదిపురుషులు. విశ్వమునకు కారణభూతులు, విశ్వమయులు. కావున మీకు కార్యకారణములు లేవు. దేవా! చిత్తగించు. నీవు రజోగుణముచే సమస్తము సృష్టించి కారణరూపముతో దానియందు ప్రవేశిస్తావు. కార్యరూపమైన చరాచరశరీరాలకు కారణములైన పృథివ్యప్తేజోవాయ్వాకాశములు అనుగతములై కార్యరూపదేహములై తేజరిల్లు విధంగా కారణరహితుడవు, ఆత్మతంత్రుడవు అగు నీవు ఒక్కడవై ఉండికూడ విశ్వరూపంతో పెక్కుగా కన్పడుతావు. సృష్టి స్థితి లయములు నలుపుచుండియూ విజ్ఞానమూర్తి వగుటచేత నీవు పరిభ్రాంతులైన జీవునివలె గుణకర్మబద్ధుడవు కావు. అందుచే నీకు బంధహేతువుకూడ కల్గదు.

సీ. పరఁగ జీవునికైన బంధమోక్షము లంట
వంటునే పరతత్త్వమైన నిన్ను
నంటునే యీశ! దేహాద్యుపాధులు నని
ర్వచనీయములు గాన వరుస నీకు
జన్మంబు జన్మసంశ్రయభేదములు లేవు
కావున బంధమోక్షములు లేవు
గణుతింప నిన్నులూఖలబద్ధుఁ డనుటయు
నహిముక్తుఁ డనుటయు నస్మదీయ

ఆ. బాలబుద్ధి గాదె! పాషండముఖర మా
ర్గములచేత నీ జగద్ధితార్థ
మైన వేదమార్గ మడఁగిన వచ్చిన
నవతరించి నిలుపు దంబుజాక్ష! 1502

● పరమేశ్వరా! బంధమోక్షములు జీవునికూడ అంటవనగా జ్ఞానస్వరూపుడ వగు నిన్నంటునా? దేహాదులైన ఉపాధులు నిరూపించబడక పోవుటవల్ల నీకు జన్మముగాని, అందుకు కారణమైన అవిద్యకాని లేదు. ఆ కారణంవల్లనే నీకు బంధమోక్షములు లేవు. ఆలోచించగా నిన్ను రోటికి కట్టువడినవాడనీ, యమునాప్రవంతిలో కాళియవిముక్తుడనీ అనడం అవివేకంవల్లనే సుమా! నాస్తిక మార్గములచేత ప్రాచీనమగు వేదపథం అణగారిపోతున్న కాలాన జగము మేలుకొరకు నీవు అవతరించి ధర్మమును కాపాడుతావు.

క. ఆ నీవు ధరణిభారము
మానిచి రక్కసుల నెల్ల మర్దించుటకై
యానకదుందుభియింటను
మానుగ జన్మించితివి సమంచితకీర్తిన్. 1503

* నీవు భూభారం తొలగించి రక్కసుల నుక్కడంచుటకై వసుదేవు గృహమున కీర్తిశాలివై జన్మించావు.

మ. త్రిజగత్పావనపాదతోయములచే దీపించి వేదామర
ద్విజముఖ్యాకృతివైన నీవు కరుణన్ విచ్చేయుటం జేసి మా
నిజగేహంబులు ధన్యతం దనరెఁ బో! ని న్నార్యు లర్చింపఁగా
నజితత్వంబులు వారి కిత్తు వనుకంపాయత్త చిత్తుండవై. 1504

● ముల్లోకాలను పవిత్రీకరించు పాదజలముచే ప్రకాశిస్తూ దేవబ్రాహ్మణవేదాదిస్వరూపుడవైన నీవు కృపతో విచ్చేయడంవల్ల మా గృహాలు పావన మైనాయి. నిన్ను పెద్దలు పూజించగా కృపాధీనమనస్కుడవై వారికి జయశీల మనుగ్రహిస్తావు.

శా. ఏ పుణ్యాతిశయప్రభావమున నో యీ జన్మమం దిక్కడన్
నీ పాదంబులు గంటి ని న్నెఱిఁగితిన్ నీవుం గృపాళుండవై
నాపై నర్మిలిఁజేసి మాన్పఁ గదవే నానాధనాగార కాం
తాపుత్రాదులతోడి బంధనము భక్తవ్రాతచింతామణీ! 1505

* భక్తులపాలిటి చింతామణివైన శ్రీకృష్ణా! ఏ మహాపుణ్య మహిమవల్లనో ఈజన్మలో ఇక్కడ నీ చరణపద్మాలు దర్శించగల్గినాను. నిన్ను తెలుసుకొన గల్గినాను. నీవును దయాస్వభావుడవై నాయెడ నున్న ప్రేముడిచే నాకు గృహవిత్తదారసుతాదుల మీది మోహపాశమును తొలగించుము.

వ. అని పలికిన నగుచు నక్రూరునికి మాటలవలన సంసారసంబంధం బగు మోహంబును గీలుకొలుపుచు హరి యిట్లనియె. 1506

● అని అక్రూరుడువ చింపగా నవ్వుతూ తన వాక్కులచే సంసారసంబంధమగు వ్యామోహమును నెక్కొల్పుతూ శ్రీకృష్ణుడు ఆయనతో ఇ ట్లన్నాడు.

శ్రీకృష్ణుఁ డక్రూరుని హస్తినాపురంబునకుఁ బంపుట

క. బంధుండవు సద్యోహిత
సంధుండవు నాఁకు జనకుఁడవు కృపా
సింధుండ వెల్లగుణముల
నంధుండవు గావు ప్రోవ నర్హుఁడ వెందున్. 1507

● నీవు మాకు బాంధవుడవు. మేలు సమకూర్చువాడవు. నాకు పినతండ్రివి. దయకు సముద్రుడవు. గుణములచే గ్రుడ్డి వాడవు కావు. మమ్ము కాపాడుటకు సమర్థుడవు.

చ. కొలుతురు మర్త్యు లిష్టములు గోరి శిలామయదేవసంఘమున్
జలమయతీర్థసంఘమును సంతతము న్నటు వారు గొల్వఁగా
వల దనరాదుగాక భగవత్పదభక్తులరైన మీ క్రియన్
నొలయక దేవతీర్థములు చూచినయంతనె కోర్కు లిచ్చునే॥ 1508

● మానవులు కోరికలు పడయగోరి శిలానిర్మితములైన దేవతాప్రతిమలనూ, జలమయములైన గంగాదిపుణ్యతీర్థములనూ నిరంతరం సేవిస్తారు. వా రలా సేవిస్తుండగా వలదని వాకొనడం పాడిగాదు. కాని సత్యం పరికిస్తే భగవత్పాదభక్తులైన మీవలె దైవత విగ్రహారాధనము, పుణ్యతీర్థసేవనము దర్శనమాత్రముననే అభీప్సితార్థములు అనుగ్రహించలేవు.

వ. మహాత్మా! పరమభాగవతుండవైన నీవు మా కభీష్టంబుల నొనరింప నర్హుండవు; వినుము. పాండురాజు పరలోకగతుండైనఁ గుంతి సహితులయిన పాండవులు ధృతరాష్ట్రు శాసనంబున నేతెంచి కరిపురంబున నున్నవారఁట. నిజపుత్రమోహితుం డగు న య్యంధ నృపతి వారియందు సమత్వంబునం జరింపం డటుగావున. 1509

● మహాత్మా! భాగవతోత్తముడవైన నీవు మా కోరిక లీడేర్ప తగినవాడవు. ఆలకింపుము, పాండురాజు చనిపోగా తల్లియగు

కుంతితో పాండవులు ధృతరాష్ట్రుని ఆజ్ఞచే వచ్చేసి హస్తినాపురిలో ఉన్నారు. గ్రుడ్డిరాజగు అంబికేయుడు దుర్యోధనాదులైన తన కొడుకులయందలి వ్యామోహముతో కురుపాండవులయందు సమ బుద్ధిగల్గి మెలగుట లేదు.

క. వారలు బంధులు గావున
వారలకును మే లొనర్చి వా రలరంగా
వారింప వలయు దుస్థ్సితి
వారిజరిపువంశ! పొమ్ము వారిం జూడన్. 1510

● ఓ సోమకులావతంసమా! వారును వీరును చుట్టాలే గనుక ఇరుపక్షాలవారికిని మేలు చేకూర్చి వారూ వీరూ సంతోషించేటట్లు దుఃస్థితిని నివారించుటకై నీవు హస్తినలో వారిని చూడబొమ్ము.

వ. అని పలికి సంకర్షణోద్ధవసహితుండై హరి నిజగృహంబునకుం జనుటయు నక్రూరుండు కౌరవరాజధాని యగు కరిపురి కరిగి యందు ధృతరాష్ట్ర భీష్మ విదుర బాహ్లిక భారద్వాజ గౌతమ దుర్యోధన కర్ణాశ్వత్థామాదులం గుంతీసహితులైన పాండవులం దక్కిన బంధువులనుం గని యథోచితసత్కారంబుల నొంది తత్త ద్వర్తనంబు లెఱింగికొనుచుం గొన్ని దినంబు లుండ నొక్కనాఁడు విదురుండు విన నేకతంబున నక్రూరునికిఁ గుంతి యిట్లనియె. 1511

● అని పలికి ఉద్ధవ బలరామ సహితుడై శ్రీకృష్ణుడు తన భవనమునకు వెళ్లినాడు. అక్రూరుడు కురురాజధానియైన హస్తినా పురానికి పోయాడు. ధృతరాష్ట్రుడు, భీష్ముడు, విదురుడు, బాహ్లికుడు భరద్వాజుడు, గౌతముడు, దుర్యోధనుడు, కర్ణుడు, అశ్వత్థామ మున్నగువారినీ, కుంతితోగూడియున్న పాండవులనూ, తక్కంగల చుట్టాలనూ అచ్చట చూచి తగనసత్కారాలు పడసినాడు. అక్కడ వారి వారి వర్తనము లెట్టివో తెలిసికొంటూ కొన్ని దినా లున్నాడు.

అంత నొక్కనాడు విదురుడు మాత్రమే వినుచుండగా కుంతీదేవి అక్రూరునితో ఇట్లన్నది.

శా. అన్నా! తల్లులు దండ్రులున్ భగినులు న్నల్లుండ్రు మద్భ్రాతలున్
నిన్నుం బొమ్మనువేళ నే మనిరి? మా నెవ్వల్ విచారింతురే?
యున్నారా సుఖయుక్తులై? మృగి వృకవ్యూహంబులోనున్న రే
ఖ న్నే నిక్కడ నున్నదానఁ గుమనః కౌరవ్యమధ్యంబునన్. 1512

* అన్నా! తలిదండ్రులు, చెల్లెండ్రు, అల్లుండ్రు, మా తమ్ములు నిన్నిక్కడికి పంపేవేళ నీతో ఏమిచెప్పినారు? మాదుఃఖాలు వారు ఆలోచింతురా? వా రందరూ సుఖంగా ఉన్నారా? నే నిక్కడ దుర్బుద్ధులగు కౌరవుల నడుమ తోడేళ్ల గుంపులో ఆడుజింక ఉన్న విధంగా ఉన్నాను.

మ. కఱపించెన్ ఫణికోటిచే లతికలం గట్టించి గంగానదిన్
నెత్తఁ ద్రోపించె విషాన్వితాన్న మొసఁగెన్ నిద్రారతిం జెంది యే
మఱియుండం బొడిపించె నాయుధములన్ మత్పుత్త్రులం దేమియుం
గొఱగాఁ డీ ధృతరాష్ట్రసూనుఁడు మహాక్రూరుండు గార్యంబులన్. 1513

• ధృతరాష్ట్రుని కుమారుడైన దుర్యోధనుడు మిక్కిలిక్రూరుడు. నా బిడ్డలకు బొత్తిగా కొఱగానివాడు. వాడు నా పిల్లలను పాములచే కరపించాడు. తీగలచే కట్టించి గంగానదిలో త్రోయించాడు, విషాన్నము తినిపించాడు. ఏమరి నిద్రించేవేళ ఆయుధాలతో పొడిపించాడు.

మ. బలుఁడుం గృష్ణుఁడు నెన్నడైనఁ దమలో భాషించి మేనత్త బి
డ్డలకున్ మేలు దలంతురే? వగపులన్ డయ్యంగఁ బాలై రయో!
జలజాతాక్షుఁడు భక్తవత్సలుఁ డిలాచక్రంబు భాగించి యి
మ్ముల నిప్పించునె నా కుమారకులకున్ ముఖ్యప్రకారంబులన్. 1514

• బలరామకృష్ణులు ఎన్నడేని తమలో తాము భాషించుకొని మేనత్తబిడ్డల క్షేమము తలంతురా? పుండరీకాక్షుడగు శ్రీకృష్ణు

దుండ మేము దుఃఖములచే కృశింపవలసివచ్చెనా? భక్తవత్సలుడగు శ్రీహరి భూమిని సమభాగాలుగా భాగించి న్యాయప్రకారం నా పుత్రుల కిప్పించునా?

వ. అని పలికి, కృష్ణునిఁ జిత్తంబునఁ నిల్పి నమస్కరించి సంకీర్తనంబు చేసి, 'సర్వాత్మకః సర్వపాలకః పుండరీకాక్షః శరణాగతనైన నన్ను రక్షింపు మని ' వగచుచున్న కుంతికి నక్రూరుండు విదుర సమేతుండై ప్రియవచనంబుల దుఃఖోపశమనంబు సేసి వీడ్కొని బంధుమిత్రమధ్యంబున సుఖోపవిష్టుండై యున్న ధృతరాష్ట్రున కిట్లనియె. 1515

• అని పలికి శ్రీకృష్ణుని తన మనసులో నిల్పి నమస్కరించి సంకీర్తన కావించి ఓ కమలపత్రాక్షా! నీవు సర్వాత్మకుడవు. సర్వపాలకుడవు; ప్రపన్నురాలనగు నన్ను కాపాడవే యని దుఃఖిస్తున్న కుంతీదేవికి విదురునితోపాటు అక్రూరుడు ఇంపైన మాటలతో దుఃఖ శాంతి చేశాడు. ఆమెను వీడ్కొని బంధుమిత్రుల నడుమ సుఖముగ కూర్చుండియున్న ధృతరాష్ట్రుని జేరి అతనితో అక్రూరుడు ఇట్లు పలికినాడు.

అక్రూరుండు ధృతరాష్ట్రునితో హితోపదేశముగా సంభాషించుట

ఉ. నీ యనుజుండు పాండుధరణీవిభుఁ డీల్గిన నీవు భూమి ధ
ర్మాయుతబుద్ధి నేలుచుఁ బ్రజావళిఁ గాచుచు గౌరవంబుతోఁ
బాయక లోకులందు సమభావన చేసితివేనిఁ గీర్తియున్
శ్రేయము గల్గు వే జొకటి సేసిన దుర్గతిగల్గు భూవరా! 1516

* ధృతరాష్ట్ర మహారాజా! నీ తమ్ముడగు పాండుభూపతి మరణానంతరం నీవు పుడమికి ఒడయడవైనావు. ప్రజలను ధర్మబుద్ధితో పరిపాలిస్తూ, కాపాడుతూ, గౌరవంతో సమదృష్టితో వారిని చూచు

కొందువేని నీకు యశస్సు, క్షేమం లభిస్తాయి. ఇందుకు వ్యతిరే కంగా వర్తిస్తే దుర్గతి కలుగుతుంది.

సీ. అవనీశ! పాండవులందు నీ నందను
లందు సమానుండ వగుట బుద్ధి
యెవ్వనితోయోగ మిం దెవ్వనికి నిత్య
మంగనాగారపుత్త్రాదికముల
వలన నయ్యెడిదేమి? వసుమతి నొకజంతు
వుదయింప నొకజంతు వుక్కడంగు
నొకఁడు పుణ్యముఁ జెందు నొకఁడు పాపము నొందు
మీనజీవనభూత మిళిత జలము

ఆ. తత్తనూజు లెట్లు ద్రావుదు రట్లు మూ
ఢాత్ము విత్తమెల్ల నపహరింతు
రహితులైన కొడుకు లటమీఁద మనియైనఁ
జచ్చియైనఁ దండ్రిఁజూడఁ జనరు. 1517

* రాజా! పాండుకుమారులందును, నీ కుమారులయందును సమబుద్ధితో మెలంగుట నీకు మంచిది. ఏ యొక్కనికీ ఈ లోకమందు మరొక్కనితో ఉనికి శాశ్వతం కాదు. మరి పుత్రకళత్రగృహాదులవల్ల ఒరగునది ఏమున్నది? భూమిలో ఒకప్రాణి పుడుతూనే మరో ప్రాణి గిడుతుంది. ఒకడు పుణ్యం సంపాదించగా మరొకడు పాపం సంపాదిస్తాడు. తల్లిచేపకు జీవనమైన నీళ్లను దాని పిల్లలు త్రాగు విధంగా బుద్ధిహీనుడైన తండ్రి ధనమంతయూ అతని పుత్రులే శత్రువులై హరిస్తారు. అటుపై ఆ తండ్రీ చచ్చినా బ్రతికినా అతని విషయం వారు పట్టించుకోరు.

క. కావున మూఢాత్ముఁడవై
నీ వార్జించిన ధనంబు నీ పుత్త్రులు దు
ర్భావులు పుచ్చుకొనంగా
భూవర! నిందితుఁడ వగుదు భూనాకములన్. 1518

• కావున ఓ రాజా! నీవు అధర్మపరుడవై గడించిన విత్తమెల్ల దుర్బుద్ధులైన నీ కొడుకులు గైకొనగా భువియందును, దివియందును నిందలు పొందుకావు.

శా. నిందం బొందకుమయ్య! యీ తనువు దా నిద్రాకళాదృష్టమా
సందోహంబు విధంబు నిల్వదుసుమీ! జాత్యంధతం బొందియున్
మందప్రజ్ఞత లేల చేసెదవు సమ్యగ్ జ్ఞానచక్షుండవై
సందేహింపక యిమ్ము పాండవులకున్ సర్వంసహాభాగమున్. 1519

• ఈ శరీరం స్వప్న దృష్ట వస్తుసముదాయంవలె నిల్చునది కాదు. అనిత్యమైనది. నీవు పుట్టంధుడవైనను మందబుద్ధివి మాత్రము కావద్దు. జ్ఞాననేత్రుడవై సంశయము మాని పాండవులకు వారి భూభాగం ఇచ్చివేయి.

వ. అనిన ధృతరాష్ట్రుం డిట్లనియె. 1520

• అని అక్రూరుడు పలుకగా అతనికి ప్రతివచనంగా ధృతరాష్ట్రుడు ఇట్లన్నాడు.

సీ. నీమాట మంచిది నిశ్చయ మగునైన
నస్థిరంబయిన నా యంతరంగ
మందు నిల్వదు సుదామాచలస్ఫటిక శి
లాతలోద్యత తటిల్లతిక భంగి;
నమృతంబు నొందియు నానందితుఁడు గాని
నరుమాడ్కి నేను నానంద మొంద;
నీశ్వరాజ్ఞావిధ మెవ్వఁడు దప్పింప
నోపు విజ్ఞానియై యుండెనైన

ఆ. విశ్వమెల్లఁ జేసి విభజించి గుణముల
నెవ్వఁ డనుసరించె నెవ్వఁ డవని
భారమెల్లఁ బాయఁ బ్రభవించె దేవకి
కెవ్వఁ డాత్మతంత్రుఁ డీశ్వరుండు. 1521

వ. అట్టి కృష్ణునకు నమస్కరించెద; ఆ నందనందనుని దివ్యచిత్త మునంగల తెఱంగునం బ్రతుకంగలవార మని వీడ్కొలిపిన, వక్రూరుం డతని తలం పెఱింగి యిట్లనియె. నీ తలంపు గనుం గొంటి. నీ కిష్టంబగునట్లు వర్తింపుమని పలికి, మరల మథురకుం జనుదెంచి, తదీయవృత్తాంతంబు రామకృష్ణుల కెఱింగించె. 1522

• నీవు పల్కినమాట నిజమైనది. మంగళకరమైనది. ఐనను అది సుదామపర్వతమందలి స్ఫటికశిలాప్రదేశంలో ఉదయించి తళుక్కున మెఱసి అణగిపోయే మెరుపు మాదిరి నా మదిలో స్థిరంగా నిలువదు.

అమృతమును పొందియు ఆనందించని మరణశీలియగు మనుజునివలె నేనును ఆనంద మొందలేను. పరమేశ్వరసంకల్పము నెవడు తప్పించగలడు? ఎవడు జ్ఞానస్వరూపుడై యుండి ఈ విశ్వమును సృజించి అందులో ప్రవేశించి జీవులకు కర్మలను, వాటికి దగిన ఫలములను విభాగించి ఇచ్చుచున్నాడో, ఎవడు భూభారం మాన్పుటకు దేవకీదేవికి సుతుడై జన్మించినాడో, తనకు విహారతంత్రమైన సంసారచక్రభ్రమణానికి ఎవడు కారణమో అట్టి పరమ పురుషుడగు

శ్రీకృష్ణునకు వందనము లర్పిస్తున్నాను. ఆ మహామహుని దివ్యచిత్తమున నెట్లున్నదో అట్లే జరుగగలదు అని వీడ్కొలిపినాడు. అక్రూరుడు ధృతరాష్ట్రుని భావ మెరిగి ఇట్లన్నాడు.

'నీ యభిప్రాయము గ్రహించాను. నీ కేది ఇష్టమో అట్లే కావింపు' మని పలికి హస్తినాపురినుండి మరలి మథురకు చేరి ధృతరాష్ట్రునిచంద మంతయూ కృష్ణబలరాముల కెరిగించాడు.

వ. అంతః గంసభార్యలగు నస్తియుం బ్రాప్తియుం, విధవలయి, దుఃఖింపుచుం దమదండ్రి యయిన జరాసంధునికడకుం జని. 1523

• అంతట కంసునిభార్యలైన అస్తి, ప్రాప్తి అనేవారు విధవలై దుఃఖిస్తూ తమ తండ్రియైన జరాసంధుని దగ్గరకు వెళ్లారు.

జరాసంధుఁడు మథురాపట్టణముమీఁద దండెత్తివచ్చి కృష్ణునితో యుద్ధము చేయుట

శా. వాండ్రున్ వీండ్రును రాజులే యనుచు గర్వప్రౌఢితో యాదవుల్
వేండ్రంబైన బలంబుతో మథురకున్ వే వచ్చి నిష్కారణం
బాండ్రున్ బిడ్డలు బంధులున్ వగవఁ గంసాది క్షమానాథులన్
దండ్రీ! చంపిరి కృష్ణుచేత నిటు వైధవ్యంబు వచ్చెన్ జుమీ. 1524

* వారు తమ జనకునితో 'తండ్రీ! లోకంలోని వారూ, వీరూ రాజులేనా అని యాదవులు మిక్కిలి గర్వించి దుస్సహమైన సైన్యంతో వచ్చి మథురాపట్టణాన్ని ముట్టడించారు. భార్యలు, పిల్లలు, చుట్టాలు ఆక్రందిస్తుండగా కంసుడు మున్నగు భూపతులను వధించారు. ఈ విధంగా మాకు కృష్ణునివల్ల వైధవ్యం సంప్రాప్తించింది.

వ. అనిన విని, ప్రళయకాలానలంబు తెఱంగున మండిపడి శోకరోషం బులు బంధురంబులుగా జరాసంధుం డిట్లనియె. 1525

* అని వారిరువురు చెప్పగా జరాసంధుడు విని ప్రళయ కాలాగ్నివిధంగా మండిపడ్డాడు. శోకరోషములు మనమున పెన గొనగా ఇట్లన్నాడు.

శా. ఏమీ! కంసునిఁ గృష్ణుఁడే రణములో హింసించె నోచెల్లః నా
సామర్థ్యంబుఁ దలంపఁ డించుకయు మచ్చండప్రతాపావలో
ద్దామార్చుల్ వడి నేఁడు గాల్చు యదుసంతానాటవీవాటికన్
భూమిం గ్రుంగిన నింగిఁ బ్రాఁకిన మహాంభోరాశిలోఁ జొచ్చినన్.

* ఏమీ! కంసుణ్ణి సంగ్రామంలో శౌరి సంహరించాడా? ఔరా! అతడు నా సమర్థత ఒకించుకయు భావించడేమో! చెలరేగు

తున్న నా ప్రతాపాగ్నిజ్వాలలు యాదవసమూహ మనే అరణ్యమును నేడే దహించివేయగలవు. అతడు భూమిలో దాగునో, ఆకసమున కెగ్రబ్రాకునో, పారావారములో ప్రవేశించునో చూచెద గాక!

క. యాదవ విరహిత యగుఁ బో
మేదిని నాచేత నేఁడు మీఁదుమిగిలి సం
పాదితబలులై హరి రు
ద్రాదులు నింద్రాదు లెవ్వ రడ్డం బైనన్. 1527

• తమ తమ బలములతో హరిహరేంద్రాదు లెవరు అడ్డు పడెదరో అదియు కనుగొందు గాక! ఈ మహీమండల మంతయు నేడు నాచేత యాదవరహిత మగుగాక!

వ. అని పలికి, సమరసన్నాహ సంకులచిత్తంబునఁ గోపంబు దీపింప, సంగరభేరి వేయించి కదలి. 1528

* అని శపథంచేసి జరాసంధుడు కోపము జ్వలించగా యుద్ధ సమాయత్తచిత్తుడై సంగ్రామభేరి వేయించి కదలినాడు,

క. దక్షుండై యిరువదిమూఁ
డక్షౌహిణులైన బలము లనుగతములుగా
నాక్షణమ జరాసంధుఁడు
ప్రక్షోభముతోడ మథురపైఁ జనియె నృపా! 1529

* పరీక్షిన్మహారాజా! జరాసంధుడు దక్షుడై ఇరువది మూడు అక్షౌహిణుల సైన్యం తన్ను వెంబడించగా ఆ క్షణమే సరభసంగా యాదవరాజధానియైన మథురపైకి దాడివెడలినాడు.

క. గంధేభ తురగ రథ భట
బంధుర చరణోత్థితోగ్ర పాంసుపటల యో
గాంధీభూతములై దివి
మంథరగతి నడచె నపుడు మార్తాండహరుల్. 1530

* ఆ సమయంలో రథ గజతురగ పదాతుల పాదఘట్టనలచే ఎగసిన దుమ్మువల్ల కండ్లు కనిపించక సూర్యుని రథాశ్వములు గగన తలంలో మెల్లగా నడిచాయి.

అలా పోయి పోయి జరాసంధుని సేనలు మథురాపురం చేరి నాయి.

వ. ఇట్లు చని నిరంతర కిసలయ పత్ర కోరక కుసుమ ఫలభార వినమిత వృక్షవిలసిత మహోద్యానంబును, ఉద్యానవనభాగ వలమాన జలోన్నయన దారుయంత్రలతానిబద్ధ కలశ విముక్త సలిల ధారాశీకర పరంపరాసంపాదిత వర్షాకాలంబును; కాలకింకర సదృశ వీరభట రథ తురగ సామజానీక సంకులంబును, గుణాచార ధర్మ ప్రవీర పౌరజన భాసురంబును, సురాభేద్యమాన మహోన్నతాట్టాలక యంత్ర భయంకర ప్రాకారచక్రంబును, చక్ర సారస హంసాది కలకలరవ కలిత సరోవరంబును, సరోవర సంఫుల్ల హల్లక కమల పరిమళమిళిత పవన విరాజితంబును, జితానేక మండలేశ్వరభూషణ మణిగణ రజోనివారిత మదగజేంద్ర దానజలప్రభూత పంకంబును, బంకరహిత యాదవేంద్రదత్త సువర్ణాచల కల్పతరు కామధేను సమ్మర్ధిత విద్వజ్జననికేతనంబును, కేతన సన్నిబద్ధ చామరమయూర చాప శింజినీనినద పరిపూతాభ్రంబును, నభ్రంలిహ మహాప్రాసాద సౌధ గవాక్షరంధ్ర నిర్గత ఘనసార ధూమధూమపటల విలోకన సంజనిత జలధరభ్రాంతి విభ్రాంత శిఖండితాండవ రుచిరంబును జిరతరానేక దేవాలయ ఘోష్యమాణ తూర్యనినద పరిభావిత పారావారకల్లోల ఘోషంబును, ఘోషకామినీప్రాణవల్లభ బాహు దండపరిరక్షితంబునునై, పరులకు నలక్షితంబైన మథురానగరంబు చేరి, వేలాలంఘనంబు చేసి, వెల్లివిరిసిన మహార్ణవంబు తెఱంగున పట్టణంబునకు ముట్టడంబుచేసి, చుట్టును విడిసిన జరాసంధుని బలౌఘంబు గని, వేళావిదుండగు హరి తన మనంబున.

• ఆ విధంగా పోయి పోయి జరాసంధుని సేనలు మథురా పురం చేరినాయి. ఆ మథురాపట్టణం దట్టమైన చిగురుటాకులతో, ఆకులతో, మొగ్గలతో, పూలతో, పండ్లబరువుతో వినమ్రములైన చెట్లతో చెలువారు ఉద్యానవనాలు కలిగి ఉంది. ఆ ఉద్యానవన భాగాలలో నీటిని పైకితెచ్చే దారుయంత్రాలు గిర్రున తిరుగుతూ, వాటికి బిగించబడిన గిండిగల నుంచి నీటిని పైకి ఎగజిమ్ముతుండగా ఆ నీటితుంపరలు పట్టణంలో కృత్రిమవర్షాకాలాన్ని సృష్టిస్తున్నాయి.

యమకింకరులతో సమానులైన వీరభటులతో, రథగజతురంగాలతో నగరం సంకులంగా ఉంది. కులాచారములుగల ధర్మవీరులైన పౌరులతో పట్టణం పరిఢవిల్లుతున్నది. ఆ మథురాపురం దేవతలకైనను ఛేదించరాని మిక్కిలి ఎత్తైన కోటబురుజులందలి శిలాప్రక్షేపణ యంత్రాలతో గూడి వెఱపు పుట్టించు ప్రాకారాలు కలిగి ఉంది,

జక్కవపిట్టలు, బెగ్గురుపక్షులు, హంసలు మొదలగు విహంగముల కిలకిలారావములతో నిండిన సరస్సులతో ఆ నగరం అందగిస్తున్నది. సరస్సులలో వికసించిన కలువలు, కమలాలు-వీటి పరిమళాలతో మేళవించిన వాయువులతో ఆ ప్రోలు పొలుపారుతున్నది.

నిర్జితులైన రాజుల మణిభూషణాల రాయిడిచే రాలిన పొడి వల్ల పట్టణంలో మదగజముల దానధారలతో ఏర్పడిన పంకములు అణగిపోయాయి. పాపరహితులైన యదుప్రముఖులచేత ఈయబడిన కనకాచల, కల్పవృక్ష, కామధేనువులతో క్రిక్కిరిసిన మథురలోని పండితుల యిండ్లు ప్రకాశిస్తున్నాయి.

మథురానగర గగనతలం టెక్కములకు కట్టబడిన వింజామరలు, నెమలిసిగలు గల విండ్లయొక్క అల్లెత్రాటిమ్రోతలతో ఆవరింపబడింది. (అర్థం చింత్యము)

ఆకసము నంటియున్న రాజభవనాల, సౌధాల గవాక్షరంధ్రాల నుంచి వెలువడుతున్న కర్పూరధూపధూమాలను చూచి అవి మబ్బుల గుంపు లని భ్రమించి నెమిళ్ళు పురిలో మనోహరంగా నృత్యం చేస్తున్నాయి.

ఆ పట్టణంలో చిరకాలంగా దేవాలయములందు మ్రోగింపబడు తున్న మంగళవాద్యధ్వనులు సముద్రతరంగఘోషను తిరస్క రిస్తున్నాయి.

యాదవభామినుల ప్రాణపతులయొక్క బాహుదండములచే కాపాడబడుతూ అన్యులకు తేరిపారజూడ శక్యముగాని ఆ మథురా నగరం చేరి చెలియలికట్ట నతిక్రమించి పొంగివచ్చే మహాసముద్రం వలె పట్టణమును ముట్టడించి చుట్టూ విడిసియున్న జరాసంధుని సైనిక శిబిరాలను జూచి సమయజ్ఞుడైన శ్రీహరి తన మనసులో ఇట్లాలోచించాడు.

మ. ఇదున్నాలుగు నాలు రెండు నిరు మూఁ డక్షౌహిణుల్ సుట్టి సం
ఛాదించెన్ బుర మెల్ల మాగధునెడన్ సామంబు దానంబు సం
భేదంబున్ బనిలేదు దండవిధి శౌర్యోద్ధతిం బ్రయోగించి యీ
భూదేవీతనుభార మెల్ల నుడుపన్ బోలున్ జయోద్యోగినై. 1532

● ఇరవైమూ డక్షౌహిణులసేన పట్టణాన్ని చుట్టి ముట్టడించి ఉంది. జరాసంధునిపట్ల సామదానభేదాలు అనే ఉపాయాలు నిరుప యోగాలు. కాబట్టి నాల్గవదైన దండోపాయం ప్రయోగించి జయంతో వెలుగొందుతూ భూభారం తొలగించాలి.

క. ఏ నవతరించు టెల్లను
మానుగఁ జతురంతధరణి మండలభరమున్
మానుపుకొఱకుం గాదే
పూనెద నిది మొదలు దగిలి భూభర మడఁపన్. 1533

● నేను అవతరించుట నాల్గుచెరుగుల నేలబరువు నివారించుట కొరకే గనుక నేటినుంచి భూభారం హరించుటకు ఉద్యమిస్తాను.

ఆ. మగధనాథుఁ బోర మడియింపఁ బోలదు
మడియకున్న వీఁడు మరలి మరలి
బలముగూర్చికొంచుఁ బఱతెంచుఁ బఱతేరఁ
ద్రుంపవచ్చు నేల దొసఁగు దొఱఁగ. 1534

● యుద్ధంలో మగధేశ్వరుడైన జరాసంధుణ్ణి చంపరాదు. వీడు చావకుంటే మళ్ళీమళ్ళీ సైన్యాన్ని సమకూర్చుకొని వస్తుంటాడు. అప్పుడు ధరాభారం ఉడిపి అవతల వీణ్ణి చంపవచ్చు.

వ. అని యిట్లు చింతించుచున్న సమయంబున నభోభాగంబుననుండి మహాప్రభాసమేతంబులును, సపరిచ్ఛదసూతంబులును, ననేక బాణ బాణాసన చక్రాది వివిధాయుధోపేతంబులు నైన రథంబులు రెండు మనోరథంబులు వల్లవింప దైవయోగంబునం జేరవచ్చినం జూచి హరి సంకర్షణున కిట్లనియె. 1535

● అని గోవిందుడు తలపోశాడు. అతడిట్లు తలపోస్తుండగా మిక్కిలి కాంతిగలవీ, సారథులతో, ధ్వజకవచాదులతో కూడినవీ, శరములు, విండ్లు, చక్రములు మొదలైన నానావిధాయుధాలతో ఒప్పునవీ అయిన రెండురథాలు మనోరథాలు (కోరికలు) చిగిరింపగా ఆకాశవీథి నుంచి దైవయోగంవల్ల వచ్చి చేరాయి. వాటిని చూచి బలదేవునితో పద్మనేత్రు డిట్లన్నాడు.

శా. కంటే రామ! రథంబు లాయుధములున్ గాఢప్రకాశంబులై
మింటన్ వచ్చెను వీనిఁ గైకొని సురల్ మెచ్చన్ నృపశ్రేణులన్
బంటింపం బనిలేదు చంపుము ధరాభారంబు వారింపు మీ
వెంటన్ నీ యవతారమున్ సఫలమౌ వేవేగ లె మ్మాజికిన్. 1536

● అన్నా! బలరామా! చూచావా? పరమప్రభావంతములైన రథాలు ఆయుధాలతో ఆకసం నుంచి అరుదెంచాయి. వీటిని గైకొని దేవతలు హర్షించగా శత్రురాజులను జాగుచేయక సంహరించు. ఈ

విధంగా నీ అవతార ప్రయోజనం నెరవేరుతుంది. కావున కదనమునకు శీఘ్రంగా సిద్ధం కమ్ము.

వ. అని పలికి. 1537

* అని వాసుదేవుడు పలికినాడు.

క. ఖరులై దృఢకవచ ధను
శ్శరులై యధిగతరథానుచరులై మదవత్
కరులై ఘనహరులై బల
హరు లయ్యెడ నాజికేగి రరిభీకరులై. 1538

• బలరామాచ్యుతులు వాడిమి గలవారు. గట్టి కవచములు, ధనుర్బాణములు గలవారు. మదగజములు, గొప్ప అశ్వములు కలవారు. వారు అతిభయంకరులై అనుచరులతో ఆహవభూమి కరిగినారు. 'బలహరులు' అన్నచోట బలరామాచ్యుతులు అను నర్థముతోపాటు శాత్రవబలము హరించువారు అన్న అర్థము కూడ ప్రతీయమానమగును.

వ. ఇట్లు సమరసన్నాహంబునం బురంబు వెడలి. 1539

ఉ. అన్యులు దల్లడిల్ల దనుజాంతకుఁ డొత్తె గభీరఘోష కా
ఠిన్య మహాప్రభావ వికటీకృత పద్మభవాండజంతు చై
తన్యము ధన్యమున్ దివిజతాపసమాన్యముఁ బ్రీత భక్తరా
జన్యము భీత దుశ్చరిత శాత్రవసైన్యముఁ బాంచజన్యమున్. 1540

• ఈ రీతిగా సమరసన్నాహం వహించి కేశవ బలరాములు పట్టణంనుంచి వెలువడినారు. వైరులు చలించగా దైత్యవిధ్వంసియైన శ్రీకృష్ణుడు గంభీరము, కర్కశము అగు నినాదమహిమచే బ్రహ్మాండములోని జీవరాసుల చైతన్యాన్ని వికటీకరించునదియు, దేవమునులచే మన్నింపబడునదియు, భక్తులైన రాజులను సంతోషపెట్టునదియు, చెడునడతగల శాత్రవసైన్యమునకు భయము గల్గించునదియు, ధన్యమైనదియు అగు పాంచజన్యమనే తన శంఖాన్ని పూరించాడు.

క. సింధుర భంజన పూరిత
బంధురతర శంఖనినద భారమున జరా
సంధునికిం గల సైన్యము
లంధములై పంచరించె నాహవభూమిన్. 1541

● గజములను ఖండిస్తూ పురుషోత్తముడు పూరించిన నిబిడతరమైన పాంచజన్యనినాదభారంతో జరాసంధునికున్న సేనలన్నీ కదనభూమిలో కన్నులు కానరాక పంచలించి పోయాయి.

వ. అ య్యవసరంబున మాగధుండు మాధవున కిట్లనియె. 1542

● ఆ తరుణంలో మగధాధిపతి మధురాధిపతితో ఇట్లన్నాడు.

సీ. అదలించి రొప్పంగ నాలమందలు గావు
గంధగజేంద్రవంశములు గాని
పరికించి వినఁగ నంభారవంబులు గావు
వాజీంద్ర హేషారవములు గాని
పదహతిఁ గూల్పంగఁ బ్రాఁతబండ్లును గావు
నగ సమాన స్యందనములు గాని
ప్రియము లాడంగ నాభీరలోకము గాదు
కాలాభవైరివర్గంబు గాని

తే. యార్ప వనవహ్ని గాదు బాణాగ్ని గాని
మఱియు బృందావనముగాదు మొనలుగాని
యమునగాదు నటింప ఘోరాజిగాని
పోరు నీకేల గోపాల! పొమ్ము పొమ్ము. 1543

● ఓరీ! కృష్ణా! ఇవి మత్తమాతంగయూథములు గాని, అదలించి పారదోలుటకు ఆవులమందలు గావు. ఇవి జవనాశ్వముల సకిలింతచప్పుళ్ళు గాని, వీనులొగ్గి వినుటకు ఆలపోతుల అంభారావాలు కావు. ఇవి అద్రిసమానములైన అరదములు గాని పాదహతులతో పడగూల్చుటకు పాతబండ్లు గావు. ఇది యమునితో సమానమైన శాత్రవసమూహము గాని కోరి ముచ్చటలాడుటకు గొల్లలగుంపుగాదు

ఆర్పివేయుటకు ఇది బాణాగ్నిగాని దావానలం కాదు. మురిసి తిరుగుటకు ఇది బృందావనంకాదు; సేనావ్యూహము. నర్తనమాడుట కిది దారుణయుద్ధభూమి గాని యమునానదీతీరభూమి గాదు. కావున గోపాలా! ఈ కదనము నీ కేల? పోపొమ్ము.

మ. తరుణిం జంపుటయో బకుం గెడపుటో ధాత్రీజముల్ గూల్చుటో
ఖరముం ద్రుంచుటయో ఫణిం బణపుటో గాలిన్ నిరోధించుటో
గిరి హస్తంబునఁ దాల్చుటో అయమహాగ్నిస్ఫార దుర్వార దు
ర్భర బాణాహతి నెట్లు నిల్పెదవు సప్రాణుండవై గోపకా! 1544

• ఓ గోపకిశోరా! ఇది యువతిని చంపుట కాదు; కొంగను ద్రుంచుటగాదు. చెట్లను గూల్చుట కాదు. గాడిదను గెడపుటకాదు; పామును పారదోలుటగాదు. గాలిని నిర్బంధించుటగాదు. శైలమును చేత ధరించుట కాదు, ప్రళయకాలాగ్నివలె దీపించు దుర్వారములు, దుస్సహములు అయిన నాశరాహతులకు ఎట్లోర్చి నీవు ప్రాణాలతో నుండగలవు? _ వరుసగా పూతనాహరణము, బకాసురవధ, యమళార్జున భంజనము, గర్దభాకారుడైన ధేనుకాసురునివధ, కాళియమర్దనము, తృణావర్తసంహారము, గోవర్ధనోద్ధరణము అను శ్రీకృష్ణచర్యలు అనుసంధేయాలు.

వ. అదియునుం గాక. 1545

* అంతే కాదు.

సీ. గోపికావల్లకీఘోషణంబులు గావు
శింజినీరవములు చెవుడుపఱచు
వల్లవీకరముక్త వారిధారలు గావు
శరవృష్టిధారలు చక్కుసేయు
ఘోషాంగనాపాంగ కుటిలాహతులు గావు
నిశితాసి నిహతులు నిగ్రహించు
నాభీరకామినీ హస్తాబ్జములు గావు
ముష్టిఘాతంబులు మురువు డించు;

తే. నల్లి ప్రేవల్లెగాదు ఘోరావనీశ
మకరసంఘాత సంపూర్ణ మగధరాజ
వాహినీసాగరం బిది వనజనేత్ర!
నెఱసి నిను దివికై వడి నేఁడు ముంచు. 1546

● ఇవి గొల్ల పడతుల వీణానినాదాలు కావు, అల్లెత్రాటి మ్రోతలు. నీ చెవులు చిల్లులు పడుతాయి సుమా! ఇవి ఘోషతరుణులు చేతులతో చల్లే నీటిజల్లులు కావు, బాణాలనే వర్షధారలు. నీ శరీరాన్ని శంఠతుండెములు గావిస్తాయి. ఇవి గొల్ల బోటుల క్రీగంటిచూపులు గావు, వాడి కత్తివ్రేటులు, నిన్ను నిగ్రహిస్తాయి. ఇవి వ్రజావ ధూటుల తామరలవంటి చేతులు గావు, పిడికిటిపోటులు; నీ పొడిమిని పోకారుస్తాయి. ఇది వ్రేపల్లె కాదు, ఉగ్రులైన రాజు లనే మొసళ్ళ మొత్తంతో నిండిన జరాసంధుని సేనాసముద్రం; ఈ మహాసముద్రం పెల్లుబికి దీవిని ముంచినట్లు నిన్ను ముంచివేస్తుంది.

వ. అనిన శ్రీహరి యిట్లనియె. 1547

ఉ. పంతములేల? తొల్లి జనపాలురఁ బోరుల గెల్చినాఁడవం
ద్రంతియ చాలదే? బిరుదులాడుట బంటుతనంబు త్రోవయే?
యింతటఁ దీఱెనే? మగధ! యేటికిఁ బ్రేలెదు? నీవ యేల క
ల్పాంతమహోగ్రపావకునినైన హరింతు వరింతు సంపదన్. 1547

● ఈ విధంగా పలుకుతున్న జరాసంధునితో శ్రీకృష్ణు డిలా అన్నాడు-

ఓ మాగధుడా! బీరము లెందుకు? మునుపు కొందరురాజులను నీవు కదనంలో గెలిచినా వంటూరు. అది చాలదు. డంబాలు పలకడం శౌర్యపద్ధతిగాదు. ఇంతటితో తీరిపోయిందా? ఎందుకు వదరుతావు? ప్రళయకాలంలోని భయంకరాగ్నినైనా హరిస్తాను. విజయలక్ష్మిని వరిస్తాను.

క. గోపాలుఁడ వని పలికితి
భూపాలక! దీన నేమి? పోరాడంగా
గోపాలమహీపాల
వ్యాపారాంతరము దెలియవచ్చుం బిదపన్. 1548

● ఓ రాజా! నన్ను పసులకాపరి అన్నావు. ఇందువల్ల నాకు కలిగిన లోటు లేదు. సమరంలో గోపాల భూపాలకుల తారతమ్యం ఏమిటో ఇప్పుడే నీకు తెలిసివస్తుంది.

వ. అనిన రోషబంధురుండై జరాసంధుం డిట్లనియె. 1549

● అని శ్రీకృష్ణుడు పలుకగా క్రోధావిష్టుడై జరాసంధుడి ట్లన్నాడు.

ఉ. బాలుఁడ వీవు కృష్ణ! బలభద్రునిఁ బంపు రణంబుసేయ; గో
పాలకబాలుతోడ జనపాలశిఖామణియైన మాగధుం
డాలముసేసె నంచు జను లాడెడి మాటకు సిగ్గుపుట్టెడిం
జాలుఁ దొలంగు దివ్యశరజాలుర మమ్ము జయింపవచ్చునే? 1550

● కృష్ణా! నీవు పిల్లవాడవు. నాతో పోరడానికి మీ అన్న బలరాముణ్ణి పంపు. గొల్లపిల్లకాయతో రాజచూడామణియైన మగధపతి యుద్ధంచేసినాడని లోకులు మాట్లాడుతుంటే మేము సిగ్గుతో తలవంచుకోవలసి వస్తుంది. చాలు లే. అవతలకిపో. మేము అమోఘ శరాలు కలవాళ్ళం. మమ్ము గెలవడం నీతరం కాదు.

వ. అనిన నగి నగధరుం డిట్లనియె. 1551

● ఆ మాటలకు నవ్వి గోవర్ధనగిరిధారి ఇలా అన్నాడు.

క. పొగడుకొనుదురే శూరులు?
మగఁటిమిఁ జూపుదురు గాక! మాగధ! నీకున్
మగతనము గలిగెనేనిం
దగు మెఱయు వికత్థనములు దగ వీ పోరన్. 1552

● జరాసంధా! వీరులైనవారు పౌరుషం చూపుతారే గాని నీ మాదిరిగా తమ్ముకు తాము ఊరక పొగడుకోరు. పౌరుషముంటే ఖండనంలో నీ ప్రతాపం ప్రదర్శించు. ఆత్మస్తుతి చాలించు.

వ. అని రోషించి. 1553

చ. పవమనుడు మేఘరేణువుల భానుకృశానులఁ గప్పు కైవడిన్
వివిధబలౌఘముం బనిచి వేగమ మాగధుఁ డావరించె భూ
మ్యవని చరిష్ణులం గువిమతావనినాథ నిరాకరిష్ణులన్
దివిషదలంకరిష్ణుల వతిస్థిరజిష్ణుల రామకృష్ణులన్. 1554

● ఆ మాటలకు జరాసంధుడికి ఆగ్రహం వచ్చింది. వాయువు మబ్బులనే ధూళితో సూర్యాగ్నులను కప్పేవిధంగా మాగధుడు వివిధ సేనాసమూహాలను ముందుకు నడిపింప భూసంరక్షణార్థం అవతరించి చరించే వారూ, విరోధిరాజులను నిరాకరించేవారూ, దేవతల కలంకారమైన వారూ, మిక్కిలి స్థిరమైన విజయం కలవారూ అయిన రామకృష్ణులను చుట్టుముట్టినాడు.

మ. హయహేషల్ గజబృంహితంబులు రథాంగారావముల్ శింజినీ
చయటంకారములున్ వివర్ధితగదాచక్రాస్త్రనాదంబులున్
జయశబ్దంబులు భేరిభాంకృతులు నిస్సాణాదిఘోషంబులున్
భయదప్రక్రియ నొక్కవీఁక నెగసెన్ బ్రహ్మాండభేదంబుగన్. 1555

● ఆ సమయంలో గుఱ్ఱాలసకిలింపులు, గజములఘీంకారాలు, రథచక్రధ్వానాలు, వింటినారిమ్రోతలు, పెచ్చుపెరుగుతున్న గద, చక్రం, బాణం మున్నగు ఆయుధముల శబ్దాలు, జయజయా రావాలు, భేరి మొదలైన చర్మవాద్యముల నినాదాలు భయజనకములై బ్రహ్మాండాన్ని భేదించేటట్లు ఒక్కపెట్టున చెలరేగినాయి.

వ. మఱియు నయ్యెడ మాగధ మాధవ వాహినులు రెండు నొండొంటిం దాఁకి రౌద్రంబున సంవర్తసమయసముద్రంబుల భంగి నింగికిం

బొంగి చెలంగి చలంబునం దలపడి పోరునెడ మసరు కవిసి మహా
రణ్యంబులు వెలువడి మార్కొను మదగజంబుల మాడ్కిని, మహో
త్కంఠంబులగు కంఠీరవంబుల తెఱంగున దుర్లభంబులగు శరభం
బుల చాడ్పునం, బ్రచండంబులగు గండభేరుండంబుల గమనికం
దమతమ మొనలకుం దలకడచి వీరరసంబులు వివిధరూపంబులైన
విధంబునం బదుగురు నూర్వురు, వేవురు గములై కులకుధర
గుహాంతరంబులు నిండ సింహనాదంబు లొనర్చుచు, నార్చుచు,
నట్టహాసంబులు సేయుచు, నరివీరుల రోయుచుఁ, బటహ కాహళ
భేరీ శంఖ శబ్దంబులకు మబ్బుచు, గర్వంబునం బ్రబ్బుచు, గదల
వ్రేయుచుఁ, గాండంబుల నేయుచు, ముద్గరంబుల నొత్తుచు,
ముసలంబుల మొత్తుచు, గుంతంబులం గ్రుచ్చి యెత్తుచుఁ, గర
వాలంబులం ద్రెంచుచుఁ, జక్రంబులం ద్రుంచుచు, శస్త్రంబులం
దఱుఁగుచుఁ, జిత్రంబుగఁ దిరుఁగుచుఁ బరిఘంబులఁ ద్రిప్పి
కొట్టుచు, బ్రాసంబులం బెట్టుచు, శూలంబులఁ జిమ్ముచు, నురియ
లం గ్రమ్ముచు, బహుభంగులఁ బరాక్రమించు వీరభటులును, నిబిడ
నీరంధ్ర నేమినిర్ఘోషంబుల నాకాశంబు నిరవకాశంబుగ నవర్గళచక్ర
మార్గంబులం బడు పదాతులు చదియ నరదంబులు దోలి, వివిధా
యుధప్రయోగంబుల వైరుల వ్రచ్చి, చిందఱవందఱలాడు రథికు
లును, రథిక శరపరంపరలఁ గంపింపక మహామోఘ మేఘధార
లకుం జలింపని ధరణీధరంబుల చాడ్పున రథంబులకుం గవిసి,
కల్పాంతకాల దండిదండ ప్రచండంబులగు శుండాదండంబులు
సాఁచి పూఁచి కడనొగ లొడిసి తిగిచి కుదిచి విఱిచి, కూబరములు
నుఱుములుగఁ జిఱజిఱఁ ద్రిప్పివైచియు, భటులం జటులగతి
బంతులక్రియ నెగురవైచి దంతంబుల గ్రుచ్చియు, ఘోటకంబుల
వ్రచ్చియు విచ్చలవిడిం దిరుగు కరులును, వజ్రి వజ్రధారలకుం
దప్పి కకుప్పాలకు నెగయు ఱెక్కలుగల గిరులసిరులం బెక్కురల
తోడ హేషారవభీషణంబులై మనోజవంబులగు తురంగంబులం బఱపి
తురంగ పద పాంసుపటల ప్రభూత బహుళాంధకారంబులు గరకలిత

కఠోర ఖడ్గ మరీచిజాలంబుల నివారించుచు నానాప్రకారంబులం బ్రతివ్యూహంబులం జించి చెండాడు రాహుత్తులు గలిగి సంగ్రామంబు భీమం బయ్యె నందు. 1556

● అపుడు కృష్ణజరాసంధుల సేనలు పరస్పరం ఎదుర్కొని రౌద్రంతో ప్రళయకాలమందలి సముద్రాలమాదిరి ఆకస మంటేటట్లు ఉప్పొంగి పౌరుషంతో పోరాడసాగినాయి. మదమెక్కి మహారణ్యాలనుంచి వెలువడి డీకొనే మదపుటేనుగులవలె, మిక్కిలి వేగిరపాటుగల సింహాలవిధంగా, అపూర్వములైన శరభముల లాగా, భీతిపుట్టించే గండభేరుండముల పోలికగా యోధులు తమ తమ సేనల్ని దాటి వీరరసం పలురూపులు గైకొన్నట్లు పదిమంది, నూరుమంది, వెయ్యిమంది వంతున గుంపులై కులపర్వత గుహాంతరాళాలు నిండేటట్లు పెడబొబ్బలు పెట్టినారు. వెడనవ్వులు నవ్వినారు. శత్రువీరులను నెమకినారు. పటహము, కాహళ, భేరి, శంఖం అనే వాద్యాల శబ్దాలకు వారు ఉద్రేకంపొందినారు. గర్వంతో చెలరేగినారు. అరివీరులను గదలతో మోదినారు. శరములు ప్రయోగించినారు. సమ్మెటులతో మర్దించినారు. రోకళ్ళతో మొత్తినారు. బల్లెములతో గ్రుచ్చిపైకెత్తినారు. కత్తులతో ఖండించినారు. చక్రాలతో ఛేదించినారు. శస్త్రాలతో తరిగినారు. వింతగా తిరుగుతూ ఇనుపకట్ల గుదియలతో త్రిప్పికొట్టినారు. ఈటెలు, శూలాలు చిమ్మినారు. చురకత్తులతో క్రుమ్మినారు. ఈ రీతిగా వీరభటులు పలురకాల పరాక్రమించారు. ఎడతెరపిలేని రథచక్రఘోషలతో ఆకసం నిండిపోయింది. చక్రాల క్రిందపడి పదాతిదళాలు నలిగేటట్లు అరదములు తోలించి అనేక విధములైన ఆయుధాలు ప్రయోగించి రథికులు శత్రువులను చీల్చి చెండాడినారు. రథికుల శరపరంపరలకు చలించక మహావర్షధారలకు చలించని పర్వతాలమాదిరి ఏనుగులు తేరులమీదికి కవిసి ప్రళయ కాలంలోని యమదండంవలె భయంకరమైన దండములవంటి

తొండాలు సాచి పూనికతో కడనొగలను ఒడిసిపట్టి లాగి కుదించి జిరజిర త్రిప్పి విరిచి పొడిపొడి గావించాయి. భటులను బంతుల మాదిరి ఎగురవేసి దంతాలతో క్రుమ్మినాయి. గుఱ్ఱాలను చీల్చివేసి విచ్చలవిడిగా విహరించాయి. దేవేంద్రుని వజ్రాయుధపు వ్రేటులు తప్పించుకొని దిగంతాలకు ఎగిరిపోయే రెక్కలున్న కొండలకైవడి భాసిస్తూ జీనులతో గూడినవై, దారుణంగా సకిలిస్తూ మనస్సువలె వడిగలిగిన వారువాలు విజృంభించాయి. వాటిని ఉసికొలిపి తోలే టప్పుడు, వాటి కాలిడెక్కల దుమ్ముచే కారుచీకట్లు వ్యాపించాయి. ఆ కారుచీకట్లను తమచేతిలోని కరకుకత్తులకాంతిపుంజంతో నివారిస్తూ గుఱ్ఱపురౌతులు శత్రువుల ప్రతివ్యూహాలను పటాపంచలు గావించారు. ఈ విధంగా భీషణసమరం జరిగింది.

క. చెదురథములుఁ దెగు హయులును
బడు కరులును మడియు భటులుఁ బఱచు రుధిరమున్
మడియు తల లొఱగు తనువులుఁ
బొడియగు తొడవులును మధురిపుని దెసఁ గలిగెన్. 1557

• శ్రీకృష్ణుని పక్షంలోని అరదములు భగ్నమయినాయి. అశ్వాలు తెగిపడ్డాయి. ఏనుగులు కూలిపోయాయి. భటులు మరణించారు. నెత్తురు ప్రవహించింది. తలలు తునిగినాయి. దేహములు వ్రాలి పోయాయి. భూషణాలు పొడిపొడియై రాలిపోయాయి.

క. భీతంబై హతసుభట
వ్రాతంబై భగ్నతురగవారణరథ సం
ఘాతంబై విజయశ్రీ
వీతంబై యదుబలంబు విఱిగె నరేంద్రా! 1558

* పరీక్షిన్మహారాజా! యాదవసైన్యం భీతిల్లింది. మేటివీరులు మరణించారు. హయములు, ఏనుగులు, రథసమూహాలు భగ్నమయి నాయి. విజయలక్ష్మి విరహితయై యాదవబలం వెనుకకు తగ్గింది.

శా. 'యోధాగ్రేసరుఁ డీ హలాయుధుఁడు లోకోత్కృష్టబాహాబల
శ్రీధౌరేయుఁడు కృష్ణుఁ డిట్టి ఘనులం జిత్రంబు; నేఁ డిట్లు సం
రోధించెన్; బలముం దెరల్చె; మగధేంద్రుం' డంచు నీక్షించుచున్
సౌధాగ్రంబులఁ బౌరకాంతలు మహాసంతప్తలై రెంతయున్. 1559

● బలరాముడు వీరులలో అగ్రగణ్యుడు. శ్రీకృష్ణుడు లోకోన్నత భుజబల సంపన్నుడు. ఇట్టి మహామహులను జరాసంధుడు అడ్డగించి వారి సేనలను తరిమికొట్టడం ఎంతో వింతగా ఉంది అని పురస్త్రీలు మేడలమీద జేరి మిక్కిలి పరితాపం పొందినారు.

వ. ఇట్లు తన మొనలు విఱిగి పాఱినం గనుంగొని, సమరసంరంభం
బున హరి విశ్వంభరాభరణ వేదండ తుండాభంబులగు బాహుదం
డంబులు వెంచి, విజృంభించి, బ్రహ్మాండకుహర కుంభ పరిస్ఫో
టనం బగు పాంచజన్యనినదంబు నిబిడ నిర్ఘాత శబ్దంబుగా నుదం
చిత పింఛదామంబు సంక్రందన చాపంబుగాఁ, బ్రశస్త హస్తలాఘ
వంబున శరాకర్షణ సంధాన మోక్షణంబు లేర్పడక, నిర్వక్ర చక్రా
కారంబుతోడ మార్తాండమండల ప్రభా ప్రచండంబగు శార్ఙ్గకోదం
డంబు క్రొమ్మెఱుంగులుగా, దిగ్గజేంద్ర కర్ణభీషణంబులగు గుణ
ఘోషణంబులు ఘుమఘుమారావ దుస్సహంబు అయిన గర్జనంబు
లుగా, రథ తురంగమ రింఖా సముద్ధూత పరాగపటల పరంపరా
సంపాదిత పుంజీభూతంబగు పెంజీఁకటి యిరులుగా, నసమసమర
సన్నాహ చాతురీ విశేషంబులకుం జొక్కి, నిక్కి కరంబు లెత్తి నర్త
నంబులం బ్రవర్తించు నారద హస్తవిన్యాసంబులు లీలాతాండవ
మండిత మహోత్కంఠంబు లగు నీలకంఠంబులుగా, సుందర
స్యందననేమి నిర్ఘోషభీతులయి కుంభికుంభములపై వ్రాలు వీరులు
మత్తమయూర కేకారవ చకితులై యువతికుచ కుంభంబులమీఁద
వ్రాలెడు కాముకులుగా, నానానరేంద్ర రక్తపిపాసా పరవశంబులై
వాచఱచుచున్న భూతవ్రాతంబులు వర్షవర్షేతి నిస్వనంబు లొసంగు
చాతకంబులుగా, నభంగ సంగర ప్రేరకుండగు హలాయుధుండు

వృష్టికారణంబగు మందసమీరణంబుగా, ననల్పకల్పాంతకాల నీల వలాహకంబు ఖాతిం బరగు మేనిచాయతోడం దోయజనాభుం డరాతి చతురంగదేహక్షేత్రంబులం బుంఖానుపుంఖంబులుగ ననం ఖ్యాత బహువిధ దివ్యబాణవర్షంబు గురియునెడ శస్త్రాస్త్రపరంపరా సంఘట్టన జనితంబు లగు మిడుఁగుఱులు వర్షాకాల విహిత విద్యోత మాన ఖద్యోతంబులుగ, విశిఖ వికీర్ణ వీరకోటీర ఘటిత పద్మరాగ శకలంబు లింద్రగోపంబులును, మహిత మార్గణ విదళిత మత్త మాతంగ కుంభ మౌక్తికంబులు వడగండ్లుగఁ జటులార్ధచంద్ర శర చ్ఛిన్న చరణంబు లయి 'కృష్ణ! కృష్ణ! నిలు నిలు' మని వలు కుచుం గూలెడు మేనులు కృషీవల కర పరశుధారా విదళిత మూల విశాలసాలంబులుగ, ఖాసుర భల్ల భగ్నంబు లయిన వదన గహ్వ రంబుల వలన డుల్లెడు దంతపుంజంబులు మాలతీకుసుమ మంజరు లుగ, నవ్య నారాచభిన్న దేహంబులయి దిగ్గనఁ గ్రొగ్గండ్లవలన వెడలు రక్తస్యందసందోహంబులతో సంచరింపక ప్రాణంబులు విడుచు శుండాలంబులు సెలయేఱులతోడి కొండలుగఁ గఠోరకాండ ఖండితంబులు లయిన భుజాదండంబులతోడఁ గలసి పడిన వజ్ర మయ కంఠికాభరణంబులు భోగిభోగసమేత కేతకీకుసుమంబులుగఁ బ్రళయార్ణవ కల్లోల శబ్ద సన్నిభంబు లయిన భేరీరవంబులు భీకర భేకీ నికరారవంబులుగ, దారుణేమ విలూన వాహ వారణ మనుజ మస్తిష్కంబు రొంపిగ సొంపుమెఱయ నాభీల కీలాల ప్రవాహంబులు ప్రవహించె; నందు భుజములు భుజంగములుగఁ గపాలంబులు కమఠంబులుగ, శిరోజంబులు శైవాలంబులుగఁ, గరంబులు మీనం బులుగ, హయంబులు నక్రంబులుగ, గజంబులు దీవులుగ, ధవళ చ్ఛత్రంబులు నురువులుగఁ, జామరంబులు గలహంసంబులుగ, భూషణరత్న రేణురాసులు పులినంబులుగ నొప్పె; నప్పుడు. 1560

* తన సేనలు ఓడి పారిపోవడం చూచి సమరాటోపంతో శ్రీహరి భూభారం వహించే దిగ్గజతుండాలతో సమానము లయిన తన భుజదండాలు సారించి విజృంభించాడు. బ్రహ్మాండభాండం

బ్రద్ద లయ్యేటట్లు పాంచజన్యశంఖం పూరించాడు. ఆ శంఖధ్వని పెళపెళమను పిడుగుల మ్రోతవలె ఉండినది. తాను ధరించిన నెమలి పింఛం ఇంద్రధనుస్సువలె చూపట్టింది.

మెచ్చదగిన హస్తలాఘవంచేత బాణములు అల్లెత్రాటియందు కూర్చడం, లాగడం, విడవడం తెలియరాకుండా మండలాకారంతో సూర్యమండలప్రభవలె తేరిచూడరానిదై అతని శార్ఙ్గమనే చాపం క్రొత్తమెరుపువలె తేజరిల్లింది. దిగ్దంతుల చెవులకు వెరపు గలిగించే అతని ధనుష్టంకారాలు ఘుమఘుమ ధ్వనులతో సహింపరానివై ఉరుముల చప్పుళ్ళుగా ఒప్పినాయి. రథానికి గట్టిన గుఱ్ఱాల గిట్టల తాకిడికి లేచిన ధరాధూళిమూలాన ఏర్పడ్డ చీకటియే అంధకారమై తోచింది. అతని సాటిలేని యుద్ధసన్నాహ నైపుణ్యానికి పరవశించి నిక్కి చేతులెత్తి నాట్యంచేస్తున్న నారదమహర్షి హస్తవిన్యాసాలే, మిక్కిలి సంబరంతో తాండవనృత్యం సలిపే నెమళ్ళుగా నెగడినాయి. అందమైన ఆయన రథచక్రాలరవళికి జంకి ఏనుగుల కుంభస్థలాలపై ఒరుగుతున్న వీరులు మదించిన నెమళ్ళకూతలకు ఉలికిపడి తరుణుల కుండలవంటి కుచాలమీద వ్రాలే కాముకులుగా దీపించారు.

నానారాజుల నెత్తురుద్రావు కోరికతో పరవశములై పెను బొబ్బలుపెట్టు పిశాచబృందాలు వర్షమో వర్షమో అని పలవరించే చాతకాలుగా ద్యోతకమయినాయి. అమోఘ యుద్ధప్రేరకు డయిన బలరాముడు వర్షానికి కారణమైన మందమారుత మయినాడు. ఘోర విలయ సమయంలోని కారుమబ్బుకైవడి ప్రకాశించే శరీరచ్ఛాయగల కమలనాభుడు శత్రువులకు సంబంధించిన రథగజాశ్వపదాతుల దేహాలనే భూములందు పుంఖానుపుంఖంగా లెక్కింపరాని పలురకాలైన దివ్యశరములనే వర్షం కురిపించాడు.

అలా అతడు శరవర్షం కురిపించేటప్పుడు శస్త్రాస్త్రముల రాపిడికి పుట్టిన నిప్పురవ్వలు వానకారులోని మిణుగురు పురువులుగా

నెగడినాయి. బాణాలచే చెదరిన వీరులకిరీటములందు తాపబడిన పద్మరాగమణిఖండాలు అరుద్రపురుగులమాదిరి ఉండినాయి. గొప్ప తూపులచే చీల్చబడిన మదగజకుంభాలలోని ముత్యాలు వడగండ్లుగా ఉండినాయి. తీవ్రములయిన అర్ధచంద్రబాణాలచే కాళ్ళు ఖండింప బడగా కృష్ణా కృష్ణా నిలు నిలుమని పలుకుతూ నేలపై గూలుతున్న శరీరాలు సేద్యగాండ్ర చేతులలోని గండ్రగొడ్డళ్ళచే నరకబడి కూలు తున్న పెనువృక్షాలుగా ఉండినాయి. వాడిబల్లెములచే భగ్నము లయిన గుహలవంటి నోళ్ళనుంచి రాలుతున్న దంతముల సమూహం మొల్లపూగుత్తులుగా ఉండినాయి. నిశితబాణాలునాటిన శరీరాలుగలవై క్రొత్త గాయాలనుండి పిలపిల నెత్తురు ప్రవహింపగా, తిరుగలేక ప్రాణాలు విడిచే ఏనుగులు, సెలయేళ్ళతో కూడిన కొండలుగా ఉండినాయి. కర్కశములైన శరాలచే ఖండింపబడిన బాహుదండాలతో కలసి నేలపైబడిన వజ్రమయకంఠాభరణాలు పాముపడగలతో కూడిన మొగలిపూలు అయినాయి.

ప్రళయకాలమందలి సముద్రతరంగఘోషకు సాటివచ్చే భేరి స్వనాలు దారుణమైన కప్పల బెకబెకధ్వను లయినాయి. భీషణము లయిన బాణములచే కోయబడిన గుఱ్ఱముల, ఏనుగుల, మనుష్యుల మెదడు రొంపియై సొబగుమీరింది. భయంకరమైన నెత్తురువెల్లువలు ప్రవహించాయి. ఆ ప్రవాహంలో బాహువులు పాములుగా, తల పుఱ్ఱెలు తాబేళ్ళుగా, తలవెంట్రుకలు నాచుగా, చేతులు చేపలుగా, గుఱ్ఱాలు మొసళ్ళుగా, ఏనుగులు దీవులుగా, తెల్లగొడుగులు నురుగు లుగా, వింజామరలు రాయంచలుగా, ఆభరణరత్నాలధూళులు ఇసుక తిన్నెలుగా ఎసగినాయి.

లయ. హసిత హరినీలనిభ వసనము విశాలకటి
నసమనయనాద్రి పరిలసిత మేఘో
ల్లసనము వహింపఁ గరకిసలయము హేమమణి
విసర వలయ ద్యుతులు దెసలతుదలందున్

బసలు గురియంగ సరభసమున బలుండు దర
హసితము ముఖాబ్జమున నెసఁగ ఘనకాలా
యస మయ మహోగ్రతర ముసలము వడిన్ విసరి
కసిమసఁగి శత్రువుల నసువులకుఁ బాపెన్. 1561

* బలరాముని విశాలమైన కటిప్రదేశంలో ఇంద్రనీలమణితో సమానమైన నీలాంబరం కైలాసగిరియందు లెస్సగా ప్రకాశించు మేఘంవలె చెలువుగులికింది. అతని చిగురుటాకులవంటి చేతులకుగల కనకఖచితరత్నకంకణములకాంతులు దిగంతములందు ఇంపెనలారాయి. బలభద్రుడు పద్మమువంటి మోమున చిరునవ్వు చెలువొందగా దృఢమైన ఇనుముతో నిర్మింపబడి మిక్కిలి భయ మొదవించే తన రోకలిని మహావేగంతో గిరగిర త్రిప్పుతూ విజృంభించి విరోధుల ప్రాణాలు హరించాడు.

అయ. ప్రలయసమయాంతకుని చెలువునఁ గటాక్షముల
నలఘు చటులాగ్నికణములు సెదరఁ గోలా
హలముగ సువర్ణ మణివలయనిచయోజ్జ్వలిత
హలము వడిఁజాచి శిరములు నురములు న్ని
ర్దలితములుగన్ శకలములుగ నొనరింపఁ గని
బెలుకుఱి జరాసుతునిబలము రణవీథిన్
జలితదనుజావలికి బలికి భయభీత సుర
ఫలికిఁ ద్రిజగచ్ఛలికి హలికిఁ దలడించెన్. 1562

● రక్కసుల గుంపును కలవరపెట్టువాడు, ప్రబలమైన బలముగలవాడు, భయత్రస్తులకు కల్పవృక్షము వంటివాడు, ముల్లోకాలను గడగడలాడించేవాడు, హలాయుధమును ధరించేవాడు అయిన బలరాముడు ప్రళయకాల యమునిచందంగా ప్రకాశించాడు. అతని కడగన్నులందు మిక్కిలి భయంకరములైన నిప్పురవ్వలు గుప్పుగుప్పున వెలువడినాయి. కనకరత్న ఖచితములైన కడియాల చుట్టలచే శోభిల్లు తన ఇనుపనాగలిని వేగంగా విసరుతూ అతడు

విరోధుల తలలు రొమ్ములు చీల్చి ముక్కలు ముక్కలు చేశాడు. అదిచూచి జరాసంధుడి సైన్యం భయంతో విలవిలలాడుతూ రణ రంగంలో తల వ్రాల్చింది.

శా. రోషోద్రేకకళాభయంకరమహారూపంబుతో నొక్కచే
  నీషాదండము సాఁచి లాంగలము భూమీశోత్తమగ్రీవలన్
  భూషల్ రాలఁ దగిల్చి రాఁదిగిచి సంపూర్ణోద్ధతిన్ రోఁకటన్
  వేషంబుల్ సెడమొత్తె రాముఁడు రణోర్విన్ నెత్తురుల్‌జొత్తిలన్. 1563

* బలరాముడు కోపవిజృంభణంతో మహాభయంకరమైన రూపంతో విలసిల్లినాడు. ఒకచేతితో ఏడికోల సాచి నగలు రాలి పడేటట్లు నాగలిని ఆ రాజశ్రేష్ఠుల మెడకు తగిలించి దగ్గరకు లాగి నాడు. అమితదర్పంతో వారివేషాలు చెరచి రణరంగంలో నెత్తురులు పారేటట్లు మరొకచేతిలోని రోకలితో నెత్తిపై మొత్తినాడు.

క. హలిహలహృత కరికుంభ
  స్థలముక్తాఫలము లోలిఁ దనరెఁ గృషిక లాం
  గలమార్గ కీర్ణ బీజా
  వలికై వడి నద్భుతాహవక్షేత్రమునన్. 1564

• అచ్చెరువు కలిగించు ఆ యుద్ధభూమియందు బలభద్రుని నాగటిచే బద్దలుకొట్టబడిన ఏనుగు కుంభస్థలము లందలి ముత్యాలు నేలరాలి కర్షకుల నాగటిచాళ్ళలో చల్లబడిన విత్తనాల విధంగా విలసిల్లినాయి.

క. తఱిమి హలి హలము విసరుచు
  నెఱిఁ గదిసిన బెగడి విమతనికరము లెడలై
  వెఱఁగుపడు నొదుఁగు నడఁగును
  మఱుపడుఁ జెడు మడియుఁ బొరలు మరలుం దెరలున్. 1565

• బలభద్రుడు తరుముతూ, తన నాగలిని త్రిప్పుతూ సమీపించగా శత్రుసమూహాలు భయపడి దూరంగా పారిపోతాయి.

ఆశ్చర్యం పొందుతాయి. ప్రక్కకు తొలగుతాయి. లోపడుతాయి. చాటుకు పోతాయి. చెడిపోతాయి. చనిపోతాయి. నేలబడి పొరలు తాయి. వెనుకకు మరలిపోతాయి. కలత చెందుతాయి.

హరి తిగ్మగోశతంబుల
హరిదంతర మెల్లఁ గప్పునాకృతిఁ గడిమిన్
హరితిగ్మగోశతంబుల
హరిదంతర మెల్లఁ గప్పె నతిభీకరుఁడై. 1566

• సూర్యుడు వందలకొలది వాడికిరణాలచే దిగంతాలను కప్పేవిధంగా పరాక్రమశాలి అయిన శ్రీకృష్ణుడు మిక్కిలి భయం కరుడై వందలకొలది వాడి అమ్ములతో దిగంతాలను కప్పివేశాడు.

సీ. పదుగురేగురు దీర్ఘ బాణముల్ గాఁడిన
 గుదులు గ్రుచ్చినభంగిఁ గూలువారుఁ
దలలు ద్రెవ్విన మున్ను దారు వీక్షించిన
 వారల నొప్పించి వ్రాలువారుఁ
బదములు దెగిపడ్డ బాహులఁ బోరి ని
 ర్మూలితబాహులై మ్రొగ్గువారు
క్షతముల రుధిరంబు జల్లింప నిర్ఝర
 యుతశైలములభంగి నుండువారు;

ఆ. భ్రాతృ పుత్ర మిత్ర బంధువుల్ వీఁగిన
నడ్డ మరుగుదెంచి యణఁగువారు
వాహనములు దెగిన వడి నన్యవాహనా
ధిష్ఠు లగుచు నెదిరి ద్రెళ్ళువారు. 1567

• నిడుపైన నారాచములు నాటగా పదిమంది ఐదుమంది వంతున గుదులు గ్రుచ్చినట్లుగా కూలుతున్నారు కొందరు. తలలు తెగిపడగా పూర్వం తాము చూచిన వారిని బాధించి మరికొందరు

ప్రాలుతున్నారు. కాళ్ళు తెగిపడినప్పటికీ చేతులతో పోరాడి అవికూడ తునిగిపోగా మ్రొగ్గుతున్నారు వేరొక కొందరు. గాయాలనుండి నెత్తురు చిందుతుండగా సెలయేళ్ళతో గూడిన శైలాలవలె ఇంకకొంద రున్నారు. సోదరులు, పుత్రులు, స్నేహితులు, చుట్టాలు ఓడిపోగా అడ్డమువచ్చి కొందరు హతమవుతున్నారు. గుఱ్ఱములు తెగిపడగా వెంటనే ఇతరహయములు ఎక్కి వచ్చి ఎదిరించి మరికొందరు మరణిస్తున్నారు.

వ. మఱియును. 1568

శా. ఈ కాయంబులఁ బాసినంతటనె మా కెగ్గేమి? జేతృత్వమున్
నీకుం జెల్లదు కృష్ణ! నిర్జరులమై ని న్నొత్తు మామీఁదటన్
వైకుంఠంబున నంచుఁ బల్కుక్రియ దుర్వారాస్త్రభిన్నాంగులై
యాకంపింపక కొంద ఱాడుదురు గర్వాలాపముల్ కృష్ణునిన్. 1569

● ఇంకనూ మరికొందరు కృష్ణా! ఈ శరీరాలు విడిచినమాత్రాన మాకు కలిగే కీడు ఏమీ లేదు. నీకు విజయం లభించడం కల్ల. ఎందుకనగా మేము చచ్చి ఆ మీాద అమరులమై వైకుంఠంలో ని న్నొడిస్తాము అంటూ వారింపరాని శస్త్రాలచే ఛేదింపబడిన కాయ ములు కలవారై, ఏమియు చలింపక కొందరు శ్రీకృష్ణునితో గర్వోక్తు లాడినారు.

వ. ఇవ్విధంబున. 1570

క. జగదీశ! యేమి సెప్పుదు?
నగణితలయవార్ధి భయదమై మూఁగిన య
మ్మగధేశుబలము నెల్లను
దెగఁ జూచిరి హరియు హలియుఁ దీవ్రక్రీడన్. 1571

● ఈ లాగున పరీక్షిన్మహారాజా! ఏమని చెప్పేది? ప్రళయ కాల సాగరంవలె భయజనకమై చుట్టుముట్టిన ఆ మగధరాజు సైన్య

మంతటిని శ్రీకృష్ణుడూ బలరాముడూ అవక్రవిక్రమంతో చక్కాడినారు.

క. భువన భవస్థితివిలయము
లవలీలం జేయు హరికి నరినాశన మెం
త విషయమైన మనుజుండై
భవ మొందుటం జేసి పొగడంబడియెం గృతులన్. 1572

* లోకములను అవలీలగా పుట్టించనూ, పెంచనూ, గిట్టించనూ, శక్తిమంతుడైన నారాయణునకు శత్రునాశన మొనర్చుట ఒక లెక్క లోనిదికాదు. మానవుడై పుట్టినందున కావ్యములందు అలా శ్లాఘింప బడినాడు. మరేమియు కాదు.

వ. ఆ సమయంబున. 1573

శా. అంహఃకర్ములు తల్లడిల్ల భయదాహంకారుఁడై సీరి దో
రంహం బొప్ప హలాహతిన్ రథ ధనూరథ్యంబులం గూల్చి త
త్సంహారస్పృహఁ జొచ్చి పట్టెను జరాసంధున్ మదాంధున్ మహా
సింహంబుం బ్రతిసింహముఖ్యము బలశ్రీఁ బట్టు నేర్పేర్పడన్. 1574

• ఆ సమయంలో పాపకర్ములు తల్లడిల్లునట్లు బలరాముడు విరోధులకు వెరపుకలిగించే గర్వంతో బహువేగంగా నాగటిపోటులతో అరదాలనూ, ధనుస్సులనూ, గుఱ్ఱాలనూ కూల్చివేశాడు. శత్రు సంహారమందలి కాంక్షతో మహాసింహ మొకటి ప్రత్యర్థి అయిన మరోసింహాన్ని పట్టుకునే నేర్పు తేటపడగా కావరంతో కన్నుగానని జరాసంధుణ్ణి ముందుకురికి అతడు పట్టుకొన్నాడు.

వ. ఇటు పట్టుకొని. 1574

ఉ. కుంఠితులై పరుల్ బెగడ ఘోరబలుండు బలుండు వాని సో
ల్లుంఠము లాడుచున్ దిగిచి లోకభయంకరమైన ముష్టిచేఁ
గంఠగతాసుఁ జేసి తమకంబున మొత్తఁగ భూధర క్షయో
త్కంఠుఁడు చక్రి మీఁదెఱిఁగి కార్యము గల్దని మాన్పి యిట్లనున్.

● అలా పట్టుకొని శత్రువులు చెదరి బెదరిపోగా భయంకర బలశాలి అయిన బలభద్రుడు వానిని ఎత్తిపొడుపు మాటలతో పడ మొత్తి లాగి, లోకాలకు వెరపుకలిగించే తన పిడికిటిపోటుతో కంఠగత ప్రాణుణ్ణి గావించాడు. భూభార మడగింప నెంచిన చక్రాయుధుడు భావికార్యం తలపోసి జరాసంధవధ మాన్పి మాగధునితో ఇట్లన్నాడు.

శా. దుఃఖింపం బనిలేదు; పొమ్ము; బలసందోహంబులం దెమ్ము; చే
తఃఖేదం బెడలంగ రమ్ము; రిపులం దండింపు; కాదేని భూ
స్వఃఖేలజ్జన మెల్ల మెచ్చ నృప! నీ శౌర్యోన్నతుల్ సూపి మే
దఃఖండంబులు భూతముల్ దినఁ దనుత్యాగంబు సేయందగున్.

* ఓ నరపతీ! నీవు దుఃఖింప నవసరంలేదు. పొమ్ము నీ సేనలను కూర్చుకొని మనోవ్యథ తొలగునట్లు మరల రమ్ము. వైరులను శిక్షింపుము. అలా చేయలేకపోతే భువియందు, దివియందు విహరించే జనులు మెచ్చునట్లు నీ పరాక్రమాతిశయం చాటి నీ మెదడుముక్కలు పిశాచాలు తినేలా, నీ దేహాన్ని వదలిపెట్టు. అలా చేయడం మంచిది.

వ. అని నగుచు విడిపించిన, చిడిముడికి నగ్గలంబయిన సిగ్గున గ్రమ్మగి నెమ్మొగంబు సూపక, కోప కపటభావంబులు మనంబునం బెనం గొనఁ దపంబు చేసియైన వీరలం జయించెద నని, పలాయితులైన రాజులం గూడికొనుచు జరాసంధుఁడు విఱిగి చనియె; సురలు గుసుమవర్షంబులు గురియ హలియు హరియును మథురానగర జన వందిమాగధ జేగీయమానులై వీణా వేణు మృదంగ శంఖ దుందుభి నినదంబు లాకర్ణించుచు, మృగమదజలసిక్త విమలవీథికా శతంబును, వివిధ విచిత్ర కేతనాద్యలంకృతంబును, సువర్ణమణి మయ జయస్తంభ నిబద్ధతోరణ సంయుతంబును, వేదనాద నినాదితంబును, సంతుష్టజన సంకుల గోపురంబునునైన పురంబునుఁ బ్రవేశించి రందు. 1578

* అని పలికి నవ్వుతూ వాణ్ణి విడిచిపుచ్చాడు. వాడేమో తొట్రుపాటును మించిన సిగ్గుతో కుమిలిపోయి మొగమెత్తుకోలేక కోపం, కుటిలత్వం మనసులో మెలివడగా తపస్సుచేసి అయినా వీళ్లను జయించాలి అనుకున్నాడు. పారిపోయిన పార్థివసమూహంతో కూడి మరలిపోయాడు. అపుడు దేవతలు బలరామకృష్ణులమీద పూల వాన కురిపించారు. బలరాముడు, శ్రీకృష్ణుడు తమ్ము మథురా నగరవాసులూ, వందిమాగధులూ కీర్తింపగా వీణలు, వేణువులు, మృదంగాలు, శంఖాలు, దుందుభులు మొదలైన మంగళతూర్యా రావాలు ఆలకిస్తూ పురప్రవేశం చేశారు. అపుడు మథురానగరవాసులు వీథులను శుభ్రంగా చిమ్మి కస్తూరికలిపిన నీళ్లతో తడిపినారు. అనేక విచిత్రములైన జెండాలు మున్నగు వాటితో పుర మలంకరించారు. కనకరత్నమయములైన విజయస్తంభాలకు తోరణాలు కట్టినారు. ఊరంతా వేదధ్వనులతో ప్రతిధ్వనించింది. సంతుష్టహృదయులైన ప్రజలతో ఆ పట్టణపు వాకిళ్ళు కళకళలాడినాయి.

ఉ. వెల్లువలైన వైరినృపవీరుల నెల్ల జయించి వీటికిన్
బల్లిదులైన కృష్ణబలభద్రులు వచ్చుచునున్నవారు రం;
డుల్లములారఁ జూత మని యున్నతసౌధములెక్కి వారిపైఁ
బల్లవ పుష్ప లాజములు పౌరపురంధ్రులు సల్లి రెల్లెడన్. 1579

* 'వెల్లువలా పెల్లుబికివచ్చిన వీరులయిన శత్రురాజు లందరినీ జయించి బలవంతులైన బలరామకృష్ణులు విజయం చేస్తున్నారు రండి రండి, మనసార దర్శిద్దాము' అని ఎత్తైన మేడలెక్కి పురస్త్రీలు వారిమీద చిగుళ్లూ, పూలూ, సేసలూ చల్లినారు.

వ. ఇట్లు పురంబు ప్రవేశించి యుద్ధప్రకారంబెల్ల నుగ్రసేనున కెఱిం గించి కృష్ణుం డిచ్ఛావిహారంబుల నుండె; మఱియు నెక్కువ మత్స రంబున న మ్మాగధుండు మహీమండలంబునంగల దుష్టమహీపతుల నెల్లం గూడికొని సప్తదశవారంబులు సప్తదశాక్షౌహిణీబల సమే

తుండై మథురానగరంబుపై విడిసి, మాధవభుజాప్రాకారరక్షితు లగు యాదవులతోడ నాలంబుసేసి, నిర్మూలితబలుండై పోయి క్రమ్మఱ నష్టాదశయుద్ధంబునకు వచ్చునెడం గలహావిద్యావిశారదుం డగు నారదుండు కాలయవను కడకుం జని యి ట్లనియె. 1580

● ఈలా రామకృష్ణులు పట్టణంలో ప్రవేశించారు. యుద్ధ మెలా జరిగిందో ఉగ్రసేన మహారాజుకు తెలిపి శ్రీకృష్ణుడు యథేచ్ఛా విహారాలతో ఉండినాడు. కాని, జరాసంధుడు పెనుమచ్చరంతో భూవలయంలోని దుష్టరాజు లందరినీ చేర్చుకొని పదిహేడుసారులు పదిహేడు అక్షౌహిణులసేనతో మథురపై దండెత్తినాడు. మాధవుని భుజములనే ప్రాకారాలతో పరిరక్షితులైన యాదవులతో అతడు కయ్యం గావించాడు. తడవ తడవకూ తన బలము లన్ని నశించి పోయినప్పటికీ జరాసంధుడు మళ్ళీ పదునెనిమిదవ పర్యాయం కదనానికి సిద్ధపడి కదలివస్తుండగా కలహావిద్యలో ఆరితేరిన నారదుడు కాలయవనుడి దగ్గరకువెళ్ళి యిట్లన్నాడు.

మ.యవనా! నీవు సమస్త భూపతుల బాహాఖర్వగర్వోన్నతిం
బవమం డభ్రములన్ హరించుపగిదిన్ ఖండించియు న్నేల యా
దవులన్ గెల్వవు? వారలన్ మఱచియో? దర్పంబు లేకుండియో?
యవివేకస్థితి నొందియో? వెఱచియో? హైన్యంబునుం జెందియో?

* ఓ కాలయవనా! వాయువు వారిదములను ఎగురగొట్టే విధంగా నీవు సకలరాజులను భుజగర్వాతిశయంతో విరిచివేసికూడా ఎందుకు యాదవులను జయించకుండా ఉన్నావు? వాళ్లను మరచి పోయావా? దర్పంలేకనా? అవివేకమా? భయమా? లేక అల్పత్వమా?

క. యాదవులలోన నొక్కఁడు
మేదినిపై సత్త్వరేఖ మెఱసి జరాసం
ధాదులఁ దూలన్ దోలెన్
దాదృశుఁ డిల లేఁడు వినవె తత్కర్మంబుల్. 1582

• యాదవులలో ఒకడు బలాధిక్యంతో పుడమిపై తేజరిల్లుతూ జరాసంధుడు మున్నగువారిని తొలగగొట్టినాడు. అట్టివా డీ భూమిలో మరొక్కడు లేడు. అతనికృత్యములు నీవు వినలేదా ?

వ. అనిన విని, కాలయవనుం డిట్లనియె. 1583

* ఆ మాటలు విని కాలయవనుడు ఇట్లన్నాడు.

శా. ఏమీ ! నారద ! నీవుచెప్పిన వరుం డే రూపువాఁ ? డెంతవాఁ ?
డే మేరన్ విహరించు ? నెవ్వఁడు సఖుం ? డెందుండు ? నేపాటి దో
స్సామర్థ్యంబునఁ గయ్యముల్ సలుపు? నస్మద్బాహుశౌర్యంబు సం
గ్రామక్షోణి ధరించి నిల్వఁగలఁడే? గర్వాఢ్యుఁడే? చెప్పుమా ! 1584

* ఏమేమీ! నారదా! నీవు చెప్పిన ఆ మానవుడు ఎట్టివాడు? ఎంతటివాడు? ఏ తీరున వ్యవహరిస్తాడు? ఎక్క డుంటాడు? వానికి మిత్రు డెవడు? ఏపాటి భుజబలంతో యుద్ధం చేయగలడు? మా బాహుపరాక్రమమునకు తాళి రణరంగంలో ఎదురొడ్డి నిలువగలడా? దర్పోద్ధతుడేనా? చెప్పు.

వ. అనిన విని, దేవముని యిట్లనియె. 1585

* అతనిమాటలకు దేవర్షి అయిన నారదు డిట్లన్నాడు.

సీ. నీలజీమూత సన్నిభ శరీరమువాఁడు
తామరసాభనేత్రములవాఁడు
పూర్ణేందుబింబంబుఁ బోలెడి మోమువాఁ
డున్నత దీర్ఘబాహువులవాఁడు
శ్రీవత్సలాంఛనాంచిత మహోరమువాఁడు
కౌస్తుభమణిపదకంబువాఁడు
శ్రీకర పీతకౌశేయ చేలమువాఁడు
మకరకుండలదీప్తి మలయువాఁడు

తే. రాజ! యింతంతవాఁ డనరాని వాఁడు
మెఱసి దిక్కుల నెల్లను మెఱయువాఁడు
తెలిసి యే వేళ లందైనఁ దిరుగువాఁడు
పట్టనేర్చినఁ గాని లోఁబడనివాఁడు. 1586

● యవనేశ్వరా! విను. అతడు నల్లని మేఘంవంటి దేహం కలవాడు. తామరపూలవంటి కండ్లు కలవాడు. పూర్ణచంద్రబింబం వంటి ముఖం కలవాడు. పొడవైన ఎగుభుజాలు కలవాడు. శ్రీవత్స మనే పుట్టుమచ్చతో పొలుపారు విశాలవక్షం కలవాడు. అతడు కౌస్తుభమణి ధరిస్తాడు. సంపత్కరమైన పసుపుపచ్చని పట్టుపుట్టాలు కడతాడు. చెవులందు మకరకుండలాలు కలవాడు. ఇంతవాడు, అంతవాడు అని చెప్ప శక్యం కానివాడు. అన్నిదిక్కులలో నిండి ప్రకాశించేవాడు. ఎల్లవేళలందును సంచరించేవాడు. పట్టనేరిస్తేనే గాని లోపడనివాడు.

వ. అని మఱియు నతని లక్షణంబులు చెప్పిన విని, సరకుసేయక యవనుం డిట్లనియె. 1587

* అని మరీ మరీ వర్ణించి, నారదుదు శ్రీకృష్ణుని లక్షణాలు చెప్పగా విని లెక్కచేయక కాలయవను డిట్లన్నాడు.

ఉ. యాదవుఁ డెంతవాఁడు ప్రళయాంతకుఁడైన నెదిర్చినేనియున్
గాదనఁ బోర మత్కఠిన కర్కశ బాహుధనుర్విముక్త నా
నా దృఢ హేమపుంఖ కఠిన జ్వలదస్త్ర పరంపరా సము
త్పాదిత వహ్నికీలముల భస్మముఁ జేసెదఁ దాపసోత్తమా! 1588

● ఓ మునిపుంగవా! యాదవు డనగా నెంతవాడు? ప్రళయ కాల యము డైనప్పటికీ న న్నెదిరిస్తే కాదని చెప్పను. కదనంలో కఠినమైన నా బాహువులనుంచి వెలువడే గట్టి బంగారు పింజలుగల పలువిధాలైన నిశితాస్త్రపరంపరలు జనింపజేసే అగ్నిజ్వాలలలో అతణ్ణి బూది గావిస్తాను.

వ. అని పలికి కాలయవనుండు మూఁడుకోట్ల మ్లేచ్ఛవీరులం గూడు కొని, శీఘ్రగమనంబున దాడివెడలి, మథురాపురంబు మీఁద విడిసినం జూచి, బలభద్రసహితుండయి కృష్ణుం డిట్లని వితర్కించె. 1589

● ఈ విధంగా నారదునితో వీరోక్తులాడి కాలయవనుడు మూడుకోట్ల మ్లేచ్ఛవీరులను కూర్చుకుని వేవేగ దాడి వెడలి మథురా నగరాన్ని ముట్టడించాడు. అది చూచి బలరామునితో శ్రీకృష్ణు డిలా ఆలోచించాడు.

సీ. యవనుండు పురమెల్ల నావరించెను నేఁటి
 యెల్లింటిలోపల నీ నడుమను
మాగధుండును వచ్చి మనమీఁద విడియును
 యవనమాగధులు మహాప్రబలులు
పురి రెండువంకలఁ బోరుదు రట్టిచో
 నోపినభంగి నొక్కొక్కచోట
మనము యుద్ధముసేయ మఱియొక్కఁ డెడసొచ్చి
 బంధుల నందఱఁ బట్టి చంపు

తే. నొండెఁ గొనిపోయి చెఱఁబెట్టు నుగ్రకర్ముఁ
డైన మాగధుఁ; డదిగాన నరివరులకు
విడియఁ బోరాడఁగా రాని విషమభూమి
నొక్కదుర్గంబు సేసి యం దునుపవలయు. 1590

* యవనుడు పట్టణాన్ని ముట్టడించాడు. నేడో, రేపో, ఎల్లుండో మాగధుడు కూడా మనమీద దాడి సల్పుతాడు. కాలయవనుడు, జరాసంధుడు మిక్కిలి బలవంతులు. వారు పురం రెండు వైపుల జేరి పోరాడుతారు. అపుడు శక్తికొలది మన మొకచోట యుద్ధం చేస్తున్నప్పుడు, మరొకడు సందుచూచుకొనివచ్చి మనచుట్టా లందరినీ పట్టి చంపవచ్చు. లేదా పట్టుకొనిపోయి చెరబెట్టవచ్చు. జరాసంధుడు క్రూరకర్ముడు. కాబట్టి వైరులు దండు విడియుటకు,

పోరుసల్పుటకు వీలుగాని విషమప్రదేశంలో ఒక దుర్గం నిర్మించి అందులో మనవారి నందరినీ ఉంచాలి.

వ. అని వితర్కించి సముద్రు నడిగి సముద్రమధ్యంబునఁ బండ్రెండు యోజనంబుల నిడుపు నంతియ వెడల్పుం గల్గ దుర్గప్రదేశంబు సంపాదించి, తన్మధ్యంబునం గృష్ణుండు సర్వాశ్చర్యకరంబుగ నొక్క నగరంబు నిర్మింపు మని విశ్వకర్మం బంచిన. 1591

* అని ఆలోచించి శ్రీకృష్ణుడు సముద్రుణ్ణి అడిగి సాగర మధ్యంలో పండ్రెండుఆమడల పొడవు, అంతే వెడల్పుగల ఒకదుర్గమ ప్రదేశాన్ని సంపాదించాడు. దానిమధ్య సర్వజనులకు అచ్చెరువు కూర్చునట్టి ఒకపట్టణం నిర్మించుమని దేవశిల్పి అయిన విశ్వకర్మను ఆజ్ఞాపించాడు.

ఆ. వరుణపురముకంటె వాసవుపురికంటె
ధనదువీటికంటె దండధరుని
నగరికంటె బ్రహ్మనగరంబుకంటెఁ బ్ర
స్ఫుటముగాఁగ నొక్క పురముఁ జేసె. 1592

* వరుణుడు, దేవేంద్రుడు, కుబేరుడు, యముడు, బ్రహ్మ-వీరి పట్టణాలకంటె దృఢముగా విశ్వకర్మ సముద్రమధ్యంలో ఒక పురం నిర్మించాడు.

వ. అందు. 1593

క. అకసము తోడిచూ లనఁ
బ్రాకారము పొడవు గలదు పాతాళమహా
లోకముకంటెను లోఁతెం
తో కల దా పరిఖ యెఱుఁగ దొరక దొకరికిన్. 1594

* ఆ పట్టణంలో ప్రాకారం ఆకసానికి అప్పచెల్లెలుగా ఉంది. కందకం పాతాళంకంటె లోతయినది. దానిలోతు ఎంతో ఎవరికీ అంతుచిక్కదు.

క. కోటయు మిన్నును దమలోఁ
జాటికి జగడింప నడ్డపడి నిల్చిన వా
చాటులరుచిఁ దారకములు
కూటువలై కోటతుదలఁ గొమరారుఁ బురిన్. 1595

● ఔన్నత్యవిషయమున కోటయు, ఆకాశము కలహించు కోగా అడ్డుపడి నిలిచిన వదరుబోతులవలె కోట అగ్రభాగాన చుక్కల గుంపులు ప్రకాశిస్తుంటాయి.

శా. సౌధద్వార కవాట కుడ్య వలభి స్తంభార్గళాగేహళీ
వీథీవేది గవాక్ష చత్వర సభావేశ్మప్రఘాణప్రపా
సౌధాట్టాలక సాల హర్మ్య విశిఖా సోపాన సంస్థానముల్
శ్రీధుర్యస్థితి నొప్పుఁ గాంచనమణి స్నిగ్ధంబులై య ప్పురిన్.

● ఆ పురమందు చక్కని ద్వారములతో, తలుపులతో, గోడలతో, ముంజూరులతో, స్తంభములతో, గడియలతో, గడపలతో, వీథియరుగులతో, కిటికీలతో, ముంగిళ్ళతో, చావళ్ళతో, వాకిటి గదులతో, పానీయశాలలతో కూడిన సౌధములు, కోటబురుజులు, ప్రాకారములు, మేడలు, రాజమార్గములు, సోపానములు హేమరత్నమయములై శోభాసమృద్ధితో సొంపారుతుంటాయి.

క. కూడి గ్రహంబులు దిరుగఁగ
మేడలతుది నిలువులందు మెలఁగెడి బాలల్
క్రీడింపరు పురుషులతో
వ్రీడం దద్వేళలందు విను మా వీటన్. 1597

● ఆ పట్టణపుమేడలచివరి అంతస్తులలో సూర్యాదిగ్రహములు సంచరిస్తూండటంవల్ల ఆ సమయాలలో అక్కడ నివసించే కన్యలు సిగ్గువేత పురుషులతో క్రీడించడం మానివేస్తారు.

ఉ. ఆయత వజ్ర నీలమణి హాటకనిర్మిత హర్మ్యసౌధ వా
తాయనరంధ్ర నిర్యదసితాళ మహాగరు ధూపధూమముల్
తోయదవంక్తులో యనుచుఁ దుంగమహీరుహ రమ్యశాఖలం
జేయుచునుండుఁ దాండవవిశేషము లప్పురిఁ గేకిసంఘముల్.

• ఆ నగరంలో విరివియగు వజ్రాలు, ఇంద్రనీలమణులు, బంగారం అనేవాటితో కట్టిన మేడల, మిద్దెల కిటికీలనుంచి నల్లని అగరు ధూపధూమాలు వెలువడుతూంటవి. అవి మేఘమాలికలనే భ్రమ కలిగిస్తాయి. అందుచే అక్కడ ఎత్తయిన చెట్లకొమ్మలపై చేరి నెమిళ్ళగుంపులు నాట్యం చేస్తుంటాయి.

ఆ. పరస నడచుచుండి సౌధాగ్రహేమ కుం
భములలోన నినుఁడు ప్రతిఫలింప
నేర్పరింపలేక యినులు పెక్కం డ్రంచుఁ
బ్రజలు సూచి చోద్యపడుదు రందు. 1599

* సమీపాన సంచరిస్తుండి భవనోపరిభాగములందున్న బంగారు కలశాలలో సూర్యుడు ప్రతిబింబించగా చూచి నిర్ధారణ చెయ్యలేక సూర్యులు పలువు రున్నారని అక్కడి ప్రజలు భ్రమ చెందుతుంటారు.

ఉ. శ్రీరమణీయగంధములఁ జెన్ను వహించుఁ బురీవనంబులం
గోరక జాలక స్తబక కుట్మల పుష్పమరందపూర వి
స్ఫార లతాప్రకాండ విటపచ్ఛద పల్లవ వల్లరీ శిఫా
సార పరాగమూలఫలసంభృత వృక్షలతావిశేషముల్. 1600

* అక్కడి ఉద్యానవనాలలో నానావిధ వృక్షాలు, లతలు మదికి ఇంపుగొల్పుతూ, మొగ్గలతో, పసరుమొగ్గలతో, అరవిరి మొగ్గలతో, విచ్చినపూలతో, తేనెలతో, బోదెలతో, కొమ్మలతో, ఆకులతో, చిగురాకులతో, పూచిన లేగొమ్మలతో, ఊడలతో, దట్టు

మైన పుష్పాదితో, వేళ్ళతో, పండ్లతో కూడినవై కమ్మని సువాసనలు విరజిమ్ముతుంటాయి.

క. శ్రీకరములు జనహృదయ వ
శీకరములు మందపవనశీర్ణమహాంభ
శ్శీకరములు హంస విహం
గాకరములు నగరి కువలయాబ్జాకరముల్. 1601

● ఆ పురిలో కలువలతో, కమలములతో కూడిన సరస్సులు శ్రీకరములై, జనుల మనస్సులను వశీకరించుచున్నవై, పిల్లగాలులచే చెదరగొట్టబడిన విస్తారమైన నీటితుంపరలుగలవై, హంసలు మొదలైన పక్షులకు నివాసంగా ఉంటాయి.

క. నవకుసుమామోద భరా
జవనము రతిఖిన్నదేహజస్వేదాంభో
అవనము సమధిగతవనము
పవనము విహరించుఁ బౌరభవనములందున్. 1602

● క్రొత్తపూలతావులను విరజిమ్ముతూ, సురతశ్రాంతుల శరీరాలమీది చెమట బిందువులను తొలగిస్తూ ఉద్యానవనాల నుంచి వస్తున్న మలయమారుతం ఆ పట్టణమందిరాలలో విహరిస్తుంది.

క. బ్రహ్మత్వము లఘువగు నని
బ్రహ్మయు బిరుదులకు వచ్చి పట్టఁడుగా కా
బ్రహ్మాదికళలఁ దత్పురి
బ్రహ్మజనుల్ బ్రహ్మఁ జిక్కుపఱుపరె చర్చన్. 1603

● బ్రహ్మత్వము తేలిక అవుతుందని బ్రహ్మదేవుడు పంతాలకు రాడు గాని వస్తే ఆ వీటిలోని విప్రులు బ్రహ్మవిద్యాచర్చల్లో అతణ్ణి చిక్కుపరచగలరు.

క. నగరీభూసుర కృత లవ
దగణిత మఖధూమ పిహితమై కాక మహా
గగనము నీలం బగునే?
మిగులంగ జెడఁ గగునె గ్రహసమృద్ధం బయ్యున్. 1604

● ఆ పురిలోని బ్రాహ్మణులు నలిపే యజ్ఞములందు పొడమిన హోమధూమం ఆవరించడం మూలాన ఆకాశం నల్లబడింది. అంతే కాని సూర్యచంద్రాది గ్రహాలతో కూడినదైనను అంబరం అలా కావడానికి మరో కారణం లేదు.

క. తిరుగరు వలు కర్థులకును
సురుఁగరు ధన మిత్తు రితరసుదతీమణులన్
మరగరు రణమునఁ బిఱిఁదికి
వరుగరు రాజన్యతనయు లా నగరమునన్. 1605

● ఆ నగరంలోని రాజకుమారులు అడినమాట తప్పరు. అర్థి జనులకు ధనమిచ్చుటలో వెనుదీయరు. పరకాంతలపొందు కోరరు. సమరంలో వెనుకకు జారరు.

క. రత్నాకరమై జలనిధి
రత్నము లీ నేర దేటి రత్నాకరమో?
రత్నములఁ గొనుదు రిత్తురు
రత్నాకరజయులు వైశ్యరత్నములు పురిన్. 1606

● సముద్రము రత్నాలకు నిలయమని పేరువడిందే గాని ఎవరి కే రత్నా లివ్వదు. మరి అదేమి రత్నాకరమో! కాని ఇక్కడి వైశ్యరత్నాలు మాత్రం రత్నాలు కొంటూరు, అమ్ముతారు. వారు నిజంగా రత్నాకరమునే జయించారు.

క. తుంగంబులు కరహత గిరి
శృంగంబులు దానజలవశీకృతభృంగీ
భృంగంబులు పటుశైల స
మాంగంబులు నగరి మత్త మాతంగంబుల్. 1607

• ఆ నగరమందలి మదపుటేనుగులు ఎత్తయినవి, తొండాలచే కొండశిఖరాలనైనా పగులగొట్టగలవు. మదజలాలచే ఆడుతుమ్మెదలను మగతుమ్మెదలను వశపరచుకుంటాయి. అవి కొండలవంటి దేహాలు కలవి.

క. ప్రియములు జితపవన మనో
రయములు కృతజయము లధికరమణీయ గుణా
న్వయములు నవినయములు ని
ర్భయములు హతరిపుచయములు పట్టణహయముల్. 1608

• ఆ పురిలోని అశ్వాలు అందమైనవి. వాయువేగ మనోవేగాలను జయించినవి. విజయము చేకూర్చేవి. మిక్కిలి చక్కని గుణాలూ, జాతీ కలవి. అవి భయరహితములు; అణకువ గలవి; శాత్రవ సమూహాలను హతమార్చేవి.

క. పులులపగిదిఁ గంఠీరవ
ముల క్రియ శరభముల మాడ్కి ముదిత మదేభం
బుల తెఱఁగున నానావిధ
కలహమహోద్భటులు భటులు గల రా వీటన్. 1609

• ఆ వీటిలోని వీరభటులు, పులులు, సింహాలు, శరభాలు, మత్తగజాలవంటివారు. నానావిధయుద్ధాలలో ఆరితేరినవారు.

క. ఆ వీట నుండువారికి
భావింపఁగ లేవు క్షుత్పిపాసాదులు త
ద్గోవింద కృపావశమున
దేవప్రతిమాను లగుచు దీపింతు రిలన్. 1610

* ఆ పట్టణంలోని ప్రజలకు ఆకలిదప్పులు లేవు. గోవిందుని కరుణావశమున వారు దేవతలతో సమానులై తేజరిల్లుతుంటారు.

సీ. ఆసక్తి కృష్ణముఖావలోకనమంద
హరిపాదసేవనమంద చింత
వెఱపు నారాయణవిముఖకార్యములంద
పారవశ్యము విష్ణుభక్తియంద
బాష్పనిర్గతి చక్రిపద్యసంస్తుతులంద
పక్షపాతము శార్ఙ్గిభక్తులంద
లేమి గోవిందాన్యలీలాచరణమంద
శ్రమము గోవిందపూజనములంద

తే. బంధ మచ్యుతేతరదుష్టవథములంద
జ్వరము మాధవవిరహితక్షణములంద
మచ్చరము లీశకైంకర్యమతములంద
నరవరోత్తమ! వినుము త న్నాగరులకు. 1611

• పరీక్షిన్మహారాజా! విను. ద్వారకాపురిలోని ప్రజలకు నందనందనుని వదనారవింద సందర్శనమందే అపేక్ష. గోవిందుని చరణాలు కొలుచుటలోనే వారు తలంపుగల్గి ఉంటారు. భగవద్విరుద్ధములైన పనులంటేనే వారు భయపడతారు. విష్ణుభక్తియందే వారికి మైమరపు. చక్రధరునిపై పద్యాలల్లి ప్రస్తుతించుటయందే వారు ఆనందబాష్పాలు విడుస్తారు. శౌరిభక్తులంటేనే వారి కభిమానం. అచ్యుతునికంటె అన్యములైన లీలలను ఆచరించుటయందే వారికి లేమిడి. పురుషోత్తముని పూజించుటయందే వారు శ్రమపడతారు. పరమాత్మను పొందించని కుమార్గములే వారికి చెర. క్షణకాలం పద్మనేత్రుని విడిచితే వారు పరితపించిపోతారు; పరమేశ్వరుని కైంకర్యములందే వారికి పట్టుదల.

వ. మఱియు న ప్పురవరంబున హరికిం బారిజాతమహీజంబును సుధర్మ యనియెడి దేవసభయును దేవేంద్రుం డిచ్చె. కర్రైక దేశంబుల నలుపు గలిగి మనోజవంబులును శుక్లవర్ణంబులు నైన

తురంగంబుల వరుణుం డొసంగె. మత్స్య కూర్మ పద్మ మహాపద్మ శంఖ ముకుంద కచ్ఛపనీలంబు లను నెనిమిది నిధులఁ గుబేరుండు సమర్పించె. నిజాధికారసిద్ధికొఱకుఁ దక్కిన లోకపాలకులును దొల్లి తమకు భగవత్కరుణాకటాక్షవీక్షణంబుల సంభవించిన సర్వసంప దల మరల నతిభక్తితో సమర్పించి రివ్విధంబున. 1612

• మరియు శ్రేష్ఠమగు ఆ పట్టణంలో నివసించే శ్రీహరికి పారిజాతవృక్షమునూ, 'సుధర్మ' అనేదేవసభనూ దేవేంద్రు డిచ్చాడు. ఒక చెవిమాత్రమే నలుపురంగు గలిగి తక్కిన ఒడలెల్ల తెల్లనై, మనో వేగం కలిగిన గుఱ్ఱాలను వరుణు డిచ్చాడు. మత్స్యం, కూర్మం, పద్మం, మహాపద్మం, శంఖం, ముకుందం, కచ్ఛపం, నీలం అనే పేర్లుగల ఎనిమిదినిధులను కుబేరు డొసగినాడు. తక్కిన లోకపాలకు లందరూ తమతమ అధికారాలసిద్ధికోసం మునుపు తమకు భగవంతుని అనుగ్రహంవల్ల లభించిన సకలవిభూతులను మరల అచ్యుతునికే అతిభక్తితో సమర్పించారు.

క. దర్పించి చేసి పురము స
మర్పించెను విశ్వకర్మ మంగళగుణ సం
తర్పితగహ్వరికిన్ గురు
దర్పితదుఃఖప్రవాహతరికిన్ హరికిన్. 1613

• ఈ విధంగా విశ్వకర్మ పరమనైపుణ్యంతో పట్టణం నిర్మించి తన కల్యాణగుణాలతో ధరణిని సంతృప్తి పరచినవాడునూ, మహా విజృంభణం కలిగిన దుఃఖమనే ప్రవాహానికి నావవంటి వాడునూ అయిన శ్రీహరికి సమర్పించాడు.

వ. ఇట్లు విశ్వకర్మ నిర్మితంబైన ద్వారకానగరంబునకు నిజయోగ ప్రభావంబున మథురాపురజనుల నందఱఁ జేర్చి, బలభద్రున కెఱిగించి తదనుమతంబున నందనవనము నిర్గమించు పూర్వదిగ్గజంబు పెంపున, మేరుగిరిగహ్వరంబు వెలువడు కంఠీరవంబు తెఱంగున,

హరిహయదిగంతరాళంబున నుదయించు నంధకారపరిపంథి కైవడి మథురానగరంబు వెలువడి నిరాయుధుండై యెదురువచ్చుచున్న హరిం గని. 1614

• ఈ విధంగా విశ్వకర్మచే నిర్మింపబడిన ద్వారకాపట్టణానికి శ్రీకృష్ణుడు తన యోగమహిమచేత మథురానగరప్రజలందరినీ చేర్చి బలభద్రునకు తెలిపినాడు. ఆయన అనుమతితో నందనవనం నుంచి వెలువడే ఐరావతగజం మాదిరీ, మేరుపర్వత గుహనుంచి బయలు మెరసిన వీరకేసరిమాదిరీ, ప్రాగ్దిశయందు ఉదయించే ప్రభాకరుని మాదిరీ మాధవుడు మథురాపురం నుంచి వెలువడినాడు. అతడు ఆయుధాలు లేకుండా వస్తుండడం కాలయవనుడు చూచాడు.

శ్రీకృష్ణుఁడు నిరాయుధుండై కాలయవనుఁడు వెంటనంటఁ బరువెత్తుట

మ. కరిసంఘంబులు లేవు; రావు తురగౌఘంబుల్; రథవ్రాతముల్
పరివర్తింపవు; రారు శూరులు ధనుర్బాణాసి ముఖ్యాయుధో
త్కరముం బట్టఁడు; శక్రచాపయుతమేఘస్ఫూర్తితో మాలికా
ధరుఁ డొక్కం డదె నిర్గమించె నగరద్వారంబునం గంటిరే? 1615

* అలా చూచి కాలయవనుడు తనవారితో ఇలా అన్నాడు. ఏనుగుల గుంపులు లేవు. గుఱ్ఱాల పౌజులు రావు. తేరుల బారులు నడువవు. శూరులు వెంటరారు. చాపము, బాణములు, ఖడ్గము మొదలగు ఆయుధాలు ధరింపడు. మెడలో హారంధరించి ఇంద్ర ధనుస్సుతోగూడిన మేఘంవలె శోభిస్తూ పట్టణద్వారంనుంచి ఒంటరిగా వస్తున్న అతణ్ణి చూచారా?

శా. ఎన్నే నయ్యె దినంబు లీ నగరిపై నేతెంచి పోరాటకున్
మున్నెవ్వండును రాఁడు వీఁ డొకఁడు నిర్ముక్తాయుధుం డేగు దెం
చె న్నన్నోర్వఁగనో ప్రియోక్తులకునో శ్రీఁగోరియో చూడుఁ డం
చు న్నాత్మీయజనంబుతోడ యవనేశుం డిట్లు తర్కింపఁగన్. 1616

• ఈ మథురానగరిపైకి దండెత్తి ఎన్నో దినము లయినాయి. మును పెవ్వరూ ఇలా రాలేదు. ఆయుధాలు విడిచి వీ డెవడో వస్తున్నాడు. నన్ను జయించడానికో, ప్రియంగా మాట్లాడటానికో, ఏదైనాసంపదను అడగటానికో తెలియకుండా ఉంది. చూడండి, అంటూ ఆ యవనాధిపతి తన వారితో చర్చించాడు.

క. విభులగు బ్రహ్మప్రముఖుల
కభిముఖుఁడై నడవకుండునట్టి గుణాఢ్యుం
డిభరాజగమన మొప్పఁగ
నభిముఖుఁడై నడచెఁ గాలయవనున కధిపా! 1617

* ఓ పరీక్షిన్మహారాజా! బ్రహ్మ మొదలైన వేల్పులకుకూడా ఎదురు మొగమై ఏగనట్టి కల్యాణగుణ సంపన్నుడైన శ్రీకృష్ణుడు కరిరాజునడకవంటి నడకతో కాలయవనుడికి అభిముఖంగా నడిచాడు.

వ. ఆ సమయంబున న య్యాదవేంద్రు నేర్పడం జూచి. 1618

* అట్టి సమయాన యదునాయకుడైన శ్రీకృష్ణుణ్ణి కాలయవనుడు తేరిపారజూచి తనలో ఇలా అనుకున్నాడు.

మ. 'వనజాతాక్షుఁడు సింహమధ్యుఁడు రమావక్షుండు శ్రీవత్సలాం
ఛనుఁ డంభోధరదేహుఁ డిందుముఖుఁ డంచద్దీర్ఘబాహుండు వ
ద్వనమాలాంగదహారకంకణ సముద్యత్కుండలుం డీతఁ డా
ముని సూచించిన వీరుఁడౌ' ననుచు న మ్మ్లేచ్ఛుండు గాఢోద్ధతిన్.

* తామరలవంటి కన్నులు గలవాడును, సింహంనడుము వంటి నడుము గలవాడును, వక్షస్స్థలాన లక్ష్మి గలవాడును, శ్రీవత్స మనే పుట్టుమచ్చ కలవాడును, సోమునివంటి మోముగల వాడును, ఒప్పుతున్న పొడుగాటి చేతులు గలవాడును, చక్కని వనమాల, బాహుపురులు, ముత్యాలదండలు, కంకణాలు, కమ్మలు కలవాడును అయిన వీడు ఆ నారదముని సూచించిన శూరుడు

కావచ్చు. ఇలా భావించి మూర్ఖుడైన కాలయవనుడు మిక్కిలి కావరంతో మిడిసిపడ్డాడు.

సీ. చటులవాలాభీల సైంహికేయుని భంగిఁ
లాలితేతరజటాలతిక దూలఁ
బ్రళయావసర బృహద్భానుహేతిద్యుతిఁ
బరుషారుణశ్మశ్రుపటలి వ్రేలఁ
గాదంబినీచ్ఛన్న కాంచనగిరిభాతిఁ
గవచసంవృతదీర్ఘకాయ మమర
వల్మీకసుప్త దుర్వారాహికైవడిఁ
గోశంబులో వాలు కొమరు మిగుల

ఆ. నార్చి పేర్చి మించి యశ్వంబు గదలించి
గమలసంభవాది ఘనులకైనఁ
బట్టరాని ప్రోడఁ బట్టెద నని జగ
దవనుఁ బట్టఁ గదిసె యవనుఁ డధిప! 1620

* పరీక్షిన్మహారాజా! బ్రహ్మ మొదలైన వేల్పు పెద్దలకుకూడ పట్టనలవిగాని నెఱజాణ శ్రీకృష్ణుడు. లోకరక్షకుడైన అతణ్ణి పట్టుకొనడానికని, కాలయవనుడు తన అశ్వాన్ని కదిలించి గర్జిస్తూ సమీపించాడు. అప్పుడు భయంకొల్పుతున్న రాహువుతోకవలె కాలయవనుని తీగవంటి కఠినమైనజడ కదులుతూ ఉంది. ప్రళయకాలంలోని అగ్నిశిఖలవంటి కాంతితో అతని కఱకైన పల్లమీసాలు వ్రేలాడుతున్నాయి. మబ్బులగుంపుచే కప్పబడిన మేరుపర్వతంలాగా అతని సమున్నతదేహం కవచంతో కప్పబడి ఉంది. పుట్టలో నిదురిస్తున్న పాములాగా అతని ఒరలో ఖడ్గం దీపించింది.

క. ఇటు దన్నుఁ బట్టవచ్చినఁ
బటుతరజవరేఖ మెఱసి పట్టువడక ది
క్తటము లదర హరి వాఱెం
జటులగతిన్ వాఁడు దోడఁ జనుదేరంగన్. 1621

• ఈ విధంగా తన్ను పట్టుడానికై యవనుడు రాగా కృష్ణుడు పట్టువడకుండా మిక్కిలి వేగంగా దిక్కులదరేటట్లు పరుగెత్తినాడు. కాలయవనుడు అతనివెంట పడ్డాడు.

వ. అప్పుడు కాలయవనుం డిట్లనియె. 1622

* ఈ విధంగా వెంటబడి తరుముతూ కాలయవనుడు కమల నయనునితో ఇట్లన్నాడు.

మ. యదువంశోత్తమ! పోకు పోకు రణ మీ నర్హంబు; గంసాదులన్
గదనక్షోణి జయించి తీ వని సమిత్కామంబునన్ వచ్చితిన్;
విదితఖ్యాతులు వీటిపోవ నరికిన్ వెన్నిచ్చి యి బ్భంగి నే
గుదురే రాజులు? రాజమాత్రుఁడవె? వైగుణ్యంబు వచ్చుంజుమీ!

• ఓ యదువంశశ్రేష్ఠుడా! నిలు నిలు. పారిపోకు; నాతో పోరాడు. నీవు సంగరరంగంలో కంసుడు మొదలైన వాళ్ళను జయించిన వీరుడవని విని కలహకాంక్షతో నేను వచ్చాను. నీవంటి రాజులు గడించిన పేరుప్రఖ్యాతులు చెడేటట్లు విరోధికి వెన్ను చూపి ఈలా పారిపోతారా? నీవు సాధారణరాజువు కాదు గదా! నీకు అపఖ్యాతి వస్తుంది సుమా!

మ. బలిమిన్ మాధవ! నేఁడు నిన్ను భువనప్రఖ్యాతిగాఁ బట్టుదున్
జలముల్ సొచ్చిన, భూమిక్రిందఁ జనినన్, శైలంబుపై నెక్కినన్
బలిదండన్ విలసించినన్ వికృతరూపంబుం బ్రవేశించినన్
జలధిన్ దాఁటిన నగ్రజన్మహలికాశ్వాటాకృతుల్ దాల్చినన్. 1624

• మాధవా, నీవు నీటిలో ప్రవేశించిననూ (మత్స్యావతారం), భూమిక్రింద దూరిననూ (కూర్మావతారం), కొండపై నెక్కిననూ (వరాహావతారం), బలి సమీపాన చేరిననూ (వామనావతారము), వికారరూపం గైకొన్ననూ (నృసింహావతారం), సాగరాన్ని దాటిననూ (రామావతారం), బ్రాహ్మణునియొక్కయు

హాలికుని యొక్కయు, అశ్వాతుని యొక్కయు రూపం దాల్చినను (పరశురామ, బలరామ, కల్క్యవతారములు) లోకంలో నాకు ప్రఖ్యాతి లభించేటట్లు బలిమితో నేడు నిన్ను పట్టుకుంటాను.

వ. అదియునుం గాక. 1625

మ. శరముల్ దూఱవు; మద్ధనుర్గుణలతాశబ్దంబు లేతేర ౹ వా
హరిరింఖోద్ధతధూళి గప్ప; దకటా౹ హాస్యుండవై పాఱె; దు
ర్వరపై నే క్రియఁబోరితో కదిసి మున్ వాతాశితోఁ గేశితోఁ
గరితో మల్లురతో జరాతనయుతోఁ గంసావనీనాథుతోన్. 1626

• అంతేకాక ఇంతకూ నా బాణాలు నీ శరీరంలో నాటనేలేదు. నా వింటి అల్లెత్రాటిమ్రోతలు వినిపించనేలేదు. నా గుఱ్ఱాల కాలిడెక్కల ధూళి నిన్ను కప్పివేయనేలేదు. అయ్యయ్యో! అప్పుడే పారిపోతున్నావే! మునుపు కాళియుడితో, కేశితో, కువలయాపీడంతో, జెట్టిమల్లులతో, జరాసంధునితో, కంసరాజుతో ఏ విధంగా పోరాడితివో కదా!

వ. అని పలుకుచుఁ గాలయవనుండు వెంట వరుగుదేర సరకుసేయక మందహాసంబు ముఖారవిందంబునకు సౌందర్యంబు నొసఁగ 'వేగిరపడకు; రమ్ము ర'మ్మనుచు హరియును. 1627

* ఈ విధంగా అంటూ కాలయవనుడు వెన్నుని వెంబడించాడు. శ్రీకృష్ణుడు వానిమాటలు లెక్కపెట్టక చిరునవ్వు తనమోము నలంకరింపగా 'తొందరపడకు రమ్ము, రమ్ము' అని పలికినాడు.

సీ. 'అదె యిదె లోఁబడె' వని పట్టవచ్చినఁ
గుప్పించి లంఘించుఁ గొంతతడవు
పట్టరా; దీతని వరు వగ్గలం' బని
ఖావింపఁగా సమీపమున నిలుచు

నదరి పార్శ్వంబుల కడ్డంబు వచ్చినఁ
గేడించి యిట్టట్టు గికురువెట్టు
వల్మీకతరుసరోవరము లడ్డంబైన
సవ్యాపసవ్యసంచరతఁ జూపుఁ

తే. పల్లములఁ డాఁగు దిబ్బల బయలువడును
నీడలకుఁ బోవు నిఱుముల నిగిడిపాఱు
నన్నుఁబట్టిన నీవు మానవుఁడ' వనుచు
యవనుఁ దెగువంగ బహుజగదవనుఁ డపుడు। 1628

* ఇదిగో తనకు దొరకినాడు. అదిగో తనకు చిక్కినాడు అని కాలయవనుడు పట్టుకొనుటకు రాగా కృష్ణుడు తప్పించి దుముకుతాడు. ఇతని వేగం అధికం. వీణ్ణి పట్టుకోలేను అని కాలయవనుడు భావించినపుడు దామోదరుడు దగ్గరగా వచ్చి నిలబడతాడు. అతడు బంధించడానికి ప్రక్కలకు అడ్డం వచ్చినపుడు శ్రీహరి మోసంతో తప్పించుకొని వెళతాడు. పుట్టలు, చెట్లు, సరస్సులు అడ్డం వచ్చినపుడు గోవిందుడు కుడి, ఎడమ వైపులకు పరుగు దీస్తాడు. పల్లపు నేలలలో దాగుకొంటాడు. మిట్టలెక్కి బయటపడుతాడు. నీడలలోకి వెళతాడు. మారుమూలలలో తారాడుతాడు. నన్ను పడితేనే నీవు మగవాడవు అంటూ లోకరక్షకుడైన శ్రీకృష్ణుడు కాలయవనుణ్ణి ముప్పతిప్పలు పెట్టాడు.

వ. మఱియును. 1629

సీ. సకలభూతవ్రాతసంవాసుఁ డయ్యును
వనములు నగములు వరుస దాఁటు
లోకోన్నతుండును లోకచక్షుఁడు నయ్యు
మాటిమాటికి నిక్కి మగిడి చూచుఁ

బక్షవిపక్షసంబంధశూన్యుం డయ్యుఁ
దను విపక్షుఁడు వెంటఁ దగుల నిగుడు
విజయావజయభావ విరహితుం డయ్యుఁ దా
నపజయంబును జెందినట్లు తోఁచు

ఆ. నభయ భయవిహీనుఁ డయ్యు భీతునిమాడ్కిఁ
గానఁబడును సర్వకాలరూపుఁ
డయ్యుఁ గాలచకితుఁడైన కైవడి వన
మాలిపఱచు వెఱపుమాలి యధిప! 1630

● పరీక్షిన్నరేంద్రా! వనమాలాధరుడైన వనజాక్షుడు వెఱపు వీడి పరుగిడుతాడు. నిఖిలభూతములలో నివసించు వాడయినప్పటికీ అడవులు కొండలు వరుసగా దాటుతాడు. లోకాలలో అధికుడు, లోకాలకు కన్నువంటివాడు అయినప్పటికీ సారెసారెకూ నిక్కి నిక్కి చూస్తాడు. తనవారు, పెరవారు అనే భేదం లేనివా డయినను తాను ఓటమి చెందినట్లే గోచరిస్తాడు. భయనిర్భయాలు లేనివాడయినను భయపడ్డవానివలె కనిపిస్తాడు. కాలస్వరూపు డయినను కాలానికి (కాలయవనుడికి) కలతపడ్డవానిలాగా కనబడతాడు.

వ. ఇ వ్విధంబున. 1631

క. దారిత శాత్రవ భవమ న
పార మహావేగ విజిత పవనున్ యవనున్
దూరము గొని చని కృష్ణుఁడు
ఘోరంబగు నొక్క శైలగుహ వడిఁ జొచ్చెన్. 1632

● ఈ విధంగా శ్రీకృష్ణుడు శత్రుమందిరాలను భేదించినవాడూ, అంతులేని గొప్పవేగంచే గాలినోడించిన వాడూ అయిన యవనుణ్ణి దూరంగా తీసుకుని పోయి భయంకరమైన ఒక కొండగుహలో చటుక్కున ప్రవేశించాడు.

క. అదె లోఁబడె నిదె లోఁబడె
నదె యిదె పట్టెద నటంచు నాశావశుఁడై
యదుసింహుని పదపద్ధతి
వదలక గిరిగహ్వరంబు వాఁడుం జొచ్చెన్. 1633

● 'అదిగో దొరకినాడు, ఇదిగో దొరకినాడు, అదిగో పట్టుకుంటాను, ఇదిగో పట్టుకుంటాను' అని ఆశకు లోపడి ఆ యదుశ్రేష్ఠుని అడుగుల జాడ ననుసరించి కాలయవనుడు తాను కూడా ఆ పర్వత గుహలో ప్రవేశించాడు.

వ. ఇట్లు సొచ్చి మూఢహృదయంబునుం బోలెఁ దమఃపూర్ణంబయిన గుహాంతరాళంబున దీర్ఘతల్పనిద్రితుండై గుఱుపెట్టుచున్న ఒక మహాపురుషునిం గని శ్రీహరిగాఁ దలంచి. 1634

● ఈలా చొరబడి మూఢుని హృదయం మాదిరి అజ్ఞానంతో (చీకటితో) నిండిన గుహలోపల పెద్ద పాన్పుమీద నిద్రలో మునిగి గురకపెడుతున్న ఒక మహాపురుషుణ్ణి చూచి అతడే శ్రీకృష్ణుడని తలంచాడు.

ఉ. ఆలముసేయలేక పురుషాధమ! దుర్లభ కంటకద్రుమా
భీల మహాశిలానహిత భీకరకుంజరఖడ్గసింహ శా
ర్దూల తరక్షుసంకలిత దుర్గపథంబునఁ బాఱుతెంచి యీ
శైలగుహన్ సనిద్రుక్రియఁ జాఁగి నటించినఁ బోవనిత్తునే? 1635

* ఓరీ పురుషాధమా! నాతో యుద్ధంచెయ్యలేక ముండ్లచెట్లు, పెనరాళ్ళు, ఏనుగులు, ఖడ్గమృగాలు, సింహములు, శార్దూలములు, సివంగులు మొదలైన జంతువులచేత భీతికొల్పుతూ నడవడానికి వీలుగాని దారిలోపడి పరుగెత్తివచ్చి ఈ కొండగుహలో దూరి నిద్రించే వాని మాదిరి నటిస్తున్నావు. నిన్ను పోనిస్తా ననుకుంటున్నావా?

క. ఎక్కడ నెవ్వారలకును
చిక్క వనుచు నారదుండు సెప్పెను నాకుం
జిక్కితి వెక్కడఁ బోయెదు?
నిక్కముగా నిద్రపుత్తు నిన్నీకొండన్. 1636

* నీవు ఎక్కడా ఎవ్వరికినీ చిక్కవని నారదుడు చెప్పినాడు. ఇక్కడ నాకు నీవు చిక్కినావు? ఇంకెక్కడికి వెళతావు? నిద్ర నటిస్తున్న నిన్ను నిజంగా ఈ కొండగుహలోనే దీర్ఘనిద్రపుచ్చుతాను.

ఆ. అనుచు యవనుఁ డట్టహాసంబు గావించి
చటుల కఠిన కులిశ సదృశమైన
పాదమెత్తి తన్నెఁ బాటి తద్దేహంబు
నగగుహం బ్రతిధ్వనంబు నిగుడ. 1637

• అంటూ కాలయవనుడు వికారపునవ్వు నవ్వి కర్కశమైన వజ్రాయుధంవంటి తన కాలితో ఎగసి ఆ నిద్రపోతున్న పురుషుణ్ణి తన్నినాడు. ఆ కాలిదెబ్బకు పర్వతగుహ మారుమ్రోగింది.

ఉ. తన్నిన లేచి నీల్గి కమఁదమ్ముల మెల్లన విచ్చి లోపలన్
సన్నపుఁ గిన్క వర్ధిల దిశల్ గన దృష్టి సమిద్ధవిగ్రహో
త్పన్నమహాగ్నికీలముల భస్మముసేసె నతండు సాయక
చ్ఛిన్న విరోధికంతవను శ్రీభవనున్ యవనున్ లఘుక్రియన్. 1638

• అలా వాడు తన్నడంతోనే నిద్రలేచి ఒడలు విరుచుకుంటూ ఆ పురుషుడు పద్మాలవంటి కండ్లు విచ్చి, పొటమరించిన కోపం వృద్ధి పొందగా నాలుగుమూలలు చూచాడు. తన చూపులలో మహోగ్ర మైన ఆగ్రహంవల్ల జనించిన పెద్ద అగ్నిజ్వాలలతో ఆ పురుషుడు శత్రువుల కుత్తుక లనే అడవులను తన కత్తితో ఛేదించినవాడూ, సంపదలకు నిలయమైనవాడూ అయిన కాలయవనుణ్ణి అలవోకగా బూది గావించాడు.

వ. ఇ ట్లేక క్షణమాత్రంబున యవనుండు 'నీఱయ్యె ' ననిన విని రాజిట్లనియె. 1639

• అలా ఒక్క క్షణకాలంలో యవనుడు భస్మమైపోయాడు అని శుకమౌని చెప్పగా విని పరీక్షిత్తు ఇట్లన్నాడు.

ముచుకుందుని పూర్వకథాభివర్ణనము

ఆ. 'ఎవ్వఁ డాత ? డితని కెవ్వండు దండ్రి ఘో
రాద్రిగుహకు నేటి కతఁడు వచ్చి
నిద్రవోయె ? యవను నిటు గాల్ప నెట్లోపెఁ ?
దెలియఁ బలుకు నాకు ధీవరేణ్య !' 1640

• బుద్ధిమంతులలో శ్రేష్ఠుడా, ఆ పురుషు డెవరు? అతనితండ్రి యెవరు? భయంకరమైన కొండగుహలోనికి వచ్చి అతడెందుకు నిద్ర పోయాడు? అతడు కాలయవనుణ్ణి ఎలా కాల్చివేయ గలిగినాడు? ఈ విషయమంతా నాకు విపులంగా వివరించు.

వ. అనిన ఁ బరీక్షిన్నరేంద్రునకు నతికుతూహలంబుతో శుకయోగి వర్యుం డిట్లనియె; నిక్ష్వాకుకుల సంభవుండు మాంధాత కొడుకు ముచుకుందుండను రాజు రాక్షసభీతులైన వేల్పులం బెద్దకాలంబు సంరక్షించిన మెచ్చి, వా రమరలోక సంరక్షకుండైన యా రాజ కుమారునికడం జేరి యి ట్లనిరి. 1641

• అని ఇలా ప్రశ్నించిన పరీక్షిన్మహారాజుకు మిక్కిలి కుతూహలంతో యోగిపుంగవుడైన శుకు డిట్లా అన్నాడు. ఆ పురుషుడు ఇక్ష్వాకు వంశంలో జనించిన మాంధాతయొక్క కుమారుడు అయిన 'ముచుకుందు' డనే మహారాజు. అతడు అసురులకు భయపడిన దేవతలను బహుకాలం సంరక్షించాడు. దేవలోకాన్ని కాపాడిన ఆ రాకుమారుణ్ణి మెచ్చుకుని వేల్పులు అతని దగ్గరచేరి ఇట్లన్నారు.

మ. జగతి న్నిర్గతకంటకం బయిన రాజ్యంబున్ విసర్జించి శూ
రగణాగ్రేసర! పెద్దకాలము మమున్ రక్షించితిలోన నీ
మగువల్ మిత్రులు బంధులున్ సుతులు సంబంధుల్ భువిన్‌లేరు, కా
లగతిం జెందిరి; కాల మెవ్వరికి దుర్లంఘ్యంబె దా నారయన్. 1642

● ఓ వీరాగ్రేసరా, మానవలోకంలో శత్రువులే లేని నీ రాజ్యాన్ని వదలివచ్చి చిరకాలం మమ్మల్ని సంరక్షిస్తూ ఇక్కడే ఉండిపోయావు. ఈలోపల నీ పత్నులు, స్నేహితులు, చుట్టాలు, కుమారులు నీకు సంబంధించిన ఇతరు లందరూ భూమిని విడిచారు. వారంతా మరణించారు. ఎంతటి వారయినా కాలప్రభావాన్ని గడవలేరు.

క. కాలము ప్రబలులకును బలి
కాలాత్మం డీశ్వరుం డగణ్యుఁడు జనులం
గాలవశులఁగాఁ జేయును
గాలము గడవంగలేరు ఘను లెవ్వారున్. 1643

* కాలం మహాబలవంతులకంటె బలమయినది. భగవంతుడే కాలస్వరూపుడు. అత డిట్టివాడని నిరూపింప శక్యం కాదు. అతడు జనులను కాలానికి లోపరుస్తాడు. ఎంత దొడ్డవారయినా కాలాన్ని దాటలేరు.

క. వర మిచ్చెద మర్థింపుము
ధరణీశ్వర! మోక్షపదవి దక్కను మే మె
వ్వరమును విభులముగా మీ
శ్వరుఁడగు హరిదక్క మోక్షసంగతిఁ జేయన్. 1644

● ఓ రాజా, కైవల్యం తప్ప మరి ఏ వరమయినా కోరుకో ఇస్తాము. మోక్ష మివ్వడానికి భగవంతుడు నారాయణుడు తప్ప మే మధికారులం కాము.

వ. అని పలికిన దేవతలకు, నమస్కరించి, ముచుకుందుండు నిద్రం గోరి దేవదత్త నిద్రావశుండై పర్వతగుహాంతరాళంబున శయనించి యుండె; యవనుండు నీఱైన పిమ్మట, హరి ముచుకుందుని ముందట నిల్చిన. 1645

● దేవతలిట్లా చెప్పగా వారికి అభివాదనంచేసి ముచుకుందుడు నిద్రను కోరుకున్నాడు. దేవతలిచ్చిన నిద్రకు లోపడి అతడు కొండ గుహలోపల ఇంతకాలమూ పవళించి ఉండినాడు. కాలయవనుడు భస్మమైన పిదప ముకుందుడు ముచుకుందుని ఎదుట సాక్షాత్కరించాడు.

సీ. వనరుహలోచను వైజయంతీదామ
శోభితు రాకేందు సుందరాస్యు
మకరకుండలకాంతి మహితగండస్థలుఁ
గౌస్తుభాలంకృతు ఘనశరీరు
శ్రీవత్సలాంఛనాంచితవక్షు మృగరాజ
మధ్యుఁ జతుర్బాహు మందహాసు
గాంచనసన్నిభకౌశేయవాసు గాం
భీర్యసౌందర్యశోభితుఁ బ్రసన్ను

ఆ. నమ్మహాత్ముఁ జూచి యాశ్చర్యమును బొంది
తన్మనోజ్ఞదీప్తి దనకుఁ జూడ
నలవిగాక చకితుఁడై యెట్టకేలకుఁ
బలికెఁ బ్రీతి నవనిపాలకుండు. 1646

● కమలములవంటి కన్నులు గలవాడు, వైజయంతి అనే వనమాలతో విలసిల్లువాడు, పున్నమ చంద్రబింబంవలె అందమైన మోముకలవాడు, మకరకుండలాల కాంతితో నిండిన కపోలతలములు కలవాడు, కౌస్తుభమణితో అలంకరింపబడినవాడు, ఉన్నత దేహం కలవాడు, శ్రీవత్స మనే పుట్టుమచ్చతో ఒప్పుతున్న ఉరం కలవాడు, సింగం నడుమువంటి నడుము కలవాడు, చిరునవ్వు చిందువాడు,

పసిడివన్నె పట్టువలువ కలవాడు, గాంభీర్యసౌందర్యాలతో భాసిల్లే వాడు, అనుగ్రహం కలవాడు అయిన ఆ మహానుభావుణ్ణి రాజైన ముచుకుందుడు చూచాడు. ఆశ్చర్యం పొందినాడు. నారాయణుని మనోహరమైన కాంతి చూడటానికి అశక్యమైనందున ఆతడు సంభ్రమం చెంది ప్రీతితో చివరి కిట్లన్నాడు.

మ. శశివో? యింద్రుఁడవో? విభావసుఁడవో? చండప్రభారాశివో?
శశిచూడామణివో? పితామహుఁడవో? చక్రాంకహస్తుండవో?
దిశలున్ భూమియు మిన్ను నిండె నిదె నీ తేజంబుఁ జూడంగ దు
ర్వశమై; యెవ్వఁడ? వేల వచ్చి తిచటన్ వర్తించె దేకాకివై? 1647

* అయ్యా, నీవు చంద్రుడవో, మహేంద్రుడవో, అగ్నివో, సూర్యుడవో, చంద్రశేఖరుడవో, బ్రహ్మదేవుడవో, చక్రపాణివో తెలియడం లేదు. పరికింపగా నీ ప్రకాశం చూడటానికి అశక్యమై దిక్కులందునూ భూమ్యాకాశములందునూ నిండి వుంది. నీ వెవడవు? ఇక్కడి కెందుకు వచ్చావు? ఎందు కిచట ఒంటరిగా ఉన్నావు?

క. ఈ యడవి విషమకంటక
భూయిష్ఠము ఘోరసత్త్వపుంజాలభ్యం
బో యయ్య! యెట్లు వచ్చితి?
నీ యడుగులు కమలపత్త్రనిభములు సూడన్. 1648

● ఈ అరణ్యం మిట్టపల్లాలతో, ముండ్లతో నిండి ఉంది. భయంకర జంతుజాలంవల్ల దుర్గమంగా ఉంది. నీ పాదతలములు పద్మపత్రాలమాదిరి ఉన్నాయి. ఎలా ఇక్కడికి నడిచి వచ్చావు?

వ. మహాత్మా! యేను నీ శుశ్రూషణంబు సేయం గోరెద; నీ జన్మ గోత్రంబు లే నెఱుంగ నర్హుండనేని నెఱింగింపుము; నే నిక్ష్వాకువంశ సంభవుండ; మాంధాతృ నందనుండ; ముచుకుందుం డనువాఁడ; దేవహితార్థంబు చిరకాల జాగరశ్రాంతుండనయి నిద్ర నొంది యింద్రియసంచారంబులు మఱచి. 1649

* మహాత్మా, నీకు సేవ చెయ్యాలని కోరుకుంటున్నాను. నీ కులం, గోత్రం నే నెరుగను. ఇష్టమయితేనే చెప్పు. నేను ఇక్ష్వాకు వంశంలో జన్మించాను. మాంధాత పుత్రుణ్ణి. నా పేరు ముచుకుందు డంటారు. దేవతల మేలుకొరకు బహుకాలం మేలుకొని ఉండినందున బడలిపోయి నిద్రలో మునిగి ఇంద్రియవ్యాపారాలు మరచి ఉన్నాను.

శా. ఏ నిద్రించుచు నుండ నొక్క మనుజుం డేతెంచి దుష్కర్ముఁడై
నీఁడై చెడె నాత్మకిల్బిషమునన్ దర్పోగ్రుఁడై యంతటన్
శ్రీనాథాకృతివైన నిన్నుఁగని వీక్షింప న్నశక్తుండనై
దీనత్వంబును జెందితిన్ ననుఁ గృపాదృష్టిన్ విలోకింపవే. 1650

* నేను నిద్రిస్తుండగా ఎవడో ఒకడు వచ్చాడు. వాడు దుర్మార్గుడు, దారుణమైన గర్వం కలవాడు. వాడు తన పాపంవల్ల భస్మమై నశించాడు. పిదప నారాయణస్వరూపుడవైన నిన్ను దర్శించి తేరిపారచూడడానికి అశక్తుడనై దైన్యం పొందినాను. నన్ను దయతో గూడిన చూపులతో కటాక్షించు.

వ. అనిన విని మేఘగంభీరభాషణంబుల హరి యిట్లనియె. 1651

* ముచుకుందుని పలుకులు విని మేఘగంభీరమైన కంఠంతో గోవిందు డిలా అన్నాడు.

సీ. భూరజంబులనైన భూనాథ! యెన్నంగఁ
జనుఁగాని; నా గుణజన్మకర్మ
నామంబు లెల్ల నెన్నంగ నెవ్వరుఁ జాల
రది యేల? నాకును నలవిగాదు
నేలకు వ్రేఁగైన నిఖిల రాక్షసులను
నిర్జించి ధర్మంబు నిలువఁబెట్ట
బ్రహ్మచే మున్ను నేఁ బ్రార్థింపఁబడి వసు
దేవునింటను వాసుదేవుఁ డనఁగఁ

ఆ. గరుణ నవతరించి కంసాఖ్యతోమున్న
కాలనేమిఁ జంపి ఖలుల మఱియుఁ
ద్రుంచుచున్నవాఁడఁ దొడరి నీచూడ్కి నీ
ఱైనవాఁడు కాలయవనుఁ డనఘ! 1652

● ఓ రాజేంద్రా, భూరేణువులనైనా లెక్కించడం శక్యమౌ తుంది గాని నాకు గల గుణములు, జన్మములు, కర్మములు, నామ ములు ఇన్ని అని ఎవరూ గణింపలేరు, ఇంత యేల? నాకునూ సాధ్యం కాదు. పుడమికి భారభూతులైన రక్కసు లందరినీ జయించి ధర్మాన్ని స్థాపించడానికై బ్రహ్మ పూర్వం నన్ను ప్రార్థించాడు. నేను నరేనని యదుకులాన వసుదేవుని గృహంలో లోకానుగ్రహా కాంక్షతో అవతరించాను. వసుదేవనందనుణ్ణి కనుక నన్ను వాసుదేవు డంటారు. కంసనామంతో ఉన్న కాలనేమిని సంహరించాను. ఇంకా దుర్జనులను తునుమాడుతున్నాను. ఓ దోషరహితుడా, నీ చూపు తగిలి దగ్ధుడైనవాడు కాలయవనుడు.

వ. వినుము; తొలియు నీవు నన్ను సేవించినకతంబున ని న్ననుగ్ర హింప నీకై ఈ గుహకు నేతెంచితి; నభీష్టంబులయిన వరంబు లడుగు మిచ్చెద. మద్భక్తులగు జనులు క్రమ్మఱ శోకంబున కర్హులు గా రనిన హరికి ముచుకుందుండు నమస్కరించి, నారాయణదేవుం డగుట యెఱింగి, యిరువదియెనిమిదవ మహాయుగంబునందు నారాయణుం డవతరించునని మున్ను గర్గుండు చెప్పుటం దలంచి.

● అవనీపతీ! ఆలకించు. పూర్వం నీవు నన్ను ఆరాధించావు. ఆ కారణాన నిన్ను అనుగ్రహించడానికై ఈ పర్వతగుహకు వచ్చాను. నీ కిష్టమైన వరాలు అడుగు ఇస్తాను. నా భక్తులైనవారు ఇక శోకం పొందుటకు తగరు.

హరి ఈలా చెప్పగా ముచుకుందుడు నందపుత్రుడికి నమస్క రించి అతడు సాక్షాన్నారాయణుడని తెలిసి ఇరువదెనిమిదవ మహా యుగంలో భూమిపై పుండరీకాక్షు డవతరిస్తాడని తొల్లి గర్గాచార్యులు చెప్పినమాట జ్ఞప్తికి తెచ్చుకుని ఇలా అన్నాడు.

ముచుకుందుఁడు శ్రీకృష్ణుని స్తోత్రము చేయుట

క. నీ మాయఁ జిక్కి పురుష
స్త్రీమూర్తికజనము నిన్ను సేవింపదు; వి
త్తామయగృహగతమై సుఖ
తామసమై కామవంచితంబయి యీశా! 1654

● సర్వేశ్వరా, నీ మాయచేత మోహితులై స్త్రీలును, పురుషులును నిన్ను భజింపరు. సుఖలేశం తోపించు విత్తమునందును, గృహాదులందునూ తగులం పొంది వారు వంచితు లవుతున్నారు.

చ. పూని యనేకజన్మములఁ బొంది తుదిం దన పుణ్యకర్మ సం
తానము పేర్మిఁ గర్మ వసుధాస్థలిఁ బుట్టి ప్రపూర్ణదేహుఁడై
మానవుఁడై గృహేచ్ఛఁబడు మందుఁ డజంబు తృణాభిలాషియై
కానకపోయి నూతఁబడు కైవడి నీ పదభక్తిహీనుఁడై. 1655

* జీవి పలుజన్మము లెత్తియెత్తి తుదకు పుణ్యకార్యముల ఫలంగా కర్మక్షేత్రమైన ధరాతలంలో పూర్ణదేహంతో మానవుడుగా పుడతాడు. పుట్టికూడ మూఢతవల్ల నీ పదభక్తి లేనివాడై మేక, గడ్డి మీది ఆశతో కనులు గానక వెళ్ళి వెళ్ళి నూతిలో పడిన విధంగా గృహాదులందలివాంఛకు వశుడై చెడుతున్నాడు.

క. తరుణీపుత్రధనాదుల
మరగి మహారాజ్యవిభవ మదమత్తుఁడనై
నరతనులుబ్ధుఁడ నగు నా
కరయఁగ బహుకాల మీశ! యూఁడిపోయెన్. 1656

● పరమేశ్వరా, ఆలు, బిడ్డలు, డబ్బు మున్నగువాటియందు తగులము పొంది మహారాజ్య సంపత్తిచేత మదించిన మనసు గలవాడనై శరీరమునందు పేరాస వహించియున్న నాకు వ్యర్థముగా చాలకాలం గడచిపోయింది.

క. ఘట కుడ్య సన్నిభం బగు
చటులకళేబరముఁ జొచ్చి జనపతి నంచుం
బటు చతురంగంబులతో
నిటు నటుఁ దిరుగుదుము నిన్ను నెఱుఁగక యీశా: 1657

● ప్రభూ, కుండ, గోడవలె జడమైన, చంచలమైన ఈ దేహంలో ప్రవేశించి నేను రాజునంటూ రథ, గజ, తురగ, పదాతులతో విర్రవీగుతూ, భూమియందు అటునిటు క్రుమ్మరుతుంటినే గాని నిన్ను తెలుసుకోలేకపోతిని.

ఆ. వివిధకామభోగవిషయులాలసు మత్తు
నప్రమత్తవృత్తి నంతకుండ
వైన నీవు వేళ యరసి త్రుంతువు సర్ప
మొదిఁగి మూషికంబు నొడియునట్లు. 1658

* పలువిధములైన మనోరథములు, శబ్దాది విషయములందు ఆస వహించి ఏమరియుండగా నీవు మాత్రం ఏమరుపాటు చెందక అంతకస్వరూపుడవై పాము కనిపెట్టి యుండి తటాలున ఎలుకను ఒడిసి పట్టుకున్నట్లు సమయం రాగానే పట్టి విషయలాలసులను హరిస్తావు.

క. నరవరసంజ్ఞితమై రథ
కరిసేవితమైన యొడలు కాలగతిన్ భీ
కరమృగభక్షితమై దు
స్తరవిట్క్రిమిభస్మసంజ్ఞితం బగు నీశా! 1659

● గోవిందా, 'ప్రభువు' అని పేరు వహించి రథాలమీద, ఏనుగుల మీద ఎక్కి తిరిగిన శరీరం కాలవశమై భయంకరములైన జంతువులచే భక్షింపబడటంవల్ల పురీషమనీ, మురిగిపోతే పురుగులనీ, కాలిపోతే బూది అనీ వ్యవహరింపబడుతోంది.

ఆ. సకలదిశలు గెలిచి సములు వర్ణింపంగఁ
జారుపీఠమెక్కి సార్వభౌముఁ
డైన సతుల గృహములందుఁ గ్రీడాభోగ
వృత్తిమందు నిన్ను వెదకలేఁడు. 1660

అన్ని దిక్కులనూ జయించి సాటివారు కొనియాడగా ఉన్నతపీఠం అధిష్ఠించిన చక్రవర్తి అయినప్పటికీ సుందరీమణుల మందిరాలలో కామసుఖాలు అనుభవిస్తాడేగాని నిన్ను అన్వేషించడు.

ఆ. మానసంబుఁ గట్టి మహితభోగంబులు
మాని యింద్రియముల మదము లణఁచి
తపముసేసి యింద్రతయ కోరుఁగాని నీ
యమృతపదము గోరఁ డజ్ఞుఁ డీశ! 1661

* ఈశ్వరా, జ్ఞానహీనుడు మనస్సును బంధించి గొప్ప భోగములను విడనాడి ఇంద్రియాటోపమును అణచివేసి తపస్సుచేసి ఇంద్రపదవి నభిలషిస్తాడే కాని నీ అమృతస్థానమును కోరడు.

సీ. సంసారియైయున్న జనునకు నీశ్వర!
నీకృప యెప్పుడు నెఱయఁ గల్గు
నప్పుడు బంధంబు లన్నియుఁ దెగిపోవు;
బంధమోక్షంబైనఁ బ్రాప్తమగును
సత్సంగమంబు! సత్సంగమంబున నీదు
భక్తి సిద్ధించు; నీ భక్తివలన
సన్ముక్తియగు; నాకు సత్సంగమముకంటె
మును రాజ్యబంధనిర్మూలనంబు

తే. గలిగినది దేవ! నీ యనుగ్రహము గాదె?
కృష్ణ! నీ సేవగాని తక్కినవి వలదు
ముక్తిసంధాయి వగు నిన్నుఁ ముట్టఁ గొలిచి
యాత్మబంధంబు గోరునే యార్యుఁ డెందు? 1662

* అచ్యుతా, నీ అనుగ్రహం ఎపుడు కలుగుతుందో అపుడే సంసారమందు పరిభ్రమిస్తున్న పురుషుడికి ఆ సంసారబంధాలు వదలిపోతాయి. సంసారనివృత్తి కలిగినప్పుడు సత్పురుషులతో సహవాసం లభిస్తుంది. సత్సంగంచేత నీయందు భక్తి సిద్ధిస్తుంది. నీయందు నెలకొన్న భక్తివల్ల ముక్తి చేకూరుతుంది. నాకు భాగవతోత్తముల సాంగత్యమునకు పూర్వమే రాజ్యపాశనిర్మూలనం జరిగింది. ఇదంతా నీ కృప. కృష్ణా! నాకు నీ పాదసేవనం తప్ప తక్కిన వేమియూవద్దు. విజ్ఞుడైనవాడు ముక్తిదాయకుడవైన నిన్ను సేవించి తనకు ప్రతిబంధకాలైన శబ్దాది విషయభోగాలను వాంఛింపడు గదా!

వ. కావున రజస్సత్త్వతమోగుణంబుల యనుబంధంబులగు నైశ్వర్య శత్రు మరణ ధర్మాది విశేషంబులు విడిచి, యీశ్వరుండును విజ్ఞానఘనుండును, నిరంజనుండును, నిర్గుణుండును, నద్వయుండును నైన పరమపురుషుని నిన్నాశ్రయించెదఁ; జిరకాలంబు గర్మఫలంబులచేత నార్తుండనై క్రమ్మఱం దద్వాసనల సంతప్తుండనై తృష్ణం బాయక శత్రువులైన యింద్రియంబు లాఱింటిని గెలువలేని నాకు శాంతి యెక్కడిదిః విపన్నుండనైన నన్ను నిర్భయుం జేసి 'రక్షింపు' మనిన ముచుకుందునికి హరి యిట్లనియె. 1663

● కాబట్టి సత్త్వము, రజస్సు, తమస్సు అను త్రిగుణాలను అనువర్తించునట్టి ఐశ్వర్యము, శత్రుమరణము, ధర్మము ఇత్యాది విశేషము లన్నింటినీ వదలి నేను ఈశ్వరుడూ, విజ్ఞానఘనుడూ, మాయాకార్యములైన రాగాదులు లేనివాడూ, త్రిగుణాలతో సంబంధము లేనివాడూ, తనకు సమానుడూ, తనకంటె అధికుడు కలుగనివాడూ, పురుషులలో ఉత్తముడూ అయిన నిన్ను శరణు పొందుతాను. బహుకాలం ప్రారబ్ధకర్మఫల మనుభవిస్తూ దుఃఖితుడనై ఇంకా పూర్వజన్మవాసనలచే సంతాపాన్ని పొందుతూ ఆశ వదలక శత్రువులైన కన్ను,

ముక్కు, చెవి, చర్మము, నాలుక, మనస్సు అనే ఆరు జ్ఞానేంద్రియా లను జయించలేని నాకు శాంతి ఎలా లభిస్తుంది? ఆపన్నుడనైన నన్ను మన్నించి భయరహితుణ్ణి గావించి కాపాడుమంటూ వేడు కొన్న ముచుకుందుడితో ముకుందుడు ఇట్లన్నాడు.

ఉ. మంచిది నీదు బుద్ధి నృపమండన ! నీవు పరార్థమెట్లు వ
ర్తించిన నైనఁ గోరికల దిక్కునఁ జిక్కవు మేలు; నిర్మలో
దంచితవృత్తి నన్ గొలుచు ధన్యు లబద్ధులు నెట్లు నీకు ని
శ్చంచలభక్తి గల్గెడిని సర్వము నేలుము మానవేటికిన్. 1664

● రాజులకు అలంకారమయినవాడా, నీ బుద్ధి మంచిది. నీవు ఇతరులకోసమై ఎలా ప్రవర్తించినప్పటికీ కోరికలకు ప్రలోభం చెందలేదు. నిర్మలమనస్సుతో నన్ను సేవించువారు ధన్యాత్ములు. వారు సంసారబద్ధులు కా నేరరు. నీకు నాయందు దృఢమైన భక్తి ననుగ్రహిస్తున్నాను. నాయందు మనసుంచి సమస్తం పరిపాలించు. మానవలసిన పనిలేదు.

వ. 'నరేంద్రా ! నీవు తొల్లి క్షత్రధర్మంబున నిలిచి, మృగయావినో దంబుల జంతువుల వధియించినాఁడవు; తపంబునఁ దత్కర్మవిము క్తుండవై తర్వాతిజన్మంబున సర్వభూతసఖిత్వంబుగలిగి, బ్రాహ్మణ శ్రేష్ఠుండవై నన్నుం జేరెద' వని వీడ్కొలిపిన హరికిం బ్రదక్షి ణంబు వచ్చి నమస్కరించి గుహ వెడలి సూక్ష్మప్రమాణదేహం బులతో నున్న మనుష్య పశు వృక్ష లతాదులం గని కలియుగంబు ప్రాప్తంబగు నని తలంచి, యుత్తరాభిముఖుండై తపోనిష్ఠం డగుచు, సంశయంబులు విడిచి సంగంబులు పరిహరించి విష్ణుని యందుఁ జిత్తంబుఁ జేర్చి గంధమాదనంబు ప్రవేశించి, మఱియు నరనారాయణ నివాసంబైన బదరికాశ్రమంబు చేరి, శాంతుండై హరి నారాధించుచుండె. నిట్లు ముచుకుందుని వీడ్కొని. 1665

● ఓ రాజోత్తమా! పూర్వం నీవు క్షాత్రధర్మం అవలంబించి వేట మొదలైన వేడుకలతో జంతువులను చంపినావు. కనుక తపస్సు చేసి ఆ పాపం బాపుకో. మరుసటి జన్మలో బ్రాహ్మణుడవై, ప్రాణు లందు మైత్రి కలగి నన్ను పొందగలవు – అని నారాయణుడు అతనికి వీడ్కోలిచ్చాడు. ముచుకుందుడు మురవైరికి ప్రదక్షిణం చేసి ప్రణ మిల్లి గుహనుంచి వెలుపలికి వచ్చాడు. అతడు మనుష్యులు, పశువులు, చెట్లు, తీవలు అల్పపరిమాణాలై ఉండడం చూచాడు. కలియుగం రాబోతున్నదని తలంచి ఉత్తరదిక్కునకు బయలుదేరాడు. ఆయన తపోదీక్ష వహించి అనుమానాలు వదలిపెట్టి, అన్నిటియందు ఆసక్తి మాని హరిమీద మనస్సు లగ్నం చేసి గంధమాదనపర్వతాన్ని ప్రవేశించాడు. అక్కడినుంచి నరనారాయణులకు నెలవైన బదరి కాశ్రమాన్ని చేరి శాంతుడై అచ్యుతుని ఆరాధింపసాగాడు.

శా. అచ్ఛిద్రప్రకటప్రతాపరవిచే నాశాంతరాళంబులం
బ్రచ్ఛాదించుచుఁ గ్రమ్మఱన్ మథురకుం బద్మాక్షుఁ డేతెంచి వీ
డాచ్ఛాదించి మహానిరోధముగఁ జక్రాకారమై యున్న యా
మ్లేచ్ఛవ్రాతమునెల్లఁ ద్రుంచె రణభూమిం బెంపు సొంపారఁగన్.

● ఈలా ముచుకుందుని వీడ్కొలిపి పద్మములవంటి లోచన ములుగల శ్రీకృష్ణుడు లోపంలేని ప్రతాపమనే భానుతేజంతో దిగంత రాలను కప్పివేస్తూ మరల మథురానగరానికి విచ్చేశాడు. అతడు పట్టణ మంతటినీ చక్రాకారంతో ఆవరించి, ముట్టడించియున్న యవను లందరినీ సమరభూమిలో పెంపుసొంపారగా నిర్మూలించాడు.

జరాసంధుండు ప్రవర్షణగిరిని దహించుట

వ. ఇట్లు మ్లేచ్ఛబలం బొరిగొని మఱియు న మ్మథురానగరంబునం గల ధనంబు ద్వారకానగరంబునకుం బంచిన మనుష్యులు గొనిపోవు నెడ.

● ఈలా మ్లేచ్ఛులను సంహరించి, మథురానగరంలో ఉండే సిరిసంపదలను ద్వారకాపురికి తరలించడానికి మనుషులను ఏర్పాటు చేశాడు. వారు విత్తాన్ని గైకొని వెళ్ళే సమయంలో.

సీ. ఘోటకసంఘాతఖుర సమున్నిర్గత
ధూళి జీమూతసందోహముగను
మహనీయ మదకల మాతంగకటదాన
ధారలు కీలాలధారలుగను
నిరుపమస్యందననేమి నిర్ఘోషంబు
దారుణగర్జితధ్వానముగను
నిశితశస్త్రాస్త్రమానితదీర్ఘ రోచులు
లలితసౌదామినీలతికలుగను

తే. శత్రురాజ ప్రతాపాగ్ని శాంతముగను
వృష్టికాలము వచ్చు న వ్విధము దోఁప
నేఁగుదెంచె జరాసంధుఁ డిరువదియును
మూఁడునక్షౌహిణులు దన్ను మొనసి కొలువ. 1668

* జరాసంధుడు ఇరవైమూడు అక్షౌహిణుల సేనతో మథురా పట్టణం మీదికి దండెత్తి వచ్చాడు. అతని గుఱ్ఱాల గుంపుయొక్క డెక్కలనుండి పైకి రేగిన దుమ్ము మబ్బుల గుంపువలె ఉన్నది. దొడ్డవైన మదపుటేనుగుల చెక్కిళ్ళనుంచి స్రవించే మదజలధారలు వర్ష జలధారలను పురుడించాయి. కదిలే రథచక్రాల రొద ఘోరమైన ఉరుముల మ్రోత అనిపించింది. వాడియైన శస్త్రాస్త్రాల పెనుకాంతులు మెరిసే మెరుపుతీవలను పోలినాయి. శత్రురాజుల శౌర్యమనే అగ్నిని చల్లార్చే వర్షాకాలం మాదిరి అతడి సైన్యం గోచరించింది.

చ. ఇటు చనుదెంచియున్న మగధేశ్వరవాహినిఁ జూచి యుద్ధ సం
ఘటనము మాని మానవులకై వడి భీరుల భంగి నోడి ముం
దటి ధనమెల్ల డించి మృదుతామరసాభపదద్వయుల్ క్రియా
పటువులు రామకేశవులు పాఱిరి ఘోరవనాంతరంబులన్. 1669

• ఈ విధంగా మథురానగరం మీదికి దండెత్తి వచ్చిన మగధరాజు జరాసంధుడి సైన్యాన్ని చూచి యుద్ధప్రయత్నం మాను కుని కేవలం సామాన్యమనుజుల వైఖరి రణభీరువుల కైవడి జంకి పోయి తమ విత్తమంతటిని అక్కడ దిగవిడచి మెత్తటి తామరదళాల వంటి అడుగులు కలవారూ, కార్యశూరులూ అయిన రామకృష్ణులు భయంకరారణ్యంలో పడి పరుగెత్తసాగారు.

వ. ఇట్లు పఱచుచున్న కృష్ణబలభద్రులం జూచి వారల ప్రభావంబు లెఱుంగక పరిహసించి. 1670

* అలా పారిపోతున్న బలరామకృష్ణులను చూచి వారి మహిమలు గుర్తింపలేక జరాసంధుడు ఎగతాళి చేశాడు.

ఉ. 'ఓ యదువీరులార! రభసోద్ధతిఁ బాఱకుఁ; డిట్లు పాఱినం
బోయెడువాఁడఁ గాను; మిము భూమి నడంగిన మిన్ను బ్రాఁకినం
దోయధిఁ జొచ్చినం దగిలి త్రుంచెద'నంచు సమస్తసేనతోఁ
బాయక వచ్చె వెంటఁబడి బాహుబలాఢ్యుఁడు మాగధేశుఁడున్. 1671

* భుజబలసంపన్నుడైన ఆ మగధరాజు ఇలా అన్నాడు: ఓ యాదవవీరులారా, మహావేగంతో పారిపోకండి. ఇలా పరుగెత్తి వెళుతున్నా మిమ్ము విడిచిపెట్టేవాణ్ణి కాను. భూమిలో దాగినా, ఆకసాని కెగిరినా, సాగరంలో ప్రవేశించినా వెంటనంటి మిమ్మల్ని హతమారుస్తాను-అంటూ అతడు వదలక సకలసేనలతో వారి వెంట పడ్డాడు.

వ. మఱియుం బలాయమానులై బహుయోజనంబుల దూరంబు సని విశ్రాంతులై దనకు డాఁగ నెల వగునని యింద్రుండు మిక్కిలి వర్షింపఁ బ్రవర్షణాఖ్యంబై పదునొకండు యోజనంబుల పొడవును నంతియ వెడలుపును గల గిరి యెక్కి రంత. 1672

* రామకృష్ణులు పరుగెత్తి పరుగెత్తి పెక్కామడల దూరం వెళ్ళి సేదదీర్చుకోడానికి, దాగుకోడానికి తగిన చోటని తలచి దేవేంద్రుడు అధికంగా వానలు కురియించడం చేత ప్రవర్షణమనే పేరు వహించి, పదకొండు ఆమడల పొడవు అంతే వెడల్పు గల ఒక పర్వతాన్ని ఆరోహించారు.

శా. ఆ శైలేంద్రముఁ జుట్టి రా విడిసి రోషావిష్టుఁడై మాగధో
ర్వీశుం డా వసుదేవనందనులఁ దా వీక్షింపఁగా లేక త
న్నాశేచ్ఛన్ బిలసానుశృంగములఁ బూర్ణక్రోధుఁడై కాష్ఠముల్
రాసుల్ గా నిడి చిచ్చువెట్టఁ బనిచెన్ రౌద్రంబుతో భృత్యులన్.

* మగధదేశాధీశుడైన జరాసంధుడు కోపవివశుడై ఆ పర్వత రాజంచుట్టూ దండు విడిశాడు. అక్కడ రామకృష్ణులను కనుగొనలేక పోయాడు. వారి వినాశం కోరి ఆ కొండగుహల్లో, చరియల్లో, శిఖరాల్లో కట్టెల గుంపులు పేర్చి దహించివేయండని రౌద్రంతో సేవకులను ఆజ్ఞాపించాడు.

వ. ఇట్లు జరాసంధపరిజన ప్రదీపితంబైన మహానలంబు దరికొనియె నందు. 1674

* ఈలా జరాసంధుని భృత్యులచేత ముట్టించబడిన మహాగ్ని దరికొని ఆ పర్వతాన్ని కాల్చివేసింది.

క. పొగ లెగసెఁ బొగలతుదలను
మిగులుచు మిడుఁగుఱులు నిగిడె మిడుఁగుఱుగమి ము
న్నుగ బ్రహ్మాండము నిండెను
భగ భగమని మంట లొదవె భయదము లగుచున్. 1675

• పొగలు పైకెగసినాయి. పొగలమీద మిక్కుటంగా నిప్పురవ్వలు వ్యాపించాయి. ఆ మిణుగురు గుంపులచే బ్రహ్మాండం నిండింది. అటుపై భయం గొల్పుతూ భగభగమని మంటలు లేచాయి.

వ. మఱియు న మ్మహానలంబు బిలసానుశృంగవృక్షలతాకుంజపుంజం బుల దరికొని, శిఖలు కిసలయంబులుగ, విస్ఫులింగంబులు విరు లుగ, సముద్ధూతధూమపటలంబులు బంధురస్కంధశాఖావిసరంబు లుగ, ననోకహంబు కైవడి నభ్రంకషంబై ప్రబల్పి కఠోరసమీరణ సమున్నత మహోల్కాజాల తిరోహిత వియచ్చర విమానంబును, వివిధ విధూమ విస్ఫులింగ విలోకనప్రభూత నూతనతారకాభ్రాంతి విభ్రాంత గగనచరంబును, సంతప్యమాన సరోవరసలిలంబును, విశాలజ్వాలాజాలజాజ్వల్యమాన తక్కోలచందనాగరుకర్పూరధూమ వాసనావాసిత గగనకుహరంబును, గరాళకీలాజాలదందహ్యమాన కీచకనికుంజపుంజసంజనిత చిటపటారావ పరిపూరిత దిగంతరాళం బును, భయంకర బహుళతరశిఖాభిద్యమాన పాషాణఘోషణపరి మూర్ఛిత ప్రాటిలోకంబును, సంతప్యమాన శాఖిశాఖాంతరనిబిడ నీడనిహిత శాబకవియోగ దుఃఖడోలాయమాన విహంగకులంబును, మహాహేతిసందీప్యమాన కటిసూత్ర సంఘటిత మయూరపింఛ కుచకలశయుగళభారాలస శబరకామినీసమాశ్రిత నిర్ఝరంబును, దగ్ధానేకమృగమిథునంబునై యేర్పడెడ. 1676

* ఆ మహాగ్ని గుహలందునూ, చరియలందునూ, శిఖరము లందునూ గల చెట్లను, తీవలను, పొదలను అంటుకొని మండింది. జ్వాలలే చిగుళ్ళుగా, మిణుగురులే పూలుగా, పైకిలేచిన పొగల ప్రోగులే దట్టమైన బోదెలుగా, కొమ్మలుగా కనిపించగా ఆ అగ్ని ఒక మహావృక్షంవలె ఆకసమంటుతూ వ్యాపించింది. దారుణమైన వాయువుచేత లేచిన గొప్ప నిప్పుకణికలు ఖేచర విమానాలను మరుగుపరిచాయి. పొగలేక కణకణలాడే పలురకాల మిణుగురులను చూచి అవి క్రొత్తనక్షత్రాలని అంబరచారులైన వేల్పులు విభ్రాంతి చెందినారు. సరస్సులలోని నీరు సలసల క్రాగిపోయింది. పెను మంటలు అంటుకొని కాలుతున్న అగరు, తక్కోల, చందన కర్పూర

వృక్షాల పొగల సుగంధంతో ఆకాశమండలమంతా పరిమళించింది. భయంకరమైన మంటలతో మిక్కిలి మండుతున్న వెదురుపొదల గుంపునుండి పుట్టిన చిటపట ధ్వనులు దిక్కుల నడిమి భాగాన్ని నింపివేశాయి. ఘోరములు, మిక్కుటములు అయిన మంటలచే పగిలిపోతున్న రాళ్ళమ్రోతవల్ల భూతజాలం మూర్ఛిల్లింది. దగ్ధమవుతున్న చెట్ల కొమ్మల నడుమ దట్టమైన గూండ్లలో నివసిస్తున్న తమ పిల్లల ఎడబాటువల్ల ఏర్పడిన దుఃఖంతో పక్షిసమూహం కలత చెందింది. తమ మొలనూళ్ళయందు కట్టుకున్న నెమలి యీకలకు మంటలంటుకోగా, కుండలవంటి కుచాలబరువుచే మందగమనలై చెంచితలు సెలయేళ్ళ నాశ్రయించారు. ఆ అగ్ని అనేక మృగ మిథునాలను దహించివేసింది.

క. ఇల నేకాదశయోజన
ముల పొడవగు శైలశిఖరమున నుండి వడిన్
బలకృష్ణులు రిపుబలముల
వెలి కుఱికిరి కానఁబడక విలసితలీలన్. 1677

• ఆ సమయంలో పదకొండామడల పొడవైన ఆ కొండ కొమ్మునుంచి బలరామకృష్ణులు జరాసంధుని బలముల కంటబడకుండా కుప్పించి వెలుపలికి దుమికినారు.

వ. ఇట్లు శత్రువుల వంచించి యాదవేంద్రులు సముద్రపరిఖంబైన ద్వారకానగరంబునకుం జనిరి. జరాసంధుండు వారలు దగ్ధులైరని తలంచుచు బలంబులుం దానును మగధదేశంబునకు మరలి చనియె; నంత. 1678

* ఈ విధంగా విరోధులను మోసగించి యదుకుల విభులైన రామకృష్ణులు సాగరమే అగడ్తగా కలిగిన ద్వారకాపురికి చేరుకున్నారు. జరాసంధుడు వారు కాలిపోయారని భావించి తనసేనలతో మగధదేశానికి మరలి పోయాడు.

రుక్మిణీ కల్యాణ కథాప్రారంభము

క. ఆ వనజగర్భుపంపున
రైవతుఁ డను రాజు దెచ్చి రాముని కిచ్చెన్
రేవతి యనియెడు కన్యక
భూవర! మును వింటికాదె బుద్ధిం దెలియన్. 1679

* పరీక్షిన్మహారాజా! బ్రహ్మదేవుని ఆజ్ఞననుసరించి రైవతుడనే రాజు 'రేవతి' అనే పేరుగల కన్యను తెచ్చి బలరామున కిచ్చి వివాహం చేశాడు. ఇంతకుమునుపే ఈ విషయం వివరంగా విన్నావు గదా!

వ. తదనంతరంబ. 1680

మ. ఖగనాథుం డమరేంద్రు గెల్చి సుధ మున్ గైకొన్న చందంబునన్
జగతీనాథులఁ జైద్యపక్షచరులన్ సాళ్వాదులం గెల్చి భ
ద్రగుఁడై చక్రి వరించె భీష్మకసుతన్ రాజీవగంధిన్ రమా
భగవత్యంశభవన్ మహాగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్. 1681

* ఆ విధంగా బలరామునికి పెండ్లి కాగానే పూర్వము పక్షిరాజైన గరుత్మంతుడు దేవేంద్రుని జయించి అమృతాన్ని ఆత్మీయం చేసుకున్న రీతిగా చేదిదేశాధీశ్వరుడైన శిశుపాలుణ్ణీ, అతనిపక్షం వహించిన సాళ్వుడు మొదలైన నరపతులనూ ఓడించి మంగళకరుడూ చక్రాయుధుడూఐన శ్రీకృష్ణుడు భీష్మకమహారాజు కొమార్తెయగు రుక్మిణిని పెండ్లాడినాడు. ఆ రుక్మిణీదేవి పద్మంవంటి దేహపరిమళం గలది. లక్ష్మీదేవి అంశతో జన్మించింది. గొప్ప గుణవంతురాలు. కన్నెలలో మిన్న.

వ. అనిన రా జిట్లనియె. 'మున్ను రాక్షసవివాహంబున స్వయంవరమునకు వచ్చిన హరి రుక్మిణిం గొనిపోయెనని పలికితివి. కృష్ణుం డొక్కరుం డెవ్విధంబున సాళ్వాదుల జయించి తన పురంబునకుం జనియె; నదియునుం గాక, 1682

* ఈ విధంగా శుకయోగీంద్రుడు చెప్పగా విని పరీక్షిత్తు ఇట్లన్నాడు. మునీంద్రా! మునుపు గోవిందుడు స్వయంవరానికి వచ్చి రుక్మిణీదేవిని రాక్షస వివాహపద్ధతితో తీసుకవెళ్ళినాడని చెప్పి నావు. ఏ విధంగా అతడొక్కడే సాళ్వుడు మొదలైన రాజులను జయించి ద్వారకాపట్టణానికి ఆమెను తోడ్కొని వెళ్ళినాడు?

శా. కల్యాణాత్మకమైన విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తి పై
కల్యం డెవ్వఁడు తృప్తుఁడౌ; నవి వినంగాఁ గ్రొత్తలౌచుండు సా
కల్యం బేర్పడ భూసురోత్తమ! యెఱుంగం బల్కవే! రుక్మిణీ
కల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్. 1683

• బ్రాహ్మణోత్తమా! శుభదాయకాలైన శ్రీహరికథలు వింటే చాలు-మనోవికారాలన్నీ మాయమవుతాయి. ఆ గాథలు ఆలకిస్తూ 'ఇక చాలు' అని ఎవడు తృప్తిపడతాడు? విష్ణుకథలు ఎన్నిసారులు విన్నా సరికొత్తగానే ఉంటాయి. కాబట్టి నాకు 'రుక్మిణీకల్యాణ' కథ వివరంగా వినిపించు. వినవలెనని మదిలో ఉబలాటంగా ఉన్నది.

క. భూషణములు సెవులకు బుధ
తోషణము లనేక జన్మదురితౌఘ విని
శ్శోషణములు మంగళతర
ఘోషణములు గరుడగమను గుణభాషణముల్. 1684

• గరుడవాహనుని గుణగణాలు వర్ణించే సంభాషణాలు చెవులకు భూషణాల వంటివి. అవి పండితులకు సంతోషం సమకూరుస్తాయి. పలుజన్మల నుంచి సంపాదించుకొన్న పాపాలను పోకారుస్తాయి. అవి వాస్తవంగా శుభప్రదాలైన శబ్దాలు.

వ. అని రా జడిగిన శుకుం డిట్లనియె. 1685

• అని పరీక్షిన్మహారాజు అడుగగా శుకమహర్షి ఇట్లన్నాడు.

చ. వినుము విదర్భదేశమున వీరుఁడు కుండినభర్త భీష్మకుం
డను నొక దొడ్డరాజు గల; డాతని కేవురు పుత్రు లగ్రజుం
డనయుఁడు రుక్మినాఁ బరఁగు; నందఱకున్ గడగొట్టు చెల్లెలై
మనుజవరేణ్య! పుట్టి నొక మానిని రుక్మిణినాఁ బ్రసిద్ధయై. 1686

* అధిపా! ఆకర్ణించు. విదర్భదేశంలో కుండిన నగరముంది. దానికి భీష్మకుడు ప్రభువు. అతడు వీరుడు; గొప్పరాజు. ఆయనకు ఐదుగురు కుమారులు; పెద్దవాడు రుక్మి. అతడు నీతిమాలినవాడు. ఈ ఐదుగురు కొమాళ్లకు కడగొట్టు చెల్లెలై భీష్మకమహారాజుకు ఒక కూతురు కల్గింది. ఆమె 'రుక్మిణి' అనే పేరుతో ప్రసిద్ధి వహించింది.

క. బాలేందురేఖ దోఁచిన
లాలితయగు నవరదిక్కులాగున ధరణీ
పాలుని గేహము మెఱసెను
బాలిక జన్మించి యెదుగ భాసుర మగుచున్. 1687

* నెలపొడుపుచే పడమటి దెస భాసిల్లినట్లు రుక్మిణి పుట్టి పెరుగుతుండగా భీష్మకమహారాజు మందిరం దేదీప్యమానంగా తేజరిల్లింది.

వ. మఱియు దినదినప్రవర్ధమానయై. 1688

సీ. పేర్వెర బొమ్మలపెండ్లిండ్లు సేయుచు
నబలలతోడ వియ్యంబు లందు
గుజ్జనగూళ్లను గొమరొప్ప వండించి
చెలులకుఁ బెట్టించుఁ జెలువు మెఱసి
రమణీయ మందిరారామదేశంబులఁ
బువ్వుఁ దీగెలకును బ్రోదివెట్టు
సదమల మణిమయ సౌధభాగంబుల
లీలతో భర్మడోలికల నూఁగు

తే. బాలికలతోడఁ జెలరేగి బంతు లాడు
శారికా కీరవంక్తికిఁ జదువు సెప్పు
బర్హిసంఘంబులకు మురిపములు గఱపు
మదమరాళంబులకుఁ జూపు మందగతులు. 1689

• రుక్మిణి దినదినప్రవర్ధమానురాలవుతూ ఉంది. బాలామణి యైన రుక్మిణి బొమ్మలకు పేరులుపెట్టి పెండ్లిండ్లు చేస్తూ తోడి బాలికలతో వియ్యాలు నెఱపుతుంది, పప్పు, బియ్యాలు గిన్నెలలో పోసి కమ్మగ గుజ్జనగూళ్లువండించి తన స్నేహితురాండ్రకు వైనంగా వడ్డన గావిస్తుంది. సుందరమైన మందిరోద్యానములందు పుష్పలతలకు ఎరువువేసి, నీళ్లుపోసి, పందిళ్లమర్చి పరిపోషణ చేస్తుంది. స్వచ్ఛమైన మణిమయ భవనాలలో బంగారు ఉుయ్యాలల్లో ఊగుతుంది. ఈడుపిల్లలతో చెండాటలాడుతుంది. గోరువంకలకూ, చిలుకలకూ పలుకులూ, నెమళ్లగుంపుకు నాట్యాలూ, మదించిన రాయంచలకు నడకలూ నేర్పుతుంది.

వ. అంత. 1690

సీ. దేవకీసుతు కోర్కితీఁగెలు వీడంగ
వెలఁదికి మైదీఁగె వీడఁ దొడఁగెఁ;
గమలనాభుని చిత్తకమలంబు వికసింపఁ
గాంతి నింతికి ముఖకమల మొప్పె;
మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ
బొలఁతికి చనుదోయి పొడవు సూపె
శౌరికి ధైర్యంబు సన్నమై తయ్యంగ
జలజాక్షి మధ్యంబు సన్నమయ్యె

ఆ. హరికిఁ బ్రేమబంధ మధికంబుగాఁ గేశ
బంధ మధిక మగుచు బాల కమరెఁ
బద్మనయను వలనఁ బ్రమదంబు నిండార
నెలఁత యౌవనంబు నిండి యుండె. 1691

* దేవకీపుత్రునకు రుక్మిణిని పెండ్లాడవలెనన్న కోరిక కొనలు సాగునట్లుగా కోమలికి తీగవలె సన్ననైన శరీరం పెరుగుతున్నది. గోవిందునకు హృదయపద్మం విప్పారునట్లుగా కాంతకు వదన సరోజం కాంతితో కళకళలాడింది. మాధవునకు మనసులో వలపు రగుల్గొన్నట్లుగా మగువకు చనుదోయి బిగువెక్కింది. శౌరికి ధైర్యం సన్నగిల్లు విధంగా సారసనేత్రకు నడుము సన్ననయింది. పద్మనాభునకు ప్రణయ మధిక మగునట్లుగా వెలదికి తలకట్టు వృద్ధి పొందింది. నందనందనునకు హృదయానందం నిండగా ఎలనాగకు ఎలజవ్వనం ఎనలారింది.

వ. ఇట్లు రుక్మి రుక్మరథ రుక్మబాహు రుక్మకేశ రుక్మనేత్రు లను నేవు
రకుం జెలియలైన రుక్మిణీదేవి తన యెలప్రాయంబున. 1682

క. తన తండ్రి గేహమునకుం
జనుదెంచుచున్న యతిథిజనులవలనఁ గృ
ష్ణుని రూపబలగుణాదులు
విని కృష్ణుఁడు దనకుఁ దగిన విభుఁడని తలఁచెన్. 1683

• ఇలా రుక్మి, రుక్మరథుడు, రుక్మబాహువు, రుక్మకేశుడు, రుక్మనేత్రుడు అనే ఐదుగురకు తోబుట్టువైన రుక్మిణీదేవి తొలిజవ్వనంలో తన తండ్రిగారి ఇంటికి వస్తున్న అతిథులవల్ల శ్రీకృష్ణుని రూపం, బలం, సద్గుణాలు మున్నగువాటిని విన్నది. తనకతడే తగిన మగడని నిర్ణయించుకున్నది.

క. ఆ లలనరూపు బుద్ధియు
శీలము లక్షణము గుణముఁ జింతించి దగన్
బాలారత్నముఁ దన కి
ల్లాలుగఁ జేకొందు ననుచు హరియుం దలఁచెన్. 1684

• శ్రీకృష్ణుడు కూడ కన్యామణియగు రుక్మిణిరూపం, వివేకం సత్ప్రవర్తన, శుభలక్షణాలు, సద్గుణాలు అన్నీ గ్రహించాడు. ఆ ఒప్పులకుప్పను తప్పక పరిణయమాడాలని నిశ్చయించుకున్నాడు.

వ. అంత. 1685

ఉ. బంధువు లెల్లఁ గృష్ణునకు బాలిక నిచ్చెదమంచు శేముషీ
సింధువులై విచారములు సేయఁగ వారల నడ్డుపెట్టి దు
స్సంధుడు రుక్మి కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి మత్తపు
ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁదలంచె నంధుఁడై. 1686

• ఇలా వారు ఒకరినొకరు పెండ్లాడవలెనని తీర్మానించుకున్న సమయంలో మతిమంతులైన చుట్టాలందరూ కృష్ణునకు రుక్మిణీదేవి నిచ్చి పెండ్లిచేయాలని కృతనిశ్చయులయ్యారు. దుష్టులతో మైత్రి పాటించి జ్ఞానహీనుడగు రుక్మి మాత్రము వెన్నునిపట్ల ప్రబలవిరోధం వహించాడు. ఆ మదాంధుడు బంధుజనుల ప్రయత్నం వారించి గండుతుమ్మెదల పిండువలె నల్లని శిరోజాలుగల తన చెల్లెలిని చేది దేశాధిపతి శిశుపాలునకు కట్టబెట్టవలెనని సంకల్పించాడు.

ఉ. అన్నతలంపు దా నెఱిఁగి యు న్నవనీరజగంధి లోన నా
పన్నత నొంది, యాప్తుఁడగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి గర్వసం
ఛన్నుఁడు రుక్మి నేఁడు ననుఁ జైద్యున కిచ్చెద నంచు మన్నవాఁ
డెన్నివిధంబులం జని బుధేశ్వర! చక్రికి విన్నవింపవే! 1687

• క్రొందామరల సుగంధాలు వెదజల్లే రుక్మిణి అగ్రజుని చెడు తలంపు గుర్తించింది. రానున్న ప్రమాదం తలచుకొని మనసులో ఎంతో బాధపడింది. తన మేలుగోరే అగ్నిద్యోతనుడనే ఒక విప్రుణ్ణి రావించి ఇలా విన్నవించింది. ఓ విద్వన్మణీ! గర్వంతో కన్నులు గానక పెద్దన్న రుక్మి నన్నిప్పుడు శిశుపాలున కిచ్చుటకు సిద్ధమైనాడు. ఏ విధంగానైనా నీవు ద్వారకాపురికి వెళ్ళి చక్రాయుధునకు నా పరిస్థితి విన్నవించు.

క. అయ్యా! కొడుకు విచారము
అయ్యయు వారింపఁ జాలఁ డటు గాకుండన్
నెయ్యం మెఱిఁగించి చీరుము
చయ్యన నిజసేవకానుసారిన్ శౌరిన్. 1698

* ఓ బ్రాహ్మణోత్తమా! తండ్రికూడా తనయుని ఆలోచన తగదని వారింపలేకున్నాడు. మా అన్న ఆటలు సాగకుండా నీవు వెంటనే వెళ్ళి నిజసేవకుల చిత్తవృత్తి ననుసరించే శౌరికి నా ప్రణయ మెరిగించి ఇక్కడికి పిలుచుకొని రావాలి.

వ. అని కొన్ని రహస్యవచనంబులు సెప్పిన విని బ్రాహ్మణుండు ద్వారకా నగరంబునకుం జని, ప్రతిహారుల వలనఁ దనరాక యెఱింగించి య న్నగధరుం డున్న నగరుఁ బ్రవేశించి, యందుఁ గనకాసనా సీనుండై యున్న పురుషోత్తముం గాంచి 'పెండ్లికొడుకవు గ' మ్మని దీవించిన ముసిముసినగవులు నగుచు బ్రహ్మణ్యదేవుండైన హరి తన గద్దియ దిగ్గన డిగ్గి, బ్రాహ్మణుం గూర్చుండ నియోగించి, తనకు దేవతలు సేయు చందంబునం బూజలు సేసి, సరసపదార్థ సంపన్నంబైన యన్నంబు పెట్టించి, రెట్టించిన ప్రియంబున నయంబున భూసురుండైన భూమురుం జేరి లోకరక్షణ ప్రశస్తం బయిన హస్తంబున నతని యడుగులు పుడుకుచు మెల్లన నతని కిట్లనియె. 1699

* అని మరికొన్ని రహస్యపుమాటలు రుక్మిణీదేవి ఆ విప్రునకు చెప్పిపంపింది. ఆ పలుకులన్నీ విని అగ్నిద్యోతనుడు వెంటనే ద్వారకా నగరానికి వెళ్ళినాడు. తన రాక వార్తాహారులద్వారా లోపలికి చెప్పి పంపి గోవర్ధన గిరిధారి నివసించే భవనం ప్రవేశించాడు. అక్కడ బంగారు గద్దెపై కూర్చున్న ఆ పరమ పురుషుణ్ణి తిలకించాడు. 'పెండ్లికుమారుడవు' కమ్మని ఆశీర్వదించాడు. బ్రాహ్మణులను దైవంగా భావించే ఆ మురారి ముసి ముసి నవ్వులు నవ్వుతూ

తటాలున పీఠం దిగి అతణ్ణి కూర్చోబెట్టి వేల్పులు తన్ను పూజించు నట్లు పూజించాడు. పిదప షడ్రుచులతో నిండిన కమ్మని భోజనం పెట్టించి ప్రేమతో బ్రహ్మతేజస్సంపన్నుడైన ఆ బ్రాహ్మణుని చెంతకు జేరినాడు. జగద్రక్షణములో ఆరితేరిన తన చేతితో అతని అడుగులు పుడుకుతూ నెమ్మదిగా ఇట్లన్నాడు.

సీ. జగతీసురేశ్వర, సంతోషచిత్తుండ
వై యున్న నీధర్మ మతిసులభము
వృద్ధసమ్మత మిది విత్త మెయ్యది యైనఁ
బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు
తనధర్మమున నుండుఁ దరలఁ డా ధర్మంబు
గోరిక లతనికిఁ గురియుచుండు
సంతోషిగాఁ డేని శక్రుఁడైన నశించు
నిర్ధనుం డైనను నింద్రుఁ బోలు

ఆ. సంతసించెనేని, సర్వభూతసుహృత్త
ములకుఁ బ్రాప్తలాభ ముదితమాన
సులకు శాంతులకును సుజనులకును గర్వ
హీనులకును వినతు లే నొనర్తు. 1700

• విప్రపుంగవా! నీవు నిత్యసంతోషివి. నీ వర్తనం అనుసరణీయం. ఆర్యులకు అంగీకారం. బ్రాహ్మణుడు ఏ కొంచెపాటి విత్తం లభించినప్పటికీ సంతోషిస్తాడు. తన ధర్మం నెరవేరుస్తాడు. నిజ ధర్మాన్ని అతిక్రమించడు. ఇట్టి విప్రుడికి సర్వవాంఛలూ సఫలమవుతాయి. తృప్తిలేకపోతే ఇంద్రునంతటివాడైనా నాశనమవుతాడు. సంతృప్తి గలవాడు ధనహీనుడైనా ఇంద్రునితో సమాను డవుతాడు. సకల జీవరాశికీ హితము కోరేవారూ, సమకూడిన దానితో సంతోషించే మనస్సు కలవారూ, శాంతస్వభావులూ, గర్వరహితులూ అయిన సత్పురుషులకు నేను నమస్కారాలు చేస్తాను.

ఉ. ఎవ్వని దేశమం దునికి యెవ్వనిచేఁ గుశలంబు గల్గు మీ
కెవ్వని రాజ్యమందుఁ బ్రజలెల్ల సుఖింతురు వాఁడు మత్ప్రియుం
డివ్వనరాశిదుర్గమున కె ట్లరుదెంచితి వయ్య! నీవు? లే
నవ్వలు గావు; నీ తలంపునం గల మే లొనరింతు ధీమణీ! 1701

* పండితోత్తమా! మీది ఏ దేశం? ఏ రాజు మీ క్షేమం విచారిస్తున్నాడు? ఏ రాజ్యంలో ప్రజలందరు సుఖపడుతున్నారో ఆ రాజే నా కిష్టుడు. నీవు సాగరమధ్యమందున్న మా కోటలోనికి ఎలా వచ్చావయ్యా? పరియాచకపు మాటలు గావు. నీ మనోవాంఛ ఏమో చెప్పు? తప్పక తీరుస్తాను.

వ. అని యిట్లు లీలాగృహీతశరీరుండైన యప్పరమేశ్వరుం డడిగిన ధరణీసురవరుం డతనికి సవినయంబుగ నిట్లనియె. దేవా! విదర్భ దేశాధీశ్వరుండైన భీష్మకుండను రాజు గలం; డా రాజుకూఁతురు రుక్మిణి యను కన్యకామణి గల; ద య్యిందువదన నీకుఁ గైంకర్యంబు సేయంగోరి వివాహమంగళ ప్రశస్తంబయిన యొక్క సందేశంబు విన్నవింపు మని పుత్తెంచె నవధరింపుము. 1702

* ఈ విధంగా లీలామానుష విగ్రహుడైన శ్రీకృష్ణుడు పలుకగా బ్రాహ్మణోత్తముడైన అగ్నిద్యోతనుడు అడకువతో ఇట్లన్నాడు. దేవా! విదర్భదేశాన్ని భీష్మకు డనే రాజు పాలిస్తున్నాడు. ఆయన కొక కూతురున్నది, ఆ కన్యామణి నామధేయం రుక్మిణి. ఆ చంద్రముఖి మీకు సపర్యలు సలుపనెంచి మంగళకరమైన వివాహశుభ వార్త దేవరవారికి మనవి చేయుమని నన్ను మీ పాలికి పంపింది. స్వామీ! సందేశం చిత్తగించండి.

సీ. ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక
దేహతాపంబులు దీఱిపోవు
నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల
కఖిలార్థలాభంబు గలుగుచుండు

నే నీ చరణసేవ లేప్రొద్దుఁ జేసిన
భువనోన్నతత్వంబుఁ బొందఁ గలుగు
నే నీ ఘననామమే ప్రొద్దు భక్తితోఁ
దడవిన బంధసంతతులు వాయు

తే. నట్టి నీయందు నాచిత్త మనవరతము
నచ్చి యున్నది నీ యాన నానలేదు,
కరుణఁ జూడుము కంసారి ! ఖలవిదారి !
శ్రీయుతాకార ! మానినీ చిత్తచోర ! 1703

* కంసాంతకా! ప్రశస్తములైన నీ గుణాలు చెవులబడితే చాలు శరీర తాపాలన్నీ శమిస్తాయి. ఓ కళ్యాణస్వరూపా! మంగళ కరమైన నీ స్వరూపం తిలకిస్తే చాలు నేత్రాలకు నిఖిల ప్రయోజనాలు సిద్ధిస్తాయి. దుష్టులను దునుమాడువాడా! నిరంతరం నీ పాదసేవ చేస్తే చాలు లోకంలో మహోన్నతి నొందవచ్చు. మానవతుల మన సులు హరించువాడా! సంతతమూ నీ దివ్యనామం సంస్మరిస్తే చాలు బంధాలన్నీ పటాపంచ లవుతాయి. నీ మహిమ ఎక్కడ? నే నెక్కడ? అని సిగ్గుచెందక నా హృదయం నీయందు లగ్నమయింది. ఇది నిజం. నన్ను కరుణతో కటాక్షించు.

శా. ధన్యున్ లోకమనోభిరాముఁ గులవిద్యారూపతారుణ్య సౌ
జన్యశ్రీబలదాన శౌర్యకరుణాసంశోభితున్ నిన్ను నే
కన్యల్ గోరరు? కోరదే మును రమాకాంతాలలామంబు రా
జన్యానేకపసింహ ! నావలననే జన్మించెనే మోహముల్ ? 1704

* శత్రురాజులనే గజాలను సంహరించే సింహంవంటి శ్రీ కృష్ణా! నీవు ధన్యుడవు. లోకుల మనస్సులు రంజింపజేసేవాడవు. వంశము, విద్య, చక్కదనము, జవ్వనము, మంచితనము, సంపద, బలము, దానము, పరాక్రమము, కారుణ్యము అనే గుణాలతో

అలరారుతున్నావు. ఇటువంటి నిన్ను ఏ కన్యలు వరించకుండా ఉండగలరు? ఉవిదలలో ఉత్తమురాలైన శ్రీ మహాలక్ష్మి అలనాడు నిన్ను చెట్టబట్టలేదా? నే నొక్కతెనే నిన్ను మోహించానా ఏమి? వలపు అనేది నావల్లనే జన్మించిందా?

ఉ. శ్రీయుతమూర్తి! యో పురుషసింహమ! సింహముపాలి సొమ్ము గో
మాయువు గోరు చందమున మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ
ధ్యాయినియైన నన్ను వడిఁ దాఁ గొనిపోయెద నంచు నున్నవాఁ
డా యధమాధముం డెఱుఁగఁ డద్భుతమైన భవత్ప్రతాపమున్. 1705

● ఓ మంగళమూర్తీ! పురుషులలో సింహమువంటి వాడవు నీవు. సింహమునకు చెందవలసిన పదార్థము నక్క వాంఛించునట్లు నీ చరణ సరోజాలను స్మరించే నన్ను మదోన్మత్తుడైన శిశుపాలుడు శీఘ్రంగా హరించుకుపోవడానికి యత్నిస్తున్నాడు. అల్పులలో అల్పుడైన ఆ చేది దేశపురాజు ఆశ్చర్యజనకమైన నీ పరాక్రమం ఎరుగడు సుమా!

మ. వ్రతముల్ దేవగురుద్విజన్మబుధసేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితి నేనిన్ వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁగాక ని
ర్జితులై పోదురుగాక సంగరములోఁ జేదీశముఖ్యాధముల్. 1706

● పూర్వజన్మములందు నేను జగన్నాయకుడూ, లోకాలకు శుభాలు కలిగించేవాడూ అయిన గోవిందుణ్ణి పతిగా గోరి నోములు నోచి ఉంటే దేవతలకూ, గురువులకూ, బ్రాహ్మణులకూ, విద్వాంసులకూ సేవ లొనర్చి ఉంటే, దాన ధర్మాది పుణ్యకార్యాలు సల్పి ఉంటే వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుడు నాకు ప్రాణేశ్వరుడౌతాడు. శిశుపాలుడు మొదలుగాగల నీచులు భండనంలో పరాజితులవుతారు.

ఉ. అంకిలి సెప్పలేదు; చతురంగబలంబులతోడ నెల్లి యో
పంకజనాభ! నీవు శిశుపాలజరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయశౌర్యమే
యుంకువసేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొనిపొమ్ము వచ్చెదన్.

● ఓ పద్మనాభా! నీకు ఇక్కడ అడ్డ మేమీ లేదు. రేపే రథ గజ తురగ పదాతులనే చతురంగబలాలతో వచ్చి శిశుపాల జరాసంధులను ఉగ్రరణంలో ఓడించు. ఓ పరమపురుషా! నీ పరాక్రమమే ఓలిగా ఇచ్చి బలాత్కారమున రాక్షస వివాహపద్ధతితో నన్నెత్తుకొని వెళ్లు. నేను నీవెంట వచ్చుటకు సిద్ధంగా ఉన్నాను.

సీ. లోపలి సౌధంబులోన వర్తింపంగఁ
దేవచ్చునే నిన్నుఁ దెత్తునేనిఁ
గావలివారలఁ గల బంధువులఁ జంపి
కాని తేరా దని కమలనయన!
భావించితేని నుపాయంబు సెప్పెద
నాలింపు కులదేవయాత్రఁ జేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ
బెండ్లికి మునువడఁ బెండ్లికూఁతు

తే. నెలమి మావారుఁ బంపుదు రేను నట్లు
పురము వెలువడి యేతెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు
వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్యచరిత! 1708

● 'రుక్మిణీ! నీవు కన్యాంతఃపురంలో ఉంటావు గదా? నిన్ను వెంటబెట్టుకుని వెళ్లడానికి ఎలా శక్యమవుతుంది? అలాతీసుకొని వెళ్ళవలెనంటే అంతఃపుర రక్షకులనూ, నీ బంధుజనాలనూ చంప వలసి వస్తుంది గదా!' అని, నీరజాక్షా! నీవు భావిస్తే ఈ రభసతో నిమిత్తం లేని ఒక చక్కని ఉపాయం మనవి చేస్తాను. చిత్తగించు.

పెండ్లికి ముందుగా పెండ్లి కొమార్తెను మా ఇలువేల్పు మంగళ గౌరిని కొలవడానికి మావారు పంపుతారు. నేను ఊరి వెలుపలనున్న దుర్గగుడికి మ్రొక్కుచెల్లించడానికై నగరినుండి బయలుదేరి వస్తాను. నీవు అడ్డగింపరాని నడవడి గలవాడవు. ఆ తరుణంలో నన్ను నిరాటంకంగా నీ వెంట తోడ్కొని పో!

మ. ఘను లాత్మీయ తమోనివృత్తి కొఱకై గౌరీశుమర్యాద నె
వ్వని పాదాంబుజతోయమందు మునుఁగన్ వాంఛింతు రే నట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱుజన్మంబులన్
నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా!

● నాథా! మహాత్ములు అజ్ఞానరాహిత్యం కొరకు పరమేశ్వరుని లాగా ఏ పరమపురుషుని పాదపద్మాలలో ప్రభవించిన గంగాజలాలలో ఓలలాడ నెంచుతారో అట్టి తీర్థపాదుడవైన నీ యనుగ్రహానికి అర్హురాలను కాకపోతే బ్రహ్మచర్య వ్రతనిష్ఠ వహించి నూరు జన్మాలకైనా నీవే నా పతివి కావాలని నిన్నే ధ్యానిస్తూ నా ప్రాణాలు నీకే అర్పిస్తాను. ఇది నా మనోనిశ్చయం.

సీ. ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని
కర్ణరంధ్రంబుల కలిమి యేల?
పురుషరత్నమ! నీవు భోగింపఁగా లేని
తనులతవలని సౌందర్య మేల?
భువనమోహన! నిన్నుఁ బొడగానఁగా లేని
చక్షురింద్రియముల సత్త్వ మేల?
దయిత! నీ యధరామృతం బానఁగా లేని
జిహ్వకు ఫలరససిద్ధి యేల?

ఆ. నీరజాతనయన! నీ వనమాలికా
గంధ మబ్బలేని ఘ్రాణ మేల?
ధన్యచరిత! నీకు దాస్యంబుసేయని
జన్మ మేల? యెన్ని జన్మములకు? 1710

• ప్రాణవల్లభా! నీ మధురవాక్కులు విననోచని చెవులవల్ల ప్రయోజనం శూన్యం. పురుషోత్తమా! నీ వనుభవింపని సుందర సుకుమార శరీరలావణ్యం ఎందుకూ కొరగాదు. జగన్మోహనమూర్తీ! నిన్ను సందర్శింప నోచని కనుల కలిమి దండుగ. జీవితేశ్వరా! నీ అధరసుధారసం ఆస్వాదింపని నాలుకకు ఫలరసముల ప్రాప్తి ఎందుకు? కమలాక్షా! నీవు ధరించు వనమాలికా సౌరభం ఆఘ్రాణించని ఈ నాసిక ఏల? ధన్యచరిత్రా! నీ పాదపరిచర్యకు ఉపకరింపని ఈ జన్మ ఎన్ని జన్మలెత్తినా ఏమి లాభం?

వ. అని యిట్లు రుక్మిణీదేవి పుత్తెంచిన సందేశంబును, రూపసౌందర్యాది విశేషంబులును బ్రాహ్మణుండు హరికి విన్నవించి 'కర్తవ్యం బెద్ది సేయ నవధరింపు'మని సవర్ణనంబుగా మఱియు నిట్లనియె.

• ఈ విధంగా అగ్నిద్యోతనుడు రుక్మిణీదేవి పంపిన సందేశం, ఆమె ఆకార సౌందర్యం మొదలైన విశేషాలను వెన్నునకు విజ్ఞప్తిచేసి 'కర్తవ్య మేమో ఏలినవారే ఆలోచించాలి' అంటూ మరల వైదర్భి వర్ణనకు ఉపక్రమించి ఇట్లన్నాడు.

సీ. పల్లవవైభవాస్పదములు పదములు
 గనకరంభాతిరస్కారు లూరు;
అరుణప్రభామనోహరములు గరములు
 గంబుసౌందర్యమంగళము గళము
మహితభావాభావమధ్యంబు మధ్యంబు
 చక్షురుత్సవదాయి చన్నుదోయి
పరిహసితార్ధేందుపటలంబు నిటలంబు
 జితమత్తమధుకరశ్రేణి వేణి

ఆ. భావజాశుగముల ప్రాపులు చూపు లా
కుసుమశరుని వింటికొమలు బొమలు
చిత్తతోషణములు చెలువభాషణములు
జలజనయనముఖము చంద్రసఖము. 1712

● రుక్మిణీదేవి చరణములు చిగురుటాకుల జిగిని మించుతాయి. తొడలు పసిడి అరటిబోదెలను పరిభవిస్తాయి. అరచేతులు బాలారుణ ప్రభవలె మనోహరాలు. కంఠం శంఖం మాదిరి కదు రమణీయం. నడుము ఉన్నదా లేదా అనిపిస్తుంది. చనుగవ కనులపండువు గావిస్తుంది. నెన్నుదురు నెలవంకను గేలిచేస్తుంది. జడ గండుతుమ్మెదల బారును జయిస్తుంది. చూపులు మన్మథునితూపులు. కనుబొమలు మదనుని వింటికొనలు. మాటలు మనస్సంతోషసంధాయకాలు. ఆమె వదనం చంద్రబింబం.

ఉ.ఆ యెలనాఁగ నీకుఁ దగు; నంగనకుం దగు దీవు; మా యుపా
ధ్యాయుల యాన పెండ్లియగుఁ; దప్పదు; జాడ్యములేల ? నీవు నీ
తోయమువారిఁ గూడుకొని తోయరుహాననఁ దెత్తుగాని వి
చ్చేయుము; శత్రులన్ మఱుముసేయుము; సేయుముశోభనం బిలన్.

● కృష్ణా! మా ఒజ్జలమీద ఒట్టువేసి చెపుతున్నాను. నీకు రుక్మిణీ, రుక్మిణికి నీవూ ఈడుజోడుగా ఉంటారు. మీకు వివాహం తప్పక జరుగుతుంది. ఆలస్య మెందుకు ? నీవు నీ వారితో గూడి ఆ వనజముఖిని కొనితేవటానికి వెంటనే బయలుదేరు. వైరివర్గాన్ని నుగ్గు నుగ్గు గావించు. లోకానికి మేలు చేకూర్చు.

శ్రీకృష్ణుఁడు కుండినగరంబునకు రథారూఢుండై చనుట

వ. అని యిట్లు పలికి, బ్రాహ్మణునివలన విదర్భరాజతనయ పుత్తెంచిన సందేశంబును, రూప సౌందర్యాది విశేషంబులును విని, యవధరించి, నిజకరంబున నతని కరంబుఁబట్టి నగుచు న య్యాదవేంద్రుం డిట్లనియె. 1714

● ఈ రీతిగా పలుకుతున్న ఆ భూసురుని వల్ల విదర్భరాజ కుమారి పంపిన వార్తనూ, ఆమె రూపం, చక్కదనం మున్నగు

విశేషాలనూ ఆ యదుకుల చక్రవర్తి సావధానంగా ఆలకించాడు. తన చేతితో అగ్నిద్యోతనుని చేయిపట్టుకొని నవ్వుతూ ఇలా అన్నాడు.

ఉ. కన్నియమీఁద నాతలఁపు గాఢము; కూరుకురాదు రేయి నా
కెన్నఁడు; నా వివాహము సహింపక రుక్మి తలంచు కీడు నే
మున్నె యెఱుంగుదున్; బరులమూఁక లడంచి కుమారిఁ దెత్తు వి
ద్వన్నుత ! మానుఁ ద్రచ్చి నవవహ్నిశిఖన్ వడిఁదెచ్చు కైవడిన్.

● పండితప్రశంసలు పడసినవాడా! రుక్మిణిమీద నాకు అగ్గల మైన కోరిక. కనుకనే రేయి నే నెన్నడూ నిద్రించి ఎరుగ. రుక్మి మా పెండ్లి కోర్వలేక చెడుతలంపుతో నున్నాడని నా కింతకుమునుపే తెలును. కొయ్యను మథించి కొత్తదగు అగ్నిజ్వాలను వెలికి తెచ్చిన విధంగా శత్రువర్గాన్ని ఛేదించి కన్యారత్నాన్ని గైకొంటాను.

క. వచ్చెద విదర్భభూమికిఁ;
జొచ్చెద భీష్మకుని పురము; సురుచిరలీలన్
దెచ్చెద బాలన్; ద్రేల్మిడి
వచ్చెద నడ్డంబు రిపులువచ్చినఁ బోరన్. 1716

● నేను విదర్భదేశం వస్తాను. అలవోకగా కుండిన నగరం ప్రవేశిస్తాను. చిటికలో రుక్మిణిని తెస్తాను. విరోధులు నిరోధిస్తే ఆహవరంగంలో హతమారుస్తాను.

వ. అని పలికి, రుక్మిణీదేవి పెండ్లినక్షత్రంబు దెలిసి, తన పంపున రథ సారథియైన దారుకుండు శైబ్య సుగ్రీవ మేఘ పుష్పవలాహకంబు లను తురగంబులం గట్టి, రథ మాయత్తంబుచేసి తెచ్చిన, నమోఘ మనోరథుండైన హరి తాను, బ్రాహ్మణుండును రథారోహణంబు సేసి యేకరాత్రంబున నానర్త కదేశములు గడచి, విదర్భదేశంబు నకుం జనియె; నందుఁ గుండినపురీశ్వరుండైన భీష్మకుండు కొడు కునకు వశుండై, కూఁతు శిశుపాలున కిత్తునని తలంచి, శోభనో ద్యోగంబు సేయించె; నప్పుడు. 1717

● గోవిందుడు ఈ విధంగా వచించి వివాహముహూర్త మెపుడో అగ్నిద్యోతనుణ్ణి అడిగి తెలుసుకున్నాడు. తన ఆజ్ఞానుసారం సారథియైన దారుకుడు శైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వలాహకం అనే నాలుగశ్వాలను పూన్చి ఆయత్తపరచుకొని తెచ్చిన రథాన్ని సిద్ధ సంకల్పుడైన శ్రీకృష్ణుడు అగ్నిద్యోతనునితో పాటు అధిరోహించాడు. ఒకేరాత్రి పయనించి ఆనర్తకదేశాలు దాటి వెన్నుడు విదర్భకు విచ్చేశాడు. అక్కడ కుండిన నగరాధిపతి భీష్మకుడు కుమారునకు లోపడి తన కొమార్తెను శిశుపాలున కిచ్చుటకు ఒప్పుకొని శుభకార్య ప్రయత్నాలు చేయింపసాగాడు.

సీ. రచ్చలు త్రికలతలు రాజమార్గంబులు
విపణిదేశంబులు విశదములుగఁ
జేసిరి; చందనసిక్తతోయంబులు
గలయంగఁ జల్లిరి; కలువడములు
రమణీయ వివిధతోరణములు గట్టిరి
సకలగృహంబులఁ జక్కఁ జేసి;
కర్పూరకుంకుమాగరుధూపములు వెట్టి
రతివలఁ బురుషుల నన్నియెడల

ఆ. వివిధవస్త్రములను వివిధమాల్యాభర
ణానులేపనముల నమరియుండి
రఖిలవాద్యములు ~~[illegible]~~
~~నా~~ముున నగర మొప్పియుండె. 1718

● నగరమంతా అలంకరించారు. మండపాలు, సందులు, రాజవీథులు, అంగడిప్రదేశాలు చిమ్మి శుభ్రం చేశారు. మంచిగంధం కలిపిన నీరు అంతటనూ చల్లినారు. కలువపూదండలతో మనోహరము లైన నానావిధతోరణాలు కట్టినారు. అన్ని యిండ్లను చక్కబరచి కర్పూరముతో, కుంకుమతో, ముగ్గులు పెట్టి అగరుధూపాలు వేశారు. అన్నిచోట్ల ఆడవారు మగవారు రంగురంగుల వస్త్రాలతో, రకరకాల

పూదండలతో, క్రొంగ్రొత్త వలువలతో, నగలతో, మైపూతలతో ఒప్పి నారు. అనేక మంగళతూర్యాలను పరమసంతోషంతో ప్రయోగించారు. పట్టణమంతా మహావైభవంతో పరిఢవిల్లింది.

వ. అంత నా భీష్మకుండు విహితప్రకారంబునం బితృదేవతల నర్చించి బ్రాహ్మణులకు భోజనంబులు వెట్టించి, మంగళాశీర్వచనంబులు సదివించి, రుక్మిణీదేవి నభిషిక్తం జేసి, వస్త్రయుగళభూషితం గావించి, రత్నభూషణంబు లిడం జేసె; ఋగ్యజుస్సామాథర్వణ మంత్రంబుల మంగళాచారంబు లొనరించి, భూసురులు రక్షాకర ణంబు లాచరించిరి; పురోహితుండు గ్రహశాంతికొఱకు నిగమనిగ దితన్యాయంబున హోమంబుఁ గావించె; మఱియు నా రాజు దంప తుల మేలుకొఱకుఁ దిల ధేను కలధౌత కనక చేలాది దానంబులు ధరణీదేవతల కొసంగె న య్యవసరంబున. 1719

* ఆ తర్వాత భీష్మకుడు శాస్త్రములో చెప్పిన రీతిగా పితృ దేవతలను పూజించాడు. భూసురులకు భోజనం పెట్టించి వారిచే మంగళాశీర్వాదాలు పఠింపజేశాడు. రుక్మిణికి తలంటు స్నానం చేయించి ఆమెను వస్త్రద్వయంతో, రత్నాభరణాలతో అలంకరింప జేశాడు. బ్రాహ్మణులు ఋక్కు, యజుస్సు, సామము, అథర్వము అనే నాల్గు వేదాలలోని మంత్రాలతో స్వస్తిపుణ్యాహవాచనములు చేసి నిర్విఘ్నంగా పరిణయమహోత్సవం పరిసమాప్తి చెందడానికి రక్షా కరణములు గావించారు. పురోహితుడు [illegible]శాంతికై వేదోక్త విధానంతో హోమం గావించాడు. భీష్మకుడు నూత్నదంపతుల క్షేమానికై బ్రాహ్మణులకు నువ్వులు, గోవులు, వెండి, బంగారం, వస్త్రాలు మొదలైన దానాలు చేశాడు.

మ. భటసంఘంబులతో రథావళులతో భద్రేభయూథంబుతోఁ
బటువేగాన్విత ఘోటకవ్రజముతో బంధుప్రియశ్రేణితోఁ
గటుసంరంభముతో విదర్భతనయం గైకొందు నంచున్ విశం
కటవృత్తిం జమదెంచెఁ జైద్యుఁడు గడున్ గర్వించి య వ్వీటికిన్

• ఆ సమయంలో విదర్భరాజపుత్రిని చేపడతానంటూ మదోన్మత్తుడైన శిశుపాలుడు భటుల పటాలంతో, తేరులబారుతో, భద్ర జాతికి చెందిన కుంజర బృందంతో, కదువడిగా పరుగిడే గుఱ్ఱాల ఫౌజుతో బంధుమిత్ర సమేతంగా మహాటోపంతో కుండిన నగరానికి వచ్చాడు.

ఉ. బంధులఁగూడి కృష్ణబలభద్రులు వచ్చినఁ బాఱఁ దోలి ని
ర్బంధరవృత్తిఁ జైద్యునికి మానినిఁ గూర్చెదమంచు నుల్లస
ద్గంధురవీరరథ్యరథసేనలతోఁ జమదెంచి రా జరా
సంధుఁడు దంతవక్త్రుఁడును సాల్వవిదూరకపౌండ్రకాదులున్. 1721

* బాంధవసహితులైన బలరామకృష్ణులను తరిమికొట్టి నిరాటంకంగా నెలతను శిశుపాలుని కిచ్చి పెండ్లి జరిపిస్తామంటూ జరాసంధుడూ, దంతవక్త్రుడు, సాల్వుడు, విదూరకుడు, పౌండ్రక వాసుదేవుడు మొదలైనవారు మదపుటేనుగులు, వీరభటులు, అశ్వములు, అరదములు అనే చతురంగ బలాలతో కదలివచ్చారు.

వ. మఱియు నానాదేశంబుల రాజు లనేకు లేతెంచి; రందు శిశుపాలు నెదుర్కొని పూజించి భీష్మకుం డొక్కనివేశంబున నతని విడియించె; నంత నా వృత్తాంతంబు విని. 1722

• ఇంకా దేశదేశాలలరాజులు పెక్కుమంది వచ్చారు. భీష్మకుడు శిశుపాలున కెదురేగి పూజించి అతనికి ఒకచోట విడిది ఏర్పాటు చేశాడు. ఆ సమాచారం విన్నాడు బలరాముడు.

చ. హరి యొకఁ డేగినాఁడు మగధాదులు చైద్యహితానుసారులై
నరపతు లెందఱేనిఁ జనినారు కుమారికఁ దెచ్చుచోట సం
గరమగుఁ దోడు గావలయుఁ గంసవిరోధికి నంచు వేగఁ దా
నరిగె హలాయుధుండు గమలాక్షుని జాడ ననేక సేనతోన్. 1723

• 'వెన్ను డొక్కడే వెళ్లినాడు. శిశుపాలునికి సహాయంగా జరాసంధుడు మొదలగు రాజు లెందరో కుండినపురానికి పోయినారు.

కన్యకను తెచ్చేటప్పుడు కదనం జరుగుతుంది. తమ్ముడు శ్రీకృష్ణునికి సహాయపడ వలెనంటూ హాలధరుడైన బలభద్రుడు అనుజు దేగిన మార్గాన అసంఖ్యాకమైన సైన్యంతో అరుదెంచినాడు.

క. ఆ లోపల నేకతమున
నాలోలవిశాలనయనయగు రుక్మిణి త
న్నా లోకలోచనుఁడు హరి
యాలోకము చేసి కదియఁడని శంకితయై. 1724

● ఆ సమయంలో వాలుకన్నుల బాల రుక్మిణి ఏకాంత మందిరంలో కూర్చుని లోకములకు కన్నువంటివాడైన యదువల్లభుడు తన సందేశం తిలకించి తన్ను చేరరాడేమో అనే సందేహంతో లోలోపల ఆందోళన చెందసాగింది.

శా. లగ్నం బెల్లి వివాహముం గదిసె నేలారాఁడు గోవిందుఁ? డు
ద్విగ్నం బయ్యెడి మానసంబు వినెనో వృత్తాంతమున్ బ్రాహ్మణుం
డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె? నా యత్నంబు సిద్ధించునో
భగ్నంబై చనునో విరించికృత మెబ్భంగిన్ బ్రవర్తించునో? 1725

● సుముహూర్తం రేపే. పెండ్లి దగ్గరపడుతున్నది. ఇందీవర శ్యాము డెందుకురా డబ్బా? నా మనస్సు ఆందోళన చెందుతున్నది. ఆయనకు వార్త అందిందో లేదో? అస లీ భూసురుడు ఎందు కింత ఆలసించాడు? ఇంతకూ నా ప్రయత్నం ఫలిస్తుందో ఫలించదో? దైవనిర్ణయం ఎలా ఉందో ఏమో?

మ. ఘనుఁ డా భూసురుఁ డేఁగెనో? నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో
విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో? విచ్చేసెనో? యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపఁడో? యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో? నా భాగ్య మెట్లున్నదో?

* మహనీయుడైన ఆ బ్రాహ్మణోత్తముడు ద్వారకకు వెళ్ళి నాడో? లేదో? మార్గాయాసంతో మధ్యలోనే నిలిచి పోయినాడేమో? నందనందనుడు నా సందేశాన్ని విని తప్పుగా భావించినాడేమో? లేక ఇక్కడికే వచ్చియున్నాడో? పరమేశ్వరుడీ పనికి అనుకూలిస్తాడో? అనుకూలించడో? గౌరీమహాదేవి నన్ను కాపాడుతుందో? కాపాడదో? ఇంతకు నా అదృష్టం ఎట్లుందో, ఏమో?

వ. అని వితర్కించుచు. 1727

ఉ. పోఁ డను బ్రాహ్మణుండు యదుపుంగవు వీటికి; వాసుదేవుఁడున్
రాఁడను; నింకఁబోయి హరి రమ్మనిచీరెడి యిష్టబంధుఁడున్
లేఁడను; రుక్మికిం దగవు లేదిటఁ జైద్యున కిత్తు నంచు ను
న్నాఁడను; గౌరి కీశ్వరికి నావలనం గృపలేదు నేఁ డనున్. 1728

• ఇలా అనేకవిధాల భావిస్తుంది. అగ్నిద్యోతనుడు అసలు ద్వారకాపురికి అరిగి ఉండడు; అందుచేతనే వసుదేవనందనుడు రాలేదని సందేహిస్తుంది. మరల ద్వారకకు వెళ్ళి మాధవుని ఆహ్వానించే ఆత్మబంధువు తనకు ఎవ్వడూ లేడుకదా అనుకుంటుంది. అన్న నీతి మాలి తన్ను శిశుపాలునికి ఇయ్యటానికి సిద్ధపడినాడే అని విచారిస్తుంది. పరమేశ్వరికి తనపై నేడు కృప తప్పింది అని చింతిస్తుంది.

ఉ. చెప్పదు తల్లికిం దలఁపుఁ జిక్కు; దిశల్ దరహాసచంద్రికం
గప్పదు; వక్త్రతామరసగంధ సమాగత భృంగసంఘమున్
రొప్పదు; నిద్రఁ గైకొన దురోజపరస్పరసక్త హారముల్
విప్పదు; కృష్ణమార్గగతవీక్షణపంక్తులు ద్రిప్ప దెప్పుడున్. 1729

* కన్యకామణి రుక్మిణి తన మనస్సులోని ఆవేదన తల్లికి చెప్పుకోదు. దిక్కులలో చిరునవ్వు వెన్నెలలు చిందింపదు. ముఖపద్మ సౌరభానికి ముసురుకుంటున్న తుమ్మెదలగుంపును తోలదు. నిదుర పోదు. వక్షఃస్థలాన ఒండొంటితో మెలివడిన ముత్యాలదండల చిక్కు

సడలింపదు. తామరసనేత్రుడు వచ్చేదారిపై నిలిపిన చూపులను క్షణ కాలమైనా ప్రక్కకు మరలింపదు.

చ. తుడువదు కన్నులన్ వెడలు తోయకణంబులు; కొప్పుఁ జక్కగా
ముడువదు; నెచ్చెలిం గదిసి ముచ్చటకుం జన; దన్న మేనియుం
గుడువదు; నీరముం గొనదు; కూరిమి కీరముఁ జేరి పద్యమున్
నొడువదు; వల్లకీగుణవినోదము సేయదు; డాయ దన్యులన్. 1730

● ఆ రాజపుత్రి రుక్మిణి కనులనుండి కారే కన్నీటిబొట్లు తుడవదు. చక్కగా కొప్పు సవరించుకోదు. స్నేహితురాలితో ముచ్చటింపదు. అన్నము బొత్తిగా ఆరగింపదు. మంచినీళ్లయినా ముట్టదు. చెలిమితో చెంతకు జేరిన చిలుకకు పద్యము చెప్పదు. వీణాతంత్రులను మీటుతూ వినోదింపదు. చెలికత్తెలతో చేరదు.

సీ. మృగనాభి యలఁదదు మృగరాజ మధ్యమ
జలముల నాడదు జలజగంధి
ముకురంబుఁ జూడదు ముకురసన్నిభముఖి
పువ్వులు దుఱుమదు పువ్వుఁబోఁడి
వనకేళిఁ గోరదు వనజాతలోచన
హంసంబుఁ బెంపదు హంసగమన
లతలఁ బోషింపదు లతికాలలితదేహ
తొడవులు దొడవదు తొడవు తొడవు

ఆ. తిలక మిడదు నుదుటఁ దిలకినీతిలకంబు
కమలగృహముఁ జొరదు కమలహస్త
గారవించి తన్నుఁ గరుణఁ గైకొన వన
మాలి రాఁడు తగవుమాలి యనుచు. 1731

* మురళీధరుడు తన మొరాలించి దయతో తన్ను గైకొనుటకు రాడయ్యెనే? తగవుతప్పెనే అని, సన్నని నడుముగల ఆ యన్నుల మిన్న కస్తూరి ఒడలిక పూసికొనదు. అద్దమువంటి మోముగల ఆ

ముద్దులగుమ్మ అద్దము చూడదు. ఆ పువ్వుబోణి జడలో పువ్వులు పెట్టుకోదు. జలజముల వంటి నయనములుగల ఆ చెలియ జలక్రీడ లాడదు. అంచనడకల వంటి నడకలు గల ఆ కలువ కంటి అంచను పోషించదు. లతవలె మృదువైన శరీరముగల ఆ నెలత లతికలను సాకదు. అలంకారములకే అలంకారమైన ఆ అతివ ఆభరణములు ధరింపదు. చెలువలకు సిగబంతిగా నున్న ఆ ఇంతి నుదుటు తిలకము దిద్దదు. కమలములవంటి కరములుగల ఆ కలికి కమలాకరం ప్రవేశింపదు.

వ. మఱియును. 1732

మ. మఱఁగున్ మెల్ల నిగాలికిం; బటురటన్మత్తద్విరేఫాలికిం
దలఁగుం; గోయిలమ్రోఁతకై యులఁగు; మద్యత్కీరవంభాషణలం
గలఁగున్; వెన్నెలవేడిమి న్నలఁగు; మాకందాంకురచ్ఛాయకుం
దొలఁగుం గొమ్మ మనోభవానలశిఖాదోధూయమానాంగియై. 1733

● రుక్మిణీదేవి మదనాగ్ని జ్వాలలలో క్రుగ్గుతున్న శరీరము గలదై, మందమారుతాన్ని అంగీకరింపదు. మత్తిలి ఝం ఝుమ్మని మొరయుచున్న తుమ్మెదల ఝారునకు తొలగిపోతుంది. కోయిల కూతకు కోపం వహిస్తుంది. చిలుక బోదల కలికి పలుకులకు ఉలికి పడుతుంది. వెన్నెలవేడిమికి కలత చెందుతుంది. గున్నమామిడి నీడలకు దూర మేగుతుంది.

వ. ఇట్లు హరిరాక కెదురుచూచుచు సకల ప్రయోజనంబులందును విగతస్పృహయై మనోజానలంబునం గ్రాగిలెడి మగువకు శుభంబుఁ జెప్ప వామలోచనభుజంబు అదరునంతఁ గృష్ణ నియోగంబున వేగంబున బ్రా... ...ండు సనుదెంచిన నతని ముఖలక్షణంబుపలక్షించి యా కలకంఠి ...త్వరితగతిం జాలఁ [illegible] తోడ సకుంఠితయై మొగంబునం జిఱునగవు నిగుడ ... సని [illegible] ...బడిన బ్రాహ్మణుం డిట్లనియె. 1734

• ఇలా పద్మాక్షుని రాకను ప్రతీక్షిస్తూ అవసరకృత్యాలపై గూడ అపేక్షలేక మన్మథాగ్నిలో క్రుగ్గుతున్న ఆ మగువకు శుభం సూచిస్తున్న విధంగా ఎడమకన్ను, ఎడమభుజం అదిరినాయి. అచ్యుతుని ఆజ్ఞానుసారం శీఘ్రంగా వచ్చిన అగ్నిద్యోతనుని ముఖ లక్షణాలు గమనించి కమ్మని కంఠస్వరంగల రుక్మిణి మిక్కిలి తహ తహతో ముఖమున మందస్మితం చిందులాడగా సత్వరంగా ఎదురే గింది. అప్పు డా సరోజాక్షిని వీక్షించి ఆ విప్రుడు ఇట్లన్నాడు.

ఉ. మెచ్చె భవద్గుణోన్నతి; కమేయధనావళు లిచ్చె నాకుఁ; దా
వచ్చె సుదర్శనాయుధుఁడు వాఁడె; సురాసురు లెల్ల నడ్డమై
వచ్చిననైన రాక్షసవివాహమునం గొనిపోవు నిన్ను; నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా!

• బాలామణీ! సుదర్శనాయుధుడు నీ ఉత్తమగుణాలు మెచ్చుకున్నాడు. నాకు మితిలేని ధనరాశు లిచ్చినాడు. ఇదిగో ఇప్పుడే వచ్చేసినాడు. దేవదానవులు ఏకమై ఎదురొడ్డి నిలిచినప్పటికీ రాక్షస వివాహవిధానంతో నిన్ను గొనిపోతాడు. నీ మంచినడవడి, నీ యదృష్టం నేటికి ఫలించాయి తల్లీ!

వ. అనిన వైదర్భి యిట్లనియె. 1736

మ. జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశమున్ జెప్పి; నన్
నిలువం బెట్టితి; నీ కృపన్ బ్రదికితిన్ నీయంత పుణ్యాత్మకుల్
గలరే? దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర; నం
జలిఁ గావించెద; భూసురాన్వయమణీ! సద్బంధుచింతామణీ!

* అగ్నిద్యోతనుడి పలుకులు ఆలకించి [illegible] జపుత్రి ఇలా అన్నది.

[illegible] వంశము[illegible] శిరోమణివంటి వాడా! బంధువుల పాలిటికి చింతా[illegible]వంటివాడా! నా సందేశము నెరిగించి తోయజ

దశాక్షుని తోడ్కొని వచ్చినావు. నన్ను ప్రాణాలతో నిలిపినావు. నీ కరుణచే జీవించాను. నీ వంటి పుణ్యాత్ములు ఈ పుడమిలో లేరు. నీ వొనర్చిన ఈ యుపకారానికి ప్రత్యుపకార మేమిచేయాలో ఎరుగని దానిని. భూసురోత్తమా! నీకు దోసిలొగ్గి నమస్కరిస్తాను.

వ. అని నమస్కరించె; నంత రామకృష్ణులు తమ కూఁతు వివాహం బునకు వచ్చుట విని, తూర్యఘోషంబులతో నెదుర్కొని, విధ్యుక్త ప్రకారంబునం బూజించి మధుపర్కంబు లిచ్చి, వివిధాంబరాభర ణంబులు మొదలైన కానిక లొసంగి, భీష్మకుండు బంధుజనసేనా సమేతులైన వారలకుం దూర్ణంబున సకల సంపత్పరిపూర్ణంబులైన నివేశంబులు కల్పించి విడియించె; నిట్లు కూడిన రాజుల కెల్లను వయోవీర్యబలవిత్తంబు లెట్లట్ల కోరినపదార్థంబు లెల్ల నిప్పించి పూజించె; నంత విదర్భపురంబుప్రజలు హరిరాక విని వచ్చి చూచి నేత్రాంజలులం దదీయ వదనకమలమధుపానంబుసేయుచు.

● అని అంజలి ఘటించింది. అంతట భీష్మకమహారాజు బలరామకృష్ణులు తమ తనయ స్వయంవరానికి తరలి వచ్చారని తెలిసి మంగళవాద్యధ్వనులతో ఎదురేగి శాస్త్రోక్తవిధానంతో వారిని పూజించాడు. మధుపర్కాలు ఇచ్చాడు. నానావిధాలైన అంబరాలు నగలు మొదలైన కానుక లర్పించాడు. చుట్టాలతో సేనలతో ఏతెంచిన ఆ రామకృష్ణులకు సత్వరం సమస్తసౌకర్యాలున్న విడుదులు ఏర్పాటు చేశాడు. ఈ విధంగా కుండినపురికి చేరిన రాజు లందరికీ వారి వారి వయసుకూ, శక్తికీ, సంపత్తికీ తగినట్లుగా వారుకోరిన వస్తువు లన్నింటినీ తెప్పించి ఇప్పించి ఆదరించాడు భీష్మకుడు. అంతట విదర్భపట్టణప్రజలు శ్రీకృష్ణభగవానుడు అరుదెంచినవార్త ఆకర్ణించిన వారై అరుదెంచి, అవలోకించి తమ కన్నులనే దోసిళ్ళతో గోవిందుని వదనారవింద సౌందర్యాన్ని ఆస్వాదించుతూ ఇలా పలికారు.

మ. తగు నీచక్రికి విదర్భరాజసుతకుం; దథ్యంబు వైదర్భియుం
దగు నీచక్రికి; నింతమంచి దగునే ? దాంపత్య మీ యిద్దఱిం
దగులం గట్టిన బ్రహ్మ నేర్పరిగదా! దర్పాహతారాతియై
మగఁడౌఁ గావుతఁ జక్రి యీ రమణికిన్ మా పుణ్యమూలంబునన్.

* ఈ చక్రాయుధుడు విదర్భ రాజకుమారికి ఎంతో తగియున్నాడు. నిజంగా వైదర్భి ఈ చక్రికి మిక్కిలి తగిఉంది. అహా! ఎంత చక్కని దాంపత్యం! వీరిద్దరినీ ఆలుమగలుగా జతగూర్చిన ఆ విధాత ఎంత నెరజాణ. మా పుణ్యఫలంగా ఈ చక్రాయుధుడు తన పరాక్రమంతో శత్రువుల పారదోలి మా రాకుమారిని పెండ్లాడు గాక!

వ. అని పలికి రా సమయంబున. 1740

సీ. సన్నద్ధులై బహుశస్త్రసమేతులై
బలసిచుట్టును వీరభటులు గొలువ
ముందట నుపహారములు గానుకలుఁ గొంచు
వర్గంబులై వారవనిత లేగఁ
బుష్ప గంధాంబర భూషణ కలితలై
పాడుచు భూసురభార్య లరుగఁ
బణవ మర్దల శంఖ పటహ కాహళ వేణు
భేరీధ్వనుల మిన్ను పిక్కటిల్లఁగఁ

ఆ. దగిలి సఖులు గొలువఁ దల్లులు బాంధవ
సతులుఁ దోడరాఁగ సవినయముగ
నగరు వెడలి నడచె నగజాతకును మ్రొక్క
బాల చికురపిహితఫాల యగుచు. 1741

• ఇలా అనుకుంటున్న సమయంలో ఫాలతలాన ముంగురులు ముసురుకొనగా, రుక్మిణీకన్య గౌరీదేవి నర్చించుటకై అంతఃపురంనుండి సపరివారంగా అమ్మవారిగుడికి బయలుదేలింది. వీరభటులు కవచాలు తొడుగుకొని పలువిధాలైన ఆయుధాలు ధరించిన

వారై ఆమెను పరివేష్టించి నడచారు. వారకాంతలు తినుబండములు కానుకలు చేకొని బారులుదీరి రాజకుమారి ముందు సాగిపోయారు. బ్రాహ్మణ సువాసినులు పూలు పెట్టుకొని, చందనము పూసుకొని, క్రొత్తచీరలుగట్టి, సొమ్ములుదాల్చి, పాటలు పాడుతూ ఆమె ననుస రించారు. ఉడుక, మద్దెల, శంఖము, తప్పెట, బాకా, పిల్లనగ్రోవి, భేరి మొదలైన వాద్యాల మ్రోతలు గగన మంటినాయి. చెలికత్తెలు, దాదులు, బాంధవస్త్రీలు ఆమెను వెంబడించారు.

వ. మఱియు సూత మాగధ వంది గాయక పాఠకజను లంతంత నభినందించుచుం జనుదేర మందగమనంబున, ముకుందచరణార విందంబులు డెందంబునం దలంచుచు నిందుధరసుందరీ మంది రంబు సేరి సలిలధారా ధౌత కరచరణారవిందయై వార్చి శుచియై, గౌరిసమీపంబునకుం జనియె; నంత ముత్తైదువలగు భూసురోత్త ముల భార్యలు భవసహితయైన భవానికి మజ్జనంబు గావించి గంధాక్షతంబు లిడి, వస్త్రమాల్యభూషణాదుల నలంకరించి, ధూప దీపంబు లొసంగి, నానావిధోపహారంబులు సమర్పించి, కానుక లిచ్చి, దీపమాలికల న్నివాళించి రుక్మిణీదేవిని మ్రొక్కించి రప్పుడు.

● సూతులు, వందిమాగధులు, గాయకులు, స్తుతిపాఠకులు కైవారాలు గావిస్తూ వెంటరాగా రుక్మిణి గోవిందుని పాదారవిందాలు హృదయంలో స్మరిస్తూ హంసగమనంతో అంబికాలయానికి వచ్చింది. కాలుసేతులు కడుగుకొని ఆచమించి పరిశుద్ధురాలై పరమేశ్వరి సన్నిధికి చేరింది. అప్పుడు ముత్తైదువ లయిన బ్రాహ్మణసతులు పరమేశ్వర సహితంగా భవానికి అభిషేకం గావించారు. గంధాక్షతలు సమర్పించారు. వస్త్రాలతో, పూదండలతో, ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. ధూపదీపా లిచ్చారు. పలురకాల పిండివంటలు నైవేద్యం పెట్టారు. కానుకలు అర్పించినారు. దీపాలతో హారతు లెత్తి నారు. అనంతరం రుక్మిణీదేవిని దుర్గాదేవికి మొక్కించినారు.

ఉ. నమ్మితి నా మనంబున సనాతను లైన యుమామహేశులన్
మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతు గదమ్మ! మేటి పె
ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతి సేయుమమ్మ నిన్
నమ్మినవారి కెన్నఁడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ! 1743

• అప్పుడు రుక్మిణి భవానిని ఇలా ప్రార్థించింది. అమ్మా గౌరీ! శాశ్వతులూ, ఆదిదంపతులూ అయిన పార్వతీ పరమేశ్వరులను మిమ్ము మదిలో నమ్ముకొని ఉన్నాను. భక్తితో కొలుస్తున్నాను. అమ్మలలో నీవు మేటివి. దయకు సముద్రమువంటిదానవు. వెన్నుని నాకు విభుని గావించు తల్లీ! నిన్ను నమ్ముకొన్న వారికి ఎన్నిటికినీ నష్టమనేది లేదు గదా!

వ. అని గౌరిదేవికి మ్రొక్కి పతులతోడం గూడిన బ్రాహ్మణభార్యలకు లవణాపూపంబులును, దాంబూలకంఠసూత్రంబులును, నిక్షుదండంబులు నిచ్చి రుక్మిణీదేవి వారలం బూజించిన. 1744

• ఇలా వేడుకుంటూ వైదర్భి దుర్గకు నమస్కరించి భర్తృసమేతలైన బ్రాహ్మణపత్నులకు ఉప్పు, అప్పములు, తాంబూలాలు, మంగళసూత్రములు, చెఱకుగడలు ఇచ్చి పూజించింది.

ఆ. వార లుత్సహించి వలనొప్ప దీవించి
సేస లిడిరి యువతిశిరమునందు;
సేస లెల్లఁ దాల్చి శివవల్లభకు మ్రొక్కి
మౌననియతి మాని మగువ వెడలె. 1745

* ఆ ముత్తైదువలు ఉత్సాహంతో దీవన లిచ్చి రుక్మిణీరమణి తలపై అక్షత లుంచారు. ఆ మంగళాక్షతలు ధరించి ఆమె శివకామినికి వందన మొనర్చి మౌనవ్రతం మాని గుడినుండి వెడలింది.

వ. ఇట్లు మేఘమధ్యంబు వెలువడి విలసించు క్రొక్కారు మెఱుంగు తెఱంగున, మృగధరమండలంబు నిర్గమించి చరించు మృగంబు

చందంబునఁ, గమలభవన నర్తకుం డెత్తిన జవనిక మఱుఁగు దెరలి తొడసూపిన మోహినీదేవత కైవడి, దేవ దానవ సంఘాత కరతలసవ్యాపసవ్య సమాకృష్యమాణ పన్నగేంద్ర పాశ పరివలయిత పర్యాయ పరిభ్రాంత మందరాచల మంథాన మథ్యమాన ఘూర్ణిత ఘుమఘుమాయిత మహార్ణవమధ్యంబున నుండి చను దెంచు నిందిరాసుందరీ వైభవంబున, బహువిధ ప్రభా భాసమానయై, యిందుధరసుందరీమందిరంబు వెడలి మానసకాసార హేమకమల కానన విహారమాణ మత్తమరాళంబు భంగి, మంద గమనంబునఁ గనకకలశయుగళ సంకాశ కర్కశ పయోధరభార పరికంప్యమాన మధ్యయై, రత్నముద్రికాలంకృతంబైన కెంగేల నొక్క సఖీలలామంబు కైదండగొని, రత్ననివహ సమంచిత కాంచన కర్ణపత్త్రి మయూఖంబులు గండభాగంబుల నర్తనంబులు సలుప, నరవింద పరిమళ కుతూహలావతీర్ణ మత్తమధుకరంబుల మాడ్కి నరాళంబులైన కుంతలజాలంబులు ముఖమండలంబునం గ్రందు కొన, సుందరమందహాస రోచులు దిశలందు బాలచంద్రికా సౌందర్యంబు నావహింప, నధరబింబఫలారుణ మరీచిమాలికలు రదన కుందకుట్మలంబుల కనురాగంబు సంపాదింప, మనోజాతకేతన సన్నిభంబైన పయ్యెదకొంగు దూఁగ; సువర్ణమేఖలాఘటిత మణి కిరణపటలంబు లకాల శక్రచాప జనకంబులై మెఱయఁ, జెఱకువిలు తుం డొఱవెతికి వాఁడియిడి జళిపించిన ధగద్ధగాయమానంబులగు బాణంబులపగిది, సురుచిర విలోకననికరంబులు రాజవీరుల హృదయంబులు భేదింప, శింజాన మంజుమంజీర నినదంబులు చెవుల పండువులు సేయఁ, బాదసంచారంబున హరిరాక కెదురుచూచుచు, వీరమోహినియై చనుదెంచు సమయంబున. 1746

• అలా వెడలివచ్చిన రుక్మిణి మబ్బులనడుమనుండి వెలువడి ప్రకాశించే తొలకరిమెఱుపులాగా ఉన్నది. చంద్రమండలంనుంచి

వెలికివచ్చి సంచరించే తేదిలాగా ఉన్నది. బ్రహ్మదేవుడనే నటుడు ఎత్తిన తెర మరుగుబాసి రంగమున ప్రత్యక్షమైన మోహినీదేవతలాగా ఉన్నది. వాసుకి అనే సర్పరాజును కవ్వపుత్రాడుగాను, మందరగిరిని కవ్వముగాను చేసి సురాసురసమూహం కుడియెడమలుగా చిలికే వేళ ఘూర్ణమానమై ఘుమఘుమ ధ్వనులతో నిండిన మహాసాగరమధ్యం నుంచి నిర్గమించిన రమారమణిలాగా విరాజిల్లింది. ఇలా పలుకాంతులతో విలసిల్లుతూ రుక్మిణి కాళికాలయం నుంచి బయలుదేరింది. మానససరోవరమందు పసిడితామరల గుంపులో విహరించే కొదమ రాయంచలాగా ఆమె మెల్లగా నడిచింది. బంగారుగిండ్లకు సాటివచ్చే పయోధరాల భారంతో తూలియాడుతున్న నడుముగల రాకుమారి రత్నాంగుళీయకముతో విరాజిల్లే అరుణారుణ హస్తంతో అనుగుచెలి హస్తం పట్టుకొంది. మణిఖచితాలైన సువర్ణతాటంకాల కాంతులు ఆమె చెక్కిళ్ళపై చిందులు వేస్తున్నాయి. పద్మగంధం మీది ఆసక్తితో క్రమ్మిన గండుతుమ్మెదలవంటి ఉంగరాల ముంగురులు ఆమె ముద్దుల మోముపై మూగుతున్నాయి. ఆమె అందమైన చిరునవ్వుల వెలుగులు దిక్కులలో లేతవెన్నెల సొబగు నెలకొనజేశాయి. ఆమె దొండపండువంటి అధరం అరుణకాంతులు మొల్లమొగ్గలవంటి దంతాలకు ఎఱ్ఱదనం కూరుస్తున్నాయి. మన్మథపతాక చందాన ఆమె పైటచెంగు తూగాడుతున్నది. ఆమె పసిడి ఒడ్డాణంలో చెక్కిన మణుల ధగధగ దీప్తులు కాలముగాని కాలాన ఇంద్రచాపాన్ని సృష్టించుతున్నాయి. కందర్పుడు ఒరనుండి పైకితీసి పదనుబెట్టి ఝళిపించినవేళ తళుకు తళుక్కుమని మెరిసే వాడి తూపులమాదిరి ఆమె సుందరమైన చూపులు వీరాధివీరులైన రాజుల గుండెలను చెండివేస్తున్నాయి. అందమైన కాలియందెల రవళి, చెవులకు విందుసేయగా ఆ సుందరి ముకుందుని రాక ప్రతీక్షిస్తూ వీరమోహినియై కాలినడకతో వస్తున్నది.

మ. అలినీలాలకఁ బూర్ణచంద్రముఖి నేణాక్షిం బ్రవాలాధరం
గలకంఠిన్ నవపల్లవాంఘ్రియుగళన్ గంధేభకుంభస్తనిం
బులినశ్రోణి నిభేంద్రయాన నరుణాంభోజాతహస్తన్ మహో
త్పలగంధిన్ మృగరాజమధ్యఁ గని విభ్రాంతాత్ములై రందఱున్.

● తుమ్మెదలవంటి నల్లనిముంగురులు, నిండుచందురునివంటి నెమ్మోము, లేడిచూపులవంటి చూపులు, పగడమువంటి పెదవి, అవ్యక్తమధురమైన కంఠం, క్రౌంచిపురుటాకులవంటి అడుగులజంట, మత్తగజకుంభాలవంటి కుచాలు, ఇసుకతిన్నెలవంటి పిరుదులు, గజరాజగమనమువంటి గమనము, కెందామరలవంటి చేతులు, సింహమునడుమువంటి నడుముగలిగి పద్మసుగంధాలు వెదజల్లే రుక్మిణీదేవిని చూచి అందరూ ఆశ్చర్యచకితు లయ్యారు.

వ. మఱియు న య్యింతి దరహాసలజ్జావలోకనంబులం జిత్తంబు లేమఱి ధైర్యంబు దిగనాడి, గాంభీర్యంబులు విడిచి, గౌరవంబులు మఱచి, చేష్టలుమాని, యెఱుక లుడిగి, యాయుధంబులు దిగవైచి గజతురగరథారోహణంబులు సేయ నేరక, రాజులెల్ల నేలకు వ్రాలి; రా యేణీలోచన తన వామకరనఖంబుల నలకంబులు దలఁగం ద్రోయుచుఁ నుత్తరీయంబు సక్కనొత్తుచుఁ గడగంటిచూపులం గ్రమంబున నా రాజలోకంబు నాలోకింపుచు. 1748

● అంతేకాదు. ఆ చెలువ చిరునవ్వులవల్లా, సిగ్గుతో కూడిన చూపులవల్లా అక్కడి రాజకుమారులకు మనసులు చలించాయి. వారు ధైర్యం వీడినారు; గాంభీర్యం వదలినారు; గౌరవం మరచినారు. చేష్ట లుడిగినారు. తెలివి మాలినారు. ఆయుధాలు జారవిడిచినారు. ఏనుగులు, గుర్రాలు,అరదాలు ఎక్కలేక భూమిపై వ్రాలినారు. లేడి చూపులుగల రుక్మిణి తన ఎడమచేతి గోళ్ళతో ముంగురులు ఎగదోసి కొంటూ, పయట సరిదిద్దుకుంటూ, కడగంటి చూపులను రాజసమూహంమీద ప్రసరింప జేసింది.

మ. కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం గంఠీరవేంద్రావల
గ్నుఁ నవాంభోజదళాక్షుఁ జారుతరవక్షున్ మేఘసంకాశ దే
హు నగారాతిగజేంద్రహస్తనిభబాహుం జక్రిఁ బీతాంబరున్
ఘనభూషాన్వితుఁ గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్.

* అలా చూస్తూ చంద్రబింబమువంటి ముఖమూ, సింగము నడుమువంటి నడుమూ, క్రొందామరలవంటి కన్నులూ, పరమ రమణీయమైన వక్షము, నీలమేఘమువంటి నెమ్మేనూ, ఐరావత గజతుండమువంటి కరములూ, పచ్చని పట్టుపుట్టములూ చక్రాయుధమూ కలవాడు, విజయమునందు ఆసక్తియున్నవాడు, జగములను మోహింపచేసేవాడు అయిన శ్రీకృష్ణుని రుక్మిణీదేవి దర్శించింది.

శ్రీకృష్ణుఁడు శత్రురాజులు చూచుచుండ రుక్మిణీదేవిని గొనిపోవుట

వ. కని తదీయ రూపవయోలావణ్య వైభవ గాంభీర్య చాతుర్య తేజో విశేషంబులకు సంతసించి, మనోభవశరాక్రాంతయై రథారోహణంబు గోరుచున్న వరారోహం జూచి, పరిపంథిరాజలోకంబు సూచుచుండ మందగమనంబున గంధసింధురంబు లీలం జనుదెంచి ఫేరవంబుల నడిమి భాగంబు గొనిచను కంఠీరవంబు కైవడి నిఖిల భూపాలగణంబుల గణింపక తృణీకరించి రాజకన్యకం దెచ్చి హరి తన రథంబుమీఁద నిడికొని భూనభోంతరాళంబులునిండ శంఖంబు పూరించుచు బలభద్రుండు తోడ నడవ, యాదవవాహినీ పరివృతుండై ద్వారకానగరమార్గంబు పట్టి చనియె; నంత జరాసంధపముఖు లయిన రాజు లందఱు హరిపరాక్రమంబు విని సహింపనోపక. 1750

* అలా చూచి శ్రీకృష్ణుని రూపం, లావణ్యం, గాంభీర్యం, నేర్పు, తేజస్సు, ఐశ్వర్యం, ఈ విశేషాలకు హర్షించింది. ఆమె మదన బాణాలకు గురియై త్వరగా రథ మెక్కడానికి కుతూహలపడింది. రుక్మిణీదేవిని పుండరీకాక్షుడు అవలోకించాడు. శత్రురాజసమూహం చూస్తుండగనే మత్తమాతంగం మాదిరి మెల్లని నడకతో సవిలాసంగా చనుదెంచాడు. నక్కల నడుమనున్న అమిషం హర్యక్షం ఎత్తుకొని పోయినట్లు సకలరాజలోకాన్ని లెక్క చేయక తిరస్కరించి రాకుమారిని రథ మెక్కించుకున్నాడు. భూమ్యాకాశాలు ప్రతిధ్వనించేటట్లు పాంచ జన్యం పూరించాడు. బలరాముడు వెంటరాగా శ్రీకృష్ణుడు యాదవ సైన్యంతో ద్వారకానగర మార్గం పట్టాడు. అపుడు జరాసంధునకు లోబడిన భూపాలకు లందరూ వెన్నుని విక్రమాటోపం సహింపలేక పోయారు.

మ. ఘనసింహంబులకీర్తి నీచమృగముల్ గైకొన్న చందంబునన్
మన కీర్తుల్ గొని బాలఁ దోడ్కొనుచు నున్మాదంబుతో గోపకుల్
వనుచున్నారదె? శౌర్య మెన్నటికి? మీ శస్త్రాస్త్రముల్ గాల్పనే?
తనుమధ్యన్ విడిపింపమేని నగరే ధాత్రీజనుల్ క్రంతలన్. 1751

* అదిగో! గొప్ప సింహముల కీర్తిని ముక్కడి మృగాలు హరించిన విధంగా గొల్లవాళ్లు మన యశస్సు దోచుకొని కన్య నెత్తుకొని కావరంతో కదలి వెలుతున్నారు. ఇప్పటికి కౌరగాని మన ప్రతాపం మరి ఎప్పటికి? మన శస్త్రాస్త్రాలు మంటలో వేయడానికా? సన్నని నడుముగల ఆ కన్నియను వారి బారినుండి తప్పించలేకపోతే సందుగొందుల్లో సైతం మనలను ప్రజలు పరిహసించరా?

వ. అని యొండొరులం దెలుపుకొని, రోషంబులు హృదయంబుల నిలుపు కొని, సంరంభించి, తనుత్రాణంబులు వహించి, ధనురాది సాధనం బులు ధరియించి, పంతంబు లాడి, తమ తమ చతురంగబలంబు లం గూడికొని, జరాసంధాదులు యదువీరుల వెంటనంటి, తాఁకి

నిలు నిలుండని ధిక్కరించి పలికి యుక్కు మిగిలి, మహీధరంబుల మీఁద సలిలధారలు గురియు ధారాధరంబుల చందంబున బాణ వర్షంబులు గురిసిన యాదవసేనలం గల దండనాయకులు కోదం డంబు లెక్కిడి, గుణంబులు మ్రోయించి, నిలువంబడి రప్పుడు.

● ఈ విధంగా ఒకరి కొకరు చెప్పుకొని రోషాలు మనసుల కెక్కించుకున్నారు. పూనిక వహించారు. కవచాలు ధరించారు. విండ్లు మొదలైన యుద్ధసాధనాలను చేకొన్నారు. ప్రజ్ఞలు పలికినారు. జరాసంధుడు మొదలైన రాజులందరూ చతురంగబలాలతో యాదవ వీరులను వెంబడించి, 'నిలవండి, నిలవండి' అని ధిక్కరించి హుంక రించి పలికినారు. శైలాలమీద జలధారలు వర్షించే మేఘాలమాదిరి వారు శరవర్షం కురియించారు. అప్పుడు యాదవసైన్యంలోని సేనాధి పతులు, చాపాలు ఎక్కుపెట్టి ధనుష్టంకారం గావిస్తూ నిలబడ్డారు.

క. అరిబల భట సాయకముల
హరిబలములు గప్పఁబడిన నడరెడు భీతిన్
హరిమధ్య సిగ్గుతోడను
హరివదనముఁ జూచెఁ జకితహరిణేక్షణయై. 1753

* ఆ సమయంలో శత్రువీరులు శ్రీకృష్ణునిసేనను బాణాలతో కప్పివేయటం చూచి భీతిల్లి సింగంనడుమువంటి నడుము కలది, బెదరిన జింకకన్నులవంటి కన్నులు గలది అయిన రుక్మిణి సిగ్గుతో శ్రీకృష్ణుని ముఖం అవలోకించింది.

వ. ఇట్లు చూచిన. 1754

క. చొచ్చెద రదె యదువీరులు
వ్రచ్చెద రరిసేన నెల్ల వైరులు పెలుచన్
నొచ్చెదరుమ విచ్చెదరుమ
జచ్చెదరును నేఁడు చూడు జలజాతాక్షీ! 1755

• ఇలా రుక్మిణి చూడగానే శ్రీకృష్ణుడు 'ఓ కమలనయనా! చూస్తూఉండు, మన యాదవవీరులు శత్రుసైన్యంలో ప్రవేశించి చీల్చి చెండాడుతారు. విరోధులు నొచ్చి విచ్చిపోతారు, చచ్చిపోతారు' అన్నాడు.

వ. అని రుక్మిణీదేవిని హరి యూఱడించె; నంత బలభద్రప్రముఖులైన యదువీరులు ప్రళయవేళల మిన్నునం బన్ని బలువిడుగు లడరించు పెనుమొగిళుల వడువున జరాసంధాది పరిపంథిరాజ చక్రంబుమీఁద నవ్యకపరాక్రమంబున శిఖిశిఖా సంకాశ నిశిత శిలీముఖ నారాచభల్ల ప్రముఖంబులైన బహువిధ బాణపరంపరలు గురియ, నదియును విదళిత మత్తమాతంగంబును, విచ్ఛిన్న తురగంబును, విభిన్న రథవరూథంబును, వినిహత పదాతియూథంబును, విఖండిత వాహ వారణ రథారోహణ మస్తకంబును, విశకలిత వక్షోమధ్య కర్ణ కంఠ కపోల హస్తంబును, వికీర్ణ కేశజాలంబును, విపాటిత చరణ జానుజంఘంబును, విదళిత దంతసంఘంబును, విఘటిత వీరమంజీర కేయూరంబును, విభ్రష్ట కుండలకిరీట హారంబును, విస్మృత వీరాలాపంబును, విదార్యమాణ గదా కుంత తోమర పరశు పట్టిస ప్రాస కరవాల శూల చక్ర చాపంబును, వినిపాతిత కేతన చామరచ్ఛత్రంబును, విలూన తనుత్రాణంబును, వికీర్యమాణ ఘోటకసంఘ రింఖాసముద్ధూత ధరణీపరాగంబును, వినష్ట రథవేగంబును, వినివారిత సూత మాగధ వంది వాదంబును, విజృంభిత హయహేషా పటహ ఢాంకార, కరటిఘటా ఘీంకార, రథనేమి ఛటాత్కార, తురగనాభిఘంటా ఘణఘణాత్కార, వీర హుంకార, భూషణ ఝణఝణాత్కార, నిస్సాణ ధణధణాత్కార, మణినూపుర క్రేంకార, కింకిణీగణ కిణాత్కార, శింజినీ టంకార, భట పరస్పర ధిక్కారనాదంబును, వినిర్భిద్యమాన రాజసమూహంబును, విద్యమాన రక్తప్రవాహంబును, విక్రూయమాణ భూతబేతాళ కలకలంబును, విజృంభమాణ ఫేరవ కాక కంకాది సంకులంబును, ప్రచలిత కబంధంబును, ప్రభూత పలలగంధంబును, ప్రదీపిత మేదో మాంస రుధిరఖాదంబును, ప్రవర్తిత డాకినీ ప్రమోదంబునునై యుండె; నవ్వాడు. 1756

• ఈ విధంగా పలుకుతూ వాసుదేవుడు రుక్మిణీదేవిని ఊరడించాడు. అంతట బలరాముడు మొదలైన యదువంశవీరులు ప్రళయకాలంలో మింట వ్యాపించి పిడుగులు రాల్చే పెనుమబ్బుల చందాన విజృంభించారు. జరాసంధుడు మొదలైన శత్రురాజుల మీద మొక్కవోని కడిమితో అగ్నిజ్వాలలతో సమానమైన వాడి శిలీముఖాలు, నారాచములు, భల్లములు, మొదలుగా పలువిధములైన శరపరంపరలను వర్షించారు. ఆ బాణవర్షానికి శాత్రవసైన్యంలోని మదపుటేనుగులు తునాతునకలైనాయి. గుర్రములు చెదరిపోయాయి. రథాల పైకప్పులు విఱిగిపడ్డాయి. కాల్బలము కూలిపోయింది. గజాశ్వరథారోహకుల తలలు తెగి నేలరాలాయి. గుండెలు, నడుములు, మెడలు, చెక్కులు, చేతులు తునుకలు తునుక లయ్యాయి. పుర్రెలు బ్రద్దలయ్యాయి. తల వెంట్రుకలు నేలమీద పరుచుకున్నాయి. పాదాలు, మోకాళ్లు, పిక్కలు, తెగిపోయాయి. పండ్లు రాలినాయి. వీరమద్దియలు, భుజకీర్తులు వీడిపోయాయి. చెవిపోగులు, కిరీటాలు, ముత్యాలదండలు జారిపడినాయి. సింహనాదాలు మూగవోయాయి. గదలు, బల్లెములు, గుదియలు, గండ్రగొడ్డళ్ళు, అడ్డకత్తులు, ఈటెలు ఖడ్గాలు, శూలాలు, చక్రాలు, ధనువులు విరిగి ముక్కలైనాయి. జెండాలు, గొడుగులు, వింజామరలు కూలిపోయాయి. కవచాలు పగిలినాయి. గుర్రాల పౌజు గిట్టల తాకిడికి రేగిన దుమ్ము అంతటా నిండింది. రథాలవేగం ఆగింది. వందిమాగధ, వైతాళికుల స్తోత్ర పాఠాలు కట్టువడినాయి. గుఱ్ఱాలసకిలింపులు, తప్పెటల ఝాంకారాలు, గజబృందాల ఘీంకారాలు, రథచక్రముల పటపటాత్కారాలు, గుఱ్ఱాల నడుముగంటల ఘణఘణాత్కారాలు, వీరుల హుంకారాలు, ఆభరణాల ఝుణఝుణాత్కారాలు, నగారాల ధణధణాత్కారాలు, మణిమంజీరాలక్రేంకారాలు, మువ్వల కిణకిణాత్కారాలు, అల్లెత్రాళ్ల టంకారాలు, భటుల అన్యోన్య ధిక్కారాలు అణిగిపోయాయి. రాజుల సమూహం

చెదరింది. నెత్తురుటేరులు ప్రవహించాయి. భూతబేతాళాల కలకల ధ్వని కర్ణగోచరమైంది. నక్కలు, కాకులు, గ్రద్దలు, రాబందులు వీటి అరుపులు చెలరేగినాయి. మొండెములు కదలాడినాయి. మాంసపు గౌలు కొట్టింది. మెదడు, మాంసము భక్షిస్తూ, నెత్తురు త్రాగుతూ ఉన్న డాకిని మున్నగు పిశాచాలకు ఆ రణరంగం ఆనందం కలిగించింది.

చ. మగిడి చలించి పాఱుచును మాగధముఖ్యులు గూడి యొక్కచో
వగచుచు నాలిఁ గోల్పడినవాని క్రియన్ గడు వెచ్చనూర్చుచున్
మొగమున దప్పిదేరఁ దమ ముందటఁ గొక్కుచునున్న చైద్యుతోఁ
బగతురచేతిలోఁ బడక ప్రాణముతోడుత నున్నవాఁడవే. 1757

● ఆ సమయంలో భయంతో వెనుదిరిగి పరుగిడుతూ జరాసంధుడు మొదలైన ప్రముఖులందరూ ఒకచోటు చేరినారు. పెళ్లాన్ని పోగొట్టుకున్నవాడివలె ఏడుస్తూ, వేడినిట్టూర్పులు విడుస్తూ, వడలిన ముఖంతో తమ యెదుట దుఃఖిస్తున్న శిశుపాలుణ్ణి చూచారు. 'శత్రువుల చేతుల్లోబడక ప్రాణాలతో బ్రతికే ఉన్నావు గదా!' అని ఓదార్చారు.

వ. అని మఱియును. 1758

ఆ. బ్రతుకవచ్చు నొడలఁ బ్రాణంబు లుండిన
బ్రతుకు గలిగెనేని భార్య గలదు;
బ్రతికితీవు; భార్యపట్టు దైవ మెఱుంగు
వగవ వలదు చైద్య! వలదు వలదు. 1759

● ఇలా ఓదారుస్తూ వారంతా మళ్లీ అతనితో ఇలా అన్నారు. 'నాయనా! బొందిలో ప్రాణాలుంటే ఎలాగైనా బ్రతకవచ్చు. బ్రతికి ఉంటే భార్య దొరక్కపోదు. పెండ్లాముమాట దేవు డెరుగు! ముందు నీవు బ్రతుకుటయే మాకు పదివేలు; ఊరక వాపోవవద్దు.'

వ. వినుము. దేహధారి స్వతంత్రుఁడు గాఁడు. జంత్రగానిచేతి జంత్రపు బొమ్మకైవడి నీశ్వరతంత్ర పరాధీనుండై, సుఖదుఃఖంబులందు నర్తనంబులు సలుపు. తొల్లి నేను మథురాపురంబుమీఁదఁ బది యేడుమాఱులు పరాక్రమంబునన్ విడిసి, చక్రిచేత నిర్మూలిత బల చక్రుండనై, కామపాలుచేతం బట్టువడి, యీ కృష్ణుండు కరుణతో విడిపించిన వచ్చి, క్రమ్మఱ నిరువదిమూఁ డక్షౌహిణులం గూడి కొని, పదునెనిమిదవమాఱు దాడిసేసి, శత్రువులం దోలి, విజయంబు చేకొంటిని. జయాపజయంబులందు హర్షశోకంబుల నెన్నండును జెంద; నేఁటిదివంబున నీ కృష్ణుని కెదిరి పోరి మన రాజలోకంబు లెల్ల మగ్రాక్షుం గూడుకొని, యెదిరిపోరిన నోడు. ఇంతియకాక దైవయుక్తంబైన కాలంబునం జేసి, లోకంబులు పరిభ్రమించుచు నుండుఁ నదియునుం గాక. 1760

● అప్పుడు జరాసంధుడు ఇలా అన్నాడు- శిశుపాలా! విను. మానవుడు అస్వతంత్రుడు, బొమ్మలాడించేవాడి చేతిలో కీలుబొమ్మ లాగా అతడు ఈశ్వరమాయకులోనై సుఖదుఃఖాలలో నాట్యమాడు తుంటాడు. మునుపు నేను మథురపై పరాక్రమంతో పది హేడుపర్యా యాలు దండెత్తినాను. కృష్ణునిచేతిలో నానమస్తసైన్యం ఓడిపోయింది. నేను బలరాముడిచేత పట్టుబడ్డాను. ఆ కృష్ణుడు దయతలచి విడిచి పెట్టగా వచ్చాను. మరల ఇరవైమూడక్షౌహిణుల సైన్యం సమకూర్చు కొని పద్దెనిమిదవసారి దండెత్తిపోయి శత్రువులను తరిమివైచి విజయం సాధించాను. నేనెన్నడూ గెలుపోటములలో మోదఖేదములు పొందింది లేదు. దైవప్రేరితమైన కాలంవల్ల లోకాలు సాగుతుంటాయి.

మ. తమకుం గాలము మంచిదైన మనలం దైలోక్య విఖ్యాత వి
క్రములం గెల్చిరి యాదవుల్ హరిభుజాగర్వంబునన్ నేఁడు; కా
లము మేలై చమదెంచెనేని మనమున్ లక్షించి విద్వేషులన్
సమరక్షోణి జయింత మింతపనికై శంకింప నీ కేటికిన్. 1761

• ఇంతేకాదు. యాదవులకు కాలం కలిసివచ్చింది. ముల్లో కాలతో ప్రసిద్ధిగన్న విక్రమాధ్యులమైన మనలను గోవిందుని బాహు దర్పంతో వారు ఈనాడు గెలువగలిగినారు. కాలం మనకు అనుకూలించినపుడు పంతగించి పగవారిని ఖండనభూమిలో చెండాడగలం. ఈ మాత్రానికి ఇంత చింతింప నవసరం లేదు.

వ. అని యిట్లు జరాసంధుండును, నతని యొద్దిరాజులును, శిశుపాలుని పరితాపంబు నివారించి, తమతమ భూములకుం జనిరి. శిశుపాలుండు నమచర సేనాసమేతుండయి తన నగరంబునకుం జనియె; నంత రుక్మి యనువాఁడు కృష్ణుండు రాక్షసవివాహంబునం దన చెలియలిం గొనిపోవుటకు సహింపక, యేకాక్షౌహిణీబలంబు తోడ నమరసన్నాహంబునం గృష్ణుని వెనుదగిలి పోవుచుఁ, దన సారథితో నిట్లనియె. 1762

* ఈ విధంగా జరాసంధుడూ, అతని చెంతనున్న సామంత రాజులూ శిశుపాలుని మనోవేదన తొలగించి తమతమ దేశాలకు వెళ్ళిపోయారు. శిశుపాలుడు తన పరివారంతో, సైన్యంతో తన నగరానికి అరిగినాడు. అంతట రుక్మిణి అన్న అయిన రుక్మి కృష్ణుడు రాక్షస వివాహవిధానంతో తన సోదరిని ఎత్తుకపోవడం ఓర్చుకోలేక ఒక అక్షౌహిణి సేనతో యుద్ధసంరంభం వహించి వెన్నుని వెన్నాడి వెళ్లుతూ సారథితో ఇట్లన్నాడు.

ఉ. బల్లిదు నన్ను భీష్మజనపాలకుమారునిఁ జిన్నఁజేసి నా
చెల్లెలి రుక్మిణిం గొనుచుఁ జిక్కని నిక్కపుబంటువోలె నీ
గొల్లఁడు వోయెడిన్; రథముఁ గూడఁగఁ దోలుము; తేజితోల్లస
ద్భల్లి పరంపరన్ మదముఁ బాపెదఁ జూపెద నా ప్రతాపమున్.

* నేను భీష్మకప్రభుని పుత్రుడను. మహాబలవంతుణ్ణి. బల్లిదుడనైన నన్ను పిల్లవానివలె చులకన చేసి నా చెల్లెలిని రుక్మిణిని

గైకొని ఈ గొల్లవాడు అసహాయశూరునివలె అరుగుచున్నాడు. మన అరదమును అంటతోలుము. పదును కలిగి ప్రకాశించు బాణాలను ప్రయోగించి వాని పొగరణుస్తా! నా పరాక్రమం చూపిస్తా!

వ. అని యిట్లు రుక్మి హరి కొలంది యెఱుంగక సారథి నదలించి రథముం గూడ దోలించి 'గోపాలకా! వెన్నముచ్చ! నిమిషమాత్రంబు నిలు నిలు మని తిరస్కరించి, బలువింట నారి సారించి మూఁడు వాఁడితూపుల హరి నొప్పించి యిట్లనియె.

• ఈ విధంగా రుక్మి శౌరి శక్తిసామర్థ్యాలు ఎంతటివో తెలియక సారథిని గద్దించి రథమును కూడ దోలించి 'ఓ యాదవా! వెన్నదొంగా! క్షణ మాగుము' అని నిర్లక్ష్యంగా పలికి ధనుష్టంకార మొనర్చాడు. మూడు వాడి బాణాలతో వాడు పంకజాక్షుని సంకట పరచి ఇట్లన్నాడు.

సీ. మా సరివాఁడవా మా పాపఁ గొనిపోవ?
నేపాటి గలవాఁడ? వేది వంశ?
మెందు జన్మించితి? వెక్కడఁ బెరిఁగితి?
వెయ్యది నడవడి? యెవ్వఁ డెఱుఁగు?
మానహీనుఁడ వీవు? మర్యాద లెఱుఁగవు;
మాయఁగైకొని కాని మలయు రావు;
నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు;
వసుధేశుఁడవు గావు వావి లేదు;

ఆ. కొమ్మ నిమ్ము; నీవు గుణరహితుండవు
విడువు; విడువ వేని విలయకాల
శిఖిశిఖా సమాన శిత శిలీముఖముల
గర్వ మెల్లఁ గొందుఁ గలహమందు. 1765

• కృష్ణా! మా చెల్లెలిని తీసుకవెళ్ళడానికి నీవు మాతో సమానుడవా? (దైవమునకు సమానుడుగాని, అధికుడుగాని లేడనుట)

నీ వెంత మాత్రపువాడివి? (అప్రమేయుడనుట) నీ వంశ మేది? (భగవంతునకు కులంలేదు) ఎక్కడ పుట్టితివో? ఎక్కడ పెరిగితివో? నీ ప్రవర్తన మెట్టిదో ఎవరికినీ తెలియదు. (పుట్టుట పెరుగుట జీవులకే గాని దేవునికి లేదు. బ్రహ్మరుద్రాదులకునూ అతని నడవడి తెలియదనుట) నీకు అభిమానం లేదు, మట్టు మర్యాదలు తెలియవు (కొలతలకు అందనివాడూ, హద్దులులేక అంతట నుండువాడు అనుట) వంచనము వహింపక ఎదుటపడవు? (మాయను స్వీకరించి అవతారము లెత్తువాడనుట) స్వస్వరూపంతో వైరివర్గం మీదికి వెళ్లవు (భగవంతునకు రూపంలేదు. అన్నిరూపులు తన రూపమైనవాడనుట). నీవు క్షత్రియుడవు కావు. (దైవమునకు జాతిలేదు) నీకు వావివరుసలు లేవు. (మానవులకుదప్ప సర్వజీవాంతర్యామికి లేవనుట) నీకు మంచి గుణాలు లేవు. (అతడు త్రిగుణరహితుడనుట) మా చెల్లెలిని వదిలిపెట్టు; వదలకపోతే ప్రళయకాలంలోని అగ్నిజ్వాలలతో సమానమైన వాడి బాణాలతో కదనరంగంలో నీ గర్వం సర్వం హరిస్తాను.

వ. అని పలికిన నగధరుండు నగి, యొక్కబాణంబున వాని కోదండంబు ఖండించి, యాఱుశరంబుల శరీరంబు దూఱనేసి, యెనిమిది విశిఖంబుల రథ్యంబులం గూల్చి, రెండమ్ముల సారథిం జంపి, మూఁడు వాఁడితూపులం గేతనంబు ద్రుంచి, మఱియు నొక్క విల్లందినం ద్రుంచి, వెండియు నొక్క ధనువు వట్టిన విదళించి, క్రమంబున పరిఘ పట్టిస శూల చర్మాసిశక్తి తోమరంబులు ధరియించినం దునుకలు సేసి, క్రమ్మఱ నాయుధంబు లెన్నియెత్తిన నన్నియు శకలంబులు గావించె. నంతటం దనివి పనక వాఁడు రథంబు డిగ్గి, ఖడ్గహస్తుండై, దవానలంబు పైఁ బడు మిడుతచందంబునం గదిసిన, ఖడ్గ కవచంబులు చూర్ణంబులు సేసి, మెఱుంగులు చెదర నడిదంబువెఱికి ఝళిపించి వాని శిరంబుఁ దెగవ్రేయు దునని, గమకించి, నడచుచున్న నడ్డంబు వచ్చి రుక్మిణీదేవి హరి చరణారవిందంబులు పట్టుకొని యిట్లనియె. 1766

● రుక్మి ఈ విధంగా పలుకుతుండగానే నల్లనయ్య నవ్వుతూ ఒకబాణంతో అతడిచాపం త్రుంచాడు. ఆరు తూపులతో వాని దేహం తూట్లు చేశాడు. ఎనిమిది అమ్ములతో వాని రథాశ్వాలను కూల్చినాడు. రెండు సాయకాలతో వాని సారథిని చంపినాడు. మూడు వాడి నారసాలతో వాని టెక్కెం ఖండించినాడు. రుక్మి వేరొక ధనువు అందుకోగా దాన్ని విరుగగొట్టినాడు. వారు మరొకచాపం ధరింపగా ముక్కలు చేశాడు. క్రమంగా అతడు పట్టిన పరిఘ, పట్టిసం, శూలం, అసి, శక్తి, డాలు, తోమరం అనే ఆయుధాలను తునుకలు గావించాడు. ఎన్ని ఆయుధాలు ఎత్తినాడో అన్నిటినీ ముక్కలు చేసినాడు. అంతటితో రుక్మికి తనివితీరలేదు, అతడు రథం నుండి దిగి కార్చిచ్చుమీది కురికే మిడుతమాదిరి కత్తిబూని కమలాక్షుణ్ణి సమీపించాడు. శ్రీకృష్ణు డతని కత్తినీ, కవచాన్ని పొడిపొడి గావించాడు. కాంతులు కడలందు క్రమ్ముకోగా హరి ఒరనుంచి ఖడ్గందూసి జళిపిస్తూ రుక్మిశిరం తెగనరకడానికి ముందుకు వస్తుండగా రుక్మిణీదేవి అడ్డంవచ్చి ప్రాణేశ్వరుని పాదపద్మములు పట్టుకొని ఇలా అన్నది-

మత్త. నిన్ను నీశ్వరు దేవదేవుని నిర్ణయింపఁగ లేక యో
సన్నుతామరకీర్తిశోభిత ! సర్వలోక శరణ్య ! మా
యన్న యీతఁడు నేఁడు చేసె మహాపరాధము నీ యెడన్
నన్ను మన్నన చేసి కావు మనాథనాథ ! దయానిధీ ! 1767

● సత్పురుషులు శ్లాఘించు శాశ్వతకీర్తిచే శోభిల్లువాడా! సకల భువనాలను బ్రోచేవాడా! ఈశ్వరా! నీవు దేవదేవుడవని నిశ్చయించలేక మా అన్న అయిన ఈ రుక్మి ఇపుడు మీ పట్ల చాల అపచారం గావించాడు. దిక్కులేనివారికి దిక్కయినవాడా! దయకు నిలయుడా! నన్ను ఆదరించి మా అన్నను కాపాడు.

మత్త. కల్ల లేదని విన్నవించుట గాదు వల్లభ! యీతనిన్
బ్రల్లదుం దెగఁజూచితేనియు భాగ్యవంతుల మైతి మే
మల్లుఁ డయ్యె ముకుందుఁ డీశ్వరుఁ డంచు మోదితు లైవ మా
తల్లిదండ్రులు పుత్త్రశోకముఁ దాల్చి చిక్కదు రీశ్వరా! 1768

* నాథా! మా అన్న దోసకారికాడని మనవి చేయడం లేదు. ఇతడు నిజంగా దుష్టుడే, కాని ప్రభూ! జగన్నాయకుడగు అచ్యుతుడు మాకు అల్లుడైనాడని, మేము అదృష్టవంతులమనీ సంతోషించు మా జననీ జనకులు పుత్రదుఃఖంతో పొగిలిపోతారు.

మ. అని డగ్గుత్తికతో మహాభయముతో నాకంపితాంగంబుతో
వినత భ్రాంత ముఖంబుతో శ్రుతిచలద్వేణీకలాపంబుతోఁ
గనుదోయిన్ జడిగొన్న బాష్పములతోఁ గన్యాలలామంబు మ్రొ
క్కిన రుక్మిం దెగవ్రేయఁబోక మగిడెన్ గృష్ణుండు రోచిష్ణుఁడై.

• ఈ విధంగా ప్రార్థిస్తూ కన్నెలలో మిన్నయైన రుక్మిణి గద్గదకంఠంతో, మిక్కిలి భయంవల్ల వణుకుతున్న శరీరంతో, వాడిన వంచిన ముఖంతో, చెవులమీదికి పడుచున్న జడ వెంట్రుకలతో, కనుగొలకులలో తొలకాడు కన్నీళ్ళతో నారాయణునకు నమస్కరించింది. దివ్యతేజోవిరాజమానుడైన దేవకీనందనుడు రుక్మిని ఖడ్గంతో ఖండింపక వెనుకకు మరలినాడు,

వ. ఇట్లు చంపక బావా! రమ్మని చిఱునగవు నగుచు, వానింబట్టి బంధించి, గడ్డంబును మీసంబును దలయును నొక కత్తి వాతి యమ్మున రేవులు వాఱఁ గొఱిగి విరూపింజేసె; నంతట యదువీరులు పరసైన్యంబులం బాఱఁదోలి, తత్సమీపంబునకు వచ్చి; రప్పుడు హతప్రాయుండై కట్టువడియున్న రుక్మిం జూచి కరుణచేసి, బల భద్రుండు బంధంబులు విడిచి హరిని డగ్గఱి యిట్లనియె. 1770

* యదువల్లభుడు రుక్మిని చంపక 'బావా! రమ్మని చిరునవ్వు నవ్వుతూ దగ్గరకు తీసుకొన్నాడు. వానినిపట్టి బంధించి గడ్డం

మీసం, తల కత్తితో పాయలు పాయలుగా గొరిగి కురూపిని గావించాడు. ఆ దేసమయంలో యాదవవీరులు శత్రుసైన్యాన్ని తరిమివేసి సారసనేత్రుని సముఖానకు వచ్చారు. అప్పుడు బలభద్రుడు జీవన్మృతుడై బంధింపబడియున్న రుక్మిని కనుగొని కరుణతో వాని కట్లు విప్పి కమలాక్షునితో ఇట్లన్నాడు.

క. తల మనక భీష్మనందను
తలయును మీసలును గొఱుగఁ దగవే! బంధుం
దలయును మీసము గొఱుగుట
తల దఱుగుటకంటెఁ దుష్కృతరము మహాత్మా! 1771

● మహాత్మా! ఇతణ్ణి దూరంగా వెళ్ళిపొమ్మని చెప్పక తల, మీసం గొరుగుట, నీకు న్యాయమా? చుట్టమైనవాడి తల, మీసం గొరుగుట తల దరుగుటకన్న మిక్కిలి నీచం గాదా!

క. కొందఱు రిపు లని కీడును;
గొందఱు హితు లంచు మేలు గూర్పవు; నిజ మీ
వందఱియందును సముఁడవు
పొందఁగ నేలయ్య! విషమబుద్ధి ననంతా! 1772

● ఆదిమధ్యాంతరహితా! శత్రువులని కొందరికి కీడుచేయవు. మిత్రులని మరికొందరికి మేలు గూర్పవు. వాస్తవంగా అందరియెడ సమభావంతోనే మెలగుతావు. మరి ఈ భేదబుద్ధి నీ కెందుకు కలిగిందో!

సహోదరుని భంగమునకు ఖిన్నయగు రుక్మిణీదేవిని బలభద్రుండు డూరార్చుట

వ. అని వితర్కించి పలికి రుక్మిణీదేవి నుపలక్షించి యిట్లనియె. 1773

● బలరాముడిలా అచ్యుతుని అదలించి రుక్మిణీదేవి నవలోకించి ఇట్లన్నాడు.

శా. తోడంబుట్టినవాని భంగమునకున్ దుఃఖించి మా కృష్ణు వె
గ్గాడం జూడకు మమ్మ! పూర్వభవకర్మాధీనమై ప్రాణులన్
గీడున్ మేలును జెందు; లేఁ డొకఁడు శిక్షింపంగ రక్షింప నీ
తోడంబుట్టువు కర్మశేష పరిభూతుం డయ్యె నేఁ డియ్యెడన్. 1774

* అమ్మా! అగ్రజుడు అవమానింపబడ్డాడని ఖేదంతో మా కృష్ణుని నిందించవద్దు. గత జన్మల్లో చేసిన కర్మములను బట్టి జీవులు మంచిచెడ్డ లనుభవిస్తుంటారు. శిక్షించుటకు రక్షించుటకు కర్త ఒకడంటూ లేదు. నీ తోబుట్టినవాడు కర్మశేషంతో ఈ నాడిక్కడ ఈ విధమైన పరాభవం పొందినాడు.

క. చంపెడి దోషము గలిగినఁ
జంపఁజనదు బంధుజనులఁ జను విడువంగాఁ
జంపిన దోషము సిద్ధము
చంపను మఱియేల మున్న చచ్చినవానిన్. 1775

● చంపదగిన నేరం చేసినప్పటికీ బంధువులను చంపరాదు. క్షమించి విడిచిపెట్టుటయే న్యాయుం. చంపితే పాపం తప్పదు. అవమానంతో అనలే చస్తున్నవాణ్ణి మళ్ళీ చంపడ మెందుకు?

ఆ. బ్రహ్మచేత భూమిపతుల కీ ధర్మంబు
కల్పితంబు రాజ్యకాంక్షఁ జేసి
తోడిచూలి నైనఁ దోడఁబుట్టినవాఁడు
చంపుచుండుఁ గ్రూరచరితుఁ డగుచు. 1776

* తామరసగర్భుని చే దండనీతి ధరణీపతులకు విహిత కృత్యంగా విధించబడింది. రాజ్యకాంక్షతో తోబుట్టువును తోడబుట్టిన వాడే క్రూరహృదయుడై చంపుతుంటాడు.

క. భూమికి ధన ధాన్యములకు
భామలకును మానములకుఁ బ్రాభవమునకుం
గామించి మీఁదు గానరు
శ్రీమదమున మానధనులు చెనకుదు రొరులన్. 1777

● మానవంతులు ధనమదాంధులై ధరణికోసం, ధనధాన్యాల కోసం, అంగనలకోసం ఆత్మాభ్యున్నతికోసం, ఐశ్వర్యంకోసం అన్యులను హింసిస్తారు.

వ. వినుము. దైవమాయం జేసి దేహాభిమానులైన మానవులకున్ బగవాఁడు, బంధుండు, నుదాసీనుండు నను మోహంబు సిద్ధంబై యుండు; జలాదులయందుఁ జంద్ర సూర్యాదులును, ఘటాదుల యందు గగనంబును, బెక్కై కానంబడు భంగి, దేహధారులకందఱికి నాత్మ యొక్కం డయ్యును బెక్కండై తోఁచు; నాద్యంతంబులుగల యీ దేహంబు ద్రవ్య ప్రాణ గుణాత్మకంబై, యాత్మ యందు నవిద్యచేతఁ గల్పితంబై, దేహిని సంసారంబునం ద్రిప్పు సూర్యుండు తటస్థుండై యుండ, దేహేంద్రియంబులు ప్రకాశమానంబులగు; నాత్మకు వేఱొక్కటితోడ సంయోగ వియోగంబులు లేవు; వృద్ధి క్షయంబులు చంద్రకళలకుం గాని చంద్రునికి లేని తైవడి, జన్మనాశంబులు దేహంబునకుఁ గాని, యాత్మకుఁ గలుగ నేరవు. నిద్రవోయినవాఁ డాత్మను విషయఫలానుభవంబులు సేయించుతెఱంగున, నెఱుకలేనివాఁడు నిజముగాని యర్థమునందు భవము నొందుచుండుఁ గావున. 1778

* రుక్మిణీ! విను. దైవమాయవల్ల దేహాభిమానంగల మానవులకు ఇతడు శత్రువు, ఇతడు బంధువు, ఇతడు తటస్థుడు అనే భేదబుద్ధి జనిస్తుంది. నీటియందు సూర్యచంద్రాదులు, ఘటాదులందు గగనము అనేకములై కన్పించునట్లు ప్రాణులందరికీ ఆత్మ ఒక్కటే అయినప్పటికీ పెక్కులుగా గోచరిస్తుంది. పుట్టుక, చావుగల ఈ శరీరం పృథివి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం అనే ఐదుభూతాలతోడనూ,

ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం అనే ఐదుప్రాణాల తోడనూ, సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలతోడనూ కూడినదై అజ్ఞానంచే ఆత్మయందు కల్పించబడింది. ఈ దేహం జీవుణ్ణి సంసారచక్రంలో పరిభ్రమింపజేస్తున్నది. సూర్యుడు దేనితోనూ సంబంధంలేక ఉదాసీనుడై ఉండగా గోచరమయ్యే దృష్టి, రూపం అనే వానివలె ఆత్మ ఉదాసీనుడై యుండగా శరీరమూ మరియు చర్మమూ, చక్షువూ, శ్రోత్రమూ, జిహ్వ, ఘ్రాణమూ అనే ఐదు జ్ఞానేంద్రియములు, వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అనే ఐదు కర్మేంద్రియాలూ ప్రకాశమాన మవుతాయి. ఆత్మకు మరొక్క దానితో కూడిక గాని, ఎడబాటుగాని లేదు. హాని వృద్ధులు చంద్రకళలకే గాని చంద్రుడికి లేనట్లు చావుపుట్టుకలు శరీరానికే గాని ఆత్మకు కలుగవు. నిద్రించిన వాడువిషయాల వలని సుఖదుఃఖాలు ఆత్మను అనుభవింపజేసేటట్లు జ్ఞానహీనుడు అసత్యమైన అర్థమునందు అనుభవం కల్గించుకుంటాడు.

క. అజ్ఞానజ మగు శోకము
విజ్ఞానవిలోకనమున విడువుము నీకుం
బ్రజ్ఞావతికిం దగునే
యజ్ఞానులభంగి వగవ నంభోజముఖీ! 1778

● పద్మముఖీ! రుక్మిణీ! అజ్ఞానంవల్లకలిగే దుఃఖాన్ని విజ్ఞానమనే చూపుతో విడిచిపెట్టు. నీవు మతిమంతురాలవు. అజ్ఞానులమాదిరి శోకించటం నీకు తగదు.

వ. ఇట్లు బలభద్రునిచేతఁ దెలుపంబడి, రుక్మిణీదేవి దుఃఖంబు మాని యుండె; నట రుక్మి యనువాఁడు ప్రాణావశిష్టుండై, విడువఁబడి తన విరూపభావంబునకు నెరియుచు, హరిం గెల్చికాని కుండిన పురంబుఁ జూడ నని ప్రతిజ్ఞ సేసి, తత్సమీపంబున నుండె నివ్విధంబున. 1780

● ఈ రీతిగా బలభద్రుడు ప్రబోధించాడు. రుక్మిణీదేవి విచారం విడిచిపెట్టింది. ఇది ఇట్లుండగా ప్రాణాలతో వదిలిపెట్టబడ్డ రుక్మి తన వికార రూపానికి పరితపిస్తూ శౌరిని జయించిగాని కుండిన నగరప్రవేశం చెయ్యనని ప్రతిజ్ఞపట్టి పట్టణ సమీపంలోనే ఉండి పోయాడు.

క. రాజీవలోచనుఁడు హరి
రాజసమూహముల గెల్చి రాజస మొప్పన్
రాజిత యగు తన పురికిని
రాజాననఁ దెచ్చె బంధురాజి నుతింపన్. 1781

● ఈ విధంగా నళినములవంటి నయనములుగల నారాయణుడు రాజసంతో రాజలోకాన్ని జయించి, విభ్రాజమానమైన తన పట్టణానికి చుట్టాలందరూ స్తుతింపగా, ఇందుముఖిని తోడ్కొని వచ్చాడు.

శ్రీకృష్ణుండు రుక్మిణీదేవిని పెండ్లియాడుట

వ. అంత న య్యాదవేంద్రుని నగరంబు సమారబ్ధ వివాహకృత్యంబును, బ్రవర్తమాన గీతవాద్య నృత్యంబును, బ్రతిగృహాలంకృత విలసితాశేష నర నారీవర్గంబును, బరిణయమహోత్సవ సమాహూయమాన మహీపాల గజఘటా గండమండల దానసలిలధారా సిక్తమార్గంబును, బ్రతిద్వార మంగళాచార సంఘటిత క్రముక కదళికా కర్పూర కుంకుమాగరు ధూపదీప పరిపూర్ణ కుంభంబును, విభూషిత సకల గృహవేదికా కవాట దేహళీస్తంభంబును, విచిత్ర కుసుమాంబర రత్నతోరణ విరాజితంబును, సముద్ధూత కేతన విభ్రాజితంబును నై యుండెఁ న య్యవసరంబున. 1782

* అప్పుడు యదువల్లభుని పురంలో పెళ్లిపనులు ప్రారంభింపబడినాయి. గాత్రసంగీతములు, వాద్యగానములు, నాట్యములు జరిగినాయి. ఇంటింటా ఆడువారు, మగవారు అందరూ అలంకారాలు

చేసుకున్నారు. వివాహ మహోత్సవానికి ఆహ్వానా లందుకొని అవనీ ధవు లందరూ వచ్చారు. వారి గజసమూహాల గండస్థలాల నుంచి స్రవించిన మదజలాలతో రాజమార్గాలు తడిసిపోయాయి. మంగళా చారానికై ద్వారపార్శ్వాలలో పోకమోకలు, అరటిబోదెలు కట్టినారు. కర్పూర కుంకుమములతో రంగవల్లికలు తీర్చినారు. అగరుధూపాలు వేశారు. పూర్ణకుంభాలు ఉంచారు. ఇంటి అరుగులను, తలుపులను, గడపలను, కంబాలను కైసేసినారు. వింత వింత పూలతో, మేలు కట్లతో, రత్నతోరణాలతో, గాలికి రెపరెపలాడు జెండాలతో ద్వారకా నగరం విలసిలింది.

శా. ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజ చేతోహారిణిన్ మాన వై
భవ గాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధు బాం
ధవ సత్కారిణిఁ బుణ్యచారిణిఁ మహాదారిద్ర్య సంహారిణిన్
సువిభూషాంబర ధారిణిన్ గుణవతీచూడామణిన్ రుక్మిణిన్. 1783

* ఆ శుభసమయాన తన మనస్సును హరించునదీ, ఆత్మోన్నతీ, గాంభీర్యమూ అనే గుణాలతో ఒప్పేది, సకలసంపదలు కలిగించేదీ, సుజనులనూ, చుట్టాలనూ ఆదరించేదీ, పుణ్యపథసంచారిణీ, దారిద్ర్య పరిహారిణీ, కల్యాణవేషభూషణధారిణీ, రమణీశిరోమణీ అయిన రుక్మిణిని శ్రీకృష్ణమూర్తి పెండ్లాడినాడు. ఆయన యశస్సు నలుదెసలా వ్యాపించింది.

క. సతులుం దారును బౌరులు
హితమతిఁ గానుకలు దెచ్చి యిచ్చిరి కరుణో
న్నతవర్ధిష్ణులకును మా
నిత రోచిష్ణులకు రుక్మిణీకృష్ణులకున్. 1784

* అఖండతేజోవిరాజితులూ, అపారకృపావర్ధిష్ణులూ అయిన రుక్మిణీ కృష్ణులకు ద్వారకాపురవాసులు, తమ భార్యలతో కలసి మంచి మనసులతో కానుకలు తెచ్చి సమర్పించారు.

క. హరి పెండ్లికిఁ గైకేయక
కురు సృంజయ యదు విదర్భ కుంతినరేంద్రుల్
వరమానందముఁ బొందిరి
ధరణీశులలోన గాఢతాత్పర్యములన్. 1785

* ముకుందుని వివాహానికి కేకయ, కురు, సృంజయ, యదు, విదర్భ, కుంతి దేశాలరాజులు ఇతరరాజులకంటే అపరిమితమైన ఆనందం అనుభవించారు.

క. హరి యీ తెఱఁగున రుక్మిణి
నరుదుగఁ గొనితెచ్చి పెండ్లియాడుట విని దు
ష్కరకృత్య మనుచు వెఱఁగం
దిరి రాజులు రాజసుతులు దిక్కుల నెల్లన్. 1786

* శ్రీకృష్ణుడు ఈ విధంగా రుక్మిణీదేవిని తెచ్చిపెండ్లాడటం అనన్యసామాన్యమైన కార్యమని ఆయా దేశములందలి రాజులూ, వారి రాణులూ ఆశ్చర్యం చెందినారు.

ఆ. అనఘ ! యాదిలక్ష్మియైన రుక్మిణితోడఁ
గ్రీడ సలుపుచున్న కృష్ణుఁ జూచి
పట్టణంబులోని ప్రజ లుల్లసిల్లిరి
ప్రీతు లగుచు ముక్తభీతు లగుచు. 1787

వ. అని చెప్పి. 1788

* పాపరహితుడవైన ఓ పరీక్షిన్మహారాజా! ఆదిలక్ష్మి అవతారమైన రుక్మిణితో సుఖిస్తున్న శ్రీకృష్ణుని చూచి పట్టణంలోని ప్రజలందరూ భయం విడనాడి ఎంతో సంతోషంతో విలసిల్లినారు - అని శుకయోగీంద్రుడు పరీక్షిన్నరేంద్రునకు రుక్మిణీకల్యాణగాథ వినిపించాడు.

క. కువలయరక్షాతత్పర :
కువలయదళ నీలవర్ణ కోమలదేహా !
కువలయనాథ శిరోమణి !
కువలయజన వినుత విమలగుణ సంఘాతా ! 1789

● భూమండలాన్ని రక్షించటంలో ఆసక్తిగలవాడా! కలువ రేకులవలె నల్లనికాంతితో విరాజిల్లే మృదువైన దేహం కలవాడా! ధరామండలేశ్వరులకు శిరోభూషణమైనవాడా! పుడమిజనుల పొగడ్త గన్న సుగుణసమూహం కలవాడా!

మాలిని. సరసిజనిభహస్తా ! సర్వలోకప్రశస్తా !
నిరుపమ శుభమూర్తీ ! నిర్మలారూఢకీర్తీ !
పరహృదయవిదారీ ! భక్తలోకోపకారీ !
గురు బుధజన పోషీ ! ఘోర దైతేయ శోషీ ! 1790

● అంబుజాలతో సమానమైన హస్తాలు గలవాడా! ఎల్ల లోకాలలో శ్రేష్ఠుడా! సాటిలేని మంగళస్వరూపుడా! స్వచ్ఛమై వన్నెకెక్కిన కీర్తిగలవాడా! శాత్రవుల గుండెలను ఖండించువాడా! భక్త సమూహానికి మేలు చేయువాడా! పెద్దలను, పండితులను సంతోషపరచేవాడా! భయంకరులైన రక్కసులను ఉక్కణచినవాడా!

గద్య. ఇది శ్రీపరమేశ్వర కరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతంబయిన శ్రీమహాభాగవతం బను మహాపురాణమునందు దేవకీదేవి వివాహంబును, గగనవాణీ శ్రవణంబును, కంసోద్రేకంబును, వసుదేవ ప్రార్థనంబును, యోగ మాయాప్రభావంబును, బలభద్రుని జన్మంబును, బ్రహ్మాది సుర స్తోత్రంబును, నంద పుత్రోత్సవంబును, పూతనాసంహారంబును, శకట భంజనంబును, తృణావర్త మరణంబును, గర్గాగమనంబును, నారాయణాది నామనిర్దేశంబును, బాలక్రీడయును, మృద్భక్షణం

బును, వాసుదేవ వదన గహ్వర విలోక్యమా నాఖిల లోకాలోకనం బును, నవనీత చౌర్యంబును, యశోదా రోషంబును, ఊలూఖల బంధనంబును, అర్జునతరుయుగళ నిపాతనంబును, నలకూబరమణి గ్రీవుల శాపమోక్షణంబును, బృందావన గమనంబును, వత్సపాల నంబును, వత్సాసురవధయును, బకదనుజ విదారణంబును, అఘా సుర మరణంబును, వత్సాపహరణంబును, నూతన వత్స బాలక కల్పనంబును, బ్రహ్మ వినుతియును, గోపాలనంబును, గార్దభా సుర దమనంబును, కాళియఫణి మర్దనంబును, గరుడ కాళియనాగ విరోధకథనంబును, ప్రలంబాసురహింసనంబును, దవానల పానం బును, వర్షర్తు వర్ణనంబును, శరత్కాల లక్షణంబును, వేణువిలా సంబును, హేమంతసమయ సమాగమంబును, గోపకన్యాచరిత హవిష్యవ్రతంబును, కాత్యాయనీ సేవనంబును, వల్లవీ వస్త్రాపహ రణంబును, విప్రవనితా దత్తాన్న భోజనంబును, ఇంద్రయాగ నివా రణంబును, నంద ముకుంద సంవాదంబును, పర్వతభంజనంబును పాషాణ సలిల వర్షంబును, గోవర్ధనోద్ధరణంబును, వరుణకింకరుండు నందునిం గొనిపోయిన హరి దెచ్చుటయు, వేణు పూరణంబును, గోపికాజన ఘోషనిర్గమంబును, యమునాతీర వనవిహరణంబును, కృష్ణాంతర్థానంబును, ఘోష కామినీ గణ పరిదేవనంబును, గోపికా న్వేషణంబును, గోపికాగీతలును, హరిప్రసన్నతయును, రాసక్రీడ నంబును, జలకేళియును, సర్పరూపకుం డయిన సుదర్శనవిద్యా ధరుండు హరిచరణతాడనంబున నిజరూపంబు వడయుటయును, శంఖచూడుండను గుహ్యకుని వధించుటయును, వృషభాసుర విద ళనంబును, నారదోపదేశంబున హరికథ నెఱిఁగి కంసుండు దేవకీ వసుదేవుల బద్ధులం జేయుటయును, ఘోటకాసురుం డయిన కేశి యను దనుజుని వధించుటయును, నారద స్తుతియును, వ్యోమ దానవ మరణంబును, అక్రూరాగమనంబును, అక్రూర రామకృష్ణుల సల్లాపంబును, ఘోష నిర్గమంబును, యమునా జలాంతరాళంబున

నక్రూరుండు హరి విశ్వరూపమును గాంచుటయును, అక్రూర స్తవంబును, మథురానగర ప్రవేశంబును, రజక వధయును, వాయక మాలికులచే సమ్మాన మొందుటయును, కుబ్జాప్రసాదకరణంబును, ధనుర్భంగంబును, కంసుదుస్స్వప్నంబును, కువలయాపీడ పీడనంబును, రంగస్థలప్రవేశంబును, చాణూరముష్టికుల వధయును, కంస వధయును, వసుదేవ దేవకీ బంధమోక్షణంబును, ఉగ్రసేను రాజ్యస్థాపనంబును, రామకృష్ణులు సాందీపనివలన విద్య లభ్యసించుటయును, సంయమినీ నగర గమనంబును, గురుపుత్త్రి దానంబును, ఉద్ధవుని ఘోషయాత్రయును, భ్రమర గీతలును, కుబ్జావాస గమనంబును, కరినగరంబునకు నక్రూరుండు సని కుంతీదేవి నూరార్చుటయు, కంస భార్యలగు నస్తి ప్రాప్తులు జరాసంధునకుఁ గంసుమరణం బెఱింగించుటయును, జరాసంధుని దండయాత్రయును, మథురానగర నిరోధనంబును, యుద్ధంబున జరాసంధుండు సప్తదశవారంబులు పలాయితుం డగుటయుఁ నారదప్రేరితుండై కాలయవనుండు మథురపై దాడివెడలుటయును, ద్వారకానగర నిర్మాణంబును, మథురాపుర నివాసులం దనయోగ బలంబున హరి ద్వారకానగరంబునకుఁ దెచ్చుటయు, కాలయవనుండు హరివెంటం జని, గిరిగుహయందు నిద్రితుండైన ముచుకుందుని కోపదృష్టివలన నీఱగుటయును, ముచుకుందుండు హరిని సంస్తుతి చేసి తపంబునకుం జనుటయును, జరాసంధుఁడు గ్రమ్మఱ రామకృష్ణులపై నేతెంచుటయును, ప్రవర్షణ పర్వతారోహణంబును గిరిదహనంబును, గిరి డిగ్గ నుఱికి రామకృష్ణులు ద్వారకకుం జనుటయు, రుక్మిణీ జన్మంబును, రుక్మిణీ సందేశంబును, వాసుదేవాగమనంబును, రుక్మిణీగ్రహణంబును, రాజలోక పలాయనంబును, రుక్మి యమవాని భంగంబును, రుక్మిణీ కల్యాణంబును ననుకథలు గల దశమస్కంధంబునందుఁ బూర్వభాగంబు సంపూర్ణము.

* శ్రీ మహాభాగవతం అనే ఈ మహాపురాణం పరమేశ్వర దయాలబ్ధ కవితావైచిత్రికలవాడూ, కేసనమంత్రి పుత్రుడూ, సహజ పాండిత్యుడూ అయిన బమ్మెరపోతనామాత్యులవారు రచించారు.


దేవకీదేవి పెళ్లి, ఆకాశవాణిని కంసుడు ఆలకించుట, అతడు ఉద్రేకపడుట, వసుదేవుని ప్రార్థన, యోగమాయ యొక్క మహిమ, బలరాముని పుట్టుక, బ్రహ్మ మొదలగు దేవతల యొక్కస్తుతి, శ్రీకృష్ణ భగవానుడు అవతరించుట, నందవ్రజములో ప్రవేశించుట, యోగ నిద్రకథ, నందుడు కావించిన పుత్రోత్సవం, కృష్ణుడు పూతనను చంపుట, శకటాసురుని కూల్చుట, తృణావర్తుని మృతి, యాదవ పురోహితుడైన గర్గాచార్యులవారు మందుకు చనుదెంచుట, నారాయ ణాదినామ నిర్వచనము, శ్రీకృష్ణుని బాలక్రీడ, అతడు మన్నుతినుట, యశోదాదేవి గోవిందుని ముఖ గహ్వారములో సకల చరాచర ప్రపంచమును చూచుట, శ్రీకృష్ణుడు వెన్నలు దొంగిలించుట, యశోదాదేవి శ్రీకృష్ణుని కోపించుట, ఆమె రోటికి బాలకృష్ణుని బంధించుట, కృష్ణుడు అమడముద్దులను పడగూల్చుట, అర్జునవృక్ష ములై యున్న నలకూబరుడు, మణిగ్రీవుడు అనే గంధర్వుల శాప విముక్తి, నందాదులు బృందావనమున కరుగుట, శ్రీకృష్ణుడు లేగలను మేపుట, అతడు వత్సాసురుని సంహరించుట, బకరూపము దాల్చిన దైత్యుని చీల్చచంపుట, బకుని తమ్ముడూ, సర్పరూపధారీ అయిన అఘాసురుని శ్రీకృష్ణుడు రూపుమాపుట, బ్రహ్మదేవుడు ఆవుదూడలను అంతర్ధానముచేయుట, శ్రీకృషుడు క్రొత్తగా గోవత్సములను, గోప బాలకులను సృజించుట, బ్రహ్మ శ్రీకృష్ణుని స్తుతించుట, కృష్ణుడు గోవులను పాలించుట, గర్ధభాకారము ధరించిన ధేనుకాసురుని నిర్మూ లించుట, కాళియమర్దనముగావించుట, గరుత్మంతునకు కాళీయునకు వైర మేర్పడిన వైనము, బలరాముడు ప్రలంబాసురుని ద్రుంచుట,

శ్రీకృష్ణుడు దావాగ్నిని మ్రింగుట, వర్షఋతువర్ణనం, శరదృతు లక్షణం, వేణుగానవినోదం, హేమంతఋతువురాక, గోపకన్యలు గావించిన హవిష్యవ్రతం, గోపికలు కాత్యాయనిని భజించుట, గొల్లెతల కోకలు కృష్ణుడు అపహరించుట, బ్రాహ్మణపత్నులు తెచ్చి యిచ్చిన అన్నములు స్వామి ఆరగించుట, వాసుదేవుడు ఇంద్ర యాగము మాన్పించుట, నందముకుందుల సంభాషణ, కృష్ణుడు గోవర్ధనగిరిని పెల్లగించుట, ఇంద్రుడు రాలవాన గురియించుట, కృష్ణమూర్తి గోవర్ధనపర్వతము నెత్తుట, వరుణుని భటుడు వరుణ పట్టణమునకు నందుని గొనిపోగా శ్రీకృష్ణుడు మరల తెచ్చుట, గోవిందుడు పిల్లనగ్రోవి నూదుట, గోపికలు మందనుండి వెడలి కృష్ణుని సన్నిధికి వచ్చుట, యమునానదీ తీరమందలి వనములో శ్రీకృష్ణుడు విహరించుట, కృష్ణుడు అదృశ్యమగుట, గొల్లచేడియలు కృష్ణునిగానక విలపించుట, గోపికలు కృష్ణుని వెదకుట, గోపికా గీతలు, శ్రీకృష్ణుడు ప్రసన్నుడగుట, రాసక్రీడాభివర్ణనము, జల క్రీడాభివర్ణనము, సర్పరూపియగు సుదర్శనుడను విద్యాధరుడు శ్రీకృష్ణుని కాలితాపుతో స్వస్వరూపమును పొందుట, కృష్ణుడు కుబేర భటుడైన శంఖచూడుడను గుహ్యకుని చంపుట, వృషభాసుర సంహారము, నారదుని మాటలవల్ల కృష్ణుని జన్మవృత్తాంత మెరిగి కంసుడు దేవకీవసుదేవులను బంధించుట, అశ్వరూపధరుడైన కేశి యను దనుజుని శ్రీహరి వధించుట, నారదుడు గోవిందుని సన్నుతించుట, వ్యోమాసురుని శౌరి సంహరించుట, అక్రూరుడు నంద గోకులమునకు వచ్చుట, అక్రూర బలరామకృష్ణులు ముచ్చటించు కొనుట, అక్రూరుడు నందవ్రజమునుంచి కృష్ణబలభద్రులతో మథు రకు బయలుదేరుట, అక్రూరుడు యమునానదీజలాలలో శ్రీహరి విశ్వరూపమును దర్శించుట, అతడు శ్రీకృష్ణపరమాత్మను సన్నుతించుట, కృష్ణుడు మథురలో ప్రవేశించుట, అక్కడ చాకివానిని


సంహరించుట, సాలెవాడొసగిన వస్త్రములు, సుదాముడను మాలాకారుడు సమర్పించిన పూలదండలు రామకృష్ణులు స్వీకరించుట, శ్రీకృష్ణుడు కుబ్జయెడ ప్రసన్నుడగుట, అతడు ధనుశ్శాలకరిగి వింటిని విరచుట, కంసుడు చెడుకలగాంచుట, కువలయాపీడమనే ఏనుగును కృష్ణుడుచంపుట, కృష్ణుడు మల్లరంగములో ప్రవేశించుట, శ్రీకృష్ణ బలరాములు చాణూరుడు, ముష్టికుడు అను మల్లులను మ్రందించుట, కంసుని సంహరించుట, శ్రీకృష్ణుడు దేవకీవసుదేవుల చెరమాన్పుట, ఉగ్రసేనునకు రాజ్యపట్టము కట్టుబెట్టుట, రామకృష్ణులు సాందీపని వల్ల చతుష్షష్టి విద్యలునేర్చుట, శ్రీకృష్ణుడు గుర్వర్థమై యమపట్టణమైన సంయమనీ నగరమునకు పోవుట, యమునడిగితెచ్చి రామ కృష్ణులు సాందీపనికి అతని కుమారు నొసగుట, ఉద్ధవుడు గోకులమునకు వచ్చుట, భృంగాపదేశము, శ్రీకృష్ణుడు కుబ్జయింటి కరుగుట, హస్తినాపురమునకు అక్రూరుడువెళ్లి కుంతీదేవి నోదార్చుట, కంసుని పత్నులగు అస్తి, ప్రాప్తి అనువారు తమ జనకుడగు జరాసంధునకు భర్తృమరణము దెల్పుట, జరాసంధుడు కృష్ణునిపైకి దాడి వెడలుట, జరాసుతుడు మథురాపురమును ముట్టడించుట, జరాసంధుడు సంగ్రామములో పదునేడుసారులు పరాజితుడై పారిపోవుట, నారదుని ప్రేరణచే కాలయవనుడు మథురానగరిపై దండయాత్ర సల్పుట, హరి ఆదేశముచే విశ్వకర్మ సముద్రములో ద్వారకానగరమును నిర్మించుట, కృష్ణుడు తన యోగమహిమచే మధురాపట్టణప్రజలను ద్వారకాపురికి జేర్చుట, కాలయవనుడు మాధవుని వెంట నరిగి ఒక శైలగుహలో నిద్రిస్తున్న ముచుకుందుడను రాజుయొక్క కోపదృష్టి వలన భస్మమగుట, ముచుకుందుడు నారాయణుని స్తోత్రమొనర్చి తపముసల్పుటకు వెళ్లుట, జరాసంధుడు మరల రామకృష్ణులపైకి దాడి వెడలుట, బలరామాచ్యుతులు ప్రవర్షణగిరి నెక్కుట, జరా

సంధుడు ప్రవర్షణశైలమును దహించుట, రామకృష్ణులు పర్వతము నుండి దుమికి ద్వారకాపురికి వచ్చుట, రుక్మిణీదేవి పుట్టుక, ఆమె కృష్ణునకు పంపినసందేశము, మాధవుడు కుండిన నగరమునకు ఏతెంచుట, రుక్మిణి నెత్తుకపోవుట, రాజసమూహము యుద్ధమందు ఓడి పారిపోవుట, రుక్మిణి అన్నయగు రుక్మి భంగపాటు, రుక్మిణీదేవి వివాహము అను కథలు గలిగిన ఈ దశమస్కంధ పూర్వభాగము ముగిసినది.






శ్రీ వేంకటేశ్వరస్వామివారు



శ్రీపద్మావతి అమ్మవారు

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము,
తిరుపతి,
కా. 5000.

Price: Rs. 14-00



Printed and Published by Sri M.V.S. Prasad, I.A.S.,
Executive Officer, T.T.D. and Printed at T.T.D. Press, Tirupati